సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 14 వెల: ₹ 5.50
సంపుటి: 16 సంచిక: 18
సోమవారం 10-4-2023
SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL


'ప్రభుత్వ పథకాలు మరింత వేగంగా మారుమూల పల్లెలకు వెళ్లాలి'


రింకూ 6,6,6,6,6
కోల్‌కతా నైట్‌రైడర్స్‌ను గెలిపించిన రింకూ సింగ్. -12లో




ఈ మార్పులపై లుక్కేయండి!
ఆదాయపన్ను పరంగా కీలక పరిణామాలు కొత్త విధానం ఆకర్షణీయం -13లో


గహ్లోత్‌పై మరోసారి పైలట్ ఫైట్
బీజేపీ హయాంలోని అక్రమాలపై చర్యలకు డిమాండ్ చేస్తూ అశోక్ గహ్లోత్‌తో సచిన్ పైలట్ అమీతుమీకి సిద్ధమయ్యారు.
వివరాలు 6లో ▸


అదానీ గ్రూప్‌కు చైనాతో లింకులు
అదానీ సంస్థలకు చైనాతో లింకులున్నాయని, అందుకే పోర్టుల నిర్వహణను ఇప్పటికీ ఆ గ్రూపే నిర్వహిస్తోందని కాంగ్రెస్ ఆరోపించింది.
వివరాలు 6లో ▸


హిమానీ నదాలు.. కనుమరుగు!
హిమానీ నదాలు వేగంగా కరిగి పోతున్నాయి. ఇలాగే కొనసాగితే భవిష్యత్తులో పెను మార్పులు సంభవిస్తాయన్న శాస్త్రవేత్తలు.
వివరాలు 6లో ▸


కాబోయే వైద్యులకూ వైద్యం!
డాక్టర్లు మానసిక ఒత్తిళ్లతో బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. ఈ పరిస్థితి ఎందుకు తలెత్తుతోంది.. కారణాలు ఏంటి?
వివరాలు 3లో ▸

న్యూస్‌రీల్

16 నుంచి భద్రాద్రిలో నూతన ఆర్జిత సేవలు



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో ఈనెల 16 నుంచి నూతన ఆర్జిత సేవలు ప్రారంభించనున్నారు. ఈ సేవలకు సంబంధించిన వివరాలను గతంలో వెల్లడించిన ఆలయ అధికారులు.. భక్తులు అభ్యంతరాలు, సలహాలు, సూచనలు అందజేయాలని కోరారు.
- వివరాలు 5లో▶

చర్మం ఒలిచి చెప్పులు కుట్టించినా తక్కువే: హరీశ్



'మీరు చూపించిన ప్రేమ చూస్తుంటే నా కళ్లలో నీళ్లు వస్తున్నాయి... ఎన్ని జన్మలెత్తినా రుణం తీర్చుకోలేనేమో అనిపిస్తోంది.. నా చర్మం ఒలిచి చెప్పులు కుట్టించినా తక్కువే అనిపిస్తోంది'' అంటూ మంత్రి హరీశ్‌రావు బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో భావోద్వేగానికి లోనయ్యారు.
- వివరాలు 2లో▶

ప్రేమించాడని కొట్టి.. పొడిచి చంపేశారు




మా వాళ్ల అమ్మాయినే ప్రేమిస్తావా అంటూ యువతి బంధువులు ఓ బడుగు వర్గానికి చెందిన యువకుడిని కర్రలతో కొట్టి కత్తులతో నరికి చంపేశారు. నల్లగొండ జిల్లా నిడమనూరు మండలం గుంటిపల్లిలో ఈ ఘటన జరిగింది.
- వివరాలు 5లో▶

ఊరూరా పండుగలా..

ఘనంగా ఆవిర్భావ వేడుకల నిర్వహణకు బీఆర్‌ఎస్ నిర్ణయం

- ఆత్మీయ సమ్మేళనాలకు మంచి స్పందనతో మరింత దూకుడు
- కార్యక్రమాల వివరాలను ప్రకటించిన కేటీఆర్
- 25న నియోజకవర్గ స్థాయి పార్టీ ప్రతినిధుల సమావేశాలు
- అన్నిస్థాయిల నేతలు హాజరయ్యేలా కార్యక్రమాలు
- 27న తెలంగాణ భవన్‌లో ఆవిర్భావ దినోత్సవం
- అదేరోజున కేసీఆర్ అధ్యక్షతన పార్టీ జనరల్ బాడీ సమావేశం
- మే నెలాఖరు వరకూ ఆత్మీయ సమ్మేళనాల కొనసాగింపు
- అక్టోబర్ 10న వరంగల్‌లో పార్టీ మహాసభ నిర్వహించనున్నట్లు వెల్లడి



సాక్షి, హైదరాబాద్: పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఈసారి పెద్ద ఎత్తున నిర్వహించాలని భారత్ రాష్ట్ర సమితి (బీఆర్‌ఎస్) నిర్ణయించింది. కొన్ని నెలల్లో అసెంబ్లీ ఎన్నికలు ఉండటంతోపాటు.. ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన ఆత్మీయ సమ్మేళనాలకు పార్టీ శ్రేణుల్లో మంచి స్పందన వస్తుండటంతో.. ఈ ఉత్సాహాన్ని కొనసాగించేందుకు రంగం సిద్ధం చేస్తోంది. పార్టీ ఆవిర్భావం సందర్భంగా ఊరూరా పండుగలా ఘనంగా కార్యక్రమాలు నిర్వహించాలని.. అన్ని స్థాయిల పార్టీ ప్రజాప్రతినిధులు, నేతలు, కార్యకర్తలు పాల్గొనేలా చూడాలని నిర్ణయించింది. ఏప్రిల్ 27న బీఆర్‌ఎస్ ఆవిర్భావ దినోత్సవం నేపథ్యంలో ముందు, తర్వాత నిర్వహించే కార్యక్రమాలపై పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కె.తారకరామారావు ఆదివారం ప్రకటన విడుదల చేశారు. దీనికి అనుగుణంగా పార్టీ శ్రేణులు సిద్ధంకావాలని సూచించారు.

25 నుంచి కార్యక్రమాలు..
ఈ నెల 25వ తేదీన పార్టీ ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జుల అధ్యక్షతన నియోజకవర్గ స్థాయి పార్టీ ప్రతినిధుల సభలు నిర్వహించుకోవాలని కేటీఆర్ పార్టీ శ్రేణులకు సూచించారు. పార్టీ జిల్లా అధ్యక్షులు ఈ సమావేశాల నిర్వహణను సమన్వయం చేస్తారని, కనీసం 2.5 వేల నుంచి 3 వేల మంది వరకు సభలో పాల్గొనేలా చూడాలని ఆదేశించారు. ప్రతి నియోజకవర్గంలోని అన్ని గ్రామాలు, వార్డుల్లో అదే రోజున ఉదయం
మిగతా 2వ పేజీలో ▶

వైజాగ్ స్టీల్‌పై తెలంగాణ 'ఆసక్తి'!

ప్రైవేటీకరణను అడ్డుకోవడమే లక్ష్యంగా నిర్ణయం
సింగరేణి సంస్థ ద్వారా ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రెస్ట్ ప్రక్రియలో పాల్గొనే యోచన
ఒకట్రెండురోజుల్లో వైజాగ్‌కు అధికారుల బృందం
- వివరాలు 2లో▶





▲ తమిళనాడు మదుమలైలోని తెప్పకాడు ఏనుగుల శిబిరాన్ని సందర్శించిన మోదీ కాసేపు వాటితో సరదాగా గడిపారు. ఇటీవల ఆస్కార్ అవార్డు పొందిన ఎలిఫెంట్ విస్పరర్స్ సినిమాలో ప్రధాన పాత్రలు పోషించిన మావటి దంపతులు బొమ్మన్, బెళ్లిలను ప్రధాని సన్మానించారు.

దేశంలో పులులు 3,167

గణాంకాలు విడుదల చేసిన మోదీ

2022 నాటికి దేశంలో పెద్ద పులుల సంఖ్య 3,167కి చేరుకుందని, ఇది భారత్‌కే కాకుండా ప్రపంచానికే గర్వకారణమని ప్రధాని నరేంద్ర మోదీ చెప్పారు. పెద్ద పులుల సంరక్షణ కోసం ఉద్దేశించిన టైగర్ ప్రాజెక్టు 50 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకొని కర్ణాటక స్టేట్ ఓపెన్ యూనివర్సిటీలో జరిగిన కార్యక్రమంలో ప్రధాని మోదీ పాల్గొన్నారు.

6లో
పులులను ఎలా లెక్కిస్తారంటే!







ప్రమాణాల్లేకున్నా సీట్లు పెంచాలట!

- రాష్ట్రంలో చాలా ఇంజనీరింగ్ కాలేజీల తీరిది
- ఆధునిక కంప్యూటర్లు, సరైన ఫ్యాకల్టీ లేకుండానే డిమాండ్ ఉన్న కోర్సుల్లో సీట్ల పెంపునకు దరఖాస్తు
- దాదాపు వంద కాలేజీలది ఇదే బాట..

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని చాలా ఇంజనీరింగ్ కాలేజీలు సంప్రదాయ కోర్సుల్లో సీట్లు తగ్గించుకొని డిమాండ్ ఉన్న కోర్సుల్లో సీట్లు ప్రవేశపెట్టేందుకు ఉవ్విళ్లూరుతున్నాయి. అయితే సరైన నాణ్యతా ప్రమాణాల్లేకుండానే డిమాండ్ ఉన్న కోర్సుల్లో సీట్ల పెంపునకు దరఖాస్తు చేసుకున్నట్లు జేఎన్టీయూహెచ్ తాజా పరిశీలనలో వెల్లడైంది.



పదేళ్ల నాటి కంప్యూటర్లు...
జేఎన్‌టీయూహెచ్ పరిధిలో 145 ఇంజనీరింగ్ కాలేజీలు ఉండగా వాటిల్లో దాదాపు 50 కాలేజీల్లో అన్ని సదుపాయాలున్నాయని అధికారులు చెబుతున్నారు. మిగిలిన కాలేజీలు సమర్పించిన సదుపాయాలకు సంబంధించిన వివరాలను పరిశీలించగా కంప్యూటర్ సైన్స్ కోర్సు బోధనకు కనీసం 10 మంది విద్యార్థులకు మిగతా 3వ పేజీలో ▶

78 కాలేజీల డొల్లతనం..

ఈసారి దాదాపు వంద ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీలు సీట్ల మార్పిడి కోసం దరఖాస్తు చేసుకున్నాయి. గతేడాది రాష్ట్రవ్యాప్తంగా సివిల్‌లో 40 శాతం, మెకానికల్‌లో 35 శాతం, ఎలక్ట్రికల్‌లో 34 శాతం సీట్లు మాత్రమే భర్తీ కావడంతో ఈసారి ఆయా బ్రాంచీల్లో సెక్షన్లు, సీట్లు తగ్గించుకుంటామని కోరాయి. వాటి స్థానంలో సైబర్ సెక్యూరిటీ, డేటా సైన్స్, కంప్యూటర్ సైన్స్ వంటి కోర్సుల్లో సీట్లు పెంచాలని విజ్ఞప్తి చేశాయి. అయితే ఆయా కాలేజీలు సమర్పించిన వివరాలను జేఎన్టీయూహెచ్ అధికారులు పరిశీలించగా ఎన్నో లోపాలు బయటపడ్డాయి. కంప్యూటర్ కోర్సులు కోరుతున్న వంద కాలేజీలకుగాను 78 కాలేజీల్లో అత్యాధునిక కంప్యూటర్లు లేవని, కంప్యూటర్ లాంగ్వేజ్‌పై పట్టున్న ఫ్యాకల్టీ లేదని తేలింది.


కొత్తగూడెంలో ఆత్మీయ సమ్మేళనానికి హాజరైన అభిమానులు

తప్పులు చేశారు శిక్ష తప్పదు

సీఎం కేసీఆర్‌పై మాజీ ఎంపీ పొంగులేటి ఫైర్


సింగరేణి కార్మికుల ల్యాంప్, చెమ్మాస్‌తో పొంగులేటి, జూపల్లి

- ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చలేదు
- ఈ ప్రభుత్వాన్ని మూడోసారి అధికారంలోకి ఎందుకు తీసుకురావాలి?
- సింగరేణిని అప్పుల కుప్పగా మార్చారు.. కార్మికులను అవమానించారు
- ప్రభుత్వం వల్ల ఇబ్బందిపడ్డ వారంతా ఏకమవుతున్నారని వ్యాఖ్య
- కొత్తగూడెంలో అభిమానుల ఆత్మీయ సమావేశం
- పాల్గొన్న మాజీ మంత్రి జూపల్లి..కేసీఆర్‌లో నిజాయితీ లోపించిందని ధ్వజం

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: తెలంగాణ ఏర్పడ్డాక అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం వల్ల ఇబ్బంది పడిన శక్తులు, వ్యక్తులంతా ఏకమవుతున్నారని, దానికి కొత్తగూడెంలోనే బీజం పడిందని మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఆదివారం రాత్రి కొత్తగూడెంలో జరిగిన పొంగులేటి శ్రీనన్న అభిమానుల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ప్రభుత్వం, దాన్ని నడిపిస్తున్న సీఎం ఎనిమిదిన్నరేళ్ల కాలంలో చేసిన తప్పులకు శిక్ష మిగతా 2వ పేజీలో ▶

చర్చలు మళ్లీ విఫలం

సీఎం కేసీఆర్ 7% ఫిట్‌మెంట్‌తో పీఆర్సీ ఇవ్వాలన్నారు
విద్యుత్ జేఏసీలకు ప్రతిపాదించిన ఆ శాఖ మంత్రి జగదీష్ రెడ్డి

- అంగీకరించని జేఏసీలు..చర్చలు విఫలమైనట్టు ప్రకటన
- కనీసం 25శాతం ఫిట్‌మెంట్ ఇవ్వాలని కోరిన పవర్ జేఏసీ
- నేటి నుంచి రోజువారీ సమీక్షల బహిష్కరణకు పిలుపు


ఆదివారం విద్యుత్ జేఏసీ నేతలతో చర్చిస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: విద్యుత్ ఉద్యోగుల వేతన సవరణ, ఇతర డిమాండ్ల పరిష్కారానికి తెలంగాణ స్టేట్ పవర్/ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ జేఏసీలతో, విద్యుత్ ఉద్యోగ సంఘాల జేఏసీలతో రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి జి.జగదీశ్‌రెడ్డి ఆదివారం తన కార్యాలయంలో నిర్వహించిన చర్చలు విఫలమయ్యాయి. 6శాతం ఫిట్‌మెంట్‌తో పీఆర్సీ అమలుకు క్రితంసారి జరిగిన చర్చల్లో విద్యుత్ సంస్థల యాజమాన్యాలు ప్రతిపాదించగా, ఉభయ జేఏసీలు తిరస్కరించాయి. మరోశాతం పెంచి 7శాతం ఫిట్‌మెంట్‌తో పీఆర్సీ అమలు చేయాలని సీఎం కేసీఆర్ ఆదేశించారని, దీనికి అంగీకరించి 17 నుంచి తలపెట్టిన సమ్మెను విరమించుకోవాలని తాజాగా జరిపిన చర్చల్లో విద్యుత్‌శాఖ మంత్రి ప్రతిపాదించగా, ఇందుకూ జేఏసీలు తిరస్కరించాయి. దీంతో విద్యుత్ జేఏసీలతో ఏడో దఫా చర్చలు సైతం విఫలమయ్యాయి.

17నుంచి సమ్మె పిలుపులో మార్పు లేదు: గతంలో జరిగిన చర్చల్లో 30శాతానికి తగ్గకుండా ఫిట్‌మెంట్‌తో పీఆర్సీ అమలుకి పట్టుబట్టామని, తాజాగా కనీసం 25శాతం ఫిట్‌మెంట్‌తోనైనా అమలు చేయాలని మిగతా 3వ పేజీలో ▶

ఇదంజాట్



బండి ఫోన్ ఎక్కడ?

పోయిందంటూ పోలీసులకు సంజయ్ ఫిర్యాదు
- పోలీసుల పనే అంటూ లీగల్ సెల్ భేటీలో వ్యాఖ్య
- ఆయన అనుచరుని వద్దే ఉండి ఉంటుందంటున్న పోలీసులు.. సిద్దిపేట సమీపంలో స్విచ్ ఆఫ్ అయిన సెల్


పోయిన ఫోన్ ఇదే..

సాక్షి ప్రతినిధి, కరీంనగర్/ సాక్షి, హైదరాబాద్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ ఫోన్ ఎక్కడుంది? అనేది చర్చనీయాంశమయ్యింది. కలకలం రేపిన పదో తరగతి ప్రశ్నపత్రాల లీకేజీ కుట్రలో సూత్రధారిగా అనుమానిస్తూ పోలీసులు సంజయ్‌ను అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. కాగా అరెస్టు అయినప్పటి నుంచి ఆయన ఫోన్ కన్పించకుండా పోయింది. అయితే బెయిల్‌పై విడుదలైన సంజయ్..ఆదివారం దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. అరెస్టు సమయం నుంచి తన వ్యక్తిగత ఫోన్
మిగతా 3వ పేజీలో ▶


ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన తెలంగాణ ఉభయ కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తల సభలో సంఘీభావం ప్రకటిస్తున్న ఏచూరి, డి.రాజా, చాడ వెంకట్‌రెడ్డి, రాఘవులు, నారాయణ, కూనంనేని, తమ్మినేని వీరభద్రం, జూలకంటి రంగారెడ్డి తదితరులు

సీపీఎం, సీపీఐ అగ్రనేతలు ఏచూరి, రాజా ఉద్ఘాటన
- బీజేపీ దేశంలోని రాజ్యాంగ వ్యవస్థలను ధ్వంసం చేస్తోంది.. ప్రజల సొమ్మును అదానీకి కట్టబెడుతోంది
- ప్రజాస్వామ్యాన్ని నాశనం చేస్తోంది.. మతోన్మాదాన్ని పెంచి పోషిస్తోంది
- మోదీని గద్దె దించకపోతే అంధకారమే
- ఎర్రజెండాలన్నీ ఒక్క జెండాగా ముందు రావాలన్న నేతలు
- తొలిసారిగా హైదరాబాద్‌లో ఉభయ కమ్యూనిస్టు పార్టీల ఉమ్మడి సభ

కమ్యూనిస్టుల ఐక్యతే దేశానికి దిక్సూచి

సాక్షి, హైదరాబాద్

దేశంలో బీజేపీ ఓటమి లక్ష్యంగా ఐక్యతను ప్రదర్శించాలని సీపీఎం, సీపీఐ అగ్రనేతలు పిలుపునిచ్చారు. కమ్యూనిస్టుల ఐక్యతే దేశానికి దిక్సూచి అని ఉద్ఘాటించారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీని ఓడించాల్సిన చారిత్రక అవసరం ఉందని చెప్పారు. బీజేపీ దేశంలోని రాజ్యాంగ వ్యవస్థలను ధ్వంసం చేస్తోందని, ప్రజాస్వామ్యాన్ని నాశనం చేస్తోందని, మతోన్మాదాన్ని పెంచి పోషిస్తోందని, దేశాన్ని కార్పొరేట్లకు అమ్మేస్తోందని ధ్వజమెత్తారు. మోదీని గద్దె దించకపోతే దేశం అంధకారమై పోతుందని అన్నారు. కమ్యూనిస్టుల ఐక్యత తక్షణావసరమన్నారు. కమ్యూనిస్టుల ఐక్య సదస్సులు దేశంలోనూ జరగాలని ఆకాంక్షించారు. తెలంగాణ ఉభయ కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తల సంయుక్త సభ ఆదివారం హైదరాబాద్ ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో జరిగింది. సీపీఎం, సీపీఐ ప్రధాన కార్యదర్శులు సీతారాం ఏచూరి, డి.రాజా ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. డాక్టర్ కె.నారాయణ, బీవీ రాఘవులు, కూనంనేని సాంబశివరావు, తమ్మినేని వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల తర్వాత జాతీయ స్థాయిలో ఫ్రంట్: ఏచూరి
మోదీ ప్రభుత్వం దేశాన్ని కార్పొరేట్లకు అప్పగించి లూటీ చేస్తోందని ఏచూరి ధ్వజమెత్తారు. ప్రజల సొమ్మును అదానీకి కట్టబెడుతోందని ఆరోపించారు. అదానీ ఏడేళ్లలో రూ.11 లక్షల కోట్ల రుణం తీసుకుంటే, వాటిని మాఫీ చేసిన కేంద్ర ప్రభుత్వం..రైతు రుణాలను మాత్రం మాఫీ చేయడం లేదని విమర్శించారు. వివిధ రాష్ట్రాల్లోని బీజేపీయేతర ప్రభుత్వాలను అస్థిర పరిచేందుకు ఈడీ, సీబీఐలను కేంద్రం
మిగతా 2వ పేజీలో ▶

రాష్ట్రానికి తూర్పు, ఆగ్నేయ దిశల నుంచి గాలులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రానికి తూర్పు, ఆగ్నేయ దిశల నుంచి బలంగా గాలులు వీస్తున్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. తూర్పు నుంచి వీచే గాలుల ప్రభావంతో ఆదివారం ఉపరితల ద్రోణి ఏర్పడిందని, ఇది కేరళ నుంచి కర్ణాటక మీదుగా మరాఠ్వాడా, విదర్భ వరకు కొనసాగుతోందని పేర్కొంది. ఈ ద్రోణి సముద్ర మట్టం నుంచి సగటున 0.9 కిలోమీటర్ల ఎత్తులో ఉందని వివరించింది. దీని ప్రభావంతో రాష్ట్రంలో అక్కడక్కడా తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. ఆదివారం భద్రాచలంలో గరిష్టంగా 39.0 డిగ్రీల సెల్సియస్, కనిష్టంగా దుండిగల్‌లో 20.8 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

తెలంగాణ, ఏపీల్లోని ప్రధాన కేంద్రాల్లో నమోదైన గరిష్ట, కనిష్ట ఉష్ణోగ్రతలు (సెల్సియస్‌లో)

కేంద్రం	గరిష్టం	కనిష్టం
రెంటచింతల	42.2	25.8
రాజమహేంద్రవరం	41.0	26.5
భద్రాచలం	39.0	25.5
నల్లగొండ	38.6	22.8
ఖమ్మం	38.5	23.6
మెదక్	38.5	21.8
నిజామాబాద్	38.2	23.0
తిరుపతి	38.0	22.0
ఆదిలాబాద్	37.8	21.2
మహబూబ్‌నగర్	37.6	23.9
విశాఖపట్నం	37.2	24.2
హనుమకొండ	36.8	24.5
హైదరాబాద్	35.7	22.9
దుండిగల్	35.1	20.8
హకీంపేట్	35.0	21.8
రామగుండం	34.0	22.0



రేవంత్.. తాత..

సాక్షి, హైదరాబాద్: తాను తాతయ్య అయిన విషయాన్ని టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి ట్విట్టర్ ద్వారా తెలియజేశారు. తన కుమార్తె నైమిష గత వారం బాబుకు జన్మనిచ్చిందంటూ.. మనవడిని లాలిస్తున్న ఫొటోను ఆదివారం పోస్టు చేశారు. 'తాతను అయ్యానని తెలియచేయడం సంతోషంగా ఉంది. మీ ఆశీస్సులు వారికి కావాలి' అని రేవంత్ ట్వీట్ చేశారు.

14న మంచిర్యాల సభకు ఖర్గే



సాక్షి, హైదరాబాద్: ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఈ నెల 14న రాష్ట్రానికి రానున్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ లోక్‌సభ సభ్యత్వంపై అనర్హత వేటుకు నిరసనగా టీపీసీసీ ఆధ్వర్యంలో మంచిర్యాలలో నిర్వహించనున్న సత్యాగ్రహ దీక్ష సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరు కానున్నారు. ఢిల్లీ నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకొని అక్కడి నుంచి హెలికాప్టర్ ద్వారా మంచిర్యాలకు వెళ్లి సభలో ప్రసంగించనున్నట్లు గాంధీ భవన్ వర్గాలు ఆదివారం వెల్లడించాయి.

ముఖ్యమంత్రి గైర్హాజరీ రాష్ట్రానికి నష్టం: మల్లురవి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రానికి ప్రధానమంత్రి వచ్చినప్పుడు అందుబాటులో ఉండి కూడా సీఎం కేసీఆర్ హాజరుకాకపోవడం తెలంగాణకు నష్టం కలిగిస్తుందని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపీ మల్లు రవి అభిప్రాయపడ్డారు. ఆ సభలో పాల్గొని తెలంగాణ హక్కులు, అవసరాలు, రావాల్సిన ప్రాజెక్టులపై ప్రధానిని ఎందుకు నిలదీయలేదని ప్రశ్నించారు. సీఎం గైర్హాజరీవల్ల సింగరేణి ప్రైవేటీకరణతో పాటు తెలంగాణకు హక్కుగా రావాల్సిన అంశాల గురించి ప్రధానిని అడిగే అవకాశాన్ని కోల్పోయామని ఆదివారం ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. మోదీ, కేసీఆర్‌లు రాజకీయ ప్రయోజనాల కోసం రాష్ట్రానికి తీరని అన్యాయం చేస్తున్నారని, ప్రజలు వారికి బుద్ధి చెప్పాలన్నారు.

'సింగరేణిని బొందలగడ్డ చేసింది కేసీఆరే'

సాక్షి, హైదరాబాద్: సింగరేణిని బొందలగడ్డగా మార్చిన ఘనత సీఎం కేసీఆర్‌దేనని బీజేపీ ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్.కుమార్ విమర్శించారు. ఆదివారం పార్టీ కోశాధికారి భండారి శాంతికుమార్, రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ ప్రకాశ్ రెడ్డిలతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రధాని పర్యటన నేపథ్యంలో బీఆర్ఎస్ నేతలు తలపెట్టిన సింగరేణి సమ్మె ఫ్లాప్ అయ్యిందన్నారు. తాడిచర్ల బొగ్గు గనులను ప్రైవేటుకు అప్పగించిందెవరో చెప్పాలని, 68 వేల ఉద్యోగాలను 42 వేలకు కుదించి సింగరేణివాసుల పొట్ట కొట్టిందెవరో చెప్పాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

నిమిషానికి 175 ఇంటర్నెట్‌ను ముంచెత్తుతున్న కొత్త వెబ్‌సైట్లు

ఇంటర్నెట్ ప్రపంచంలో కోట్లాది వెబ్‌సైట్లు సమాచార సామ్రాజ్యాన్ని ఏలుతున్నాయి. లావాదేవీలకు వారధిగా నిలుస్తూ కీలక పాత్ర పోషిస్తున్నాయి. నిమిషానికి 175 కొత్త వెబ్‌సైట్లు పుట్టుకొస్తున్నాయి. రోజూ 2.52 లక్షల కొత్త వెబ్‌సైట్లను సృష్టిస్తున్నారు. 1991లో ఒక్క వెబ్‌సైట్‌తో ప్రారంభమైన ఇంటర్నెట్ ఈ రోజు బిలియన్ల సంఖ్యకు చేరుకోవడం విశేషం. ప్రస్తుతం ఇంటర్నెట్‌లో సుమారు 1.13 బిలియన్ల వెబ్‌సైట్లు ఉన్నట్లు ఇంగ్లాండ్‌కు చెందిన ఇంటర్నెట్ సంస్థ నెట్‌క్రాఫ్ తాజా నివేదికలో వెల్లడించింది. అధికంగా ఆంగ్లంలోనే వెబ్‌సైట్లను రూపొందిస్తున్నారు.

- సాక్షి, అమరావతి



ఇంటర్నెట్‌లోని కోట్లాది వెబ్‌సైట్‌లలో 18% మాత్రమే యాక్టివ్‌గా ఉన్నట్లు నెట్‌క్రాఫ్ట్ పేర్కొంది. ప్రస్తుతం 20.29 కోట్ల వెబ్‌సైట్లు కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. యాక్టివ్ వెబ్‌సైట్ల కంటే పని చేయనివి ఐదు రెట్లు ఎక్కువగా ఉండటం గమనార్హం. ఒక వెబ్‌సైట్‌లో అనేక వెబ్ పేజీల సమాచారం ఉంటుంది. 50 బిలియన్ల వెబ్‌పేజీల సమాచారం నెట్‌లో నిక్షిప్తమైంది. టిల్ బర్గ్ వర్సిటీ (నెదర్లాండ్స్) పరిశోధన ప్రకారం ఇండెక్స్ వెబ్ ఏకంగా 4.98 బిలియన్ల పేజీలను కలిగి ఉంది.

18% మాత్రమే యాక్టివ్..

రెండు బిలియన్ల మంది షాపింగ్

దాదాపు 71 శాతం వ్యాపారాలను వెబ్‌సైట్లపై ఆధారపడి నిర్వహిస్తున్నారు. ఇందులో 28 శాతం ఆన్‌లైన్ వ్యాపారం నడుస్తోంది. 43 శాతం మంది చిన్న వ్యాపారులు తమ వెబ్‌సైట్‌లను మరింత మెరుగ్గా నిర్వహించేందుకు పెట్టుబడి పెట్టాలని భావిస్తున్నారు. 2 బిలియన్ల మందికిపైగా వివిధ వెబ్‌సైట్ల ద్వారా ఆన్‌లైన్ షాపింగ్ చేస్తున్నారు. ఈ-కామర్స్ విక్రయాలు 4.2 ట్రిలియన్ల డాలర్లకుపైగా చేరుకుంటున్నాయి.

వెబ్‌సైట్లో ఇలా..

ప్రపంచ వెబ్ ట్రాఫిక్‌లో 93 శాతం గూగుల్ నుంచే వస్తోంది. గూగుల్‌లో అత్యధికంగా సగటున 22 నిమిషాల పాటు బ్రౌజింగ్ సమయాన్ని వెచ్చిస్తున్నారు. ఇది యూట్యూబ్‌లో 9 నిమిషాలుగా ఉంది.

ఒక రోజులో 3 బిలియన్ల కంటే ఎక్కువగా గూగుల్ శోధనలు జరుగుతున్నాయి.

ఒక్క రోజులో 70,000కు పైగా వెబ్‌సైట్‌లు హ్యాక్‌కి గురవుతున్నాయి.

ఒక రోజులో దాదాపు 120 బిలియన్ ఇ-మెయిల్స్ పంపుతున్నారు.

ప్రతిరోజూ 4 బిలియన్ గిగాబైట్ల కంటే ఎక్కువ ఇంటర్నెట్ ట్రాఫిక్ నమోదవుతోంది.


63 మిలియన్ వెబ్‌సైట్‌లు కంటెంట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌లను ఉపయోగిస్తున్నాయి.

ప్రపంచవ్యాప్తంగా ఉన్న అగ్ర వెబ్‌సైట్‌లలో 76.17 శాతం మొబైల్‌కు అనుకూలమైనవి కాగా 23.83 శాతం వెబ్‌సైట్‌లు మొబైల్‌లో ఓపెన్ కావు.


ప్రధాన దేశాల్లో వెబ్‌సైట్ల సంఖ్య కోట్లలో

దేశం	వెబ్‌సైట్ల సంఖ్య
అమెరికా	13.33
చైనా	1.79
జర్మనీ	1.28
కెనడా	1.19
భారత్	0.57
జపాన్	0.52
ఫ్రాన్స్	0.42
యూకే	0.27
నెదర్లాండ్స్	0.20
ఇజ్రాయెల్	0.20
రష్యా	0.12

వివిధ భాషల్లో వెబ్‌సైట్ల శాతం



టాప్ 10 వెబ్‌సైట్ల సందర్శనలు ప్రతినెలా బిలియన్లలో



తప్పులు చేశారు .. శిక్ష తప్పదు

▶ మొదటి పేజీ తరువాయి

అనుభవించక తప్పదన్నారు. ఉద్యమ సమయంలో, ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పినట్టు ప్రతి కుటుంబానికి రూ.15 లక్షలు, ఇంటికో ఉద్యోగం, దళిత సీఎం, దళితులకు మూడెకరాల భూమి, ఎస్సీల వర్గీకరణ, మైనారిటీ, గిరిజన రిజర్వేషన్ల పెంపు, రుణమాఫీ.. ఇలా ఏ ఒక్క హామీని నెరవేర్చలేదని, ఈ ప్రభుత్వాన్ని మూడోసారి అధికారంలోకి ఎందుకు తీసుకురావాలని ప్రశ్నించారు. తన కుటుంబం, పేరు ప్రఖ్యాతుల కోసం ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణను రూ. 4.86 లక్షల కోట్ల అప్పుల్లోకి కూరుకుపోయేలా చేశారంటూ సీఎం కేసీఆర్ లక్ష్యంగా ఆరోపణలు చేశారు. టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ కారణంగా ఎందరో ఉద్యోగార్థులు ఇబ్బంది పడుతుంటే అరకొర చర్యలతో సరిపెట్టారని విమర్శించారు.

అప్పుల్లో సింగరేణి...

తెలంగాణ వచ్చినప్పుడు సింగరేణి రూ. 3,525 కోట్ల మిగులుతో ఉండగా 2023 మార్చి 31 నాటికి రూ. 8,000 కోట్ల అప్పుల్లో కూరుకుపోయిందని పొంగులేటి వివరించారు. 2014లో సింగరేణికి రాష్ట్ర ప్రభుత్వ బకాయిలు రూ. 408 కోట్లు ఉండగా ఇప్పుడవి రూ. 24,300 కోట్లకు చేరాయన్నారు. కేసీఆర్ ప్రభుత్వ పాలనలో లాభాల్లో ఉన్న సింగరేణి అప్పులపాలైందన్నారు. సింగరేణి కార్మికులు సరిహద్దులో సిపాయిలతో సమానమని ఉద్యమ సమయంలో చెప్పి... తెలంగాణ వచ్చాక వారిని ఘోరంగా అవమానించారని దుయ్యబట్టారు. గత ఎనమిదిన్నరేళ్లలో 123 మంది కార్మికులు చనిపోతే కనీసం ఒక్క కార్మికుడి కుటుంబాన్ని కూడా సీఎం పరామర్శించలేదని విమర్శించారు. ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి సీఎంలు వైఎస్ రాజశేఖరరెడ్డి, చంద్రబాబు సైతం కార్మికుల కుటుంబాలను ఓదార్చారని ఆయన గుర్తుచేశారు. వారిద్దరి కంటే ప్రస్తుత సీఎం బిజీగా ఉన్నారా? అని ప్రశ్నించారు.

ప్రజాస్వామ్యాన్ని కాపాడాలి: జూపల్లి

తెలంగాణలో ప్రజాస్వామ్యం అణచివేతకు గురవుతోందని, ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకే కొత్తగూడెం వచ్చి ఈ ఆత్మీయ సమ్మేళనంలో భాగం అవుతున్నానని మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఈ ప్రభుత్వం ప్రతిపక్షాల గొంతు నొక్కుతోందని విమర్శించారు. ప్రజాస్వామ్యం కోసం పోరాడుతున్న పొంగులేటిని అభినందిస్తున్నానని చెప్పారు. రాష్ట్రానికి సీఎం అంటే ధర్మకర్త లాంటి వ్యక్తని, కానీ ప్రస్తుత సీఎం ఆ విషయాన్ని మరచి అంతా తాను, తనది అన్నట్లుగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఎంత చదివినా, ఎన్ని శ్లోకాలు చెప్పినా, ఎంత మంచిగా మాట్లాడినా నిజాయతీ లేకపోతే వ్యర్థమని... ప్రస్తుత సీఎంలో ఆ నిజాయతీ లోపించిదన్నారు. మూడు పూటలా తిండి లేకపోయినా ఆత్మగౌరవం ముఖ్యమంటూ ఉద్యమ సమయంలో పోరాడామని, కానీ నేడు అది దక్కడం లేదని జూపల్లి ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ వచ్చాక ఉద్యమకారులపై అక్రమ కేసులు, స్టేషన్లలో చిత్రహింసలు పరిపాటిగా మారాయన్నారు. ధరణి పథకం మంచిదే అయినా అవినీతి ఆలవాలంగా మారిందని విమర్శించారు.

అవినీతి అధికారులకు సీఎం అండ..

కొల్లాపూర్ సంస్థానం పరిధిలో ప్రభుత్వానికి దఖలు పడిన 1,600 ఎకరాల భూమిని అవినీతి అధికారులు ప్రైవేటుపరం చేశారని... దీనిపై ఆధారాలతో సహా ఫిర్యాదు చేసినా సీఎం చర్యలు తీసుకోకపోగా అవినీతి అధికారులకే అండగా నిలిచారని జూపల్లి ఆరోపించారు. వనపర్తి జిల్లాలో ఓ వంతెన నిర్మాణ విషయంలో రూ. 5 లక్షల బకాయిలు చెల్లించాల్సిన చోట రూ. 26.30 కోట్లను అప్పనంగా ఈ ప్రభుత్వం చెల్లించిదన్నారు. దీనికి ప్రతిఫలంగా ప్రతిపక్ష పార్టీకి చెందిన 12 మంది ఎమ్మెల్యేలను అధికార పక్షంలోకి విలీనం చేసుకుందన్నారు. ఇలాంటి అవినీతి పనులు చేసి వాటినే ఆదర్శంగా చూపుతూ దేశ రాజకీయాల్లోకి వెళ్తున్నారా అంటూ సీఎం కేసీఆర్, బీఆర్ఎస్ లక్ష్యంగా జూపల్లి ప్రశ్నల వర్షం కురిపించారు.

చర్మం ఒలిచి చెప్పులు కుట్టించినా తక్కువే

- బీఆర్ఎస్ శ్రేణుల ప్రేమ, ఆప్యాయతకు ఎన్ని జన్మలెత్తినా రుణం తీర్చలేను
- సిద్దిపేట ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి హరీశ్ రావు భావోద్వేగం

సాక్షి, సిద్దిపేట: ''మీరు చూపించిన ప్రేమ చూస్తుంటే నా కళ్ళలో నీళ్లు వస్తున్నాయి... మీ ఆదరణకు నేను ఎంత సేవ చేసినా తక్కువే. మీ ప్రేమ, ఈ బలగాన్ని చూస్తుంటే ఎన్ని జన్మలెత్తిన రుణం తీర్చుకోలేనేమో అనిపిస్తోంది.. నా చర్మం ఒలిచి చెప్పులు కుట్టించినా తక్కువే అనిపిస్తోంది..''అంటూ ఆర్థిక వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు సిద్దిపేట రూరల్ మండలంలో ఆదివారం జరిగిన బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో భావోద్వేగానికి లోనయ్యారు. హరీశ్ మాట్లాడుతూ.. నా ఊపిరి ఉన్నంతకాలం, చివరి శ్వాస వరకు మీ సేవ చేస్తూనే ఉంటా. పదవులు ఉండొచ్చు పోవచ్చు. మీ ప్రేమ ఆప్యాయత వెలకట్టలేనిదని బీఆర్ఎస్ శ్రేణులనుద్దేశించి అన్నారు. కేసీఆర్ పాలనలో తెలంగాణ దేశానికి అన్నపూర్ణగా మారిందన్నారు. కాంగ్రెస్, బీజేపీ నేతల మాటలు నమ్మొద్దని, కళ్ల ముందు జరిగిన అభివృద్ధి చూసి తెలంగాణ ప్రజలు ఆశీర్వదించాలని కోరారు.

మోదీ వ్యాఖ్యలు విడ్డూరం

ప్రధాని మోదీ రాష్ట్ర పర్యటనలో చేసిన వ్యాఖ్యలు ఆశ్చర్యం కలిగించాయని మంత్రి హరీశ్ వ్యాఖ్యానించారు. విభజన హామీలైన బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, ఐటీఐఆర్ ప్రాజెక్టు, కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ అమలు కాలేదని, కాళేశ్వరానికి జాతీయ హోదా ఇవ్వకుండా రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకుంటోంది కేంద్రమేనని విమర్శించారు.



ఆటోడ్రైవర్... మినిస్టర్ హరీశ్

మంత్రి హరీశ్‌రావు కొద్దిసేపు ఆటో డ్రైవర్‌గా మారారు. ఆదివారం సిద్దిపేట ఆటో కార్మికుల కోసం ఏర్పాటు చేసిన సహకార సొసైటీ ఆధ్వర్యంలో జరిగిన ఆత్మీయ సమ్మేళనానికి ఆయన స్వయంగా ఆటో నడుపుతూ వచ్చారు. మంత్రిని చూసి ఆటోడ్రైవర్లు, ఆయన అభిమానులు ఉబ్బితబ్బిబ్బయ్యారు.

రూ.15 కోట్లతో ఏఈడీ మెషీన్లు..

సిద్దిపేట పోలీస్ కన్వెన్షన్ హాల్‌లో ప్రభుత్వ ఉద్యోగులకు, ప్రజా ప్రతినిధులకు నిర్వహించిన సీపీఆర్ శిక్షణ కార్యక్రమంలో మంత్రి హరీశ్ మాట్లాడారు. సీపీఆర్ ద్వారా 50శాతం మందిని బతికించవచ్చని, రాష్ట్ర వ్యాప్తంగా 36,520 మందికి సీపీఆర్‌పై శిక్షణ అందించామని చెప్పారు. రూ.15 కోట్లతో ఏఈడీ మెషీన్లను అందుబాటులోకి తెచ్చి అన్ని పీహెచ్‌సీలు, బస్తీ దవాఖానాలు, అంబులెన్స్‌లలో ఉంచుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్ సీపీఆర్ శిక్షణ తీసుకున్నారు.

కమ్యూనిస్టుల ఐక్యతే దేశానికి దిక్సూచి

▶ మొదటి పేజీ తరువాయి

ఉసిగొల్పుతోందని ఆరోపించారు. ఈడీ 5 వేల కేసులు పెడితే, ఇప్పటివరకు అందులో 0.5 శాతం కేసుల్లోనే శిక్ష పడిందంటే.. వేధింపులు, రాజకీయ కక్షలతోనే కేసులు పెడుతున్నట్టుగా అర్థమవుతోందని అన్నారు. దేశంలో లౌకిక రాజ్యాంగానికి బదులు హిందూత్వ రాజ్యాంగాన్ని తీసుకురావాలనే ప్రయత్నం జరుగుతోందని ఏచూరి పేర్కొన్నారు. పార్లమెంటు రికార్డులను కూడా ధ్వంసం చేస్తున్నారని ఆరోపించారు. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని ధ్వంసం చేస్తున్న మోదీ సర్కారును గద్దె దించకపోతే దేశం నాశనమై పోతుందన్నారు. బీజేపీని గద్దె దించేందుకు ఇక్కడి ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీలు లౌకిక శక్తులతో కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. ఎన్నికల తర్వాత జాతీయ స్థాయిలో ఫ్రంట్ ఏర్పడుతుందని చెప్పారు.

కమ్యూనిస్టుల ఐక్యత తక్షణావసరం: డి.రాజా

కమ్యూనిస్టుల పునరేకీకరణ, ఐక్యత తక్షణావసరమని డి.రాజా అభిప్రాయపడ్డారు. గతంలో చంద్ర రాజేశ్వర్‌రావు ఇదే ప్రతిపాదన చేశారని, ఆ తర్వాత సీపీఐ, సీపీఎంలకు ప్రధాన కార్యదర్శులుగా పనిచేసిన ఇంద్రజిత్ గుప్తా, హరికిషన్‌సింగ్ సూర్జిత్‌లు కూడా రెండు పార్టీల ఐక్యత కోసం కిందిస్థాయి వరకు సమన్వయ కమిటీలు ఉండాలనే ఆదేశాలు ఇచ్చారని తెలిపారు. గతేడాది విజయవాడలో జరిగిన సీపీఐ మహాసభలో కూడా కమ్యూనిస్టుల ఐక్యతే దేశానికి దిక్సూచి అని అభిప్రాయపడ్డామని గుర్తుచేశారు. కమ్యూనిస్టులు చాలా ప్రమాదకరమని మోదీ అంటున్నారని, అయితే తాము ప్రజల పక్షాన, బీజేపీకి వ్యతిరేకంగా పనిచేయడంలో ముందుంటామని చెప్పారు. దేశ లౌకిక రాజ్యాంగం స్థానే మనుస్మృతిని ప్రవేశపెట్టాలని బీజేపీ చూస్తోందని ఆరోపించారు. గవర్నర్లను రాజకీయ సాధనాలుగా ఉపయోగించుకుంటూ సమాఖ్య వ్యవస్థను కాలరాస్తోందని, తెలంగాణలో ఇదే చూస్తున్నామని అన్నారు. దేశంలోని ఎర్రజెండాలన్నీ వైరుధ్యాలను పక్కన పెట్టి ఒక్క జెండాగా ముందుకు కదలాలని రాజా ఆకాంక్షించారు.



ఆదివారం హైదరాబాద్‌లోని ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో జరిగిన సభకు హాజరైన వామపక్ష శ్రేణులు

బీజేపీని పాతాళానికి నెట్టాలి: రాఘవులు

తెలంగాణలో బీజేపీని పాతాళంలోకి నెట్టాల్సిన అవసరముందని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు పిలుపునిచ్చారు. తమిళనాడు, కేరళ, ఆంధ్రప్రదేశ్‌లో బీజేపీకి చోటు లేదని, ఆ లోటును తెలంగాణలో పెంచుకొని పూడ్చుకోవాలని ఆ పార్టీ చూస్తోందని అన్నారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌ను అమ్మేందుకే మోదీ దాన్ని అందంగా తీర్చిదిద్దుతున్నారని విమర్శించారు. వందే భారత్ రైలు.. భాగ్యలక్ష్మి దేవాలయం ఉన్న నగరం నుంచి వెంకటేశ్వరుడి నగరం వరకు వెళ్తుందని చెప్పడం ద్వారా దానికి కూడా మతం రంగు పులమడానికి మోదీ ప్రయత్నిస్తున్నారని ధ్వజమెత్తారు.

బీజేపీకి జై కొట్టనందుకే..: కె.నారాయణ

బీజేపీకి జై కొట్టనందుకే కేసీఆర్, కవితను మోదీ వేధిస్తున్నారని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ విమర్శించారు. బీజేపీతో కొట్లాడుతున్న బీఆర్ఎస్..ఆ పార్టీతో కొట్లాడే మిగతా పార్టీలతో రాజకీయ సంబంధాలు పెట్టుకోవాలి కదా అని ప్రశ్నించారు. ప్రజా ఉద్యమాల ద్వారానే బీజేపీని ఎదుర్కోగలమని స్పష్టం చేశారు. ప్రధాని హైదరాబాద్ పర్యటనలో ముఖ్యమంత్రి కేసీఆర్ కూడా పాల్గొని ఉంటే బాగుండేదని అన్నారు. ప్రధాని, ముఖ్యమంత్రి పదవులు ప్రైవేటు ఆస్తులు కాదని, రాజ్యాంగబద్ధమైన పదవులని స్పష్టం చేశారు.

పొత్తుల కోసం ఎక్కడికీ వెళ్లలేదు: కూనంనేని

కమ్యూనిస్టులు పొత్తుల కోసం ఇప్పటివరకు ఎవరి దగ్గరకు వెళ్లలేదని, వారే తమ అవసరం కోసం వస్తున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు చెప్పారు. 2004లో టీడీపీయే తమ వద్దకు వచ్చిందన్నారు. కేసీఆర్ బీజేపీని సమర్థించినంత కాలం బీఆర్ఎస్‌ను వ్యతిరేకించామని, ఇప్పుడు బీజేపీని వ్యతిరేకిస్తున్నందున ఆ పార్టీని సమర్థిస్తున్నామని చెప్పారు.

కేసీఆర్ ఆశించిన స్థాయిలో కలిసి రావడం లేదు: తమ్మినేని

బీజేపీ భావజాలానికి వ్యతిరేకంగా జరిగే పోరాటంలో ముఖ్యమంత్రి కేసీఆర్ ఆశించిన స్థాయిలో కలిసి రావడం లేదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. బీజేపీని ఓడించేందుకు బీఆర్ఎస్‌తో కలిసి పోటీ చేసే విషయంపై ఎన్నికలు ప్రకటించాక ఉభయ కమ్యూనిస్టు పార్టీలు ఆలోచిస్తాయని చెప్పారు. బీజేపీ వ్యతిరేక పోరాటంలో బీఆర్ఎస్‌తో కలుస్తామని, రాష్ట్ర ప్రజలను కష్టాలకు గురిచేస్తే పోరాటం చేస్తామని స్పష్టం చేశారు.

వైజాగ్ స్టీల్‌పై తెలంగాణ 'ఆసక్తి'!

- ప్రైవేటీకరణను అడ్డుకోవడమే లక్ష్యంగా నిర్ణయం
- సింగరేణి సంస్థ ద్వారా ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రెస్ట్ ప్రక్రియలో పాల్గొనే యోచన
- ఒకటీ రెండురోజుల్లో వైజాగ్‌కు అధికారుల బృందం

సాక్షి, హైదరాబాద్: వైజాగ్ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను అడ్డుకోవడమే లక్ష్యంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వైజాగ్ స్టీల్ ప్లాంట్ నిర్వహణకు మూలధనం కోసం ఇచ్చిన 'ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రెస్ట్ (ఆసక్తి వ్యక్తీకరణ) ప్రక్రియలో పాల్గొనేందుకు సూత్రప్రాయంగా నిర్ణయించినట్లు తెలిసింది. సంస్థకు మూలధన పెట్టుబడితో పాటు, ముడి సరుకుల కోసం నిధులు ఇచ్చి.. తమ ఉత్పత్తులను తీసుకునేందుకు ఆసక్తి కలిగిన వారికి ఆహ్వానం పలుకుతూ వైజాగ్ స్టీల్ ప్లాంట్ యాజమాన్యం మార్చి 27వ తేదీన ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రెస్ట్‌ని ప్రకటించింది. అయితే ఇది బీజేపీ అనుకూల కార్పొరేట్ కంపెనీలకు స్టీల్‌ప్లాంట్‌ను అప్పజెప్పే, అంతిమంగా ప్రైవేట్ పరం చేసే ప్రక్రియలో తొలి అడుగని పేర్కొంటూ.. తెలంగాణ ప్రభుత్వం తరఫున మంత్రి కేటీఆర్ ఇటీవల కేంద్రానికి లేఖ రాశారు. ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రెస్ట్ రూపంలో వైజాగ్ స్టీల్ ప్లాంట్‌లోకి ప్రైవేట్ కంపెనీలను చొప్పించే కుట్రకు కేంద్రం తెరలేపిందని ఆరోపించారు. 'వైజాగ్ ఉక్కు...తెలుగు ప్రజల హక్కు'అని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలోనే బీఆర్ఎస్ ఏపీ అధ్యక్షుడు తోట చంద్రశేఖర్.. వైజాగ్ స్టీల్ ప్లాంట్ ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో సమావేశమై చర్చించారు.

సింగరేణి సంస్థ ద్వారా..

తెలంగాణ ప్రభుత్వం భారీ ఎత్తున చేపడుతున్న మౌలిక వసతుల ప్రాజెక్టులకు అవసరమైన స్టీల్‌ను వైజాగ్ స్టీల్‌ప్లాంట్ నుంచే నేరుగా కొనుగోలు చేయాలని, దీని కోసం ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రెస్ట్ ప్రక్రియలో పాల్గొనాలని పలువురు ప్రతినిధులు రాష్ట్ర ప్రభుత్వానికి సూచించినట్లు తెలిసింది. కాగా బొగ్గు ఉత్పత్తిలో దేశంలోనే ప్రముఖ సంస్థగా ఉన్న సింగరేణి ఇందుకు పూర్తి సంసిద్ధత వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలోనే తెలంగాణ ప్రభుత్వ మెజారిటీ వాటా ఉన్న సింగరేణి సంస్థ ద్వారా వైజాగ్ స్టీల్ ప్లాంట్ ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రెస్ట్ ప్రక్రియలో పాల్గొనాలని సీఎం కేసీఆర్ నిర్ణయించినట్లు తెలిసింది. ఈ మేరకు ఒకటీ రెండురోజుల్లో అధికారుల బృందాన్ని వైజాగ్ స్టీల్ ప్లాంట్‌కు పంపించనున్నారు. ఈ బృందం.. వైజాగ్ స్టీల్ ప్లాంట్ యాజమాన్యం తమ ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రెస్ట్ ద్వారా సేకరించాలనుకుంటున్న నిధులు, ఆ నిధులు అందిస్తే తిరిగి ఇచ్చే ఉత్పత్తులు, లేదా తిరిగి చెల్లించే విధానాలు, ఇందు కోసం స్టీల్ ప్లాంట్ యాజమాన్యం విధించే నిబంధనలు, షరతులు తదితరాలపై కూలంకషంగా అధ్యయనం చేయనుంది. కాగా ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రెస్ట్ ప్రక్రియలో పాల్గొనడం ద్వారా.. ఇప్పటికే కొంతకాలంగా ప్రభుత్వ రంగ సంస్థల అమ్మకంపై తీసుకున్న వ్యతిరేక వైఖరిని మరింత బలంగా చాటాలని బీఆర్ఎస్ పార్టీ నిర్ణయించింది. ఈ ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రెస్ట్ ప్రక్రియలో తెలంగాణ ప్రభుత్వం విజయం సాధిస్తే, ప్రభుత్వ రంగ సంస్థలను సంరక్షించేందుకు ఒక ప్రభుత్వంగా వ్యవహరించాల్సిన తీరుపై ఒక బలమైన సందేశం ప్రజల్లోకి వెళుతుందన్న భావన ఉన్నట్లు తెలుస్తోంది. కాగా ప్రస్తుత పరిస్థితుల్లో కేంద్ర ప్రభుత్వం కూడా అంతిమంగా వైజాగ్ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటుపరం చేయకుండా, గతంలో పీవీ నరసింహారావు, అటల్ బిహారీ వాజ్‌పేయి హయాంలో మూలధన నిధులను అందించిన తీరుగానే వ్యవహరిస్తుందని భావిస్తున్నట్లు సమాచారం.

ఊరూరా పండుగలా..

▶ మొదటి పేజీ తరువాయి

పార్టీ జెండాలను ఎగరవేసి.. పండుగలా జరుపుకోవాలని, ఆ తర్వాత నియోజకవర్గ సమావేశాలకు రావాలని నేతలకు సూచించారు. రోజంతా జరిగే పార్టీ నియోజకవర్గ ప్రతినిధుల సభలో రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న అభివృద్ధి, ప్రజలకు అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాలు, పార్టీ తరఫున చేపట్టిన కార్యక్రమాలన్నింటిపై విస్తృతంగా చర్చించనున్నట్టు తెలిపారు. ప్రతినిధుల సభకు నియోజకవర్గ పరిధిలోని గ్రామ, వార్డు పార్టీ అధ్యక్షులు, పార్టీ అనుబంధ సంఘాల అధ్యక్షులతోపాటు అన్నిస్థాయిల ప్రజా ప్రతినిధులు, కార్పొరేషన్ల చైర్‌పర్సన్లు హాజరుకావాలని చెప్పారు.

తెలంగాణభవన్‌లో ఆవిర్భావ దినోత్సవం

ఈ నెల 27న హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో భారత రాష్ట్ర సమితి ఆవిర్భావ వేడుకలను నిర్వహించనున్నట్టు కేటీఆర్ తెలిపారు. అదేరోజున పార్టీ అధ్యక్షుడు కె.చంద్రశేఖర్‌రావు అధ్యక్షతన పార్టీ జనరల్ బాడీ సమావేశం జరుగుతుందని.. సుమారు 300 మంది పార్టీ జనరల్ బాడీ ప్రతినిధులు అందులో పాల్గొంటారని వివరించారు. ఈ సమావేశంలో పలు రాజకీయ తీర్మానాలను ప్రవేశపెడతారని.. వాటిపై విస్తృతంగా చర్చించి, ఆమోదిస్తారని వెల్లడించారు. తెలంగాణవ్యాప్తంగా ఈ నెలాఖరులో వరి కోతలు ఉండటం, ఎండల తీవ్రత దృష్ట్యా.. పార్టీ ఆవిర్భావ దినం సందర్భంగా నిర్వహించే బహిరంగసభ, ప్రతినిధుల సభను వాయిదా వేస్తున్నట్టు తెలిపారు. వీటిని కలిపి అక్టోబర్ 10న వరంగల్‌లో మహాసభ నిర్వహిస్తామని ప్రకటించారు.

మూడు నియోజకవర్గాలకు ఇన్‌చార్జులు

సిట్టింగ్ ఎమ్మెల్యే జి.సాయన్న మృతి నేపథ్యంలో కంటోన్మెంట్ అసెంబ్లీ నియోజకవర్గం ఇన్‌చార్జిగా మర్రి రాజశేఖర్‌రెడ్డిని కేసీఆర్ నియమించారు. ఇక గోషామహల్ ఇన్‌చార్జిగా నంద కిషోర్ వ్యాస్ బిలాల్, భద్రాచలం ఇన్‌చార్జిగా ఎంపీ మాలోతు కవితలను నియమించారు. ప్రస్తుతం నియోజకవర్గంలో కొనసాగుతున్న ఆత్మీయ సమ్మేళనాలతో పాటు పార్టీ ఆవిర్భావ దిన వేడుకలు, ఇతర కార్యక్రమాల నిర్వహణకు బాధ్యులుగా ఉంటారని ప్రకటించారు.


ఆత్మీయ సమ్మేళనాల కొనసాగింపు

రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన ఆత్మీయ సమ్మేళనాల నిర్వహణను పార్టీ అధినేత కేసీఆర్ అభినందించారని కేటీఆర్ తెలిపారు. ఈ ఆత్మీయ సమ్మేళనాలను మే నెలాఖరు దాకా కొనసాగించాలని కేసీఆర్ సూచించారని.. ఈ మేరకు చర్యలు చేపడుతున్నామని వివరించారు.

అభివృద్ధికి కేరాఫ్ తెలంగాణ

- అభివృద్ధి జరగలేదన్న మోదీ మాటలు అబద్ధాలు
- బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత కేకే

సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో అభివృద్ధి జరగలేదన్న మోదీ మాటల్లో నిజం లేదని, తెలంగాణ అభివృద్ధికి కేరాఫ్‌గా నిలిచిందని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత కె. కేశవరావు అన్నారు. ఆదివారం ఆయన తన నివాసంలో ఎంపీలు కె.ఆర్.సురేశ్ రెడ్డి, వెంకటేశ్ నేతతో కలసి మీడియాతో మాట్లాడారు. ప్రతి రంగంలో తెలంగాణ అభివృద్ధి చెందిందని, దేశంలో ఎక్కడా తెలంగాణ మాదిరి అభివృద్ధి లేదని అన్నారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం తెలంగాణ పట్ల సవతితల్లి ప్రేమ ప్రదర్శిస్తోందని, ఏపీ విభజన చట్టంలో ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని విమర్శించారు. కేంద్రం ఒక్క మెడికల్ కాలేజీ కూడా ఇవ్వకపోవడంతో తెలంగాణ ప్రభుత్వం స్వయంగా ఏర్పాటు చేసుకుందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు ఒక్క పైసా ఇవ్వకపోయినా రాష్ట్ర ప్రభుత్వమే పూర్తి చేసిందని స్పష్టంచేశారు. కేంద్రం జాతీయ రహదారులపై భారీగా టోల్ ట్యాక్స్ వసూలు చేస్తోందని మండిపడ్డారు. పార్లమెంట్‌లో మెజారిటీ ఉందనే గర్వంతో కేంద్రం తెలంగాణ పట్ల ఇష్టానుసారంగా వ్యవరిస్తోందని అన్నారు. ఎంపీ సురేశ్‌రెడ్డి మాట్లాడుతూ ప్రధాని మోదీ.. తెలంగాణపై విషం కక్కుతున్నారని మండిపడ్డారు. ఎంపీ వెంకటేశ్ నేత మాట్లాడుతూ ప్రధాని మోదీ కేంద్ర ప్రాజెక్టులు.. శంకు స్థాపన అంటూ రాజకీయ కుట్ర చేస్తున్నారని ధ్వజమెత్తారు.



మీడియాతో మాట్లాడుతున్న కె. కేశవరావు. చిత్రంలో ఎంపీలు సురేశ్‌రెడ్డి, వెంకటేశ్ నేత

క్లుప్తంగా...

విద్యార్థుల పక్షాన నిలబడండి

ఏఐసీసీ ఇన్‌చార్జి కార్యదర్శి నదీమ్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని బీఆర్‌ఎస్, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాలు విద్యారంగం పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని, విద్యార్థుల పక్షాన భారత జాతీయ విద్యార్థి సంఘం (ఎన్‌ఎస్‌యూఐ) నాయకత్వం విస్తృత పోరాటాలు నిర్వహించాలని ఏఐసీసీ ఇంచార్జి కార్యదర్శి నదీమ్ జావేద్ పిలుపునిచ్చారు. ఎన్‌ఎస్‌యూఐ 53వ ఆవిర్భావ దినోత్సవాన్ని గాంధీభవన్‌లో శనివారం ఘనంగా నిర్వహించారు. ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్ సంఘం పతాకాన్ని ఆవిష్కరించి, కేక్ కట్ చేశారు. ముఖ్య అతిథిగా నదీమ్ విద్యార్థి నాయకులను ఉద్దేశించి ప్రసంగించారు. కార్యక్రమంలో ఏఐసీసీ ఇంచార్జి కార్యదర్శి రోహిత్ చౌదరి, ఎన్‌ఎస్‌యూఐ కార్యవర్గ సభ్యులు, వివిధ జిల్లాల అధ్యక్షులు పాల్గొన్నారు.

లీకేజీ కేసును సీబీఐకి అప్పగించాలి



గద్వాల అర్బన్: టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల లీక్ కేసును సీబీఐకి అప్పగించాలని టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కోదండరాం డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఇప్పటివరకు వివిధ సంఘటనల్లో వేసిన సిట్ వల్ల న్యాయం జరగలేదని.. టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల లీక్ వ్యవహారంలో కూడా సిట్‌తో న్యాయం జరుగుతుందనే భరోసా లేదని తెలిపారు. ఆదివారం జోగుళాంబ గద్వాల జిల్లాకేంద్రంలో ఆ పార్టీ జిల్లా కన్వీనర్ ప్రకాశ్‌గౌడ్ ఆధ్వర్యంలో 'టీఎస్‌పీఎస్సీ లీక్ – ప్రభుత్వ వైఫల్యం'అనే అంశంపై అఖిలపక్షాల రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. టీఎస్‌పీఎస్సీ బోర్డు చైర్మన్‌ను వెంటనే తొలగించాలని, కొత్త బోర్డు నియమించిన తరువాతే పరీక్షలు నిర్వహించాలని, పరీక్ష రాసిన ప్రతి అభ్యర్థికి రూ.లక్ష పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం సీనియర్ సిటిజన్ ఫోరం, తెలంగాణ సిటిజన్ ఫోరం ఆధ్వర్యంలో టీఎన్‌జీఓ భవన్‌లో నిర్వహించిన తెలంగాణ అమరవీరుల సంస్మరణ సభలో కోదండరాం, ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

నేడు నిరుద్యోగుల కోసం రౌండ్ టేబుల్ సమావేశం

వైఎస్సార్‌టీపీ ఆధ్వర్యంలో



సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో బిశ్వాల్ కమిషన్ సూచించిన 1.91 లక్షల ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరగనుంది. సోమవారం ఉదయం 10.30కు సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఈ సమావేశం ప్రారంభమవుతుందని ఆదివారం ఆ పార్టీ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. టీ–సేవ్ ఫోరం ఆధ్వర్యంలో నిరుద్యోగ యువత పక్షాన నిలబడేందుకు ప్రతిపక్ష పార్టీలు, విద్యార్థి, ప్రజా, యువజన సంఘాలు ముందుకొచ్చాయని ఆ ప్రకటనలో షర్మిల తెలిపారు. తెలంగాణ కోసం కొట్లాడిన నిరుద్యోగులు నేడు కొలువులు లేక అంధకారంలో జీవనం గడుపుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పైసలు పెట్టిన వాడికే ఉద్యోగాలు, పైరవీలు చేసిన వారికే కొలువులు అనే చందంగా మారిందని ఆరోపించారు. కాగా, బీజేపీ, బీఆర్‌ఎస్ యేతర పార్టీలతో టీ–సేవ్ ఫోరం బలోపేతంపై సమావేశంలో చర్చించనున్నారు.

రిటైర్డ్ ఐఏఎస్ నిరంజన్‌రావు మృతి



సాక్షి, హైదరాబాద్: రిటైర్డ్ ఐఏఎస్ అధికారి జి.నిరంజన్‌రావు ఆదివారం బంజారాహిల్స్ లోని తన నివాసంలో కన్నుమూశారు. ఆయన నిద్రలోనే తుది శ్వాస విడిచినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. 1969 బ్యాచ్‌కి చెందిన ఐఏఎస్ అధికారి నిరంజన్ రావు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో వివిధ పదవుల్లో పనిచేసి 1998లో పదవీ విరమణ చేశారు. హైదరాబాద్, మెదక్, కడప జిల్లాల కలెక్టర్‌గా ఆయన పనిచేశారు. ఆర్థిక శాఖ కార్యదర్శిగా, సాధారణ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శిగా పనిచేశారు. నిజాయితీగల అధికారిగా పేరు సంపాదించుకున్నారు.

చర్చలు మళ్లీ విఫలం

▶ మొదటి పేజీ తరువాయి

కోరామని పవర్ ఎంప్లాయిస్ జేఏసీ నేతలు సాయిబాబు వెల్లడించారు. ఇప్పటికే ప్రకటించిన విధంగా ఈ నెల 17 నుంచి సమ్మె ప్రారంభిస్తామని, ఈ విషయంలో ఎలాంటి మార్పులేదని ప్రకటించారు. సోమవారం నుంచి జిల్లా ల్లో సమ్మె సన్నాహక సమావేశాలు యధావిధిగా కొనసాగుతాయన్నారు. ట్రాన్స్‌కో, జెన్‌కో, డిస్కంలలో రోజువారీగా నిర్వహించే సమీ క్ష సమావేశాలను సోమవారం నుంచి బహిష్కరించాలని పిలుపునిచ్చారు. చర్చల్లో యాజ మాన్యాల తరఫున ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ డి.ప్రభాకర్ రావు, ఉత్తర/దక్షిణ డిస్కంల సీఎండీలు ఎ.గోపాల్‌రావు, జి.రఘుమారెడ్డి, పవర్ ఎంప్లాయిస్ జేఏసీ నేతలు పి.రత్నాకర్ రావు, శ్రీధర్, బీసీ రెడ్డి పాల్గొన్నారు.



వారంతా స్టెత్‌పట్టి రోగుల నాడి చూడాల్సిన మెడికోలు... కానీ వారిలో కొందరు మానసిక ఒత్తిళ్లకు చిత్తవుతున్నారు! మనోవేదనను తాళలేక బలవన్మరణాలకు పాల్పడుతున్నారు!! గత కొన్నేళ్లుగా దేశవ్యాప్తంగా ఈ ధోరణి చోటుచేసుకుంటోంది. రాష్ట్రంలోనూ ఇటీవల కాలంలో పలువురు వైద్య విద్యార్థులు ప్రాణాలు తీసుకున్నారు. భావిభారత వైద్యులకు ఈ పరిస్థితి ఎందుకు తలెత్తుతోంది? అందుకుగల కారణాలు ఏమిటి?

కాబోయే వైద్యులకూ కావాలి వైద్యం!

దేశవ్యాప్తంగా గత కొన్నేళ్లలో వందలాది మంది మెడికోల ఆత్మహత్యలు

చదువుల ఒత్తిడి భరించలేక కొందరు.. మనోవేదనతో మరికొందరు బలవన్మరణం

మధ్యలోనే వైద్య కోర్సులు మానేసిన వారి సంఖ్య వెయ్యిపైనే...

నేషనల్ మెడికల్ కౌన్సిల్ అధ్యయనంలో వెల్లడి

ఒత్తిడి, బలహీనతలకు లోనుకావద్దని సూచన

సాక్షి, హైదరాబాద్: జాతీయ మెడికల్ కమిషన్ (ఎన్‌ఎంసీ) చేపట్టిన అధ్యయనం ప్రకారం 2010 నుంచి 2019 మధ్య దేశవ్యాప్తంగా 125 వైద్య విద్యార్థులు, 105 మంది రెసిడెంట్ డాక్టర్లు, 128 మంది వైద్యులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. బలవన్మరణాలకు పాల్పడిన ప్రతి 10 మందిలో ఏడుగురు 30 ఏళ్లలోపు వారేనని అధ్యయనంలో వెల్లడైంది. అలాగే ఉత్తరాదితో పోలిస్తే దక్షిణాదిలోనే (కేరళ మినహా) ఎక్కువ మంది మెడికోల ఆత్మహత్యలు నమోదయ్యాయని, గత ఐదేళ్లలో 64 మంది ఎంబీబీఎస్, 55 పోస్ట్ గ్రాడ్యుయేట్ మెడికోలు ఆత్మహత్యలకు పాల్పడ్డారని ఎన్‌ఎంసీ వెల్లడించింది.

ఒత్తిళ్లు.. విభేదాలు.. అనారోగ్యం..

మెడికోల ఆత్మహత్యలను ఎన్‌ఎంసీ విశ్లేషించగా విస్తుగొలిపే విషయాలు వెల్లడయ్యాయి. మెడికోల ఆత్మహత్యలు ఎక్కువగా జరిగే విభాగాల్లో అనస్తీషియాలజీ (22.4 శాతం) తొలి స్థానంలో నిలవగా ఆ తర్వాత స్థానంలో ప్రసూతి–గైనకాలజీ (16 శాతం) నిలిచింది. ఆత్మహత్యలకు పాల్పడుతున్న వైద్య విద్యార్థుల్లో (45.2 శాతం), రెసిడెంట్ డాక్టర్‌లలో (23.1 శాతం) చదువుల ఒత్తిడి కారణమవుతోంది. అలాగే వైద్యుల దాంపత్య జీవితంలో మనస్పర్థలు (26.7 శాతం), మానసిక సమస్యలు (వైద్య విద్యార్థుల్లో 24 శాతం, వైద్యుల్లో 20 శాతం), వేధింపులు (20.5 శాతం) ఆత్మహత్యలకు ఇతర కారణాలుగా నిలిచాయి. ఆత్మహత్యలకు పాల్పడిన వారిలో 13 శాతం మంది గతంలో మానసిక వైద్య సహాయం కోరడం గమనార్హం. ఆర్టీఐ కార్యకర్త వివేక్ పాండే ఇటీవల అడిగిన ప్రశ్నకు సమాధానంగా ఈ అధ్యయన ఫలితాల్ని విడుదల చేసింది. మరోవైపు వైద్యవృత్తిలో ఉన్నవారిలో ఆత్మహత్య ప్రమాదం సాధారణ జనాభా కంటే దాదాపు 2.5 రెట్లు ఎక్కువని ఇండియన్ మెడికల్ అసోసియేషన్–జూనియర్ డాక్టర్స్ నెట్‌వర్క్ పోస్ట్ గ్రాడ్యుయేట్ స్టడీస్ కమిటీ హెడ్ రిమీ డే పేర్కొన్నారు.

చదువుకు గుడ్‌బై చెబుతున్నారు

దాదాపు అన్ని మెడికల్ కాలేజీల్లో నియమాలు, రక్షణలు సహాయక వ్యవస్థలు ఉన్నప్పటికీ సక్రమంగా అమలు కావడం లేదని... అందుకే 1,166 మంది విద్యార్థులు వైద్య కళాశాలలకు వీడ్కోలు పలికారని అధ్యయనం తేల్చింది. వారిలో 160 మంది ఎంబీబీఎస్, 1,006 మంది పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సులు చదువుతున్న వారు ఉన్నారు.



ఎన్‌ఎంఏ కీలక సూచనలివీ...

- వైద్య విద్యార్థులు మాదకద్రవ్యాలు, మద్యం, పొగాకు ఇతర దురలవాట్లకు దూరంగా ఉండాలి.
- **సామాజిక మాధ్యమ పరిధి, ఉపయోగంతో పాటు విచక్షణారహిత వినియోగంతో వచ్చే వృత్తిపరమైన ప్రమాదాల గురించి వైద్య విద్యార్థులు తప్పనిసరిగా తెలుసుకోవాలి.**
- రోగులతో సమర్థంగా కమ్యూనికేట్ చేయడానికి స్థానిక భాషను నేర్చుకోవాలి.
- విద్యార్థులు ఎదుర్కొనే ఒత్తిడి, మానసిక అనారోగ్య సమస్యల గురించి ప్రొఫెసర్లు తప్పనిసరిగా తెలుసుకోవాలి.
- వైద్య విద్యార్థుల సమస్యలను పరిష్కరించడానికి అందుబాటులో ఉన్న పరిష్కార ప్రక్రియల గురించి అవగాహన పెంచుకోవాలి.

అధ్యయనం జరగాలి...



'వెలుగులోకి వచ్చేవి, మీడియాలో చర్చకు నోచుకున్నవే కాదు. బయటకు రాని మరికొన్ని ఆత్మహత్యల ఉదంతాలూ ఉన్నాయి. ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో నిబంధనల పేరిట విద్యార్థుల్ని విపరీతమైన ఒత్తిడికి లోనుచేస్తున్నారు. ఇక ఆస్పత్రుల్లో 24/7 షిఫ్టులు, కుటుంబానికి దూరంగా ఉండటం, ఆర్థిక కష్టాలు, కొన్ని చోట్ల ర్యాగింగ్, కుల వివక్ష, భవిష్యత్తుపై భయం వంటివి వైద్య విద్యార్థులు ఎదుర్కొంటున్నారు. దీనిపై సమగ్ర అధ్యయనం జరపాలి. నివారించే దిశగా కార్యాచరణ రూపొందించాలి.

– డాక్టర్ బీఎన్ రావు, ఐఎంఏ అధ్యక్షుడు

ఒత్తిడి ఉంది...



పరీక్షల దశలోనే ఒత్తిడి బాగా ఉంది. ఇంటర్న్స్, పీజీలకు రెగ్యులర్ డ్యూటీల భారం ఉంటోంది. ముఖ్యంగా ప్రభుత్వాస్పత్రుల్లో ఎక్కు వమంది రోగులు, తక్కువ మంది వైద్యులు ఉండటం వల్ల నిర్ణీత పనివేళలు ఉండవు. సర్జరీల్లో ఉండే వారికి మరింత ఎక్కువ పనిభారం ఉంటోంది.

–డాక్టర్ కౌశిక్ దెర్మా,
జూనియర్ వైద్యుల సంఘం అధ్యక్షుడు



బండి ఫోన్ ఎక్కడ?

▶ మొదటి పేజీ తరువాయి

కన్పించడం లేదని పేర్కొంటూ పట్టణ టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దానిని ఎలాగైనా వెదికి పెట్టాలని ఆయన విజ్ఞప్తి చేశారు. వాస్తవానికి ఆ ఫోన్ తన సోదరి పేరు మీద ఉందని, భద్రతా పరమైన కారణాల నేపథ్యంలో తాను ఆమె పేరు మీద ఉన్న సిమ్‌కార్డు వాడుతున్నానని ఫిర్యాదులో పేర్కొన్నారు. కాగా ఆదివారం రాత్రి పార్టీ లీగల్ సెల్ నేతలతో భేటీ అయిన సంజయ్.. తన ఫోన్‌ను పోలీసులే మాయం చేశారని ఆరోపించడం గమనార్హం.

అసలు ఆ రోజు ఏం జరిగింది?

అరెస్టు అనంతరం సంజయ్‌ను పోలీసులు బొమ్మల రామారం తీసుకెళ్తున్న క్రమంలో ఆయన ఫోన్ కనిపించకుండా పోయింది. వరంగల్ పోలీసులు చెప్పిన వివరాల ప్రకారం.. ఆ ఫోన్ సాయంతోనే ఏ–2 ప్రశాంత్‌తో సంజయ్ (ఏ–1) పదేపదే సంభాషించారు. ఈ కేసు ఛేదనకు ఎంతో కీలకమైన సాంకేతిక ఆధారం కావడంతో కుట్ర కేసు మొత్తం ఫోన్ చుట్టే తిరుగుతోంది. అయితే ఆ ఫోన్ సంజయ్ సమీప అనుచరుడైన బోయినపల్లి ప్రవీణ్ రావు వద్ద ఉండి ఉంటుందని ఓ సీనియర్ పోలీసు అధికారి అనుమానం వ్యక్తం చేశారు. బ్యాటరీ అయిపోవడం వల్ల స్విచ్ ఆఫ్ అయి ఉంటుందని, చివరిగా అది సిద్దిపేట టవర్ లొకేషన్ చూపించిందని, తప్పనిసరిగా బండి అనుచరులే దాన్ని దాచారని, ఆధారాలు దొరక్కుండా ఇప్పటికే ధ్వంసం చేసి ఉండే అవకాశాలు కూడా లేకపోలేదని ఆయన అభిప్రాయపడ్డారు.

అది పోలీసుల పనే..: సంజయ్

తన సెల్‌ఫోన్‌ను పోలీసులే మాయం చేశారని బండి సంజయ్ ఆరోపించారు. కరీంనగర్‌లో పోలీసులు తనను అక్రమంగా అదుపులోకి తీసుకున్నప్పటి నుంచి సిద్దిపేట వెళ్లే వరకు తన చేతిలోనే ఉన్న ఫోన్ ఆ తర్వాత మాయం అయ్యిందని పేర్కొన్నారు. మాయం చేసినవారే తనను ఫోన్ అడగడం సిగ్గుచేటన్నారు. వివిధ అంశాలపై చర్చించేందుకు ఆదివారం రాత్రి రాష్ట్ర లీగల్ సెల్ నేతలతో భేటీ అయిన సందర్భంగా బండి మాట్లాడారు.

కేసీఆర్ తన దగ్గర పెట్టుకున్నట్టున్నారు..

'మంత్రులు, ఎమ్మెల్యేలు చాలామంది నాకు ఫోన్లు చేశారు. ఆ విషయం తెలిసి సీఎం కేసీఆర్ మూర్ఛపోయారు. నా ఫోన్ బయటకు వస్తే అన్ని విషయాలు బయటకు వస్తాయనే భయంతో కేసీఆర్ తన దగ్గర పెట్టుకున్నట్టున్నారు. ఇతరుల ఫోన్ల సంభాషణలు వినడమే ఆయన పని..'అని సంజయ్ ఆరోపించారు. 'బీజేపీ కార్యకర్తలు దేనికీ భయపడరు. దేశం, ధర్మం కోసం పోరాడుతూనే ఉంటారు. పేపర్ లీకేజీ విషయంలో కేసీఆర్ కొడుకు రాజీనామాకు డిమాండ్ చేస్తున్నాం. రాజీనామా విషయంలో కేసీఆర్ కుటుంబానికో న్యాయం? ఇతరులకో న్యాయమా?..'అని ప్రశ్నించారు.

నిర్బంధాలు పెరిగే అవకాశం

'రాబోయే రోజుల్లో బీజేపీ కార్యకర్తలపై నిర్బంధాలు మరింత పెరిగే అవకాశం ఉంది. పెద్ద సంఖ్యలో కేసులు నమోదు చేసి జైలుకు పంపేందుకు కేసీఆర్ ప్రభుత్వం కుట్ర చేస్తోంది. అందువల్ల లీగల్ సెల్ పార్టీ కార్యకర్తలకు పూర్తి స్థాయిలో అండగా నిలవాలి. మీరున్నారనే ధైర్యం, కాపాడతారనే విశ్వాసంతోనే కార్యకర్తలంతా కేసీఆర్ ప్రభుత్వంపై పోరాడుతున్నారు. మీరు మాకు అండగా ఉండండి..'అని సంజయ్ విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ సర్కార్ తీరును, పోలీసుల వైఖరిని త ప్పుపట్టారు. 'ప్రధానిని తిడతారు. ఆయన దిష్టిబొమ్మలను తగలబెడతారు. వ్యతిరేకంగా పోస్టర్లు అంటిస్తారు. కేసీఆర్‌ను తిడితే మాత్రం నాన్ బెయిలబుల్ కేసులు పెడతారు. పాత కేసులను తిరగదోడి జైలుకు పంపుతున్నారు..' అని ధ్వజమెత్తారు.

లీకేజీపై జడ్జీలకు లేఖలు

బీజేపీ టాస్క్ ఫోర్స్ కమిటీ నిర్ణయం

సాక్షి, హైదరాబాద్: టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సహా హైకోర్టు న్యాయమూర్తులకు లేఖలు రాయాల ని బీజేపీ టాస్క్ ఫోర్స్ కమిటీ నిర్ణయించింది. ఆదివారం పార్టీ కార్యాలయంలో జరిగిన టాస్క్‌ఫోర్స్ సమావేశంలో న్యాయమూర్తులకు లేఖలు రాయడంతో పాటు త్వరలోనే వివిధ కోచింగ్ సెంటర్లు, రాష్ట్రంలోని వివిధ యూనివర్సిటీల్లోనూ పబ్లిక్ హి యరింగ్ నిర్వహించాలని నిర్ణయించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ఈ మేరకు దిశానిర్దేశం చేశారు. సమావేశంలో కమిటీ కన్వీనర్ విఠల్‌తో పాటు సభ్యులు మర్రి శశిధర్ రెడ్డి, చంద్రవదన్, గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి, ఎస్.కుమార్ పాల్గొన్నారు. త్వరలో వరంగల్‌లో పార్టీపరంగా నిర్వహించనున్న నిరుద్యోగ మార్చ్ సన్నాహాలపై చర్చించారు.

పాఠ్యాంశంలోకి కొమురంభీం..

గిరిజన యోధులు రాంజీగోండ్, కొమురం భీం జీవిత చరిత్రలను పాఠ్యాంశంలో చేరుస్తామని బండి సంజయ్ తెలిపారు. ఆదివాసీల ఆరాధ్య దైవాలైన ఇరువురు యోధులను కేసీఆర్ ప్రభుత్వం విస్మరించిందని విమర్శించారు. బీజేపీ అధికారంలోకి వస్తే ఈ ఇద్దరి చరిత్రను చిరకాలం గుర్తుండేలా చర్యలు తీసుకుంటుందని చెప్పారు. ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన ఆలె నరేంద్ర వర్ధంతి కార్యక్రమంలో పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం బండి సంజయ్ మాట్లాడుతూ.. కుహనా లౌకిక శక్తులకు ఆలె నరేంద్ర సింహ స్వప్నమయ్యారని కొనియాడారు.

మళ్లీ తెరపైకి 'భూమి మేనిఫెస్టో'

- నేటి నుంచి భూమి కారవాన్–2కు శ్రీకారం చుట్టనున్న 'లీఫ్స్'
- మెరుగైన భూపరిపాలన, న్యాయ అవసరాల గురించి రైతులతో ముఖాముఖి
- భూదాన్ పోచంపల్లి నుంచి ప్రారంభం
- రైతుల భాగస్వామ్యంతో నివేదిక

సాక్షి, హైదరాబాద్: దేశంలో రైతుల కోసం చంపారణ్ కేంద్రంగా మహాత్మాగాంధీ ఉద్యమాన్ని ప్రారంభించిన రోజున.. భూదాన ఉద్యమానికి కేంద్ర బిందువు అయిన భూదాన్ పోచంపల్లి గ్రామం నుంచి మరోమారు తెలంగాణ భూమి మేనిఫెస్టో తయారీ ప్రక్రియ ప్రారంభం కానుంది. చంపారణ్ స్ఫూర్తి, పోచంపల్లి ఆర్తి కలగలిపిన ఈ రైతు భాగస్వామ్య భూసమస్యల పరిష్కార నివేదిక రూపకల్పన కార్యక్రమానికి లీగల్ ఎంపవర్‌మెంట్ అండ్ అసిస్టెన్స్ ఫర్ ఫార్మర్స్ సొసైటీ (లీఫ్స్) శ్రీకారం చుడుతోంది. సోమవారం నుంచి భూమి కారవాన్ పేరుతో రాష్ట్రవ్యాప్తంగా రైతులను భాగస్వాములను చేస్తూ వారి అభిప్రాయాలను తెలుసుకొనే కార్యక్రమం ప్రారంభం కానుంది.

రెండు ప్రశ్నలు... లక్షలాది మంది అవసరాలు

తెలంగాణలో భూపరిపాలన, రైతుల న్యాయ అవసరాలపై సమగ్ర నివేదిక తయారీలో భాగంగా ప్రారంభమవుతున్న ఈ భూమి కారవాన్–2లో లీఫ్స్ సంస్థ రెండు అంశాలపై దృష్టి కేంద్రీకరించనుంది. ఈ రెండు అంశాల నివృత్తితో రాష్ట్రంలోని లక్షలాది మంది రైతుల అవసరాలు తీరతాయనే ఉద్దేశంతో రైతులతో ఏర్పాటు చేయనున్న సమావేశాల్లో రెండు ప్రశ్నలు అడగనుంది. రాష్ట్రంలో భూసమస్యల పరిష్కారానికి, మెరుగైన భూపరిపాలనకు ప్రభుత్వం ఏం చేయాలి? సాగుకు సంబంధించి రైతులకు ఉన్న న్యాయ అవసరాలేంటి? అనే విషయాలపై సమగ్ర సమాచారాన్ని సేకరించి భూమి మేనిఫెస్టో తయారు చేయనుంది. 2014లో తెలంగాణ ఏర్పాటు సమయంలోనూ 'లీఫ్స్'భూమి కారవాన్–1ను నిర్వహించింది. రాష్ట్రవ్యాప్తంగా 2,500 కి.మీ. మేర పర్యటించి 10 వేల మందికిపైగా రైతుల అభిప్రాయాలతో 'తెలంగాణ భూమి మేనిఫెస్టో'నివేదిక రూపొందించింది. మళ్లీ తొమ్మిదేళ్ల అనంతరం మారిన పరిస్థితుల నేపథ్యంలో రాష్ట్ర రైతాంగ వాణిని తెలుసుకొనేందుకు మళ్లీ కార్యాచరణకు సిద్ధమైంది.

పోచంపల్లి నుంచి మల్లేపల్లి వరకు

తొలిరోజు అభిప్రాయసేకరణలో భాగంగా 11 గ్రామాల్లో పర్యటించేలా 'లీఫ్స్'షెడ్యూల్ రూపొందించింది. సోమవారం యాదాద్రి భువనగిరి జిల్లాలోని పోచంపల్లి మండల కేంద్రంలో రైతులతో ముఖాముఖి అనంతరం అదే మండలంలోని దోతిగూడెం, చౌటుప్పల్ మండల కేంద్రం, చౌటుప్పల్ మండలంలోని గుడిమల్కాపురం, సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రం, ఆ మండలంలోని పుట్టపాక, మునుగోడు, చండూరు, నాంపల్లి మండల కేంద్రాలు, నాంపల్లి మండలంలోని పసునూరు, చివరగా దేవరకొండ మండలంలోని కొండమల్లేపల్లిలో రైతులతో సభలు నిర్వహించనుంది.

ప్రజల మాట వినాలి...

ఏ సమస్యకు పరిష్కారం దొరకాలన్నా ప్రజల మాట వినడం, వారిని భాగస్వాములను చేయడం అవసరం. ఇప్పటిదాకా ప్రభుత్వానికి మేం అందిస్తున్న సూచనలు ఆ కోవలోవే. సాదాబైనామా పరిష్కారం మా అభిప్రాయ సేకరణ నుంచి వచ్చిందే. ప్రస్తుతం రాష్ట్రంలోని భూసమస్యల పరిష్కారానికి రైతుల అభిప్రాయం ఏమిటో తెలుసుకొనేందుకు, శాస్త్రీయ నివేదిక తయారు చేసేందుకు మళ్లీ ప్రజల్లోకి వెళ్తున్నాం. రాష్ట్రవ్యాప్తంగా 800 గ్రామాలు తిరిగి జూన్ 2 నాటికి తెలంగాణ భూమేనిఫెస్టోను ప్రకటిస్తాం.

– ఎం. సునీల్ కుమార్, భూచట్టాల నిపుణుడు, 'లీఫ్స్'అధ్యక్షుడు

విద్యార్థులను గందరగోళానికి గురికానివ్వొద్దు

- నేటి టెన్త్ సైన్స్ పరీక్షపై ప్రత్యేక మార్గదర్శకాలు
- రెండు పేపర్ల మధ్య 20 నిమిషాల బ్రేక్



సాక్షి, హైదరాబాద్: పదవ తరగతి పరీక్షల్లో భాగంగా సోమవారం సైన్స్ పరీక్ష జరుగుతుంది. ఈ ఏడాది ఇదే కీలకం. గతంలో 11 పేపర్లతో టెన్త్ పరీక్ష జరిగేది. ఈసారి మొత్తం ఆరు పేపర్లకే పరిమితం చేశారు. ఇందులో భాగంగానే సైన్స్ రెండు (ఫిజికల్, బయలాజికల్ సైన్స్) పేపర్లను కలిపి ఒకేరోజు నిర్వహిస్తున్నారు. అయితే రెండు పేపర్లకు మధ్య 20 నిమిషాల గ్యాప్ ఇస్తున్నారు. కాగా సోమవారం పరీక్షపై పాఠశాల విద్యాశాఖ ప్రత్యేకంగా దృష్టి సారించింది. కొత్తగా చేపడుతున్న ఈ పరీక్ష విషయంలో విద్యార్థులు ఏమాత్రం గందరగోళానికి గురవ్వకుండా చూడాలని పేర్కొంటూ క్షేత్ర స్థాయి అధికారులకు స్పష్టమైన మార్గదర్శకాలతో ప్రత్యేక ఆదేశాలు జారీ చేసింది. రెండు పేపర్లకు కలిపి 80 మార్కులుంటాయి. స్కూల్ అంతర్గత పరీక్షల ఆధారంగా 20 మార్కులు తీసుకుంటారు. మొత్తంగా 100 మార్కుల్లో విద్యార్థులు 35 సాధించాల్సి ఉంటుంది.

పరీక్ష ఇలా...

- ముందుగా పార్ట్–1 (ఫిజికల్ సైన్స్) పరీక్ష ఉంటుంది. ఇది ఉదయం 9.30 గంటలకు మొదలై 11 గంటల వరకూ (1.30 గంటల వ్యవధి) ఉంటుంది. ఇందులోనే బిట్ పేపర్ (పార్ట్–బీ)ను 10.45 గంటలకు ఇస్తారు. 15 నిమిషాల్లో దీన్ని పూర్తి చేయాల్సి ఉంటుంది. ఆ తర్వాత 20 నిమిషాలు బ్రేక్ ఇచ్చి బయలాజికల్ పేపర్ ఇస్తారు.
- బయలాజికల్ సైన్స్ పేపర్‌కు సంబంధించిన పరీక్ష 11.20 నుంచి 12.50 వరకూ (1.30 గంటలు) జరుగుతుంది. 12.35 గంటలకు బయలాజికల్ సైన్స్ పేపర్‌కు సంబంధించిన బిట్ పేపర్ (పార్ట్–బీ) ఇస్తారు. దీన్ని కూడా 15 నిమిషాల్లోనే పూర్తి చేయాల్సి ఉంటుంది.

అధికారులకు ప్రత్యేక సూచనలు

రెండు పేపర్లను విడివిడిగా ప్యాక్ చేసి, మూల్యాంకన కేంద్రాలకు పంపాలని పాఠశాల విద్య డైరెక్టరేట్ చీఫ్ సూపరింటెండెంట్లను ఆదేశించింది. రెండు పేపర్లకు మధ్య 20 నిమిషాల బ్రేక్ సమయంలో విద్యార్థులను ఎట్టి పరిస్థితుల్లోనూ బయటకు పంపేందుకు అనుమతించవద్దని స్పష్టం చేసింది.

ఎస్సై తుది రాతపరీక్షకు 95% హాజరు

- అన్ని పోస్టులకు కలిపి హాజరైన అభ్యర్థులు 59,534
- టీఎస్ఎల్పీఆర్బీ చైర్మన్ వీవీ శ్రీనివాసరావు



సాక్షి, హైదరాబాద్: యూనిఫాం సర్వీసెస్ కొలువుల భర్తీలో భాగంగా శని, ఆదివారాల్లో నిర్వహించిన ఎస్సై తుది రాతపరీక్షలకు 95 శాతం మంది అభ్యర్థులు హాజరయ్యారు. సివిల్ ఎస్సై, కమ్యూనికేషన్ ఎస్సై, పోలీస్ ట్రాన్స్‌పోర్ట్ ఆర్గనైజేషన్ ఎస్సై, ఫింగర్‌ప్రింట్ బ్యూరో ఏఎస్సై పోస్టులకు మొత్తం 62,342 మంది అభ్యర్థులకు గాను 59,534 మంది అభ్యర్థులు తుది రాత పరీక్షకు హాజరైనట్టు తెలంగాణ రాష్ట్ర స్థాయి పోలీస్ నియామక మండలి చైర్మన్ వీవీ శ్రీనివాసరావు తెలిపారు. హైదరాబాద్, కరీంనగర్, వరంగల్‌ల్లో కలిపి మొత్తం 81 కేంద్రాల్లో తుది రాత పరీక్షను నిర్వహించినట్టు ఆదివారం ఓ ప్రకటనలో వెల్లడించారు. ముందస్తు ప్రణాళిక, పోలీస్ ఉన్నతాధికారుల పకడ్బందీ ఏర్పాట్లతో పొరపాట్లకు తావులేకుండా పరీక్ష పరీక్ష సజావుగా సాగిందని తెలిపారు. తుది రాత పరీక్షల ప్రిలిమినరీ కీ అతి త్వరలో పోలీస్ నియామక మండలి వెబ్‌సైట్ www.tslprb.in లో పొందుపరుస్తామని తెలిపారు.

సెంటర్ల వారీగా అభ్యర్థుల హాజరు

ప్రాంతం	సెంటర్ల సంఖ్య	మొత్తం అభ్యర్థులు	పరీక్షకు హాజరైన వారు
హైదరాబాద్	42	34,400	32,945
కరీంనగర్	18	13,555	12,833
వరంగల్	21	14,387	13,756
మొత్తం	81	62,342	59,534

డేటా లీకుపై పోలీసుల దూకుడు

- వివిధ కంపెనీలకు నోటీసులు జారీ
- 70 కోట్ల మంది వ్యక్తిగత సమాచారం తస్కరించిన నిందితులు
- ప్రధాన నిందితుల కోసం నాలుగు రాష్ట్రాల్లో గాలింపు



సాక్షి, హైదరాబాద్: దేశవ్యాప్తంగా ప్రకంపనలు సృష్టించిన డేటా చౌర్యం కేసులో సైబరాబాద్ పోలీసులు దూకుడు పెంచారు. గత నెల రోజుల వ్యవధిలో సైబరాబాద్ పోలీసులు నాలుగు డేటా చౌర్యం, విక్రయం, నకిలీ కాల్ సెంటర్ నిర్వహణ కేసులను ఛేదించారు. వీటిల్లో 30 మంది నిందితులను అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. ఆయా కేసులలో నిందితులు విక్రయానికి పెట్టిన వ్యక్తిగత సమాచారం థర్డ్ పార్టీ ఏజెన్సీలు, ఈ–కామర్స్ సంస్థల నుంచి లీకైనట్లు గుర్తించిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఆయా కంపెనీలను విచారించాలని నిర్ణయించింది. ఇప్పటికే బిగ్ బాస్కెట్, ఫోన్‌పే, ఫేస్‌బుక్, క్లబ్ మహీంద్రా, పాలసీ బజార్, యాక్సిస్ బ్యాంక్, అస్ట్యూట్ గ్రూప్, మ్యాట్రిక్స్, టెక్ మహీంద్రా, బ్యాంక్ ఆఫ్ బరోడా, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలకు నోటీసులు జారీ చేసింది. తాజాగా మరో పది కంపెనీలకూ తాఖీదులు జారీ చేసింది. ఇప్పటికే సిట్ ముందు హాజరైన కంపెనీలు.. కస్టమర్ల డేటా, సమీకరణ, భద్రతా విధానాలు, థర్డ్ పార్టీ ఏజెన్సీలు తదితరాలపై సమగ్ర సమాచారాన్ని సమర్పించాయి. ఆయా సమాచారాన్ని విశ్లేషించిన పోలీసులు మరికొంత అదనపు సమాచారం కోసం మరోసారి నోటీసులు జారీ చేయాలని నిర్ణయించినట్లు తెలిసింది.

నాలుగు రాష్ట్రాల్లో గాలింపు..

ప్రధానంగా హరియాణాలోని ఫరీదాబాద్‌కు చెందిన వినయ్ భరద్వాజ్ దేశంలోని 70 కోట్ల మంది వ్యక్తులు, సంస్థలకు చెందిన వ్యక్తిగత సమాచారాన్ని తస్కరించి, విక్రయానికి పెట్టడం సంచలనం సృష్టించింది. ఇందులో 2.60 లక్షల మంది రక్షణ శాఖ ఉద్యోగుల సమాచారంతో పాటు విద్యుత్, ఇంధనం వంటి ప్రభుత్వ శాఖలు, విద్యార్థులు, ప్రవాసులు, గృహిణులు, బ్యాంకు ఖాతాదారుల సమాచారం ఉండటం గమనార్హం. ఈ కేసులో నిందితుడు వినయ్ భరద్వాజ్ ఈ డేటాను గుజరాత్‌కు చెందిన అమీర్ సోహైల్, మదన్ గోపాల్ అనే వ్యక్తుల నుంచి కొనుగోలు చేసినట్లు పోలీసులు ప్రాథమిక విచారణలో గుర్తించారు. దీంతో వారి కోసం సిట్ బృందాలు గాలిస్తున్నాయి. ఢిల్లీ, రాజస్తాన్, హరియాణా, పశ్చిమ బెంగాల్‌లో నిందితుల కోసం వేట కొనసాగిస్తున్నట్లు తెలిసింది.

లోన్‌యాప్‌లు డౌన్‌లోడ్ చేయొద్దు

- సైబర్ మోసగాళ్ల బారిన పడొద్దు
- తెలంగాణ సైబర్ క్రైం కోఆర్డినేషన్ సెంటర్ సూచన

సాక్షి, హైదరాబాద్: ఆర్థిక అవసరాలను ఆసరాగా చేసుకుని అడ్డగోలు దోపిడీకి పాల్పడుతున్న లోన్‌యాప్‌ల మాయాజాలంలో చిక్కుకోవద్దని తెలంగాణ పోలీసులు హెచ్చరిస్తున్నారు. లోన్‌యాప్ మోసాలు పెరుగుతున్న నేపథ్యంలో ట్విట్టర్ వేదికగా తెలంగాణ సైబర్ క్రైం కోఆర్డినేషన్ సెంటర్ పలు సూచనలు చేసింది. లోన్‌యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకోవద్దని, తప్పక డౌన్‌లోడ్ చేసుకోవాల్సి వస్తే జాగ్రత్తలు తీసుకోవాలని వారు హెచ్చరించారు.



ఇవి మరవొద్దు

- లోన్‌యాప్ డౌన్‌లోడ్ చేసుకుంటే మీ ఫోన్‌లో ఉన్న యాప్స్, కాంటాక్ట్ నంబర్లు, లొకేషన్, ఫొటోలు, మీ వ్యక్తిగత విషయాలన్నీ మీకు లోన్ ఇచ్చేవాళ్లకు వెళతాయని గుర్తించాలి. మీరు తీసుకున్న లోన్ తీర్చకపోతే తీవ్రంగా వేధిస్తారు.
- ఫోన్ కాంటాక్ట్ నంబర్లు, ఫొటోలు యాక్సెస్ ఉండడంతో లోన్‌యాప్ ఏజెంట్లు మహిళల ఫొటోలను అశ్లీలంగా మార్చి కుటుంబ సభ్యులకు, స్నేహితులకు, బంధువులకు పంపి మానసికంగా వేధింపులకు గురిచేస్తున్నారు.
- లోన్‌యాప్‌ల నుంచి వేధింపులు శ్రుతి మించితే వెంటనే సైబర్ క్రైమ్ పోలీసులకు www.cybercrime.gov.in వెబ్‌సైట్‌లో లేదా 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలి.

ప్రమాణాల్లేకున్నా సీట్లు పెంచాలట!

▶ మొదటి పేజీ తరువాయి

ఒక అత్యాధునిక కంప్యూటర్ ఉండాల్సి ఉండగా సెక్షన్ మొత్తానికి రెండు కంప్యూటర్లు కూడా లేవని తేలింది. అవి కూడా అతితక్కువ ప్రమాణాలతో ఉన్నాయని, సరికొత్త టెక్నాలజీ బోధించేందుకు ఏమాత్రం పనికి రావని అధికారులు గుర్తించారు. పదేళ్ల నాటి కాన్ఫిగరేషన్‌తో వాడే కంప్యూటర్లు కూడా ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. కంప్యూటర్ సైన్స్, డేటా అనాలసిస్, సైబర్ సెక్యూరిటీకి వాడే అత్యాధునిక సాఫ్ట్‌వేర్ రన్ కావడానికి ఉపకరించే ఆధునిక కంప్యూటర్ల స్థానంలో నాసిరకం వాటితోనే కాలేజీలు బోధన సాగిస్తున్నట్లు తేలింది. ఇక అధ్యాపకుల విషయానికొస్తే కంప్యూటర్ సైన్స్ వచ్చిన కొత్తలో ఉన్న వారే ఇప్పుడూ బోధకులుగా ఉన్నారు. వారు నైపుణ్యాలను మెరుగుపరుచుకున్నట్లు ఎలాంటి ఆధారాలను యాజమాన్యాలు చూపలేదని తెలిసింది. ప్రతిరోజూ మారుతున్న టెక్నాలజీని అందిపుచ్చుకోవాలంటే ప్రముఖ కంపెనీల్లో అధ్యాపకులు శిక్షణ పొందాల్సి ఉంటుంది. ఈ దిశగా ఎలాంటి కసరత్తు జరగలేదు.

అన్ని సౌకర్యాలు, ఫ్యాకల్టీ ఉంటేనే గుర్తింపు..

ఈ నెల 18 నుంచి కాలేజీలకు అనుబంధ గుర్తింపు ఇచ్చే ప్రక్రియను మొదలుపెడతాం. ప్రతి కాలేజీని పూర్తిస్థాయిలో పరిశీలిస్తాం. నిబంధనల ప్రకారం అన్ని సౌకర్యాలు, ఫ్యాకల్టీ ఉంటేనే కాలేజీలకు గుర్తింపు ఇస్తాం. కంప్యూటర్ కోర్సుల్లో సీట్లు పెంచాలని ఎక్కువ కాలేజీలే కోరుతున్నాయి. వాటి సామర్థ్యం, బోధన విధానాలను లోతుగా పరిశీలించే ఉద్దేశంతోనే ఈసారి అఫిలియేషన్ ప్రక్రియను ముందే చేపడుతున్నాం.

– ప్రొఫెసర్ కట్టా నర్సింహారెడ్డి, జేఎన్టీయూహెచ్ వీసీ



స్నేహితులు కావాలని కోరుకోవడం వేగంగానే జరుగుతుంది,
కానీ స్నేహం అనేది నెమ్మదిగా పక్వానికొచ్చే ఫలం లాంటిది.
– అరిస్టాటిల్

సాక్షి

సోమవారం, ఏప్రిల్, 10

ఒకనాటి వేసవి

రాత్రి మిగిలిన అన్నంలో నీళ్లు పోసి ఉంచేవారు. తెల్లారి పచ్చిమిర్చి అందుకునేవారు. దాన్ని మధ్యకు చీల్చి, ఉప్పుగల్లు దూర్చి, నాష్టాలో ఒక ముద్ద అది... పంటి కింద ఇది. బాగుండేది. నీటిసోద జాస్తి. దూరం దూరం పోయి, చాలని తాడుకు కొత్తది ముడివేసి, అడుగు నుంచి లాగి, బిందె భుజాన మోసి... అయితేనేం? నేస్తులతో కలసి కబుర్లాడుకుంటూ నడుస్తుంటే బాగుండేది. తొణికే నీళ్లు వీపున చరుస్తూ ఉన్నా బాగుండేది.

కలిగిన వాళ్లు కొత్త తాటాకుల పందిరి వేసేవారు. కుదిరినవారు కొబ్బరాకులతో నీడ పరిచే వారు. కింద నిలబడితే ఆ చలువదనం బాగుండేది. ఐసుబండి ఆపితే ఆ జిల్లుదనమూ బాగుండేది. కోసి చూపించమని అడక్కుండా పుచ్చకాయ కొనేదే లేదు. త్రికోణాకార ముక్కను అప్పటికప్పుడు తినకుండా వదిలిందీ లేదు. ముంతమామిళ్లవి పలు రంగులు. వాటి మరకలు బట్టలు మీద పడితే వీపు మీద అమ్మ జాజ్ డ్రమ్ కొట్టేది. పచ్చి తాటాకుల పొట్లాల్లో ముంజలు తెచ్చేవారు. ఆపి బేరం చేస్తే ఒకో పొట్లాన్ని కొడవలితో కోసి విడిపించేవారు. ముదురు ముంజకాయ కొబ్బరికి అటుఇటుగా ఉండేది. లేతది నోట అమృతం చిమ్మేది. తాటికాయలతో చేసిన బండికి టోల్‌గేట్ అడిగే దమ్ము ఎవరికీ లేదు. తెల్లరంగు స్ట్రాంగ్ పిప్పరమెంట్ దవడన పెట్టుకుంటే అదే పెట్రోలుగా పరుగు తీసేది.

చింత చిగురొచ్చేది. బంగారం రేటుతో తూగేది. మునగచెట్లు విరగ గాసేవి. వేపచెట్టు బ్రాండు ఏ.సి ప్రతి రచ్చబండ దగ్గర కూల్ టెంపరేచర్ మెయిన్‌టెయిన్ చేసేది. వీధిన తిరగలేని అవ్వ వేరుశనక్కాయలను అక్కడే అమ్మేది. రూపాయి చేజిక్కించుకుని మ్యాట్నీకి దౌడు తీస్తే ఉబ్బరింత. బాగుండేది. కరెంటు పోయి తలుపులు తీస్తే జొరబడే చల్లగాలి. బాగుండేది.

కడప నుంచి కర్బూజ పండ్లు వస్తాయి. చక్కెర జల్లి కాసేపు వదిలి తింటే జీరాను తలపిస్తాయి. నిమ్మకాయల రేటు గజనిమ్మకాయల సైజుకు వెళుతుంది. సుగంధ వేర్లు... హలో మేమున్నాం అంటాయి. ఆరెంజి సోడా ఆగిఆగి తాగమని షోకులు పోతుంది. చలివేంద్రాల దగ్గరుండే పొడవు కాడల గరిటెలు ఆ తర్వాత ఏమవుతాయో ఏమో! పాత గొడుగులకు మర్యాద దక్కి డ్యూటీ ఎక్కుతాయి. వాసానికి దూర్చిన విసనకర్ర దగ్గిరి స్నేహితుడిలా పలకరిస్తుంది. పిచ్చుకల హడావిడి మీటింగుల మధ్య మధ్యాహ్నపు కునుకు అమోఘంగా ఉంటుంది. సాయంత్రం నాలుగు లోటాలు కుమ్మరించుకుంటే అదే స్వర్గం. డాబా మీద నీళ్లు జల్లితే రాత్రికి చుక్కలు చల్లగా పలకరిస్తాయి. నిద్రకు ఇంటిల్లిపాది మేడెక్కితే పరుపులున్నవారు శ్రీమంతులు. టేబుల్ ఫ్యాను తిప్పగలిగేవారు కుబేరులు. తల దగ్గర నీళ్ల చెంబుకు బోర్లించిన గ్లాసే మూతవుతుంది. మేను వాల్చాక స్తంభించ కుండా గాలి వీస్తే పరమ పరవశం.

ఆవకాయ సెంటిమెంట్. అర ఎకరం అమ్మైనా లంక మిరపకాయలు, గానుగ నూనె, ఆవాలు, మెంతులు, పచ్చడి మామిడి కాయలు వెల జరిగేవి. ముహూర్తం చూసి మరీ అమ్మమ్మ పని మొదలెట్టేది. కొడుకు నడుం మీద చేతులతో సాయానికి సిద్ధమయ్యేవాడు. కోడలు చూపుతో చెప్తే చేత్తో అందుకునేది. పిల్లలు కిలకిలారావాలు చేసేవారు. ఎర్రగా కలిపిన తొలిముద్ద పెట్టడానికి ప్రతి చిన్నారికి ఇంట పెద్ద తలకాయ ఉండేది.

చుట్టాలొచ్చేవారు. పిల్లల్ని తెచ్చేవారు. ఆటల్లో ఉత్తుత్తి విందు ఒండి బాదం ఆకుల్లో బలవంతాన తినిపించేవారు. ఏటికి చాటుగా వెళ్లినవారు జేబుల్లో ఇసుకతో దొరికిపోయేవారు. ఆడపిల్లలు తీరిగ్గా గోరింటాకు పెట్టుకుని పడుకుంటే తెల్లారేసరికి అరచేతుల్లో చంద్రుళ్లు ఉదయించేవారు. పైతరగతికి వెళ్లే ముందొచ్చే వేసవికై పిల్లలు ఎదురు చూసేవారు. తీక్షణ ఆనందాల ఎండలకై ఆరాటపడేవారు.

ఇప్పటిలా కాక రోషమున్న మల్లెలు వేసవిలోనే గుబాళించేవి. సీజను ముగియక ముందే స్త్రీలను జడల్లో వీలైనన్ని తురుముకోమనేవి. కనకాంబరాలతో కలిపి అల్లితే వాటిదొక అందం. మరువంతో, దవనంతో జత చేస్తే మరో చందం. మాలలు కట్టడానికి అమ్మలక్కలంతా కూడి ఇకఇకలు పకపకలు పోతుంటే చూడటం బాగుండేది. ప్రతి ఇంటి గోడ మీద అమ్మాయి పూలజడ ఫోటో కళకళలాడేది.

తీపి మామిడిపండ్లు ఈ దేశవాసుల కోసమే కాసేవి. దిల్ పసంద్ ఎంతో పసందుగా ఉండేది. బంగినపల్లి ప్రతి ఇంటా కనీసం చేరేది. రసాలు మాత్రమే పిండుకు తాగేవారు కొందరు. ఇమాం పసంద్‌కై పట్టుబట్టే వారు ఇంకొందరు. నీలాలు ఆఖరున వచ్చేవి. తోతాపురికి ఉప్పూకారాలే గతి. బిగ్ బాస్కెట్ లేని కాలంలో కారు మాట్లాడుకుని చలో చిత్తూరనేవారు. నూజివీడుకు పదమనేవారు. మధుర ఫలాల బుట్టలు ప్రాప్తమున్నవారికి దక్కేవి.

యుగాలుగా వేసవి ఇలాగే ఉంది. ప్రియజనుల కోసం ఇలా పునరావృతం అవుతూనే ఉంది. మనిషే ఈ రుతువుల సౌందర్యానికి ఎడంగా జరుగుతున్నాడు. వేసవి చెప్పే తీర్పు- విరామం ప్రకటించుకోమని, ఆటవిడుపుపై దృష్టి పెట్టమని, అయినవారి సాంగత్యాన్ని ఆస్వాదించమని! ఇవాళ మనిషి వెళ్లడానికి ఊరు లేనివాడు. పిల్లలతో వెళ్లడానికి బంధువులు, బంధాలు నిలబెట్టుకోని వాడు. అన్నీ ఉన్నా ఎందుచేతనో మనసు ఇరుకు చేసుకుంటున్నాడు. ఇంటి సభ్యులు తప్ప బయటి మనిషి వచ్చి ఒకపూట చేయి కడగని నిరుపేదవుతున్నాడు.

సూర్యనారాయణమూర్తి వేసవిలో తన దగ్గర ఉన్నది ఏదీ దాచుకోకుండా ధారాళంగా భూమి మీద ప్రసరింపజేసి ఆ వెంటనే మొలకలెత్తే వర్షానికి కారకుడవుతాడు. ఈ వేసవిలో మనం కూడా మనలో దాగి ఉన్న, ఎక్కడో అణిచివేయబడి ఉన్న, మరుపున పడి ఉన్న అనుబంధాల్ని ఏదో మేరకు వెలికి తీసి, ఒకనాటి వేసవిని, ఒకనాటి ఆనందాల్ని పొందలేమా?

ప్రయత్నిద్దామా? బాగుంటుంది.

గ్రహం అనుగ్రహం | శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, చైత్ర మాసం, **తిథి:** బ.చవితి ఉ.8.14 వరకు, తదుపరి పంచమి, **నక్షత్రం:** అనూరాధ ప.1.20 వరకు, తదుపరి జ్యేష్ఠ, **వర్జ్యం:** సా.6.44 నుండి 8.17 వరకు, **దుర్ముహూర్తం:** ప.12.24 నుండి 1.15 వరకు తదుపరి ప.2.53 నుండి 3.43 వరకు, **అమృతఘడియలు:** రా.3.56 నుండి 5.27 వరకు; **సూర్యోదయం :** 5.51; **సూర్యాస్తమయం :** 6.10; **రాహుకాలం :** ఉ.7.30 నుండి 9.00 వరకు; **యమగండం :** ఉ.10.30 నుండి 12.00 వరకు

మనమెందుకు ఇలా ఉన్నాం!

కామెంట్



కరణ్ థాపర్

బ్రిటన్ మారిపోయింది! నిగ్గర్స్, బ్లాక్స్, బ్రౌన్ స్కిన్డ్ పీపుల్... ఇలాంటి జాత్యహంకార దూషణలేవీ పనిగట్టుకుని ఇప్పుడు అక్కడ లేవు. అక్కడి తెల్లవాళ్లు... తమలా 'తెల్లగా' లేని వాళ్లను సైతం తమ తలపై ఇష్టంగా మోస్తున్నారు. ఓట్లేసి మరీ కిరీటధారులను చేస్తున్నారు. దేశ నిర్వహణ బాధ్యతలను అప్పగిస్తున్నారు. అక్కడి నాన్‌– వైట్స్‌లో ఒకరు ఇప్పుడు 'ప్రధాని'! మరొకరు 'ఫస్ట్ మినిస్టర్'! ఇంకొకరు మేయర్! సామ్రాజ్య విస్తరణ కాంక్షతో ఒకప్పుడు లోకాన్ని ఏలిన ఈ అగ్రరాజ్యం... ''మమ్మేలు గణనాథా... మాలోని చెడులను మాయింపగా...'' అన్నట్లుగా శ్వేత జాతేతరుల పాలనకు మొగ్గు చూపుతోంది. వలసలన్న వివక్ష చూపక విశ్వమానవ భావనకు తలవొగ్గుతోంది. మరి మనం ఎందుకు భిన్నంగా ఉంటున్నాం? తోటి పౌరులను – వారి పూర్వీకులు శతాబ్దాల క్రితమే ఇక్కడ జన్మించి ఉన్నవారైనప్పటికీ, సాటి భారతీయుల్లా హిందువులలో కలిసిపోయి జీవిస్తూ ఉన్నప్పటికీ – వారిని ఎందుకు వేరుగా చూస్తున్నాం? బ్రిటిషర్‌లను జాత్యంహంకారులు అని కదా మనం తరచూ అంటుంటాం. ఇప్పుడు చెప్పండి, మనకు ఏ విశేషణం సరైనది? మనల్ని మనం ఏమని పిలుచుకోవాలి?

ఒకవేళ అది గానీ నిజంగా జరిగి ఉండకపోతే, అది జరుగుతుందని నమ్మడానికే కష్టంగా ఉండేది. అదొకవేళ కల్పితం అయివున్నా ఆ కల్పన కూడా అతీంద్రియ భావనలా అనిపించేది. అయినప్పటికీ అది జరిగింది! నన్ను నిరుత్తరుడిగా మిగిల్చింది. నేడు బ్రిటన్‌లో అత్యంత ప్రాముఖ్యం కలిగి ఉండే మూడు అత్యున్నత స్థానాలలో భారత్ లేదా పాకిస్తాన్ సంతతి వారు ఉన్నారు మరి! ఐదేళ్ల క్రితమైతే ఇలా జరగడం అన్నది ఊహకు సైతం అసాధ్యమైన సంగతే. గత వేసవిలో రిషీ సునాక్ కన్జర్వేటివ్ పార్టీ నాయకత్వం కోసం పోటీ పడి లిజ్ ట్రస్ చేతిలో ఓడిపోయినప్పుడైతే... ఇక తమ జీవితకాలంలో ఎప్పటికైనా గోధుమ రంగు చర్మం కలిగివున్న ఒక వ్యక్తిని బ్రిటన్‌కు ప్రధాన మంత్రిగా చూస్తామని ఎవరూ అనుకుని ఉండరు.



లండన్ మేయర్ సాదిక్ ఖాన్, యూకే ప్రధాని రిషీ సునాక్, స్కాట్లాండ్ ఫస్ట్ మినిస్టర్ హమ్జా యూసఫ్

అందరూ ఎన్నికైనవాళ్లే!

కానీ అక్టోబర్‌లో భారతీయ సంతతికి చెందిన హిందూ మతస్థుడు రిషీ సునాక్ బ్రిటన్ ప్రధాని అయ్యారు. గతవారం స్కాట్లాండ్ ఫస్ట్ మినిస్టర్ (ప్రధాని)గా పాకిస్తానీ ముస్లిం హమ్జా యూసఫ్ బాధ్యతలు చేపట్టారు. పాకిస్తానీ మూలాలున్న మరొక ముస్లిం సాదిఖ్ ఖాన్ 2016 నుంచీ లండన్ మేయరుగా కొనసాగుతున్నారు. ఆయన ఇప్పుడు తన రెండవ టర్మ్‌లో కొనసాగుతున్నారు. ఈ ముగ్గురూ ఎన్నికైన వారే తప్ప నియామకంతో వచ్చి దర్జాగా పీఠంపై కూర్చున్నవారు కాదు. వీళ్లను ఎన్నుకున్న ఓటర్లలో అత్యధికులు శ్వేత జాతీయులే. 2021 జనాభా లెక్కల ప్రకారం బ్రిటన్ జనాభాలో భారతీయ సంతతికి చెందిన వారు కేవలం 2.86 శాతం. పాకిస్తానీ మూలాలు ఉన్న ప్రజలైతే ఇంకా తక్కువగా 1.8 శాతం మాత్రమే.

ఇది నాకు 1976 డిసెంబరు నాటి కేంబ్రిడ్జి యూనియన్ చర్చను గుర్తుకు తెస్తోంది. పదవి నుంచి నిష్క్రమిస్తున్న ఆంగ్లో–పోలిష్ సంతతి యూనియన్ ప్రెసిడెంటు పీటర్ ఫుడకోవ్‌స్కీ నుంచి కొత్త అధ్యక్షుడిగా నేను బాధ్యతలు స్వీకరిస్తున్న సందర్భం అది. అధ్యక్ష పదవి చర్చకు సంబంధించిన తీర్మానంలో ఆ వెళ్లిపోతున్న పీటర్ మాట్లాడుతూ... ''ఈ యూనియన్ శ్వేత జాతీయులు కాని వారి చేతుల్లోకి వెళుతోంది'' అని తమాషాకు అన్నారు. ఆయన తమాషా యాభై ఏళ్ల తర్వాత నిజమైంది.

మన ప్రవర్తన విరుద్ధం

బ్రిటన్ చిరకాలం వర్ధిల్లాలి. ఎంత అద్భుత మైన దేశం! మరొకటి కూడా జోడించి చెబుతాను. మిగతా ప్రపంచ దేశాలకు బ్రిటన్ ఒక దీపస్తంభం. ముఖ్యంగా మనకు! వలస వచ్చిన హిందువులు, ముస్లింలలో రెండవ తరం, మూడవ తరం వారిని కూడా బ్రిటన్ తన ప్రభుత్వంలో కీలక స్థానాలకు చేర్చి కూర్చోబెట్టింది. గొప్ప సంగతేమంటే దీనికి స్థానికులెవరూ అభ్యంతరం చెప్పడం లేదు. అరచి గీపెట్టడం లేదు. ప్రజా నిరసనలు లేవు.

మన దగ్గర చూడండి. అందుకు పూర్తిగా విరుద్ధం. మనం మన తోటి ముస్లిం పౌరులను – వారి పూర్వీకులు శతాబ్దాల క్రితమే ఇక్కడ జన్మించి ఉన్నవారైనప్పటికీ, సాటి భారతీయుల్లా హిందువులలో కలిసిపోయి జీవిస్తూ ఉన్నప్పటికీ – 'పాకిస్తాన్ వెళ్లిపోండి...' అని వారికి ఎప్పుడూ చెబుతూ ఉంటాం. మన రాజకీయ నాయకులు వారిని బహిరంగంగా దూషిస్తుంటారు. వారి ఇళ్లను పోలీసులు చట్ట బద్ధం కాని పద్ధతుల్లో కూలగొడుతుంటారు. శ్రీరామనవమి సందర్భంగా మనం వారి దుకాణాలను బలవంతంగా మూత వేయిస్తాం. వారిపై 'లవ్ జిహాద్' నిందను వేస్తాం. కొన్నిసార్లు వారి గుర్తింపును కూడా తిరస్కరిస్తాం. వారిని హైందవ ముస్లింలుగా వ్యవహరిస్తాం. చెదపురుగులు అని కూడా అంటాం.

బ్రిటిషర్‌లను జాత్యహంకారులు అని కదా మనం తరచూ అంటుంటాం... ఇప్పుడు చెప్పండి, మనకు ఏ విశేషణం సరైనది? మనల్ని మనం ఏమని పిలుచుకోవాలి? సమాధానం చెప్పండి అని నేను మిమ్మల్ని బలవంతం చేయడం లేదు. అలా అడిగితే అది మిమ్మల్ని రెచ్చగొట్టినట్లు అవుతుంది, లేదంటే జవాబు కోసం మొండిపట్టు పట్టినట్లుగా ఉంటుంది. కానీ ఈ ప్రశ్నను నేను కచ్చితంగా లేవ నెత్తుతాను. ఎందుకంటే, మనం మన తోటి పౌరులతో ఎలా ప్రవర్తిస్తున్నాం అనే దాని గురించి ఈ ప్రశ్న మిమ్మల్ని ఆలోచింపజేస్తుంది అని నా ఆశ. అంతేకాదు, వారిపై మన ప్రవర్తన ఎలాంటి ప్రభావం చూపుతుంది అనే ఆలోచన కూడా రావాలి. కానీ మనలో చాలా మందికి ఈ ప్రభావం అన్నది అసలు ఆలోచించే విషయమే కాదు. కించపరచడం చాలా తేలిక. ఆ పనిని మనం అనాలోచితంగా చేసేస్తుంటాం. అది మనకు ఏ విధంగానూ అసౌకర్యాన్ని కలిగించదు. కానీ ఆ గాయాన్ని భరించడం, గాయంతో జీవించడం అవ తలి వాళ్లకు దుర్భరం అవుతుంది. ఇంకా దారుణం ఏమిటంటే... ఇది తప్ప వేరే ఇల్లు లేదని, ఈ ఇంటి నుంచి తప్పించుకునే వీలు కూడా లేదని నీకు తెలుస్తూ ఉండటం!

బ్రిటన్ మారిపోయింది

నేను చదువుకున్న బ్రిటన్ కూడా నిస్సందేహంగా ఇందుకు భిన్నమైనదేం కాదు. గోధుమ రంగు చర్మం ఉన్న వారికి అక్కడ నాన్-వైట్స్ అని, నల్ల జాతీయులు అని, నిగ్గర్స్ అని పిలిచేవారు. తెల్లవాళ్లలో కూడా స్థాయిని బట్టి, యాసను బట్టి హెచ్చుతగ్గుల విభజనకు గురయినవాళ్లూ ఉన్నారు. నిన్నెలా చూస్తారన్నది నువ్వెలా మాట్లాడుతున్నావన్న దాన్ని బట్టే అక్కడ ఉంటుంది. కానీ ఈ యాభై ఏళ్లలో బ్రిటన్ మారిపోయింది. పాత దేశం కను మరుగైపోయింది. బాహ్యంగా పూర్వపు అవశేషాలు ఉంటే ఉండొచ్చు. కానీ గుండె లోతుల్లో అయితే బ్రిటన్ పునర్నిర్మాణం జరిగిపోయింది.

ఇదే సవాలును మనం ఇప్పుడు భారత్‌లో ఎదుర్కొంటున్నాం. మన లోపలి అసురులను దాటుకుని మనం పైకి రాగలమా? ఆ అసురులను మనం జయించగలమా? చాలా గణనీయమైన విస్తృతిలో బ్రిటన్ దీనిని సాధించింది. మరి మనం సాధించగలమా? ఈ ప్రశ్నకు సమాధానం తెలిసే నాటికి నేను ఉండకపోవచ్చు. మార్పునకు ఒకటో, రెండో జీవితకాలాలు పట్టొచ్చు. ఇప్పటికైతే నేను మనుషుల మధ్య వినిపిస్తున్న ప్రేమరాహిత్య మౌన రాగాన్ని మాత్రమే వినగలుగుతున్నాను.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

మెప్పించడం వద్దు



ప్రామాణికత, సమగ్రత జీవితంలో నిలబెట్టుకోవాల్సిన విలువలు! మీ విశ్వాసాలు, లక్ష్యాలకు కట్టుబడి ఉండండి. ఇతరులను మెప్పించడానికి మీ విలక్షణత విషయంలో రాజీపడకండి.

– హరీశ్ మరీవాలా, ఆంట్రప్రెన్యూర్

ఏదో రకంగా...



పాకిస్తానీ పాలక ఉన్నత వర్గం 'ఐఎంఎఫ్' మీద ఆధారపడకుండా ఇప్పుడు చైనా, రష్యా నుంచి సొమ్ములు పొందడానికి ప్రయత్నిస్తోంది. ఈ వర్గం, ఆ వర్గంతో పనిలేదు; దేశ ప్రయోజనాలు, విదేశాంగ విధానంతో పనిలేదు. వాళ్లు పట్టించుకునేదల్లా కేవలం లండన్, దుబాయి ప్రాజెక్టుల కోసం కొన్ని డాలర్లు మాత్రమే!

– సాజిద్ ఎన్. తరార్, వ్యాపారవేత్త

సుఖాంతం కాదు



విముక్తి చెందినట్టుగా భావించేవారి కథ చారిత్రకంగా, భౌగోళికంగా ఎప్పుడూ సుఖాంతంగా ముగియలేదు. ఈ 'విముక్తి చెందిన' ప్రవర్తన చాలా ప్రాంతాల్లో, సంస్కృతుల్లో ఉండింది. ఆఖరికి ప్రాచీన, మధ్యయుగ భారత దేశంలో కూడా. కానీ తుది ఫలితం ఏమిటంటే, 'విముక్తి చెందని' సమూహాల దురాక్రమణకు గురికావడం!

– జోసెఫ్ టి. నూనీ, రచయిత

మట్టితో, మూలాలతో...



మన గ్రామ చర్చిలో గుడ్ ఫ్రైడే భోజనం మట్టి పాత్రలో వడ్డించినప్పుడే, కేరళ ఎందుకు పర్యావరణ హిత రాష్ట్రం అయిందో అర్థమవుతుంది. ఇంకా అదనపు సంతోషం, నా పన్నెండో తరగతి క్లాస్‌మేట్ ఆ భోజనం వడ్డించాడు. అందుకే ఈస్టర్ వరకు ఉండిపోయాను.

– జేమ్స్ జోసెఫ్, రచయిత

నవ్వే సంతోషం



నేను ఎక్కడికి వెళ్లినా, నేను కలిసే ఆ ఇంకో మనిషి నాలాంటివాడే కావాలనుకుంటాను. మన మందరం సంతోషంగా జీవించాలని కోరుకుంటాం. మనమందరం నవ్వులకు స్పందిస్తాం. కాబట్టి నేను ఎక్కడికి వెళ్లినా నవ్వు తాను. మనం ఒకే భాష మాట్లాడక పోయినా, మన స్నేహాన్ని నవ్వుద్వారా వ్యక్తపరుచు కోవచ్చు.

– దలై లామా, బౌద్ధ గురువు

చారిత్రక వాస్తవం



ఒకవేళ ఆఫ్రికాను చైనా తన వలసరాజ్యంగా మార్చుకుని వుంటే, ఈరోజు మనం చైనీస్ మాట్లాడేవాళ్లం, మన పిల్లలకు చైనీస్ పేర్లు పెట్టేవాళ్లం, చైనీస్ దేవతలను పూజించేవాళ్లం, చైనీస్ తరహా రాజకీయాలను ఆచరించే వాళ్లం. కాబట్టి, ఈరోజు నువ్వు ఇంగ్లిష్, ఫ్రెంచ్ మాట్లాడుతున్నావంటే అది నీ దోషం కాదు. అది చారిత్రక హింసకు సంబంధించిన విషయం.

– అడేమోలా, పాన్-ఆఫ్రికనిస్ట్

ఫలితం తక్కువ



చాలామంది మధ్యతరగతి జనం తాము ఎక్కువ పన్ను చెల్లి స్తామనీ, బదులుగా వచ్చేది పెద్దగా ఉండదనీ ఫిర్యాదు చేస్తుంటారు. అభివృద్ధి చెందిన దేశాలతో సమానంగా భారత మధ్యతరగతి జీవులు పన్నులు చెల్లిస్తారు. కానీ సామాజిక భద్రత, సౌకర్యాలు మాత్రం మూడో ప్రపంచ స్థాయిలో ఉంటాయి. కేవలం 3–4 శాతం మాత్రమే ప్రత్యక్ష పన్ను చెల్లి స్తారు. సహజంగానే వాళ్ల మీద అధిక బరువు ఉంటుంది.

– కిరణ్ కుమార్ ఎస్., విశ్లేషకుడు

ఇన్‌బాక్స్

జైహింద్ నినాద సృష్టికర్త

'జైహింద్' అనే పదం దేశభక్తిని చాటుకునే ఓ మహత్తర నినాదం. భారత దేశానికి జయం కలుగుగాక! అని దీనర్థం. స్వాతంత్ర్యోద్యమ కాలంలో ఈ పదాన్ని ప్రాచుర్యంలోకి తెచ్చింది నేతాజీ సుభాష్ చంద్రబోస్ కాగా, దీని సృష్టికర్త మాత్రం ఆబిద్ హసన్ సఫ్రానీ. ఈయన 1911 ఏప్రిల్ 11న హైదరాబాద్‌లో జన్మించారు.

అసలు పేరు జైనుల్ ఆబిదీన్ హసన్. చిన్నతనంలోనే శాసనోల్లంఘన ఉద్యమంలో పాల్గొన్నారు. చదువు ఆగిపోయింది. తరువాత ఇంజనీరింగ్ విద్య కోసం జర్మనీ వెళ్లారు. అక్కడే నేతాజీ బోస్‌ను కలుసుకున్నారు. ఇంజనీరింగ్ చదువును మధ్యలోనే విడిచిపెట్టి బోస్‌కి వ్యక్తిగత కార్యదర్శిగా, జర్మన్ భాష అనువాదకుడిగా చేరారు. బోస్ పునర్వ్యవస్థీకరించిన 'ఇండియన్ నేషనల్ ఆర్మీ'లో ఆబిద్ 'మేజర్'గా పని చేశారు.



ఆబిద్ హసన్ సఫ్రానీ

జర్మనీ బ్రిటన్‌తో యుద్ధం చేస్తున్న సమయంలో ఇండియన్ నేషనల్ ఆర్మీలో భిన్న వర్గాలకు చెందిన ప్రజలు ఉండేవారు. అందులో కొంత మంది 'నమస్కార్' అనీ, మరికొంతమంది 'రామ్ రామ్' అనీ, 'అస్సలాము అలైకుం' అంటూ రకరకాలుగా అభివాదం చేసుకునేవారు. సెక్యులర్ భావాలు కలిగిన బోస్‌కు ఇన్ని రకాల అభివాదాలు ఉండటం సబబుగా అనిపించలేదు. అందరికీ ఆమోదయోగ్యమైన ఓ అభివాద నినాదాన్ని రూపొందించాలని ఆయన తన సన్నిహితులకు చెప్పారు. ఆబిద్ హసన్ ముందుగా 'హలో' అని ప్రతిపాదించారు. కాని బోస్‌కు అది నచ్చలేదు. తరువాత 'జై హిందుస్తాన్', 'జై హింద్' అని ప్రతిపాదించారు ఆబిద్. 'జై హింద్'కే బోసు జై కొట్టారు. ఈ నినాదం బోస్‌కు ఎంతగానో నచ్చింది. వెంటనే ఆయన దాన్ని ఆమోదించి, ప్రాచుర్యంలోకి తీసుకువచ్చారు. 1984 ఏప్రిల్ 5న ఆబిద్ హసన్ సఫ్రానీ హైదరాబాద్‌లో కన్ను మూశారు.

– యండి. ఉస్మాన్ ఖాన్, సీనియర్ జర్నలిస్ట్
(ఏప్రిల్ 11న ఆబిద్ హసన్ సఫ్రానీ జయంతి)

విమర్శ హుందాగా ఉండాలి!

అభిప్రాయం



ఉల్లి బాల రంగయ్య

సూరత్ కోర్టు తీర్పుతో కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ పార్లమెంటు సభ్యత్వాన్ని కోల్పోయారు. ఆయన రాజకీయ భవిష్యత్తు గురించి కలలుగనే వారికీ, ఆయనను ముందు పెట్టి ప్రధాని నరేంద్ర మోదీని ఢీకొనాలని ముందుకు సాగే వాళ్లకూ, బీజేపీని అధికారం నుండి దించి అంతర్జాతీయ కుట్రలను ఈ దేశంలో అమలు చేయాలని తలపోసే విదేశీ శక్తులకూ ఈ పరిణామం ఇబ్బంది కలిగించేదే.

ఇక 'దొంగలందరికీ మోదీ ఇంటి పేరు ఎందుకు ఉంటుంది?' అంటూ రాహుల్ గాంధీ 2019 ఏప్రిల్ 13వ తేదీ కర్ణాటక ఎన్నికల సభలో మాట్లాడిన మాటలు రాజకీయపరమైనవే కానీ ఒక సామాజిక వర్గం వారిని అవమానించడానికి అన్నవి కాదనీ, ఇలాంటి చిన్న తప్పిదానికి ఆయనపై అనర్హత వేటు వేయడం నరేంద్ర మోదీ నిరంకుశత్వానికి, అహంకారానికి, కక్ష సాధింపు చర్యకు నిదర్శనమనీ మోదీ వ్యతిరేక మీడియా, ముఖ్యంగా మన తెలుగు రాష్ట్రాల్లోని కొన్ని తెలుగు పత్రికలూ, చానళ్లూ మిక్కిలి వాపోవడం విచిత్రంగా ఉంది. ప్రధానిని దూషించడానికి ఆయన ఇంటి పేరుతో ఉండే మనుషులందరినీ దూషించడం, ఎద్దేవా చేయడం అహంకారానికి, క్రోధత్వానికి, సంస్కారహీనతకు పరాకాష్ఠ. తప్పు చేసింది, తప్పించుకు తిరుగుతున్నది నీరవ్ మోదీ, లలిత మోదీలు. వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోమని అడిగే హక్కు ప్రధాన ప్రతిపక్ష నేతగా రాహుల్‌కు ఉంది. ఈ విషయంలో ప్రభుత్వ నిర్లక్ష్యం ఉంటే ప్రశ్నించే హక్కు కూడా ఉంది. పైగా ఈ ఇద్దరు కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడే ఆర్థిక నేరాలు చేశారనేది వాస్తవం కాదా? కానీ ఒక సామాజిక వర్గాన్ని పూర్తిగా అవమానించే విధంగా మాట్లాడడం శిక్షార్హమే.

ఏది ఏమైనప్పటికీ రాహుల్ గాంధీ హుందాగా తాను చేసిన పొరపాటును సరిదిద్దుకొని ఉంటే ఆయనకు ఈ దేశంలో పరపతి పెరిగేదని కాంగ్రెస్ పార్టీ హితైషులే తమ ఆంతరంగిక మిత్రులతో అంటున్నారు. రాహుల్ గాంధీ స్వాతంత్ర్య యోధుడు వీర



సావర్కర్ పై నోరు పారేసుకోవడం, దీనిపై మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, శివసేన నాయకుడు ఉద్ధవ్ థాకరే ఘాటుగా స్పందించడం, ఇక ఎప్పుడూ వీర సావర్కర్ పై నోరు జారనని రాహుల్ గాంధీ చెప్పడం వంటి విషయాలు ఆయనను భావి ప్రధానిగా ఊహించుకునే వారందరినీ నిరాశ, నిస్పృహలకు గురిచేశాయి.

ప్రజాప్రాతినిధ్య చట్టం 1951లోని సెక్షన్ 8 ప్రకారం రాహుల్ తన పార్లమెంట్ సభ్యత్వాన్ని కోల్పోయారు. నిజానికి ఇప్పటికే కొందరు ఈ సెక్షన్ వల్ల పదవులు కోల్పోయిన ఉదాహరణలున్నాయి. 9 సార్లు పార్లమెంట్‌కి ఎన్నికైన రషీద్ మహమ్మద్ 2013లో తన శాసన సభ్యత్వాన్ని కోల్పోయారు. బీజేపీ ఎమ్మెల్యేలు విక్రమ్ సింగ్ షైనీ, సురేష్ హల్వాంకర్, ఆశారాణీలు జైలు శిక్షలు పడి శాసనసభ్యత్వం కోల్పోయారు. ఇక లాలూప్రసాద్ యాదవ్ దాణా కుంభకోణంలో, జయలలిత అక్రమ ఆస్తుల కేసుల్లో శాసనసభ్యత్వం కోల్పోయారు. రాహుల్ గాంధీ పార్లమెంట్ సభ్యత్వమూ ఇలాగే రద్దయింది. దీనిపై రాద్ధాంతం చేసే మోదీ వ్యతిరేకులకు భవిష్యత్తులో భంగపాటు తప్పదని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

ఇక సూరత్ కోర్టులో అప్పీలు చేసుకోవడానికి తన మందీ మార్బలంతో రాహుల్ గాంధీ వెళ్లడం వెనుక ఎలాంటి ప్రజాస్వామ్య స్ఫూర్తి ఉంది? న్యాయస్థానంపై తన ప్రభావాన్ని చూపడానికేనా? మన్మోహన్ సింగ్ ప్రభుత్వం తీసుకొచ్చిన ఆర్డినెన్స్‌నే విలేకరుల ముందు చించిపడేసిన కాంగ్రెస్ రాజకుమారుడి నుండి న్యాయస్థానంపై గౌరవాన్ని ఆశించడం అవివేకం అవుతుంది. ఒకవేళ ఈ కేసు నుండి రాహుల్ గాంధీ బయటపడినా... 'భారతదేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడింది. ప్రపంచ దేశాలు ఈ విషయం గురించి ఆలోచన చేయాలి' అని కేంబ్రిడ్జిలో రాహుల్ మాట్లాడిన మాటలూ, దేశ భక్తుడైన వీర్ సావర్కర్‌పై చేసిన విమర్శలూ రాహుల్ రాజకీయ భవిష్యత్తుకు నష్టం కలిగించేవే. అనర్హత వేటును సాకుగా చూపి, ప్రజాదరణ పొందాలని ప్రయత్నించే రాహుల్ గాంధీకి ఈ దేశ ప్రజలు ఎలాంటి సహాయ సహకారాలు అందిస్తారో భవిష్యత్తు నిర్ణయిస్తుంది.

వ్యాసకర్త రాజకీయ, సామాజిక విశ్లేషకులు

మనసారా నమ్మాలి!

ఒకరోజు కైలాసంలో పార్వతీపరమేశ్వరులు మాట్లాడుకుంటున్నారు. మాటల మధ్యలో పార్వతి 'నాథా! గంగలో స్నానమాచరిస్తే మోక్షం లభిస్తుందని చెప్పారు కదా... మరి గంగలో స్నానం చేసిన ప్రతి ఒక్కరూ మోక్షం పొందితే మోక్షం భరించలేదుగా... ఎందుకో అందరూ మోక్షం పొందడం లేదనిపిస్తోంది' అంది. అప్పుడు శివుడు 'నీకొచ్చిన సందేహం సముచితమే. కారణాన్ని నువ్వే తెలుసుకోవచ్చు, నాతో రా' అన్నాడు.

ఇద్దరూ వృద్ధరూపాలను ధరించి గంగ ఒడ్డుకు చేరుకున్నారు. 'నేనిప్పుడు గంగలో పడిపోయినట్టు నటిస్తాను. నువ్వెవరినైనా నన్ను



జ్యోతిర్మయం

కాపాడమని పిలవాలి. కానీ ఇప్పటివరకూ ఒక్క పాపమూ చెయ్యని వారిని మాత్రమే వచ్చి కాపాడమని చెప్పాలి' అన్నాడు శివుడు. శివుడు గంగలో పడిపోయాడు. వెంటనే పార్వతీ దేవి అక్కడున్న వారిని సాయం కోసం పిలిచింది. ఆమె పిలుపుతో పలువురు పరుగుపరుగున వచ్చారు. అయితే ఏ పాపం చెయ్యనివారే తన భర్తను రక్షించాలని ఆమె అనడంతో వారందరూ వెనక్కు తగ్గారు. ఇంతలో ఎవరూ ఊహించని రీతిలో ఎక్కడి నుంచో ఒక యువకుడు పరుగున వచ్చి గంగలో దూకి శివుడిని కాపాడి ఒడ్డుకు చేర్చాడు. వృద్ధురాలి రూపంలో ఉన్న పార్వతి ఆ అబ్బాయిని చూసి... 'నువ్వే పాపమూ చెయ్యలేదా' అని ప్రశ్నించింది అమాయకంగా. అప్పుడతను 'నాకేదీ తెలీదమ్మా... గంగలో స్నానం చేస్తే పాపాలు తొలగిపోతాయని విన్నాను. అటువంటప్పుడు గంగలో దిగడంతోనే నా పాపాలన్నీ పటాపంచలవుతాయి కదా... ఆ నమ్మకంతోనే గంగలో దూకి మీ ఆయనను ఒడ్డుకు తీసుకురాగలిగా' నన్నాడు. అంతట వృద్ధరూపంలో ఉన్న శివుడు... 'గంగలో స్నానం చేసే వారందరూ నమ్మకంతో స్నానం చేయడంలేదు. అందువల్లే ఎవరికీ మోక్షం సిద్ధించడం లేదు. మనసారా నమ్మిన వారి ప్రార్థనలు మాత్రమే ఫలిస్తాయి. ఆ నమ్మకం విజయానికి చేరువగా తీసుకుపోతుంది' అని వివరించాడు పార్వతికి.

– యామిజాల జగదీశ్

క్లుప్తంగా...

పూలే జయంతికి సీఎం

లక్డీకాపూల్ (హైదరాబాద్): మహాత్మా జ్యోతీరావ్ పూలే 197వ జయంత్యుత్సవాలు ఈ నెల 11వ తేదీన ఉదయం రవీంద్రభారతిలో జరుగుతాయని జయంతి ఉత్సవాల ప్రోగ్రామ్ కమిటీ చైర్మన్ చిందం పండు వంశరాజ్ తెలిపారు. కార్యక్రమానికి సీఎం కేసీఆర్ ముఖ్య అతిథిగా హాజరవుతారని చెప్పారు. కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి సహా మంత్రి కేటీఆర్ సహచర మంత్రులు పాల్గొంటారని తెలిపారు.

పింఛన్ల కోసం సీఎంకు లేఖ


సీఎంకు రాసిన లేఖను ప్రదర్శిస్తున్న ఎండ్రియాల్ వాసులు

తాడ్వాయి: అర్హులకు పింఛన్లు మంజూరు చేయాలని కోరుతూ కామారెడ్డి జిల్లా తాడ్వాయి మండలం ఎండ్రియాల్ వాసులు ఆదివారం సీఎం కేసీఆర్‌కు లేఖ రాశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామంలో పింఛన్ల కోసం 70 మంది ఏడాదిగా ఎదురుచూస్తున్నారని, ఈ విషయంపై గతంలో స్థానిక ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేదని లేఖలో పేర్కొన్నారు. తమకు పింఛన్‌లు ఇవ్వాలని కోరారు.

చంద్ర రాజేశ్వరరావు ఆశయ సాధనకు కృషి


మాట్లాడుతున్న రాజా

హఫీజ్‌పేట్: చంద్ర రాజేశ్వరరావు ఆశయ సాధనకు కృషి చేస్తామని సీఆర్ ఫౌండేషన్ చీఫ్ పాట్రన్, సీపీఐ జాతీ య కార్యదర్శి డి.రా జా పేర్కొన్నారు. ఆదివారం కొండాపూర్ లోని సీఆర్ ఫౌండేషన్‌లో చంద్ర రాజేశ్వరరావు 29వ వర్ధంతి సభ నిర్వహించారు. సభకు డి.రాజా, సీఆర్ ఫౌండేషన్ అధ్యక్షుడు కె.నారాయణ, సీపీఐ ఏపీ కార్యదర్శి కె.రామకృష్ణ, తెలంగాణ కార్యదర్శి కూనంనేని సాంబశివరావులు హాజరై చంద్ర రాజేశ్వరరావు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

కుక్కల దాడిలో చిన్నారికి గాయాలు



నర్సాపూర్: కుక్కలు దాడి చేయడంతో ఏడేళ్ల చిన్నారి తీవ్ర గాయాల పాలైంది. మెదక్ జిల్లా నర్సాపూర్‌లో ఆదివారం ఈ ఘటన జరిగింది. పట్టణానికి చెందిన ముఖసిర్ కూతురు నాయిలా ఇంటి బయట ఆడుకుంటుండగా, అక్కడే ఉన్న రెండు కుక్కలు ఆమెపై దాడి చేశాయి. వెంటనే బాలిక గట్టిగా కేకలు వేయడంతో కుటుంబ సభ్యులు వచ్చి వాటి ని తరిమేశారు. వెంటనే బాలికను ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం హైద్రాబాద్‌కు తీసుకెళ్లారు. ఇదిలా ఉండగా.. సంగారెడ్డి జిల్లా జిన్నారంలోనూ బాలుడిపై కుక్క దాడి చేసింది. తీవ్ర గాయాలైన బాలుడిని ఆస్పత్రికి తరలించారు.

చిన్నారిని చిదిమేసిన కారు



కామారెడ్డి క్రైం: చూసుకోకుండా కారును వెనక్కి తీయడంతో 13 నెలల బాలుడు మృతి చెందాడు. కామారెడ్డి మండలం ఇస్రోజీవాడిలో ఆదివారం ఈ ఘటన జరిగింది. సిద్దం స్వామి, శ్వేతలకు 13 నెలల బాబు అయాన్ష్ ఉన్నాడు. స్వామి తనకున్న స్విఫ్ట్ డిజైర్ కారును కిరాయికి నడుపుకొంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇంటి దగ్గరే పార్క్ చేసి ఉంచిన కారును కిరాయి నిమిత్తం స్వామి అన్న సాయిలు బయటకు తీయబోయాడు. అకస్మాత్తుగా ఇంట్లో నుంచి కారు వద్దకు వచ్చిన అయాన్ష్ కారు వెనుక భాగంలో నిల్చున్నాడు. సాయిలు గమనించకుండా కారును వెనక్కి తీసుకోవడంతో బాలుని తలపై నుంచి టైరు వెళ్లింది. బాలుడు కేకలు వేయడంతో కుటుంబ సభ్యులు వెంటనే గమనించి.. అతడిని కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు. అప్పటికే బాలుడు మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

భర్త శవంతో 3 రోజులు

కొణిజర్ల: అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతి చెందగా.. మతిస్థిమితం లేని ఆయన భార్య 3 రోజుల పాటు శవంతోనే ఇంట్లో గడిపింది. ఖమ్మం జిల్లా వైరాకు చెందిన రిటైర్డ్ రైల్వే ఉద్యోగి భోగి వీరభద్రం (65) కొణిజర్ల మండలం శాంతినగర్‌లో ఇల్లు నిర్మించుకుని భార్యతో ఉంటున్నాడు. రోజూ తల్లిదండ్రుల యోగక్షేమాలు కనుక్కునే పెద్దకుమారుడు వెంకటకృష్ణ ఈనెల 6వ తేదీ నుంచి ఫోన్ చేస్తున్నా తీయడం లేదు. దీంతో ఆదివారం ఆయన ఇంటికి వచ్చేసరికి తల్లి వరండాలో కనిపించింది. తండ్రి విషయమై ఆరా తీయగా బెడ్‌రూమ్‌లో ఉన్నాడని చెప్పింది. వెంకటకృష్ణ వెళ్లి చూడగా తండ్రి వీరభద్రం మృతదేహం కుళ్లిపోయిన స్థితిలో కనిపించింది. ఆయన మృతి చెంది 3 రోజులు అవుతున్నట్లు గుర్తించారు. అధిక రక్తపోటుతో కింద పడడంతో తలకు తీవ్ర గాయమై మరణించి ఉండొచ్చని భావిస్తున్నారు. వెంకటకృష్ణ ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని కొణిజర్ల ఎస్‌ఐ శంకరరావు తెలిపారు.

16 నుంచి భద్రాద్రిలో నూతన ఆర్జిత సేవలు

- రూ. 500 టికెట్‌తో వేదాశీర్వచనం, రూ.1,000 టికెట్‌తో తులసీమాల అలంకరణ సేవ
- రూ.5 వేల టికెట్‌తో స్వామివారి నిత్య సర్వ కైంకర్యం..
- రూ.10 వేల టికెట్‌తో శ్రీరామనవమి ముత్యాల తలంబ్రాల సమర్పణ సేవలు

భద్రాచలం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో ఈనెల 16 నుంచి నూతన ఆర్జిత సేవలు ప్రారంభించనున్నట్లు ఈఓ రమాదేవి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సేవలకు సంబంధించిన వివరాలను గతంలో వెల్లడించిన ఆలయ అధికారులు.. భక్తులు అభ్యంతరాలు, సలహాలు, సూచనలు అందజేయాలని కోరారు. ఈ ఏడాది జనవరి నుంచే నూతన సేవలను అందుబాటులోకి తీసుకురావాల్సి ఉన్నప్పటికీ పలు కారణాలతో జాప్యం జరిగింది.

సేవల వివరాలు ఇవీ..

వేదాశీర్వచనం: స్వామివారి దర్శనానంతరం బేడా మండపంలో (ఒక్కొక్కరికి లేదా దంపతులు) రూ.500 టికెట్‌తో ఉదయం 9.30, 10, 10.30, 11 గంటల స్లాట్స్‌లలో ఆశీర్వాదాలు అందజేస్తారు. ఇందులో పాల్గొన్న భక్తులకు కండువా, జాకెట్ పీసు, 100 గ్రాముల లడ్డూ అందజేస్తారు.

స్వామివారికి తులసీమాల అలంకరణ (ప్రతి శనివారం)

రూ.1,000 టికెట్‌తో దంపతులు లేదా ఒకరికి ఉదయం 7 గంటలకు ఉభయదాత శిరస్సుపై తులసీమాల ఉంచి ఆలయ ప్రదక్షిణ చేయిస్తారు. ఆ తర్వాత అంతరాలయంలో భక్తుల సమక్షంలో ధ్రువమూర్తులకు అలంకరణ చేస్తారు. ఇందులో పాల్గొన్న వారికి కండువా, జాకెట్ పీసు, 100 గ్రాముల లడ్డూలు రెండు, అంతరాలయ అర్చనతో రామకోటి పుస్తకాన్ని బహూకరిస్తారు.

స్వామివారి నిత్య సర్వ కైంకర్య సేవ

రూ.5 వేల టికెట్‌తో ప్రతి రోజూ జరిగే అన్ని సేవలలో ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా దంపతులు పాల్గొనే అవకాశం ఉంటుంది. ఆదివారం భక్తుల రద్దీ అధికంగా ఉండే అవకాశం ఉన్నందున ఆ రోజు 10 మందికి మాత్రమే అవకాశం ఉంటుంది. ఇందులో పాల్గొనే భక్తులకు సుప్రభాతం, అభిషేకం, అంతరాలయ అర్చన, శ్రీలక్ష్మీ అమ్మవారి అర్చన, శ్రీ ఆంజనేయ స్వామి వారి అర్చన, నిత్యకల్యాణం, వేదాశీర్వచనం, సచిత్ర రామాయణ పుస్తకం, ముత్యాల తలంబ్రాల ప్యాకెట్, అదనంగా ఐదుగురికి అన్నప్రసాదం, దర్బారు సేవ, పవళింపు(ఏకాంత) సేవలో పాల్గొనే అవకాశం ఉంటుంది.

శ్రీరామనవమి ముత్యాల తలంబ్రాల సమర్పణ

రూ.10 వేల టికెట్‌తో శ్రీరామనవమి కల్యాణ టికెట్ సెక్టార్ – 2లో రెండు సంవత్సరాలకు టికెట్లు (ఉభయం), కల్యాణ వస్త్రాలు, ప్రసాదాలు, 108 ముత్యాలతో కూడిన తలంబ్రాలు అందజేస్తారు.

నిత్య పూల అలంకరణ సేవ

రూ. 5 వేల టికెట్‌తో సోమవారం నుంచి శనివారం వరకు జరిగే పూజల్లో స్వామి వారికి, ఉపాలయాల్లో అవసరమైన పూల దండల సమర్పణ. ఇందులో పాల్గొనే వారికి కండువా, జాకెట్ పీసు, రెండు చిన్న లడ్డూలు, నలుగురికి అన్నప్రసాదం అందజేస్తారు.

తులాభారం

రూ.100 టికెట్ ధరతో ప్రతి రోజూ తులాభారం (భక్తులు మొక్కుకున్న చిల్లర నాణేలు, లేదా బియ్యం.. తదితర వస్తువులు) ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు, మధ్యాహ్నం 3 నుంచి రాత్రి 8 గంటల వరకు అందించవచ్చు.



రుణమెప్పుడొస్తది?

రెండో విడత సబ్సిడీ గొర్రెల పంపిణీ పథకానికి డబ్బుల కోసం ఎదురుచూపులు

- రూ.4,565 కోట్ల రుణానికి ఇంకా రాని గ్రీన్‌సిగ్నల్
- ఎన్‌సీడీసీ రుణం మంజూరు చేసినా ఇప్పటివరకు గ్యారంటీ ఇవ్వని ప్రభుత్వం
- ఆర్థిక శాఖ వద్దకు ఫైలు?
- కిస్తీలు ఎన్ని దఫాల్లో చెల్లిస్తారన్న దానిపై వివరణ పత్రం ఇస్తేనే..
- ఏప్రిల్ 14 తర్వాత పంపిణీ అంటున్న గొర్రెల ఫెడరేషన్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో రెండో విడత సబ్సిడీ గొర్రెల పంపిణీ పథకానికి ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ పథకం అమలుకు అవసరమైన నిధులను రుణం కింద సమకూర్చుకునేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. వెంటనే సబ్సిడీ గొర్రెల పంపిణీ చేపట్టాలని సీఎం కేసీఆర్ స్వయంగా ఆదేశాలిచ్చారు. ఆ మేరకు పశుసంవర్ధక శాఖ అధికారులు కూడా ఏర్పాట్లు కూడా చకచకా చేస్తున్నారు. కానీ, ఈ పథకం రెండో దఫా రాష్ట్రంలో అమలు చేయాలంటే రూ.4,565 కోట్ల రుణం కావాలి. ఈ రుణాన్నిచ్చేందుకు జాతీయ సహకార అభివృద్ధి కార్పొరేషన్ (ఎన్‌సీడీసీ) ఆమోదం తెలిపి కూడా ఆరునెలలు దాటిపోయింది. కానీ, ప్రభుత్వ పూచీకత్తు లభించకపోవడంతో ఆ ఆమోదం కాగితాలకే పరిమితం అయింది. ఇప్పుడు కేబినెట్ ఆమోదంతో ఆ రుణం ఎప్పుడు వస్తుందా అని పశుసంవర్ధక శాఖ అధికారులు ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది. అప్పటివరకు గొర్రెల కొనుగోలు కోసం తమ వద్ద ఉన్న రూ.100 కోట్ల వరకు ఖర్చు పెట్టగలమని, ఆ తర్వాత ఎన్‌సీడీసీ రుణంపైనే ఆధారపడాల్సి ఉంటుందని పశుసంవర్ధక శాఖ అధికారులు చెబుతున్నారు. ఏప్రిల్ నెలాఖరు వరకు రుణం వస్తుందనే ఆశతో రెండో విడత సబ్సిడీ గొర్రెల పంపిణీ పథకం అమలుకోసం ఏర్పాట్లు చేస్తున్నారు.

నగదు బదిలీతో కాదు..

వాస్తవానికి, ఈ పథకం కింద గొర్రెల పంపిణీని నగదు బదిలీ ద్వారా అమలు చేయాలని ప్రభుత్వం తొలుత నిర్ణయించినా ఆ తర్వాత వెనక్కు తగ్గింది. పైలట్‌గా నల్లగొండ జిల్లా మునుగోడు నియోజకవర్గంలో లబ్ధిదారుల ఖాతాల్లోకి నగదు జమచేసి గొర్రెలు కొనుగోలు చేపట్టింది. ఈ క్రమంలో ఇబ్బందులు ఎదురుకావడంతో మళ్లీ పాత తరహాలోనే ఇతర రాష్ట్రాల నుంచి గొర్రెలు కొనుగోలు చేయనుంది. ఇందుకోసం జిల్లా స్థాయిలో కలెక్టర్ల ఆధ్వర్యంలో సన్నాహాలు జరుగుతున్నాయి. కొనుగోలు చేసిన గొర్రెలను లబ్ధిదారుల వద్దకు చేర్చేందుకు అవసరమైన రవాణా కాంట్రాక్టు టెండర్లను జిల్లా స్థాయిలో పిలవగా, ఇప్పుడు ఆ ప్రక్రియ జరుగుతోంది. ఈ టెండర్ల ఖరారయిన తర్వాత గొర్రెల కొనుగోలు, పంపిణీ ప్రక్రియ ప్రారంభం కానుందని పశుసంవర్ధక శాఖ అధికారులు చెపుతున్నారు.

కొనుగోలు బాధ్యత జిల్లా అధికారులకు..

కొనుగోలు కోసం జిల్లా స్థాయి అధికారులకు బాధ్యతలు అప్పజెపుతున్నారు. గతంలో మండల స్థాయిలో పశుసంవర్ధక శాఖ అధికారులతో కొనుగోళ్లు జరిపించగా, ఈసారి మాత్రం జిల్లా స్థాయి అధికారులతో (డీఆర్‌వో, ఆర్డీవో, పీడీ డీఆర్‌డీఏ, జిల్లా వ్యవసాయాధికారులు, ఇతర శాఖలకు చెందిన జిల్లా అధికారులు) కొనుగోలు ప్రక్రియ చేపట్టనున్నారు. గొర్రెల కోసం ఇప్పటివరకు 30వేల మందిలోపు లబ్ధిదారులే డీడీలు తీయగా, మిగిలిన వారి చేత కూడా డీడీలు కట్టించే పనిలో స్థానిక అధికారులు నిమగ్నమయ్యారు. మొత్తం మీద ఏప్రిల్ 14 తర్వాత రెండో విడత గొర్రెల పంపిణీ పథకం అమలు చేసేదమని, ఏప్రిల్ నెలాఖరు కల్లా ఎన్‌సీడీసీ రుణం వస్తుందని ఆశిస్తున్నామని పశుసంవర్ధక శాఖ అధికారులు ఆశాభావంతో ఉన్నారు.

రాష్ట్రంలో సబ్సిడీ గొర్రెల పంపిణీ పథకం గణాంకాలివే

తొలి విడత పంపిణీ చేసిన గొర్రెల యూనిట్లు:	3,93,552
మొత్తం వ్యయం:	రూ.5,001.75 కోట్లు
ఎన్‌సీడీసీ రుణం:	3,955 కోట్లు
లబ్ధిదారుల వాటా:	1,046.75
రెండో విడత పంపిణీకి నిర్దేశించుకున్న యూనిట్లు:	3,50, 000
అంచనా వ్యయం:	రూ.6,087 కోట్లు
ఎన్‌సీడీసీ:	4,565.75 కోట్లు
లబ్ధిదారుల వాటా:	రూ. 1,521.25
యూనిట్ కాస్ట్:	1,75,000
ఒక్కో లబ్ధిదారుని వాటా:	రూ.43,750
ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీ:	1,31,250
గొర్రెల కోసం డీడీలు తీసిన లబ్ధిదారులు:	27,456

ఎమ్మెల్యే అనుచరుల బెదిరింపులు

- మరో వీడియో విడుదల చేసిన ఆరిజిన్ డెయిరీ భాగస్వామి

బెల్లంపల్లి: బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అనుచరులు తమను బెదిరిస్తున్నారని ఆరిజిన్ డెయిరీ భాగస్వామి శేజల్ ఆదివారం మరో వీడియోను విడుదల చేశారు. హైదరాబాద్ కేంద్రంగా విడుదల చేసిన ఆ వీడియో జిల్లాలోని వాట్సాప్ గ్రూపులకు పంపడంతో స్థానికంగా చర్చనీయాంశమైంది. ఎమ్మెల్యే చిన్నయ్య పీఏగా వ్యవహరిస్తున్న గడ్డం భీమాగౌడ్.. ఆంధ్రప్రదేశ్‌లోని తమ ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను బెదిరించారని శేజల్ పేర్కొన్నారు. అసలు ఆయన తమ ఇంటికి వెళ్లాల్సిన అవసరమేమిటని ఆమె ప్రశ్నించారు. ఎమ్మెల్యేకు, తనకు ఎలాంటి సంబంధం లేదని మీడియా ముందుకు వచ్చి ఒప్పుకుంటే తమపై పెట్టిన పోలీసు కేసులన్నీ వాపస్ తీసుకుంటామని, లేకపోతే పీడీయాక్టు పెడతామని బెదిరించారని వీడియోలో పేర్కొన్నారు.

పీఎఫ్‌ఆర్‌డీఏ చట్టాన్ని రద్దు చేయాల్సిందే

- టీఎస్ యూటీఎఫ్ డిమాండ్

సాక్షి, హైదరాబాద్: ఉపాధ్యాయ, ఉద్యోగులకు ఆశనిపాతంలా మారిన కొత్త పెన్షన్ విధానానికి కారణమైన పీఎఫ్‌ఆర్‌డీఏ చట్టాన్ని కేంద్రం రద్దు చేయాల్సిందేనని, దీనికి ప్రత్యామ్నాయాన్ని అంగీకరించే ప్రసక్తే లేదని తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ స్పష్టం చేసింది. కేంద్రం ఏర్పాటు చేసిన కమిటీ ఉద్యోగులను మోసం చేసేందుకేనని అభిప్రాయపడింది. టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి మాట్లాడుతూ..నూతన విద్యావిధానం ద్వారా ఆరేళ్లు నిండిన వాళ్లనే ఒకటో తరగతిలో చేర్చాలనే నిబంధన ప్రైవేటు స్కూళ్లకు ప్రయోజనకరంగా ఉందని దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు జంగయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావా రవి, నేతలు దుర్గా భవాని, లక్ష్మారెడ్డి, మాణిక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చరిత్ర దాస్తే దాగదు..


పాపన్న గౌడ్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, మల్లారెడ్డి, ఏపీ మంత్రి రమేశ్

ఘట్‌కేసర్: చరిత్ర దాస్తే దాగదని, బహుజన చక్రవర్తి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చరిత్రను ఇన్నాళ్లు దాచిపెట్టారని, కేంబ్రిడ్జ్‌లో ఆయన విగ్రహం పెట్టడంతో బయటపడిందని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. పట్టణంలోని బైపాస్ రోడ్డులో గౌడ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బహుజన వీరుడు సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని మంత్రి మల్లారెడ్డి, ఏపీ మంత్రి జోగి రమేశ్, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, కల్లు గీత పారిశ్రామిక రాష్ట్ర అధ్యక్షుడు బాల్‌రాజ్‌గౌడ్‌తో కలిసి ఆదివారం ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ సబ్బండ వర్గాల కోసం ఎనలేని పోరాటం చేశాడని గుర్తు చేశారు. సైన్యం ఏర్పాటు చేసుకొని వరంగల్, గోల్కొండ కోటలను గెలుచుకొని ఆసియాలోనే బహుజన వీరుడిగా చరిత్రకెక్కాడని కీర్తించారు. పాపన్న గౌడ్ జయంతి, వర్ధంతిని ప్రభుత్వం అధికారంగా నిర్వహిస్తుందని, ట్యాంక్ బండ్‌పై ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని తెలిపారు. మంత్రి మల్లారెడ్డి మాట్లాడుతూ గౌడల అభివృద్ధిలో భాగంగానే ప్రభుత్వం నీరా దుకాణాలను ప్రారంభించిందని చెప్పారు. ఏపీ మంత్రి జోగి రమేశ్ మాట్లాడుతూ.. పన్నులు, కప్పం నుంచి సబ్బండ వర్గాలకు విముక్తి కల్పించిన బహుజన చక్రవర్తి పాపన్న గౌడ్ అని కొనియాడారు.

ప్రేమించాడని కొట్టి.. పొడిచి చంపేశారు

- నల్లగొండ జిల్లాలో బడుగు వర్గానికి చెందిన యువకుడి హత్య
- ప్రేమ వ్యవహారమే కారణం


ఘటనాస్థలిలో నవీన్ మృతదేహం

నిడమనూరు: మా వాళ్ల అమ్మాయినే ప్రేమిస్తావా అంటూ యువతి బంధువులు ఓ బడుగు వర్గానికి చెందిన యువకుడిని కర్రలతో కొట్టి కత్తులతో నరికి చంపేశారు. నల్లగొండ జిల్లా నిడమనూరు మండలం గుంటిపల్లిలో ఆదివారం జరిగిన దారుణ హత్యపై పోలీసులు తెలిపిన వివరాలిలా.. త్రిపురారం మండలం జి.అన్నారం గ్రామానికి చెందిన విరిగి నవీన్ (21) చదువును మధ్యలోనే మానేసి మిర్యాలగూడలో మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన ఈట నాగయ్య కుటుంబం మిర్యాలగూడలోనే నివాసం ఉంటూ అక్కడే కూరగాయల వ్యాపారం చేస్తోంది. ఈయన కుమార్తె, నవీన్ నాలుగేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. వీరి ప్రేమ వ్యవహారం ఏడాది కిందట తెలియడంతో అమ్మాయిని మర్చిపోవాలని లేకుంటే హత్య చేస్తామని ఆమె కుటుంబసభ్యులు బెదిరించారు. అందుకు వెరవకుండా నవీన్ తాము పెళ్లి చేసుకుంటామని వారికి చెబుతూ వస్తున్నాడు. ఈ క్రమంలో ఆదివారం నవీన్ గుంటిపల్లి గ్రామానికి చెందిన స్నేహితులు అనిల్, తిరుమల్‌తో కలిసి ఊళ్లో ఓ ఇంటి వద్ద మద్యం తాగుతున్నారు. ఈ క్రమంలో ప్రేమ వ్యవహారంపై మాట్లాడుకుందామని అమ్మాయి తరపు బంధువులకు నవీన్ ఫోన్ చేసి రమ్మని పిలిచాడు.

కత్తులు, కర్రలతో విచక్షణారహితంగా..

అమ్మాయి తరపు బంధువులైన జి.అన్నారం గ్రామానికి చెందిన మర్రి రాజు, లింగంపల్లి రాజేష్, కొడదల శివప్రసాద్, తాళ్ల నవదీప్, మణితేజ్‌తో పాటు మరికొంత మంది మూడు బైక్‌లపై కత్తులు, వేట కొడవళ్లు కర్రలతో గుంటిపల్లికి చేరుకున్నారు. స్నేహితులతో కలిసి మద్యం తాగుతున్న నవీన్‌పై మూకుమ్మడిగా దాడికి తెగబడ్డారు. అనిల్, తిరుమల్ భయంతో పారిపోగా పరుగెత్తుతున్న నవీన్‌ను వారు వెంటాడి కర్రలతో కొట్టి, కత్తులతో పొడిచి దారుణంగా హత్య చేశారు. ఘటనా స్థలాన్ని మిర్యాలగూడ డీఎస్పీ వెంకటగిరి, హాలియా సీఐ గాంధీ నాయక్ పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. హతుడి మిత్రుడు అనిల్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు నిడమనూరు ఎస్‌ఐ శోభన్ బాబు తెలిపారు.

కేసీఆర్ నిజస్వరూపం బయటపడింది: ఎన్వీఎస్ఎస్

సాక్షి, హైదరాబాద్: ప్రధానమంత్రి నరేంద్రమోదీ రాష్ట్ర పర్యటనకు గైర్హాజరీతో ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు నిజ స్వరూపం బయట పడిందని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ అన్నారు. రాష్ట్రంలో అభివృద్ధికి అసలైన అడ్డంకి ఎవరో ప్రజలకు అర్థమైందని తెలిపారు. పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలోని పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించేందుకు పీఎం మోదీ వస్తే.. ప్రొటోకాల్‌లో భాగంగానైనా సీఎం హాజరుకావాల్సి ఉంటుందన్నారు. సీఎం కేసీఆర్ హాజరు కాకపోవడం చూస్తే.. రాష్ట్ర అభివృద్ధి పట్ల ఆయనకున్న చిత్తశుద్ధి ఏంటో తెలుస్తోందని ఎద్దేవా చేశారు.

ధాన్యం సేకరణపై నేడు కీలక సమావేశం

- అదనపు కలెక్టర్లు, డీఎంలు, డీఎస్‌ఓలతో మంత్రులు హరీశ్‌రావు, గంగుల, సింగిరెడ్డి

సాక్షి, హైదరాబాద్: యాసంగి ధాన్యం సేకరణపై పౌరసరఫరాల శాఖ సోమవారం కార్యాచరణ ప్రణాళికను ప్రకటించనుంది. ఇప్పటికే కొన్ని జిల్లాల్లో వరికోతలు మొదలైన నేపథ్యంలో అన్ని జిల్లాల అదనపు కలెక్టర్లు, డీఎంలు, డీఎస్‌ఓలతో మంత్రులు హరీశ్‌రావు, గంగుల కమలాకర్, సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి సమావేశం కానున్నారు. ఈ సమావేశానికి సీఎస్ కూడా హాజరవుతారు. మధ్యాహ్నం 3 గంటలకు ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలో జరిగే ఈ సమావేశంలో యాసంగి ధాన్యం సేకరణపై స్పష్టమైన విధి విధానాలను వెల్లడించనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 7వేల కొనుగోలు కేంద్రాల ఏర్పాటు, మౌలిక వసతుల కల్పన, మిల్లర్లకు ధాన్యం కేటాయింపు, రవాణా సౌకర్యం వంటి అంశాలపై చర్చించనున్నారు. ధాన్యం కేటాయించి 18 నెలలు గడిచినా సీఎంఆర్ ఇవ్వకుండా మిల్లర్లు ధాన్యం, బియ్యం అమ్ముకుంటున్న ఘటనలు ఇటీవల వెలుగులోకి వస్తున్నాయి. ఈ నేపథ్యంలో మిల్లర్లకు ఈ వేదిక నుంచి హెచ్చరికలు జారీ చేసే అవకాశం ఉంది. సీఎంఆర్ పెండింగ్‌లో ఉన్న ఏ మిల్లుకు యాసంగి సీజన్‌లో ధాన్యాన్ని కేటాయించకూడదని ఇప్పటికే పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ స్పష్టీకరించిన నేపథ్యంలో నేడు సమావేశంలో ప్రకటించే అవకాశం ఉంది.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించండి



సాక్షి, హైదరాబాద్: యాసంగి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను యుద్ధ ప్రాతిపదికన ప్రారంభించాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర రావు ఆదేశించారు. తక్షణమే గత తరహాలోనే 7 వేల ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ ప్రారంభించాలని సూచించారు. ఈ మేరకు ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, పౌరసరఫరాల శాఖ కమిషనర్ అనిల్ కుమార్‌ను సూచించారు. తక్షణ చర్యల్లో భాగంగా సోమవారం అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఏర్పాట్లపై దిశానిర్దేశం చేయాలని సీఎస్‌ను ఆదేశించారు.

బీసీలకు అన్యాయం చేస్తున్నారు

ఉపరాష్ట్రపతితో ఎంపీలు, బీసీ నేతల భేటీలో ఆర్.కృష్ణయ్య


ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్‌తో భేటీ అయిన ఆర్.కృష్ణయ్య, ఇతర ఎంపీలు

కాచిగూడ: దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు గడుస్తున్నా 56శాతం జనాభా ఉన్న బీసీలకు విద్య, ఉద్యోగ, ఆర్థిక, రాజకీయ రంగాల్లో సమాన వాటా ఇవ్వకుండా అన్యాయం చేస్తున్నారని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య అన్నారు. ఉపరాష్ట్రపతి హోదాలో జోక్యం చేసుకొని బీసీలకు న్యాయం చేయాలని ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్‌ను కోరారు. ఆదివారం ఆర్.కృష్ణయ్య నేతృత్వంలో పార్లమెంటు సభ్యులు బీద మస్తాన్‌రావు, పిల్లి సుభాష్‌చంద్రబోస్, గోరంట్ల మాధవ్, తలారి రంగయ్య, మరో 25 మంది బీసీ నాయకులు ఉపరాష్ట్రపతిని ఆయన కార్యాలయంలో కలిశారు. బీసీల సమస్యలపై చర్చలు జరిపారు. బీసీలకు ఏ రంగంలోనూ జనాభా ప్రకారం వాటా ఇవ్వడం లేదని, ఉద్యోగ, రాజకీయ, ఆర్థిక, సామాజిక రంగాల్లో కనీస ప్రాతినిధ్యం లభించడం లేదని తెలిపారు. సంపద సృష్టికర్తలు, ఉత్పత్తి కులాలైన బీసీలకు ఆ సంపద అనుభవించే హక్కు లేకుండా పోయిందన్నారు. పార్లమెంట్‌లో బీసీ బిల్లు ప్రవేశపెట్టి, చట్టసభల్లో బీసీలకు 50 శాతం రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని, బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలని, ఇందుకు రాజ్యాంగ సవరణ చేయాలని విజ్ఞప్తి చేశారు. బీసీల విద్య, ఉద్యోగ, రిజర్వేషన్లపై ఉన్న క్రిమిలేయర్‌ను తొలగించాలని, ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని కోరారు. అయితే 'బీసీలకు అన్ని రంగాల్లో సమాన వాటా ఇచ్చే ప్రక్రియ ప్రారంభమైంది. పూర్తిస్థాయిలో న్యాయం చేయడానికి చర్యలు తీసుకుంటాం'అని ఉపరాష్ట్రపతి జగదీప్ హామీ ఇచ్చారని ఆర్.కృష్ణయ్య తెలిపారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నేతలు లాల్ కృష్ణ, వేముల రామకృష్ణ, చిన్న నరసింహులు, హనుమంతు, ఆంజనేయులు, అభిరామ్, రాజ పుల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బొగ్గు బ్లాకుల ప్రైవేటీకరణను అడ్డుకోవాలి

- సింగరేణి పరిరక్షణకు కమ్యూనిస్టులు కలిసి రావాలి
- పాదయాత్రలో సీఎల్పీ నేత భట్టి


శ్రీరాంపూర్ ఓసీపీని పరిశీలిస్తున్న భట్టి

శ్రీరాంపూర్: సింగరేణికి చెందిన నాలుగు బొగ్గు బ్లాకుల ప్రైవేటీకరణను అడ్డుకోవాలని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క అన్నారు. హాథ్‌సే హాథ్ జోడో యాత్ర కొనసాగింపులో భాగంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో భట్టి చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్ర ఆదివారం మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్‌కు చేరుకుంది. ఏఐసీసీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్సీ కొక్కిరాల ప్రేంసాగర్‌రావు, డీసీసీ అధ్యక్షురాలు సురేఖ పాదయాత్రకు స్వాగతం పలికారు. శ్రీరాంపూర్ ఓసీపీ నిర్వాసిత గ్రామమైన సింగపూర్ మీదుగా ఓసీపీ బొగ్గు గనిని సందర్శించి, వ్యూపాయింట్ నుంచి భట్టి క్వారీని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ చేసిన నూతన బొగ్గు గనుల చట్టానికి బీఆర్‌ఎస్ ఎంపీలు మద్దతిచ్చారని, అందుకే బొగ్గు బ్లాకుల వేలానికి బీఆర్ఎస్ కూడా కారణమని పేర్కొన్నారు. ఓసీపీతో సింగరేణి ప్రాంతం బొందలగడ్డగా మారుతోందని అన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ఇక్కడే కుర్చీ వేసుకుని కూర్చుని ఓసీపీని అడ్డుకుంటానని చెప్పిన కేసీఆర్ ఇప్పుడు ఎక్కడ కూర్చున్నాడో చెప్పాలని డిమాండ్ చేశారు. ఓసీపీల్లో స్థానికులకే ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సింగరేణి ప్రైవేటీకరణను అడ్డుకునేందుకు కమ్యూనిస్టులు తమతో కలిసి రావాలని కోరారు. దేశంలో ప్రజాస్వామ్యం నిలబడాలన్నా, మతతత్వ శక్తులను అడ్డుకోవాలన్నా కాంగ్రెస్‌తోనే సాధ్యమని తెలిపారు.

జగిత్యాల స్ట్రాంగ్ రూం తెరవండి

- ధర్మపురి అసెంబ్లీ ఎన్నిక వివాదంపై హైకోర్టు ఆదేశం

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: జగిత్యాల జిల్లా ధర్మపురి అసెంబ్లీ ఫలితాల వివాదం ఆసక్తికర మలుపు తిరిగింది. నాటి ఎన్నికల ఫలితాల ప్రకటనలో అవకతవకలు జరిగాయని, కొప్పుల ఈశ్వర్ ఎన్నిక అక్రమమని ఆరోపిస్తూ కాంగ్రెస్ అభ్యర్థి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ వేసిన పిటిషన్‌పై విచారణ చేపట్టిన హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఎన్నికల ఫలితాలు భద్రపరిచిన స్ట్రాంగ్‌రూమ్‌ను తెరిచి అప్పటి ఎన్నికకు సంబంధించిన 17ఏ, 17సీ డాక్యుమెంట్ల కాపీలను, సీసీ ఫుటేజీ, ఎన్నికల ప్రొసీడింగ్స్‌ను ఈ నెల 11న సమర్పించాలని ఆ సమయంలో ఉన్న రిటర్నింగ్ అధికారి భిక్షపతిని ఆదేశించింది.

క్లుప్తంగా...

విగ్గు కాదు.. జుట్టే



వాషింగ్టన్: ఈ ఫొటోలో కనిపిస్తున్న మహిళ పేరు అవియన్ దుగాస్. వయసు 47 ఏళ్లు. అమెరికాలో లూసియానాకు చెందిన ఆమెకున్న జుట్టు చూశారా..? అది జుట్టేంటి విగ్గు అనుకుంటున్నారా..? కాదు అది నిజంగానే జుట్టే. అలా జుట్టు పెంచడానికి ఆమె 24 ఏళ్లు పట్టింది. 9.84 అంగుళాల పొడవు, 10.4 అంగుళాల వెడల్పు, 5.41 అడుగుల చుట్టుకొలత కలిగిన అతి పెద్ద జుట్టు గిన్నిస్ వరల్డ్ బుక్‌లో చోటు సంపాదించింది. 2010లో ఒకసారి 4.4 అడుగుల చుట్టుకొలతతో రికార్డులకెక్కిన ఆమె తనకి సహజంగానే జుట్టు అలా పెరిగిందని చెబుతోంది. తన జుట్టు స్ట్రెయిట్‌గా ఉండడం కోసం ఒకప్పుడు కెమికల్స్ వాడానని, కానీ అవి మంచివి కావని తేలడంతో వాటిని మానేశానని, దీంతో జుట్టు ఇలా తయారైందని దుగాస్ చెప్పుకొచ్చింది.

మెట్రోలో సైకిల్




ముంబై: మహానగరం ముంబైలో ట్రాఫిక్‌లో ప్రయాణమంటే నిత్యం నరకమే. మెట్రోలో ప్రయాణిస్తే స్టేషన్ నుంచి మళ్లీ గమ్యస్థానం చేరుకోవడానికి ఆటోలకి డబ్బులు ధార పోయాలి. ప్రతీ రోజూ ట్యూషన్‌కి వెళ్లే ఒక అబ్బాయి మెట్రోలో తనతో పాటు సైకిల్ కూడా తీసుకువెళ్లడం మొదలు పెట్టాడు. తనతో పాటే సైకిల్ దింపుకొని హ్యాపీగా కోచింగ్ సెంటర్‌కు వెళ్లసాగాడు. మెట్రోలో కూర్చున్నప్పుడు హెల్మెట్ పెట్టుకొని, తన పక్కనే సైకిల్ పెట్టుకోవడం చూసిన కొందరు దానిని ఫొటో తీసి సోషల్ మీడియాలో షేర్ చేశారు. కేంద్ర మంత్రి హర్‌దీప్ సింగ్ పూరి తన ట్విట్టర్ అకౌంట్‌లో ఈ ఫొటోని షేర్ చేయడంతో అది ఒక్కసారిగా వైరల్ అయింది.

ఒకప్పుడు సరదా కోసం పులుల్ని వేటాడేవారు. ఆ తర్వాత కాలంలో అభివృద్ధి కార్యక్రమాలు పులుల్ని బలి తీసుకున్నాయి. ప్రకృతి సమతుల్యతకి పులులెంత విలువైనవో ఆ తర్వాత మనకి తెలిసి వచ్చింది. 50 ఏళ్ల క్రితం మొదలు పెట్టిన టైగర్ ప్రాజెక్టు వల్ల పులుల సంఖ్య ఏడాదికేడాది పెరుగుతోంది. ప్రపంచంలోనే పులుల సంరక్షణ అంశంలో భారత్ అనుసరిస్తున్న విధానాలు ప్రపంచదేశాలకు మార్గదర్శకంగా మారాయి. నాలుగేళ్లకొకసారి అభయారణ్యాలలో పులుల్ని లెక్కించే ప్రక్రియ ఆసక్తికరంగా మారి గిన్నిస్ వరల్డ్ రికార్డులకెక్కింది.



గాండ్రింపులు పెరిగాయ్!



పులుల సంఖ్య పెరుగుతోంది ఇలా..!



మన దేశంలో పులుల సంరక్షణ కోసం 50 ఏళ్ల క్రితమే టైగర్ ప్రాజెక్టు మొదలైంది. పర్యావరణ పరిరక్షణకు, ప్రకృతి సమతుల్యతకి పులులు ఎంత ముఖ్యమో గ్రహించిన అప్పటి ఇందిరాగాంధీ ప్రభుత్వం 1973, ఏప్రిల్ 1న ఈ ప్రాజెక్టుకి శ్రీకారం చుట్టింది. అప్పట్లో దేశీయంగా అంతరించడానికి సిద్ధంగా ఉన్న జాబితాలో పులులు చేరిపోయాయి. ఇరవయ్యో శతాబ్దంలో ప్రపంచ దేశాల్లో పులుల సంఖ్య లక్ష ఉంటే, మన దేశంలో 40 వేలు ఉండేవి. అలాంటిది 1970 నాటికి పులుల సంఖ్య దాదాపుగా 1,800కు పడిపోవడంతో కేంద్రం అప్రమత్తమైంది. అభివృద్ధి పేరిట అడవులకి, వన్యప్రాణులకి ఎంత నష్టం జరుగుతోందో గ్రహించి టైగర్ ప్రాజెక్టుని ప్రారంభించింది. తొలిదశలో 18,278 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో తొమ్మిది టైగర్ రిజర్వ్‌లు ఉండేవి. ప్రస్తుతం 75 వేల చదరపు కిలోమీటర్లు (దేశ భౌగోళిక విస్తీర్ణంలో 2.4%) విస్తీర్ణంలో 53కి పైగా టైగర్ రిజర్వులున్నాయి. ప్రపంచంలో మొత్తం పులుల్లో మన దేశంలో 70% ఉన్నాయంటే ఈ టైగర్ ప్రాజెక్టు ఎంతటి విజయాన్ని సాధించిందో తెలుస్తోంది.

పులులను ఎలా లెక్కిస్తారంటే!

1 దేశంలో పులుల సంరక్షణ కార్యక్రమం ఏర్పాటు చేసి వాటి గణన చేపట్టినప్పుడు అదో పెద్ద సవాల్‌గా నిలిచింది. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో లేకపోవడంతో తొలినాళ్లలో అటవీ సిబ్బంది అడవుల్లో నడుచుకుంటూ వెళ్లి వన్యప్రాణులు కనిపిస్తే వాటి గుర్తులతో సహా ఎన్ని కనిపించాయో వివరాలను రాసుకొని లెక్కించేవారు.

2 ఆ తర్వాత పగ్ మార్క్ విధానం అమల్లోకి వచ్చింది. పులుల పాద ముద్రలనే వాటిని లెక్కించడానికి వాడేవారు. మనుషుల వేలిముద్రలన్నీ ఎలా ఒక్కలా ఉండవో పులుల పాద ముద్రలు కూడా ఒకేలా ఉండవు. అలా పాదముద్రల్ని బట్టి ఎన్ని పులులు ఉన్నాయో గుర్తించేవారు. బటర్ పేపర్‌పై స్కెచ్‌పెన్‌తో పాద ముద్ర ఆకారాన్ని గీస్తారు. గాజుపలకపై తెల్లటి కాగితాన్ని ఉంచి ఆకారాన్ని దానిపై పడేలా చేస్తారు. నేలపై ఉన్న ముద్రల మీద చాక్‌పౌడర్ చల్లి ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ మిశ్రమాన్ని కలిపేవారు. ఆ మిశ్రమం గడ్డ కట్టి పులి పాదం అచ్చు లభించేది. ఆ పాద ముద్ర ఆధారంగా ఎన్ని పులులు తిరిగాయి, వాటి వయసు వంటివి తెలుసుకునేవారు.

3 ఒక దశలో వన్యప్రాణుల గోళ్లు, మలం సేకరించి దాని ఆధారంగా కూడా గణన జరిగేది.

4 కొన్నేళ్లు గడిచాక మరో కొత్త విధానాన్ని మొదలు పెట్టారు. పులులు చేతికి చిక్కినప్పుడు వాటిపై ప్రత్యేకమైన ముద్ర వేసేవారు. మళ్లీ వాటిని అడవుల్లో వదిలేసి ఆ తర్వాత లెక్కించే సమయంలో ముద్ర ఉందో లేదో చూసేవారు. ముద్ర లేని పులులు కనిపిస్తే కొత్తగా జాబితాలో వచ్చి చేరేవి.

5 గత కొన్నేళ్ల నుంచి అత్యాధునిక కెమెరాలు వినియోగించి పులుల సంఖ్యని గణిస్తున్నారు. ఎక్కువగా పులులు సంచరించే ప్రాంతాలను గుర్తించి అక్కడ కెమెరాలు ఏర్పాటు చేసినట్టుగా జాతీయ పులుల సంరక్షణ అథారిటీ అధికారులు చెప్పారు. అడవుల్లో ఇరువైపులా ఉన్న చెట్లకు కెమెరాలు ఫిక్స్ చేయడం వల్ల పులులతో పాటు ఆయా ప్రాంతాల్లో ఉండే వన్యప్రాణుల గురించి కూడా తెలుస్తుంది. ఇక పులుల ఎత్తు, వాటి నడక, వాటి శరీరంపై ఉండే చారల ఆధారంగా సంఖ్యను తెలుసుకుంటారు.

గిన్నిస్ రికార్డుల్లోకి పులుల గణన

మన దేశంలో పులుల గణన రికార్డులు తిరగరాసింది. కెమెరాల సాయంతో భారీగా వన్యప్రాణుల గణన చేపట్టిన తొలి దేశంగా భారత్ గిన్నిస్ రికార్డులకెక్కింది. 2018–2019 పులుల గణన ప్రపంచంలోనే అత్యంత సమగ్రమైనది. 141 ప్రదేశాల్లో 26,838 చోట్ల మోషన్ సెన్సర్లున్న కెమెరాలు అమర్చారు. ఈ ప్రక్రియలో 44 వేల మంది అధికారులు, జీవ శాస్త్రవేత్తలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. 20 రాష్ట్రాల్లో రహస్య కెమెరాలు, ఇతర పద్ధతుల్లో పులులతో పాటు ఇతర వన్యప్రాణుల్ని లెక్కించడం రికార్డు సృష్టించింది.

దేశంలో పెరుగుతున్న పులుల సంఖ్య

ఒకప్పుడు **1,800** లోపే.. ఇప్పుడు దాదాపు రెట్టింపు

ప్రపంచంలోని మొత్తం పులుల్లో **70%** భారత్‌లోనే

50 ఏళ్ల 'ప్రాజెక్ట్ టైగర్' ఫలితమే

బందిపూర్‌లో ప్రధాని

ప్రాజెక్టు టైగర్ 50 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కర్ణాటకలో బందిపూర్ టైగర్ రిజర్వ్ ఫారెస్ట్‌లో పర్యటించారు. పశ్చిమ కనుమల్లో ఉన్న ఈ అభయారణ్యంలో ఓపెన్ జీపులో దాదాపుగా 20 కి.మీ. దూరం ప్రయాణించి ప్రకృతి అందాలను తిలకించారు. కాకీప్యాంట్, షర్టు, నెత్తిన టోపి ధరించిన ప్రధాని మోదీ బందిపూర్ ఫొటోలను ట్విట్టర్‌లో షేర్ చేశారు. ''బందిపూర్ టైగర్ రిజర్వ్ ఫారెస్ట్‌లో ఉదయం గడిపాను. భారత దేశ ప్రకృతి రమణీయతను, వన్యప్రాణుల్లో వైవిధ్యాన్ని ఆస్వాదించాను'' అని ట్వీట్‌లో పేర్కొన్నారు. బైనాక్యులర్స్ ద్వారా వన్యప్రాణుల్ని చూస్తూ, కెమెరాలో వాటిని బంధిస్తూ గడిపారు.

గజరాజులతో ఆప్యాయంగా

తర్వాత బందీపూర్ రిజర్వ్‌కు 12 కిలోమీటర్ల దూరంలో తమిళనాడులో మదుమలైలోని తెప్పకాడు ఏనుగుల శిబిరాన్ని మోదీ సందర్శించారు. ఏనుగులతో సరదాగా గడిపారు. ఇటీవల ఆస్కార్ అవార్డు పొందిన ఎలిఫెంట్ విస్పరర్స్ సినిమాలో ప్రధాన పాత్రలు పోషించిన మావటి దంపతులు బొమ్మన్, బెళ్లిలను సన్మానించారు. వారితో కలిసి ఏనుగులకు చెరుకులు తినిపించారు. వారిని ఢిల్లీకి ఆహ్వానించారు.

3,167 దేశంలో పులులు


నాలుగేళ్లలో 200 పెరిగాయి

గణాంకాలు విడుదల చేసిన మోదీ

ఎకాలజీ, ఎకానమీ అవిభాజ్యమని వ్యాఖ్యలు



మైసూరు/సాక్షి, చెన్నై: పర్యావరణం, ఆర్థిక వ్యవస్థ కలసికట్టుగా ముందుకు వెళ్లడానికి భారత్ ప్రాధాన్యమిస్తుందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. పులుల సంరక్షణ కోసం ఉద్దేశించిన టైగర్ ప్రాజెక్టుకు 50 ఏళ్లయిన సందర్భంగా ఆదివారం మైసూరులోని కర్ణాటక స్టేట్ ఓపెన్ వర్సిటీలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ''ఇంటర్నేషనల్ బిగ్ క్యాట్ అలియెన్స్'' (ఐబీసీఏ) ప్రాజెక్టును ప్రారంభించారు. వచ్చే 25 ఏళ్లలో పులుల సంరక్షణకు చేపట్టబోయే చర్యలతో ''అమృత్ కాల్ కా టైగర్ విజన్'' బుక్‌లెట్‌ను విడుదల చేశారు. వన్యప్రాణుల సంరక్షణ ప్రపంచదేశాలు చేపట్టాల్సిన అతి ముఖ్యమైన అంశమని చెప్పారు. దేశంలో పులుల తాజా గణాంకాలను ఈ సందర్భంగా మోదీ వెల్లడించారు. 2022 నాటికి దేశంలో పెద్ద పులుల సంఖ్య 3,167కు పెరగడం హర్షణీయమన్నారు. ''పులుల సంరక్షణ ద్వారా భారత్ ప్రకృతి సమతుల్యత సాధించింది. ఇది ప్రపంచానికే గర్వకారణం. ఒకప్పుడు దేశంలో అంతరించిన జాబితాలో చేరిన చీతాలను నమీబియా, దక్షిణాఫ్రికా నుంచి తెచ్చాం. వాటి సంతతిని విజయవంతంగా పెంచుతున్నాం'' అని చెప్పారు. పులులు, సింహాలు, చిరుతపులులు, మంచు చిరుతలు, ప్యూమా, జాగ్వార్, చీతా వంటి వన్యప్రాణుల్ని సంరక్షించడానికే ఐబీసీఏ ప్రాజెక్టుకు తెర తీసినట్టు చెప్పారు.



'50 ఇయర్స్ ఆఫ్ టైగర్ ప్రాజెక్ట్' పుస్తకాన్ని విడుదల చేస్తున్న ప్రధాని



ఆదివారం బందీపూర్ టైగర్ రిజర్వ్‌లో పర్యటిస్తున్న మోదీ

- సాక్షి, నేషనల్ డెస్క్



చర్చిలో ప్రధాని ప్రార్థనలు

న్యూఢిల్లీ: ఈస్టర్ పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రధాని నరేంద్ర మోదీ ఆదివారం ఢిల్లీలోని సేక్రెడ్ హార్ట్ చర్చిని సందర్శించి ప్రార్థనలు నిర్వహించారు. బీజేపీ ఇటీవల క్రైస్తవ ఓట్లను ఆకర్షించే ప్రయత్నాలు చేస్తున్న నేపథ్యంలో ఈ ఘటన రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. గోవా, ఈశాన్య రాష్ట్రాల్లో బీజేపీ వరస విజయాలు సాధిస్తున్నందున ఆ వర్గాలను ఆకట్టుకోవడానికే ప్రధాని చర్చికి వెళ్లినట్టు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అంతకు ముందు క్రైస్తవ సోదరులకు మోదీ ఈస్టర్ శుభాకాంక్షలు తెలియజేశారు.

ప్రాంతీయ భాషల్లోనూ సీఆర్‌పీఎఫ్ పరీక్ష

అమిత్‌షాకు స్టాలిన్ లేఖ

చెన్నై: సెంట్రల్ రిజర్వు పోలీస్ ఫోర్స్ రిక్రూట్‌మెంట్‌లో కంప్యూటర్ టెస్ట్‌ను తమిళంలో నిర్వహించకపోవడాన్ని తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్ వ్యతిరేకించారు. హిందీ, ఇంగ్లిష్‌ల్లోనే నిర్వహించడం సరికాదన్నారు. ఈ మేరకు కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు ఆయన లేఖ రాశారు. ''పైగా 100 మార్కుల్లో హిందీ ప్రాథమిక పరిజ్ఞానానికి 25 మార్కులను కేటాయించడం వల్ల హిందీ మాట్లాడే అభ్యర్థులకే లబ్ధి కలిగింది. చర్య అభ్యర్థుల రాజ్యాంగ హక్కుకు భంగం కలిగించడమే. వీటిని నివారించేందుకు హిందీయేతర భాషలు మాట్లాడే వారి కోసం తమిళం సహా ప్రాంతీయ భాషల్లోనూ పరీక్ష చేపట్టేలా చర్యలు తీసుకోండి'' అని కోరారు.

హిమానీ నదాలు... శరవేగంగా కనుమరుగు...!

20 ఏళ్లలో 270 కోట్ల టన్నుల మేరకు క్షీణత ● హిమాలయాల పరిమాణంలో ఇది 6.5 శాతం

హిమాలయాల్లో హిమానీ నదులు శరవేగంగా కరిగిపోతున్నాయి. ఎంతగా అంటే, గత 20 ఏళ్లలో కరిగిపోయిన హిమానీ నదాల పరిమాణం ఏకంగా 57 కోట్ల ఏనుగుల బరువుతో సమానమట! అంటే హీనపక్షం 170 కోట్ల టన్నుల పై చిలుకే...! ఈ ప్రమాదకర పరిణామాన్ని పర్యావరణవేత్తలు, సైంటిస్టులు ఆలస్యంగా గుర్తించారు. ఈ ధోరణి ఇలాగే కొనసాగితే అతి తొందర్లోనే హిమాలయాల్లో పెను మార్పులు చూడాల్సి వస్తుందని వారు హెచ్చరిస్తున్నారు...

2000 నుంచి 2020 మధ్య కేవలం 20 సంవత్సరాల్లో హిమాలయాల్లో ప్రోగ్లేషియల్ సరస్సులు ఏకంగా 47 శాతం పెరిగాయి. సరస్సుల సంఖ్య పెరిగితే మంచిదే కదా అంటారా? కానే కాదు. ఎందుకంటే హిమానీ నదాలు కరిగిపోయి కనుమరుగయ్యే క్రమంలో ఏర్పడే సరస్సులివి! ఇవి ఎంతగా పెరిగితే హిమానీ నదాలు అంతగా కుంచించుకుపోతున్నట్టు అర్థం! ఈ పరిణామమంతా చాలావరకు భూమి పై పొరకు దిగువన జరుగుతుంది గనుక ఇంతకాలం పర్యావరణవేత్తల దృష్టి దీనిపై పడలేదు. కానీ ఈ సరస్సుల సంఖ్య బాగా పెరిగిపోతుండటంతో ఈ పరిణామం పై వాళ్లు ఇటీవలే దృష్టి సారించారు. హిమాలయాల్లో కరిగిపోతున్న హిమనీ నదాల పరిమాణాన్ని తొలిసారిగా లెక్కగట్టగా ఈ విస్మయకర వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి. బ్రిటన్‌లోని సెయింట్ ఆండ్రూస్, చైనీస్ అకాడమీ ఆఫ్ సైన్సెస్, ఆస్ట్రియాలోని గ్రాజ్ యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీ, కార్నిగీ మెలన్ వర్సిటీలకు చెందిన రీసెర్చర్ల బృందంలో ఇందులో పాల్గొంది. అధ్యయన ఫలితాలను నేచర్ జియోసైన్స్ జర్నల్‌లో ప్రచురించారు. ''హిమాలయాల వద్ద భూ ఫలకాలు అత్యంత చురుగ్గా ఉంటాయి. నిత్యం కదలికలకు లోనవుతూ ఉంటాయి. దాంతో హిమానీ నదాల ప్రవాహ మార్గాలు తరచూ మారిపోతున్నాయి'' అన్నారు.

- సాక్షి, నేషనల్ డెస్క్



హిమాలయాల్లో ఎవరెస్టు ప్రాంతంలో దాదాపుగా ఎండిపోయి కన్పిస్తున్న ఓ హిమానీ నదం

హిమాలయాల్లో 6.5 శాతం తగ్గిన మంచు

ఈ తాజా అధ్యయనం పలు ఆందోళనకర అంశాలను వెలుగులోకి తెచ్చింది. వాటిలో ప్రధానమైనవి...

- కనుమరుగవుతున్న హిమానీ నదాల రూపంలో గ్రేటర్ హిమాలయాలు ఇప్పటికే తమ మొత్తం మంచులో 6.5 శాతాన్ని కోల్పోయాయి.
- మధ్య హిమాలయాల్లో హిమానీ నదాల అంతర్ధానం చాలా వేగంగా కొనసాగుతోంది.
- గాలోంగ్ కో హిమానీ నదం ఇప్పటికే ఏకంగా 65 శాతం కనుమరుగైంది.
- హిమాలయాల్లో 2000–2020 మధ్య ప్రోగ్లేషియల్ సరస్సుల సంఖ్యలో 47 శాతం, విస్తీర్ణంలో 33 శాతం, పరిమాణంలో 42 శాతం చొప్పున పెరుగుదల నమోదైంది
- ఇందుకు కారణం హిమాలయాల్లోని హిమానీ నదుల పరిమాణం గత 20 ఏళ్లలో ఏకంగా 1.7 గిగాటన్నుల మేరకు తగ్గిపోవడమే. అంటే 1.7 లక్షల కోట్ల కిలోలన్నమాట! ఇది భూమిపై ఉన్న మొత్తం ఏనుగుల బరువుకు కనీసం 1,000 రెట్లు ఎక్కువ!!
- ఈ ధోరణి 21వ శతాబ్దం పొడవునా కొనసాగుతుందని పరిశోధకులు అంచనా వేశారు.
- ఫలితంగా హిమాలయాల్లోనే గాక ప్రపంచవ్యాప్తంగా అన్నిచోట్లా హిమానీ నదాలు ప్రస్తుతం భావిస్తున్న దానికంటే అతి వేగంగా కనుమరుగయ్యే ప్రమాదం పొంచి ఉందని వారు హెచ్చరిస్తున్నారు.

అదానీ గ్రూప్‌కు చైనాతో లింకులు

న్యూఢిల్లీ: అదానీ గ్రూప్‌పై కాంగ్రెస్ పార్టీ మరోసారి తీవ్ర ఆరోపణలు గుప్పించింది. అదానీ సంస్థలకు చైనాతో లింకులున్నాయని ఆరోపించింది. దేశంలోని పోర్టుల నిర్వహణను ఇప్పటికీ ఆ ఒక్క గ్రూపే ఎందుకు నిర్వహిస్తోందంటూ ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. మీడియా కథనాన్ని ఉటంకిస్తూ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ఆదివారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. చైనా సంస్థలు, అనుబంధ సంస్థలకు దేశంలోని పోర్టులు, టెర్మినళ్ల నిర్వహణ బాధ్యత అప్పగించరాదనేది ప్రభుత్వం విధానంగా వస్తోంది. అయితే, చైనాకు చెందిన చాంగ్‌చుంగ్-లింగ్‌తో సన్నిహిత సంబంధాలున్న అదానీ గ్రూప్‌కు పోర్టుల నిర్వహణను ఎందుకు అప్పగించారో తెలపాలని ప్రధాని మోదీని ప్రశ్నించారు. అదానీ కొడుకు వినోద్ సారథ్యంలోని పీఎంసీ ప్రాజెక్ట్స్, అదానీ గ్రూప్‌కు రూ.5,500 కోట్ల విద్యుత్ సామగ్రి కుంభకోణంతో సంబంధాలున్నట్లు డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటలిజెన్స్ ఆరోపిస్తున్న విషయం ఆయన గుర్తు చేశారు. చైనాకు సన్నిహిత దేశం ఉత్తరకొరియాకు దొంగచాటుగా పెట్రోలియం ఉత్పత్తులను విక్రయించే షాంఘైకు చెందిన కనీసం రెండు షిప్పింగ్ కంపెనీలు అదానీ గ్రూప్‌వేనని తెలిపారు. చైనాతో సంబంధాలున్నట్లు రుజువులున్నా దేశంలోని పోర్టుల నిర్వహణ బాధ్యతల్లో అదానీ గ్రూప్‌ను ఇప్పటికీ ఎందుకు కొనసాగిస్తున్నారని ప్రభుత్వాన్ని రమేశ్ నిలదీశారు. ఇవన్నీ దేశ భద్రతకు ప్రమాదకరం కావా అని ప్రశ్నించారు. అదానీ గ్రూప్‌పై హిండెన్‌బర్గ్ నివేదిక నేపథ్యంలో అవకతవకలపై నిగ్గు తేల్చేందుకు జేపీసీ వేయాలని కాంగ్రెస్ పార్టీ కేంద్రాన్ని గట్టిగా డిమాండ్ చేస్తున్న విషయం తెలిసిందే.

అయోధ్యలో శివసైనికుల సందడి

అయోధ్య: మహారాష్ట్ర సీఎం ఏక్‌నాథ్ షిండే, ఉపముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌లతోపాటు సుమారు 3 వేల మంది శివసైనికుల రాకతో ఆదివారం అయోధ్య సందడిగా మారింది. సీఎం షిండే, డిప్యూటీ సీఎం ఫడ్నవీస్ భవ్య రామాలయాన్ని దర్శించుకున్నారు. రామ్‌లల్లా మందిరంలో పూజలు చేశారు. సాయంత్రం సరయూ నది ఒడ్డున మహా హారతిలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అయోధ్యలో శివసేన చీలికవర్గం నేత, ముఖ్యమంత్రి షిండే మీడియాతో మాట్లాడారు. సిద్ధాంతపరంగా తమ పార్టీ, బీజేపీ ఒక్కటేనని ఆయన చెప్పారు. 2024 ఎన్నికల్లో మహారాష్ట్ర అంతటా కాషాయ జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. 'శివసేన, బీజేపీకి రామమందిరం, అయోధ్య అనేవి రాజకీయ అంశాలు కావు. అవి నమ్మిక, విశ్వాసానికి సంబంధించినవి. నేను అయోధ్యకు రావడం హిందుత్వ అంటే గిట్టని కొందరికి ఇబ్బంది కలిగిస్తుంది. ఇటువంటి వారు కావాలనే హిందుత్వను అవమానిస్తూ, హిందుత్వ పట్ల అయోమయాన్ని సృష్టించేందుకు గతంలో ప్రయత్నించారు. ఇప్పుడూ ప్రయత్నిస్తున్నారు. ఎందుకంటే, హిందుత్వ భావన దేశంలోని ప్రతి హృదయానికి, ప్రతి ఇంటికీ చేరిన నాడు వీరు తమ దుకాణం మూసుకోవాల్సి ఉంటుంది. ఆ భయంతోనే వీరు తమ ప్రయత్నాలను కొనసాగిస్తున్నారు' అంటూ ఎవరి పేరునూ ప్రస్తావించకుండా ఆయన వ్యాఖ్యలు చేశారు. అయోధ్యలో భవ్య రామాలయం కోసం బాల్ ఠాక్రే కన్న కలను ప్రధాని మోదీ సాకారం చేశారన్నారు. కాగా, వచ్చే ఏడాది లోక్‌సభతోపాటే మహారాష్ట్ర అసెంబ్లీకి ఎన్నికలు జరగనున్నాయి.

సీఎం గహ్లోత్‌పై మరోసారి పైలట్ ఫైట్

జైపూర్: రాజస్తాన్ సీఎం అశోక్ గహ్లోత్‌తో మాజీ డిప్యూటీ సీఎం సచిన్ పైలట్ అమీతుమీకి మరోసారి సిద్ధమయ్యారు. రాష్ట్రంలో బీజేపీ హయాంలో జరిగిన అక్రమాలపై చర్యలు తీసుకోవాలని ఆదివారం డిమాండ్ చేశారు. ఇందుకోసం తాను ఒక్కరోజు నిరశన దీక్ష చేస్తానన్నారు. ''వసుంధరా రాజే ప్రభుత్వ హయాంలో జరిగిన రూ.45 వేల కోట్ల గనుల కుంభకోణంపై దర్యాప్తు చేయిస్తామని ప్రతిపక్షంలో ఉండగా గహ్లోత్ హామీ ఇచ్చారు. కానీ ఇప్పటికీ చర్యలు తీసుకోలేదు. బీజేపీతో ప్రభుత్వం కుమ్మక్కైందనే విమర్శలు వస్తున్నాయి'' అన్నారు. ఈ ఏడాది చివర్లో జరగనున్న ఎన్నికల్లోగా విభేదాలను పరిష్కరించే దిశగా పార్టీ కేంద్ర నాయకత్వంపై ఒత్తిడి పెంచడమే పైలట్ ఉద్దేశంగా భావిస్తున్నారు. 2018లో రాజస్తాన్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి గహ్లోత్, పైలట్ వర్గాల మధ్య తీవ్ర విభేదాలు కొనసాగుతున్నాయి. పైలట్ తాజా డిమాండ్‌పై కాంగ్రెస్ వర్గాలు భిన్న స్వరాలు వినిపిస్తున్నాయి. కొందరు పైలట్‌ను సమర్థిస్తుండగా, పార్టీకి హాని చేకూరుస్తుందని మరికొందరు పెదవి విరుస్తున్నారు.

మొసలి నుంచి తప్పించుకున్నాడు!

కూక్‌టౌన్(ఆస్ట్రేలియా): మొసలి పలుమార్లు దాడి చేసి, నోట కరుచుకుని నీటి అడుగుకు లాక్కెళ్లిన తర్వాత కూడా ఓ వ్యక్తి చాకచక్యంగా వ్యవహరించి, ప్రాణాలతో బయటపడ్డాడు. ఒళ్లు గగుర్పొడిచే ఈ ఘటన శనివారం ఆస్ట్రేలియాలోని క్వీన్స్‌లాండ్ రాష్ట్రం కూక్‌టౌన్‌లో చోటుచేసుకుంది. నలభయ్యేళ్ల ఓ వ్యక్తి సముద్రంలో చేపలు పట్టేందుకు వెళ్లాడు. ఈ క్రమంలో నాలుగున్నర మీటర్ల పొడవుండే ఓ మొసలి అతడి వైపుగా వచ్చింది. ప్రమాదాన్ని పసిగట్టి తప్పించుకునేందుకు యత్నించాడు. తన వద్ద ఉన్న స్పియర్ గన్‌ను పేల్చేందుకు ప్రయత్నించాడు. మొసలి అతడిపై మూడుసార్లు దాడి చేసి తల, భుజాలు, కాళ్లను గాయపరిచి, నోట కరుచుకుని నీటి అడుగుకు లాక్కెళ్లింది. ధైర్యం కోల్పోని ఆ వ్యక్తి తన చేతి వేళ్లతో మొసలి కళ్లలోకి బలంగా గుచ్చాడు. బాధతో అది పట్టు సడలించడంతో సురక్షితంగా బయటపడ్డాడు. గాయాలపాలైన అతడిని అంబులెన్సులో ఆస్పత్రికి తరలించారు.



ఇది అలాంటిలాంటి చేప కాదు. జపాన్‌కు చెందిన సైంటిస్టుల బృందం దీన్ని సముద్రంలో ఏకంగా 8,336 మీటర్ల లోతులో కెమెరాలో బంధించింది. ఇంత లోతులో ఉండే చేపను ఫొటో తీయడం ఇదే తొలిసారట! ఇందుకోసం ఆ బృందం రెండు నెలల పాటు కష్టపడాల్సి వచ్చిందట.



స్లమ్‌డాగ్ మిలియనీర్స్...!

న్యూయార్క్: ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వచ్చాక ఒక్కొక్కరు ఒక్కో రకంగా తమలోని సృజనాత్మకను బయటకి తీస్తున్నారు. మిడ్ జర్నీ అనే కృత్రిమ మేధను వినియోగించి గోకుల్ పిళ్లై అనే ఆర్టిస్టు కోటీశ్వరుల్ని నిరుపేదలుగా మార్చేస్తున్నారు. కుబేరుల్ని మురికివాడల్లోకి తెస్తున్నారు. బిల్ గేట్స్, డొనాల్డ్ ట్రంప్, మార్క్ జుకర్‌బర్గ్, ఎలన్ మస్క్ వంటి బిలియనీర్స్ సరైన బట్టలు కూడా లేకుండా మురికి మురికిగా ఆ ఫొటోల్లో దర్శనమిస్తున్నారు. ఈ ఫొటోలను గోకుల్ పిళ్లై ఆన్‌లైన్‌లో షేర్ చేస్తూ 'స్లమ్ డాగ్ మిలియనీర్స్' అని క్యాప్షన్ ఇవ్వడంతో సోషల్ మీడియాలో అవి వైరల్‌గా మారాయి!

గ్రహాంతరవాసుల వాహనమా?

రోమ్: ఎరుపు రంగులో వలయాకృతిలో కన్పిస్తున్న ఈ దృశ్యం ఇటలీలో ఇటీవల కలకలం రేపింది. విస్తుగొలిపే ఈ వింత వలయం సెంట్రల్ ఇటలీలో ఆల్ప్స్ పర్వతాల నుంచి అడ్రియాటిక్ సముద్రం దాకా ఆకాశంలో ఏకంగా 360 కిలోమీటర్ల పొడవున విస్తరించి కనువిందు చేసింది. అచ్చం హాలీవుడ్ సైన్స్ ఫిక్షన్ సినిమా దృశ్యాన్ని తలపించిన ఈ వలయం గ్రహాంతరవాసుల అంతరిక్ష వాహనం అయ్యుండొచ్చని కొందరు భావించారు. సైంటిస్టులు మాత్రం అదేమీ కాదని స్పష్టం చేశారు. కాంతి ఉద్గార క్రమంలో అతి తక్కువ ఫ్రీక్వెన్సీతో కూడిన అడ్డంకులు ఇందుకు కారణమని వారు వివరించారు. ఎల్వ్‌గా పిలిచే ఈ దృగ్విషయం ఒక్కోసారి ఇలాంటి విచిత్రాకారపు వెలుతురు వలయాలకు దారి తీస్తుందని చెప్పుకొచ్చారు. ఈ ఎల్వ్‌లు తుపాను మేఘాలకు పై భాగాల్లో విడుదలయ్యే అత్యంత హెచ్చు విద్యుదయస్కాంత శక్తి వల్ల పుట్టుకొస్తుంటాయట. ఫొటోలోని ఎరుపు వలయం పుట్టుకకు సెంట్రల్ ఇటలీకి దాదాపు 285 కిలోమీటర్లు దక్షిణాన చెలరేగిన తుపాను సందర్భంగా చోటుచేసుకున్న శక్తిమంతమైన మెరుపు కారణమని వారు చెప్పారు. ప్రఖ్యాత ఫొటోగ్రాఫర్ వాల్తెయిర్ బినొటో దీన్ని కెమెరాలో బంధించారు. ఆకాశంలో ఇలాంటి ఆకృతులను ఆయన తొలిసారిగా 2017లో ఫొటో తీశారట. అప్పటి నుంచీ ఇదే పనిలో ఉన్నట్టు చెబుతున్నారాయన.



సాక్షి కరీంనగర్

సోమవారం । 10 । ఏప్రిల్ । 2023



రాజన్న నమోస్తుతి

వేములవాడ: రాజన్నను ఆదివారం 30 వేల మంది దర్శించుకున్నారు. ధర్మగుండంలో స్నానాలు చేసి రాజన్నకు కోడెమొక్కులు చెల్లించుకున్నారు.



భక్తుల పుణ్య స్నానాలు

ధర్మపురి: ధర్మపురి పుణ్యక్షేత్రంలోని పవిత్ర గోదావరిలో ఆదివారం భక్తులు పుణ్య స్నానాలు ఆచరించారు. గంగమ్మ గౌరమ్మకు మొక్కులు చెల్లించారు.

గరిష్టం/కనిష్టం
37.0/24.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. పగటిపూట ఉక్కపోతగా ఉంటుంది. ఎండ తీవ్రత పెరుగుతుంది.

పొరుగువాడు ఆకలితో బాధపడుతుంటే తాను కడుపునిండా భుజించే వ్యక్తి విశ్వాసి కాజాలడు.

– మహమ్మద్ ప్రవక్త

ఇఫ్తార్	సహర్
సోమ 6:34	మంగళ 4:37

రంజాన్ వేళలు

విద్యుత్ సమస్యలకు 'దత్తత'

కరెంటు సమస్యలపై ప్రత్యేక సర్వే పూర్తి

- జిల్లాలో 38 గ్రామాలు.. కరీంనగర్‌లో 11ప్రాంతాలు గుర్తింపు
- తొలుత ఆర్థికేతర పనులు
- తదుపరి ఆర్థికపరమైన పనుల నిర్వహణకు కసరత్తు



దత్తత గ్రామాలు: 38
కరీంనగర్‌లోని ప్రాంతాలు: 11
గుర్తించిన లూజ్ వైర్లు: 83(11కె.వీ.), 324 (ఎల్‌టీ)
వంగిన స్తంభాలు: 53(11కె.వీ.), 105 (ఎల్‌టీ)
అవసరమైన మధ్య స్తంభాలు: 435(11కె.వీ.), 863(ఎల్‌టీ)
గుర్తించిన ఇనుప స్తంభాలు: 123(11కె.వీ.), 362(ఎల్‌టీ)
రోడ్ క్రాసింగ్ లైన్లు: 72(11కె.వీ.), 123(ఎల్‌టీ)
చెట్లపై గల విద్యుత్ లైన్లు: 287(11కె.వీ.), 310(ఎల్‌టీ)
సపోర్టింగ్ స్తంభాలు: 80(11కె.వీ.), 318(ఎల్‌టీ)
ట్రాన్స్‌ఫార్మర్ల గద్దెలు: 56
ఏబీ స్విచ్చులు: 61
హెచ్‌జీ/ఎల్‌టీ ఫ్యూజులు: 248
ఏజీఎల్ కెపాసిటర్లు: 367

కొత్తపల్లి(కరీంనగర్): వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసే దిశగా అధికారులు ఫోకస్ పెట్టారు. గ్రామాలను దత్తత తీసుకొని విద్యుత్ సమస్యలకు చెక్ పెట్టాలని నిర్ణయించారు. గతంలో 'పవర్ వీక్' తరహాలో విద్యుత్ సమస్యల పరిష్కారమే ప్రధాన ఎజెండగా గ్రామాలు, కరీంనగర్‌లోని పలు ప్రాంతాలు ఎంపిక చేసుకొని సిబ్బందితో సర్వే చేశారు. విద్యుత్ సమస్యలను గుర్తించి కార్యాచరణ రూపొందించారు. తొలుత ఆర్థికేతర విద్యుత్ సమస్యలు పరిష్కరించి.. ఆర్థికపరమైన అనుమతులు లభించాక మిగిలిన విద్యుత్ పనులు చేపట్టాలని నిర్ణయించారు.

గ్రామం ప్రాతిపదికన అధికారుల దత్తత

- టీఎస్ఎన్‌పీడీసీఎల్ కరీంనగర్ సర్కిల్ పరిధిలోని హుజూరాబాద్, కరీంనగర్, కరీంనగర్ రూరల్ పరిధిలోని 38 గ్రామాలు, కరీంనగర్‌లోని 11 ప్రాంతాలను డీఈలు, ఏడీఈలు, ఏఈలు దత్తత తీసుకున్నారు. వారు దత్తత తీసుకున్న గ్రామాలు/ప్రాంతాల్లోని సమస్యలను పరిష్కరించి విద్యుత్ సంస్థకు నివేదించాల్సి ఉంది.
- తొలుత ఆర్థికపరమైన అంశంలేని విద్యుత్ సమస్యలను సిబ్బందితో పూర్తి చేయించేలా కసరత్తు చేస్తున్నారు. ఆర్థికపరమైన విద్యుత్ సమస్యలపై ప్రతిపాదనలు సిద్ధం చేసిన అధికారులు పరిపాలన అనుమతుల కోసం నివేదించారు.
- విద్యుత్ సంస్థ నుంచి పరిపాలన అనుమతులు రాగానే ఆ పనులను సైతం చేపట్టి గ్రామాలు/ప్రాంతాల్లో విద్యుత్ సమస్యలు లేకుండా చేయాలని విద్యుత్ అధికారులు నిర్ణయించారు.
- ఈ నెలాఖరులోగా విద్యుత్ సమస్యలన్నీ పూర్తి చేయాలనే కార్యాచరణపై అధికారులు దృష్టి సారించారు. వేసవిలో ఎలాంటి లో ఓల్టేజీ, లూజు వైర్ల సమస్యలు, బ్రేక్‌డౌన్లు కాకుండా విద్యుత్ పనులపై ఫోకస్ పెట్టారు.
- హుజూరాబాద్, కరీంనగర్, కరీంనగర్ రూరల్ పరిధిలోని 38 గ్రామాలు, కరీంనగర్‌లోని 11 ప్రాంతాల్లో సర్వే నిర్వహించి హుజూరాబాద్ డివిజన్‌లో 15 గ్రామాలు, కరీంనగర్ రూరల్‌లో 07 గ్రామాలు, కరీంనగర్ డివిజన్‌లో 16 గ్రామాలు, కరీంనగర్ టౌన్1, 2లో 11 ప్రాంతాలను అధికారులు దత్తత తీసుకున్నారు.

38 గ్రామాలు.. 11 ప్రాంతాలు

కరీంనగర్ సర్కిల్‌పరిధిలో 38 గ్రామాలు.. కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలోని 11ప్రాంతాల్లో సర్వే నిర్వహించిన విద్యుత్ అధికారులు అక్కడ నెలకొన్న విద్యుత్ సమస్యలను గుర్తించి ఫొటోలు తీసి విద్యుత్‌సంస్థకు అప్‌లోడ్ చేశారు. సమస్యకు ముందు.. సమస్య పరిష్కారం అనంతరం ఫొటోలు తీసి ఉన్నతాధికారులకు నివేదిస్తున్నారు. టీఎస్ఎన్‌పీడీసీఎల్ కరీంనగర్ సర్కిల్ పరిధిలోని హుజూరాబాద్, కరీంనగర్, కరీంనగర్ రూరల్ డివిజన్ల పరిధిలోని గ్రామాలు/ప్రాంతాల్లో 11కె.వీ, ఎల్‌టీ లూజు వైర్లు.. వేలాడుతున్న వైర్లు..తుప్పు పట్టిన స్తంభాలు..మధ్య స్తంభాలు..రోడ్డు క్రాసింగ్ వైర్లు.. చెట్లను తాకుతున్న వైర్లు.. సపోర్టింగ్ స్తంభాలు..ట్రాన్స్‌ఫార్మర్ గద్దెలు..ట్రాన్స్‌ఫార్మర్ ఆన్/ఆఫ్ (ఏబీ) స్విచ్చులు.. పాడయిన హెచ్‌జీ/ఎల్‌టీ ఫ్యూజులు .. ఎర్తింగ్ పైపులు/వైర్లు.. ఏజీఎల్ కెపాసిటర్లు వంటి విద్యుత్ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించారు. ఈ పనులు పూర్తయితే విద్యుత్ ఆదాతో పాటు ప్రమాదాలకు చెక్ పెట్టి నాణ్యమైన విద్యుత్ సరఫరా అవుతుందని అధికారులు భావిస్తున్నారు.

సమస్యలకు పరిష్కారం



సర్కిల్ పరిధిలోని 38 గ్రామాలు, నగరంలోని 11 ప్రాంతాల్లో విద్యుత్ సమస్యలను గుర్తించి వాటిని ఒక్కో అధికారికి దత్తతగా కేటాయించాం. తొలుత ఆర్థికేతర పనులు చేపడుతున్నాం.పనులన్నీ ఈ నెలాఖరుగా పూర్తి చేయాలని నిర్ణయించాం. విద్యుత్ సమస్యలన్నింటికి చెక్ పెట్టి వేసవిలో నాణ్యమైన విద్యుత్ అందించాలనే ఉద్దేశంతో విద్యుత్ సిబ్బంది పనిచేస్తోంది. వినియోగదారులు సహకరించాలి.

– వడ్లకొండ గంగాధర్, ఎస్ఈ, కరీంనగర్

కేబుల్ బ్రిడ్జి పనులు త్వరగా పూర్తిచేయాలి

- రేపు జ్యోతిబాపూలే జయంతి
- కలెక్టర్ ఆర్వీ.కర్ణన్



పనులు పరిశీలిస్తున్న కలెక్టర్ ఆర్వీ.కర్ణన్

కరీంనగర్: కేబుల్ బ్రిడ్జి అప్రోచ్ పనులు త్వరితగతంగా పూర్తిచేయాలని కలెక్టర్ ఆర్వీ.కర్ణన్ అధికారులను ఆదేశించారు. ఆదివారం కేబుల్ బ్రిడ్జి అప్రోచ్ రోడ్డు పనులను పరిశీలించారు. నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని తెలిపారు. డైనమిక్ లైటింగ్, కేబుల్ బ్రిడ్జి అప్రోచ్ రోడ్డు నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని అన్నారు. కచ్చితమైన నాణ్యత ప్రమాణాలను పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఈఈ ఆర్అండ్‌బీ సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

రేపు మహాత్మా జ్యోతిబాపూలే జయంతి

జిల్లాకేంద్రంలో మహాత్మా జ్యోతిబాపూలే జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఆర్వీ.కర్ణన్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు మహాత్మాజ్యోతిబా పూలే 197వ జయంతి వేడుకలు ఈనెల11న ఉదయం 10గంటలకు శాతవాహనయూనివర్సిటీ చౌరస్తా, విజయపురికాలనీ మల్కాపూర్ రోడ్ మహాత్మా జ్యోతిబాపూలే విగ్రహం వద్ద నిర్వహించబడునని తెలిపారు. జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ కుల సంఘాల ప్రతినిధులు, జిల్లా ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని పేర్కొన్నారు.

న్యూస్‌రీల్

'పది' గణిత పరీక్షలోని కఠిన ప్రశ్నలకు మార్కులు కలపాలి



మాట్లాడుతున్న శ్రీనివాస్

కరీంనగర్: పదోతరగతి గణితపరీక్షలో కొన్ని ప్రశ్నలు ఇంటర్‌స్థాయిలో ఉన్నాయని, ఆ కఠిన ప్రశ్నలకు ప్రస్తుతం పదోతరగతి చదువుతున్న విద్యార్థులు ఎవరూ సమాధానం రాయలేరని, వాటికి సంబంధించిన మార్కులు విద్యార్థులందరికీ కలపాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోనె శ్రీనివాస్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం సంఘ కార్యాలయంలో మాట్లాడుతూ.. ఉపాధ్యాయబదిలీలు, పదోన్నతులకు సంబంధించిన కోర్టుకేసును ప్రభుత్వం తగుచర్యలు తీసుకొని వెంటనే పరిష్కారం అయ్యేలా చూడాలన్నారు. కమలాపూర్ పేపర్ లీకేజీ కేసులో సర్వీస్ నుంచి తొలగించబడిన ఉపాధ్యాయురాలు సబియా మహదత్ సర్వీస్ రిమూవల్ ఉత్తర్వులను ఉపసంహరించాలన్నారు. ఈనెల 13 నుంచి నిర్వహించే పదోతరగతి స్పాట్ వాల్యుయేషన్ విధుల నుంచి 58 సంవత్సరాలు పై బడిన వారికి మినహాయింపు ఇవ్వాలన్నారు. స్పాట్ వాల్యుయేషన్‌లో ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్న వారికి స్పెషల్ అసిస్టెంట్ విధులు కేటాయించవద్దన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి పబ్బెపాటి వేణుగోపాల్‌రావు, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు పాతూరి రాజిరెడ్డి, కేతిరి తిరుపతిరెడ్డి, జయేందర్‌రెడ్డి, అట్ల శ్రీనివాస్‌రెడ్డి, మాడ శ్రీనివాస్‌రెడ్డి, పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు బొల్లేటి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పులిపాక కిషన్, రాంరెడ్డి, భూపతి పాల్గొన్నారు.

మేడే వేడుకలు ఘనంగా నిర్వహించాలి



అభివాదం చేస్తున్న కార్మిక నాయకులు

కరీంనగర్: మేడే వేడుకలు ఘనంగా జరుపుకునేందుకు కార్మికవర్గం సిద్ధం కావాలని బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి, కార్మిక విభాగం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు ఎల్.రూప్‌సింగ్ పిలుపునిచ్చారు. ఆదివారం బీఆర్ఎస్ అనుబంధ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు బొమ్మిడి శ్రీనివాస్ అధ్యక్షతన భగత్‌నగర్‌లోని మాజీ ఎంపీ వినోద్‌కుమార్ కార్యాలయంలో మేడే సన్నాహక సమావేశం నిర్వహించారు. వివిధ రంగాల జిల్లా అధ్యక్షులు,నియోజక వర్గాల ఇన్‌చార్జిలు, మండల అధ్యక్షులతో కలిసి మాట్లాడుతూ.. బీఆర్‌టీయూ కార్మికజెండాలను మేడే రోజున ఎగురవేయాలని పిలుపునిచ్చారు. ఆర్పీల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు మానుకోట సునీత, మధ్యాహ్న భోజన వంట కార్మికుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దాసరి బాబాయ్, రాఘవులు, ఆకుల మల్లేశం, బుర్ర మంజుల, శ్రీనివాస్, సంపత్, శంకర్, సంపత్, శ్రీదేవి, స్వరూప, యాదగిరి, రాములు పాల్గొన్నారు.

సమస్యలతో సతమతం అవుతున్న నగర ప్రజలు



పాదయాత్రలో కాంగ్రెస్ నగర నాయకులు

కరీంనగర్‌టౌన్: నగరం నడిబొడ్డున కూడా ప్రజలు సమస్యలతో సతమతమవుతున్నారని కాంగ్రెస్ నగర అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు. హాత్ సే హాత్ జోడో పాదయాత్రలో భాగంగా వావిలాలపల్లిలో ఇంటింటికి తిరుగుతూ సమస్యలు తెలుసుకున్నారు. నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ... అధికార బీఆర్ఎస్ పార్టీ నాయకులు ప్రజల సమస్యలు పరిష్కరించడంలో విఫలమయ్యారని పేర్కొన్నారు. గుండాటి శ్రీనివాస్‌రెడ్డి, యనమల మంజుల, లింగంపల్లి బాబు, కుర్ర పోచయ్య, దండి రవీందర్, జీడీ రమేశ్, కుమ్మరి ఆంజనేయులు, తదితరులు ఉన్నారు.

నో.. ప్రాక్టికల్స్!

- ప్రయోగాలు నిర్వహించని డిగ్రీ, పీజీ కళాశాలలు
- విద్యార్థులకు ప్రాక్టికల్ పరిజ్ఞానం కరువు
- ఉద్యోగసాధనలో విఫలమవుతున్న యువత
- ల్యాబ్‌ల నిర్వహణపై దృష్టిపెట్టని యాజమాన్యాలు
- కొన్ని కళాశాలలకు ల్యాబ్స్ లేకున్నా అనుమతులు



ప్రాక్టికల్స్ చేస్తున్న విద్యార్థులు

శాతవాహనయూనివర్సిటీ(కరీంనగర్): శాతవాహన యూనివర్సిటీవ్యాప్తంగా పలు డిగ్రీ, పీజీ కళాశాలలు ప్రాక్టికల్స్ నిర్వహించడం మానేశాయి. బోధన తరగతులు మాత్రమే చెప్పి వదిలేస్తుండడంతో విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారు. ప్రాక్టికల్స్ లేకుండా మార్కులు వేస్తూ నేరుగా పరీక్షలు రాయిస్తూ కోర్సులు పూర్తి చేస్తుండడంతో విద్యార్థుల్లో ప్రయోగాత్మక పరిజ్ఞానం కరువవుతోంది. తద్వారా ఉద్యోగ సాధనలో విఫమవుతున్నారని విద్యారంగ నిపుణులు హెచ్చరిస్తున్నారు. సైన్స్‌గ్రూపుల విద్యార్థులకు ముఖ్యంగా ప్రాక్టికల్స్‌తోనే లోతైన పరిజ్ఞానం వస్తుంది. ప్రయోగ తరగతులు నిర్వహిస్తేనే పరిపూర్ణమైన జ్ఞానం కలుగుతుందని విద్యారంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

పట్టించుకోని విద్యార్థులు

శాతవాహన యూనివర్సిటీవ్యాప్తంగా 104 డిగ్రీ కళాశాలలు ఉన్నాయి. డిగ్రీ విద్యార్థులు 72 వేల మంది, పీజీ విద్యార్థులు 3వేలమంది వరకు చదువుతున్నారు. ఇందులో చాలా కళాశాలల్లో ప్రాక్టికల్స్ నిర్వహణ మరిచిపోయారని ఆరోపణలున్నాయి. పలు కళాశాలల యాజమాన్యాలు ప్రాక్టికల్స్ నిర్వహించకపోగా.. నిలదీయాల్సిన విద్యార్థులు, నేరుగా మార్కులు వేస్తున్నారని సంబరపడిపోతున్నారని తెలుస్తోంది. ప్రాక్టికల్స్ నిర్వహణ లేకుంటే కళాశాలలకు పెద్దఎత్తున ఖర్చులు మిగులుతాయి. ఇదే కాకుండా ప్రయోగాలు చేపించే టీచర్లు కూడా అవసరం లేదు. ఈ విషయం కళాశాలకు లాభాలను తెచ్చిపెట్టినా విద్యార్థులు మాత్రం తాము నష్టపోతున్నామని గుర్తించలేకపోవడం గమనార్హం. ప్రయోగశాలలు ఉండి కూడా చాలా కళాశాలల్లో నిర్వహించడం లేదు. మరికొన్ని కళాశాలల్లో అసలు ల్యాబ్‌లు లేకుండానే కోర్సులు నిర్వహిస్తున్నారు. దీంతో విద్యార్థులు ప్రయోగాత్మక పరిజ్ఞానానికి దూరం అవుతున్నారు.

కొన్ని కళాశాలల్లో ప్రయోగాలకు పెద్దపీట

శాతవాహన యూనివర్సిటీ పరిధిలోని ప్రభుత్వ కళాశాలల్లో రెగ్యులర్‌గా ప్రాక్టికల్స్ జరుగుతున్నాయని విద్యార్థులు చెబుతున్నారు. కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల, సిరిసిల్లలలోని కొన్ని ప్రయివేటు కళాశాలలు మాత్రం ప్రయోగాలకు పెద్దపీట వేసి విద్యార్థులకు ప్రాక్టికల్స్ చేపించి లోతుగా నేర్పిస్తున్నారు. ప్రయోగాలు చేస్తేనే విద్యార్థులకు ఉజ్వలమైన భవిష్యత్తు ఉంటుందని ఖచ్చితంగా ప్రాక్టికల్ సబ్జెక్టులున్న విద్యార్థులకు ప్రాక్టికల్స్ చేపించాలని విద్యారంగ నిపుణులు సూచిస్తున్నారు.

అలాంటి వారిపై చర్యలు తప్పవు



విద్యార్థులకు ప్రాక్టికల్స్ నిర్వహిస్తేనే వారికి లోతైన పరిజ్ఞానంతో పాటు సబ్జెక్టులపై పట్టు వస్తుంది. కళాశాలలకు అనుమతి ఇచ్చేముందు తనిఖీ నిర్వహించి అనుబంధ గుర్తింపు ఇస్తున్నాం. కళాశాలలు ప్రాక్టికల్స్ నిర్వహించడం లేదని మా దృష్టికి వస్తే తప్పకుండా చర్యలు తీసుకుంటాం.

– ప్రొఫెసర్ ఎస్.మల్లేశ్, శాతవాహన వీసీ

అన్నివర్గాల అభివృద్ధే లక్ష్యం

- రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి గంగుల కమలాకర్



మాట్లాడుతున్న మంత్రి గంగుల కమలాకర్

కరీంనగర్: రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తోందని, ప్రజలు పండుగలను సంతోషంగా జరుపుకోవాలని రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. రంజాన్ పండుగ నేపథ్యంలో హుస్సేన్‌పురలో షేక్ యూసుఫ్ ఆధ్వర్యంలో పేద ముస్లింల కుటుంబాలకు రంజాన్ కిట్ల పంపిణీలో మంత్రి పాల్గొన్నారు. ప్రభుత్వం ముస్లింలకు అనేక సంక్షేమ పథకాలతో పాటువాటి అమలులోనూ ప్రత్యేక చొరవ తీసుకుంటుందని అన్నారు. మేయర్ యాదగిరి సునీల్ రావు, కో–ఆప్షన్ సభ్యులు సయ్యద్ అంజద్ అలీ, మైనార్టీ నగర అధ్యక్షుడు మీర్ షౌకత్ అలీ, వాజీద్ పాల్గొన్నారు.

ప్రైవేట్ విద్యాసంస్థలకు సంపూర్ణ మద్దతు

ప్రైవేట్ విద్యాసంస్థలకు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాలశాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. ట్రస్మా ఆధ్వర్యంలో జిల్లాకేంద్రంలోని రంగినేని కల్యాణమండపంలో ఆదివారం నిర్వహించిన అవార్డుల ప్రధానోత్సవానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యాలయాలను దేవాలయాలుగా భావించేది ఉపాధ్యాయులేనని అన్నారు. ప్రభుత్వం కరోనా కరువు సమయంలో ఉపాధ్యాయులకు అండగా నిలిచి ఆదుకున్నామని గుర్తుచేశారు. చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి శేఖర్‌రావు, కర్రె సంజీవరెడ్డి, ప్రసాద్ రావు, శ్రీపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కేన్సర్ రహిత సమాజం కోసం కృషి చేయాలి

కరీంనగర్‌టౌన్: కేన్సర్ రహిత సమాజం కోసం ప్రతీఒక్కరు కృషి చేయాలని బీసీ సంక్షేమ, పౌరసరఫరాలశాఖ మంత్రి గంగుల కమలాకర్ పేర్కొన్నారు. ఆదివారం శ్వేతా హోటల్‌లో గౌతమి ఫౌండేషన్ నిర్వాహకులు డాక్టర్ గౌతమి–రోహిత్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆరంభ్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కేన్సర్ రహిత సమాజం కోసం గౌతమి ఫౌండేషన్ కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయం అన్నారు. రామడుగు మండలం కొక్కెరకుంట గ్రామాన్ని దత్తత తీసుకొని 2ఎకరాల్లో సేంద్రీయ వ్యవసాయం చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారని అభినందించారు. మేయర్ సునీల్ రావు, జెడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ, డాక్టర్ రామ్‌కిరణ్ పొలాస, బోనాల శ్రీకాంత్, తోటరాములు, మిడిదొడ్డి నవీన్, ఏ.కిరణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

నగరాన్ని అద్భుతంగా తీర్చిదిద్దుతాం

కరీంనగర్‌సిటీ: కరీంనగర్ నగరాన్ని మరింత అభివృద్ధి చేస్తామని మంత్రి గంగుల కమలాకర్ పేర్కొన్నారు. ఆదివారం 14,59వ డివిజన్లలో పలు అభివృద్ధి పనులను మేయర్ యాదగిరి సునీల్‌రావుతో కలసి ప్రారంభించారు. 59వ డివిజన్‌లో రూ.10లక్షలతో సీసీరోడ్డు, వెంకటేశ్వర ఆలయతోరణం , 14వ డివిజన్‌లో రూ.19లక్షలతో సీసీరోడ్డు, రూ.10లక్షలతో రెడ్డిసంఘ భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. వచ్చేనెలలో టీటీడీ సహకారంతో శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణపనులు ప్రారంభిస్తామని పేర్కొన్నారు. కార్పొరేటర్లు దిండిగాల మహేశ్, గందె మాధవి, బోనాల శ్రీకాంత్, రాజేందర్‌రావు, ఐలందర్‌యాదవ్, రెడ్డిసంక్షేమ సంఘం శ్రీనగర్, సప్తగిరికాలనీ అధ్యక్షుడు చెన్నాడిరాజేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.



ఈస్టర్ వేడుకల్లో ప్రార్థన చేస్తున్న క్రైస్తవులు

ఘనంగా ఈస్టర్

కరీంనగర్‌కల్చరల్: ఈస్టర్ పండుగను ఆదివారం జిల్లావ్యాప్తంగా క్రిస్టియన్లు ఘనంగా జరుపుకున్నారు. కరీంనగర్‌లోని సీఎస్ఐ వెస్లీ కేథిడ్రల్ చర్చిలో ఉదయం ఐదు గంటలకు సన్‌రైజ్ ఆరాధనలో పాల్గొని ఏసుక్రీస్తు పునరుధున పండుగను ఆచరించారు. ప్రెసిబిటర్ చైర్మన్ జి.శ్రీనివాస్‌నాయక్ ప్రార్థన చేయించారు. జి.నిరంజన్ నిశ్చల్ దైవవాక్యం అందించి ప్రసంగించారు. ఏసుక్రీస్తు ఈస్టర్ పండుగ రోజు సమాధిలో నుంచి తిరిగి లేవడం ద్వారా ప్రజలందరికీ రక్షణ అందించారు. ఈ కార్యక్రమంలో సెక్రెటరీ దేవదాస్, ట్రెజరర్ నెల్సన్, కమిటీ సభ్యులు విజయరావు, వినయకుమార్, సురేశ్, సాగర్, రవికుమార్, సాలు, నీకోలాస్, రూతు జయరాజ్, విజయలక్ష్మి, రేఖ, జయరాజ్ తదితరులు పాల్గొన్నారు.



రామడుగు చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

నేటి కంటివెలుగు శిబిరాలు

కరీంనగర్‌టౌన్: జిల్లాలో సోమవారం 48 ప్రాంతాల్లో కంటి వెలుగు శిబిరాలు నిర్వహించనున్నట్లు జిల్లా వైద్యాధికారి డాక్టర్ సాజీదా తెలిపారు. కరీంనగర్‌లోని 3, 9, 14, 19, 20, 21, 25, 29, 34, 48, 50, 58వ డివిజన్లలో, హుజూరాబాద్ 18,22వ వార్డుల్లో, మండలంలోని తుమ్మనపల్లి, పోతిరెడ్డిపేట గ్రామాలు, జమ్మికుంట పట్టణంలోని 12వ వార్డు, మండలంలోని బిజిగిరిషరీఫ్, మడిపల్లి, వీణవంక మండలం గన్ముక్కుల, దేశాయిపల్లి, పోతిరెడ్డిపల్లి, చిగురుమామిడి మండలం బొమ్మనపల్లి, ఓగులాపూర్, చొప్పదండి లో 14వవార్డు, మండలంలోని సాంబయ్యపల్లి, రాగంపేట, ఇల్లందకుంట మండలంలో టేకుర్తి గ్రామంలో శిబిరాలు ఉంటాయి. అదే విధంగా గంగాధర మండలం లక్ష్మీదేవిపల్లి, వెంకంపల్లి, రామడుగు మండలంలో వెలిచాల, రుద్రారం, కొత్తపల్లి మల్కాపూర్, బద్దిపల్లి, కరీంనగర్‌రూరల్ మండలంలో బొమ్మకల్, చేగుర్తి, నగునూర్, మానకొండూరు మండలం అన్నారం, కొండపల్కల, పోచంపల్లి శిబిరాలు ఉంటాయి. సైదాపూర్ మండలం వెన్కెపల్లి, బొమ్మకల్, శంకరపట్నం మండలంలో ఆర్కండ్ల, ములంగూర్, ఆముదాలపల్లి, తిమ్మాపూర్ మండలం రేణిగుంట, పర్లపల్లి, గన్నేరువరం మండలం కాసింపేట గ్రామంలో కంటి వెలుగు బృందాలు పనిచేస్తాయని తెలిపారు.

ప్రశాంతంగా ముగిసిన ఎస్సై రాతపరీక్ష

- 18 కేంద్రాల్లో 12,560మంది అభ్యర్థులు హాజరు
- సెంటర్లను తనిఖీ చేసిన సీపీ ఎల్.సుబ్బారాయుడు



పరీక్ష కేంద్రాలను తనిఖీ చేస్తున్న సీసీ

కరీంనగర్‌క్రైం: పోలీస్ శాఖలోని వివిధ విభాగాల్లో స్టైపండరీ క్యాడెట్ ట్రైనీ పోలీస్ సబ్–ఇన్‌స్పెక్టర్ ఏఆర్/టీఎస్ఎస్‌పీ/ఎస్‌పీఎఫ్/ఎస్ఏఆర్ సీపీఎల్/ఎస్ఎఫ్‌వో)అభ్యర్థుల ఎంపిక ప్రక్రియలో భాగంగా రెండు రోజుల పాటు జరిగిన రాత పరీక్షలు ఆదివారం ముగిశాయి. పరీక్ష కోసం కరీంనగర్, తిమ్మాపూర్, నుస్తులాపూర్‌లో 18 కేంద్రాలు ఏర్పాటు చేశారు. పరీక్ష ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంటవరకు, 2:30గంటల నుంచి 5:30 గంటలవరకు కొనసాగింది. 12,560 మంది అభ్యర్థులు హాజరయ్యారు. పరీక్షల సందర్భంగా ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం రాకుండా పటిష్ట చర్యలు తీసుకున్నామని సీపీ ఎల్.సుబ్బారాయుడు తెలిపారు. పరీక్ష ముగిసేంతవరకు జిరాక్స్ సెంటర్లను మూసి ఉంచినట్లు, నగరంలోని లాడ్జీలను తనిఖీ చేశామన్నారు. అనుమానాస్పద వ్యక్తులకు సంబంధించిన వివరాలు తీసుకున్నామని తెలిపారు. క్యూపద్ధతి ద్వారా అభ్యర్థులను పరీక్షాహాల్లోకి అనుమతించామని, పురుష, మహిళ అభ్యర్థులను వేర్వేరుగా తనిఖీ చేశామని వివరించారు. పరీక్షకు హాజరైన అభ్యర్థుల బయోమెట్రిక్ వివరాలను నమోదు చేయడం జరిగిందని అన్నారు.

క్లుప్తంగా

మంత్రి గంగులను కలిసిన గౌడ సంఘం నాయకులు



మంత్రి కమలాకర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న నాయకులు

కరీంనగర్: రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖల మంత్రి గంగుల కమలాకర్‌కు గౌడ సంఘం నాయకులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. సంఘం కరీంనగర్ పట్టణ శాఖకు సప్తగిరికాలనీలో రెండున్నర గుంటల స్థలాన్ని కేటాయించినందుకు పుష్పగుచ్ఛం అందించి, కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు గుగ్గిళ్ల జయశ్రీ, దిండిగాల మహేశ్, బోనాల శ్రీకాంత్, సంఘం ప్రతినిధులు యాగండ్ల అనిల్‌కుమార్‌గౌడ్, నాగుల కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

టీఎస్‌టీడీసీ చైర్మన్‌కు సన్మానం



శ్రీనివాస్‌యాదవ్‌ను సన్మానిస్తున్న సమ్మిరెడ్డి

జమ్మికుంట(హుజూరాబాద్): తెలంగాణ రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్(టీఎస్‌టీడీసీ) చైర్మన్, బీఆర్‌ఎస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి గెల్లు శ్రీనివాస్ యాదవ్‌ను బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ తుమ్మేటి సమ్మిరెడ్డి ఆదివారం ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌యాదవ్‌ను శాలువాతో సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత పదవులు చేపట్టాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

'ఓ ప్రచేతసా' పుస్తకావిష్కరణ

కరీంనగర్ కల్చరల్: సమైక్య సాహితి, తెలంగాణ సాహితి సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ప్రజాకవి సుదర్శనం వేణుశ్రీ రాసిన 'ఓ ప్రచేతసా' పుస్తకావిష్కరణ, అంకితోత్సవం ఆదివారం భగత్‌నగర్‌లోని భగవతి పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆవిష్కర్త, కవి, రచయిత డాక్టర్ తంగిరాల చక్రవర్తి మాట్లాడుతూ.. ప్రజల గురించి రాసిన సాహిత్యం ఎప్పుడూ సమాజంలో నిలబడుతుందన్నారు. కరీంనగర్ సాహిత్యానికి విశిష్ట స్థానంగా నిలుస్తోందని పేర్కొన్నారు. సాహితీవేత్త, జిల్లా సాహితీసంస్థల సమాఖ్య సాహితీ గౌతమి అధ్యక్షుడు డాక్టర్ గండ్ర లక్ష్మణరావు మాట్లాడుతూ.. కలాలు వాస్తవాలను మాత్రమే తెలుపుతాయని, వర్తమాన సమాజ స్థితిని, గుణదోషాలను ప్రచేతసా శతకం చెప్పిందన్నారు. బిషప్ సాలవ జూనియర్ కళాశాల పూర్వ ప్రధానాచార్యులు డాక్టర్ సంజీవరావుకు పుస్తకాన్ని అంకితం చేశారు. కూకట్ల తిరుపతి పుస్తక సమీక్ష చేశారు. రచయిత వేణు శ్రీతోపాటు భగవతి రమణారావు, డాక్టర్ కె.రామకృష్ణ, కేఎస్.అనంతాచార్య, సీహెచ్.రమణాచారి, డాక్టర్ బీవీఎన్.స్వామి, మాడుగుల రాములు ప్రసంగించారు. సమాఖ్య సాహితి అధ్యక్షుడు మాడిశెట్టి గోపాల్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో యోగా సంపత్, ఎస్.నాగేంద్రశర్మ, కరుణాకర్, రాజయ్య, శ్రీకర్, కవులు, రచయితలు, సాహిత్యాభిమానులు పాల్గొన్నారు.

మండే ఎండ.. జాగ్రత్తలే అండ



నిర్మానుష్యంగా రాజీవ్ రహదారి

ఈ నెల 1వ తేదీ నుంచి ఉష్ణోగ్రతలు

తేదీ	గరిష్టం	కనిష్టం
01	36.6	25.6
02	36.8	23.4
03	37.0	25.0
04	37.0	26.2
05	38.0	23.8
06	37.2	25.3
07	35.8	28.6
08	36.6	21.8
09	38.2	22.0

- పెద్దపల్లి జిల్లాలో పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- ఆదివారం 38.2 డిగ్రీలు నమోదు
- మధ్యాహ్నం ఇళ్లకే పరిమితమవుతున్న ప్రజలు

జ్యోతినగర్(రామగుండం): ఎండలు మండిపోతున్నాయి.. సూర్యుడు తన ప్రతాపాన్ని చూపుతున్నాడు.. వారం రోజులుగా వాతావరణలో మార్పులు చోటుచేసుకుంటుండటంతో పెద్దపల్లి జిల్లాలో గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఆదివారం 38.2 డిగ్రీలుగా నమోదైంది. ఎండ వేడికి చాలామంది ఇళ్లకే పరిమితమవుతున్నారు. మధ్యాహ్న సమయంలో వడగాలులు వీస్తున్నాయి. ఇప్పుడే పరిస్థితి ఇలా ఉంటే మే నెలలో ఎలా ఉంటుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వచ్చే నెలలో ఎండ మరింత తీవ్రరూపం దాల్చే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు అంటున్నారు. మధ్యాహ్నం రోడ్లు నిర్మానుష్యంగా కనిపిస్తున్నాయి. అత్యవసర పనుల నిమిత్తం బయటకు వచ్చేవారు ముఖానికి తప్పనిసరిగా మాస్కులు ధరించాల్సి వస్తోంది. ఎండ వేడికి శీతల పానీయాల విక్రయాలు ఊపందుకున్నాయి.

వడదెబ్బ తగిలే అవకాశం..


ఎండ తీవ్రత పెరుగుతుండటంతో వడదెబ్బ తగిలే అవకాశం ఉంది. చెమట రాకపోవడం, విపరీతమైన దాహం, తల తిప్పడం, నాడీ వ్యవస్థ వేగంగా కొట్టుకోవడం, స్పృహ తప్పడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ముందుగా శరీరాన్ని తడి గుడ్డతో తుడవాలి. గాలి తగిలేలా చూడాలి. ఆలస్యం చేయకుండా వైద్యుడిని సంప్రదించాలి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- సాధ్యమైనంతవరకు నీళ్లు ఎక్కువ తాగాలి.
- కాఫీలు, ఆల్కాహాల్‌కు దూరంగా ఉండాలి.
- నూలు దుస్తులు ధరించాలి.
- అవసరం అయితే తప్ప ఎండలో బయటకు వెళ్లరాదు.
- పిల్లలను సాయంత్రం 6 గంటలు దాటే వరకు బయటకు వెళ్లకుండా చూడాలి.

విధివంచిత పిల్లలకు.. 'మిషన్ వాత్సల్య'

- పథకాన్ని అమలు చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు
- నెలకు రూ.4 వేల ఆర్థికసాయం
- ఈ నెల 15 వరకు దరఖాస్తుల స్వీకరణ



మిషన్ వాత్సల్య స్కీం లోగో

సుల్తానాబాద్(పెద్దపల్లి): విధివంచిత పిల్లలకు ప్రభుత్వాలు అండగా నిలవాలని నిర్ణయించాయి. ఎటువంటి ఆదరణ లేని చిన్నారులకు చేయూతనిచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నాయి. వారి విద్య, వైద్య అవసరాలు తీర్చేందుకు ఆర్థికసాయం అందించాలని మిషన్ వాత్సల్య అనే పథకాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అమలు చేస్తున్నాయి. అనాథలు, తల్లిదండ్రులకు దూరమైన వారు, పాక్షికంగా అనాథలు(తల్లి లేక తండ్రిని కోల్పోయిన వారు), అమ్మానాన్న విడాకులు తీసుకున్నవారు, ప్రాణాంతకమైన వ్యాధి బారినపడి, పేదరికంతో ఇంటి పెద్దను కోల్పోయినవారు, బాల కార్మికులు, అక్రమ రవాణా బాధితులు, బాల యాచకులు, హెచ్‌ఐవీ బాధిత పిల్లలకు ఈ పథకం ద్వారా నెలకు రూ.4 వేల చొప్పున అందించనున్నారు.

పెద్దపల్లి జిల్లాలో 266 గ్రామాలు..

పెద్దపల్లి జిల్లాలో రామగుండం నగరపాలక సంస్థ, పెద్దపల్లి, మంథని, సుల్తానాబాద్ మున్సిపాలిటీలతోపాటు 266 గ్రామాలు ఉన్నాయి. జిల్లాలో రెండేళ్ల క్రితం కరోనా సమయంలో తల్లి లేక తండ్రి చనిపోయిన పిల్లలు ఎక్కువ మంది ఉన్నారు. ప్రభుత్వాలు అమలు చేస్తున్న మిషన్ వాత్సల్య స్కీంను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

ఏడాది వార్షిక ఆదాయ పరిమితి..

గ్రామీణ ప్రాంతాల్లో కుటుంబ సంవత్సరాల ఆదాయం రూ.72 వేలు, పట్టణ ప్రాంతాల్లో రూ.95 వేలకు మించి ఆదాయం ఉండరాదు. జేజే బోర్డు, బాలల సంక్షేమ కమిటీ కోర్టు లిఖితపూర్వకంగా నమోదు చేసిన కారణాల ఆధారంగా అవసరాన్ని బట్టి స్పాన్సర్‌షిప్ పొడిగించవచ్చు. చిన్నారులను ఏదైనా వసతి గృహం, బాల సదనంలో చేర్పించిన తర్వాత సహాయం నిలిపివేస్తారు. ప్రత్యేక అవసరాలు కలిగిన బాలల విషయంలో మినహా పాఠశాలలకు వెళ్లేవారు 30 రోజులకు పైగా సక్రమంగా రాలేదని తెలిస్తే పరిశీలించి, సాయాన్ని తాత్కాలికంగా నిలిపివేస్తారు.

దరఖాస్తుల పరిశీలనకు కమిటీ..

సీడీపీవో కార్యాలయానికి అందిన దరఖాస్తులన్నింటినీ మండల స్థాయి కమిటీ(తహసీల్దార్, ఎంపీడీవో, ఎంఈవో, సీడీపీవో, ఐసీడీఎస్ సూపర్‌వైజర్) నిశితంగా పరిశీలించి, అర్హులను ఎంపిక చేస్తుంది. దరఖాస్తులపై కమిటీ సభ్యులందరూ సంతకం చేసిన తర్వాత జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారి కార్యాలయానికి పంపిస్తారు.

జత చేయాల్సిన పత్రాలు..

పిల్లల జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, తల్లి లేదా తండ్రి ఆధార్‌కార్డు, తల్లి లేదా తండ్రి డెత్ సర్టిఫికెట్, మరణానికి గల కారణాలు, గార్డియన్ ఆధార్, రేషన్ కార్డులు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, బాలుడు లేదా బాలిక పాస్‌పోర్టు సైజ్ ఫొటో, స్టడీ సర్టిఫికెట్, బ్యాంక్ అకౌంట్ వివరాలు, బాలుడు లేదా బాలిక వ్యక్తిగత అకౌంట్ లేదా తల్లి, తండ్రి, సంరక్షకులతో జాయింట్ అకౌంట్.

సీడీపీవోలకు ఆదేశాలిచ్చాం..



మిషన్ వాత్సల్య పథకానికి సంబంధించిన దరఖాస్తులు తీసుకోవాలని సీడీపీవోలకు ఆదేశాలిచ్చాం. ఈ నెల 15 వరకు దరఖాస్తులు స్వీకరిస్తాం. తర్వాత వాటిని ఉన్నతాధికారులకు పంపిస్తాం. – రవూఫ్, డీడబ్ల్యూవో, పెద్దపల్లి

మహాత్మా జ్యోతిబాపూలే జయంతికి రండి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రకాశ్

కరీంనగర్: స్థానిక బైపాస్‌లోని మహాత్మా జ్యోతిబాపూలే విగ్రహం వద్ద ఈ నెల 11న పూలే జయంతి వేడుకలు నిర్వహించనున్నట్లు బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు ఎన్నం ప్రకాశ్ తెలిపారు. బీసీలు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. ఆదివారం కరీంనగర్‌లోని రాంనగర్‌లో గల ఓ కల్యాణ మండపంలో జరిగిన బీసీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. బడుగు బలహీనవర్గాల అణిచివేతకు వ్యతిరేకంగా పోరాటం చేసిన మహనీయుడు పూలే అన్నారు. స్త్రీలు విద్య నేర్చుకోవాలని, తన భార్య చేత పాఠశాలలు ఏర్పాటు చేయించిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. స్థానిక పూలే గ్రౌండ్‌లో, శాతవాహన యూనివర్సిటీలో జ్యోతిరావు పూలే, సావిత్రి బాయి పూలేల విగ్రహాలను నెలకొల్పాలన్నారు. కరీంనగర్ పట్టణ జనాభాలో 50 శాతానికి పైగా ఉన్న బీసీలకు బీసీ భవనం కోసం ఎకరం స్థలం కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రాచమల్ల రాజు, వరాల జ్యోతి, దొగ్గలి శ్రీధర్, కిరణ్, మురళి, దీప్తి, సంతోషిణి, సంజీవ్, రాకేశ్‌చారి, రమేశ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పదస్థితిలో వివాహిత మృతి

- శాలపల్లెలో ఘటన
- అత్తింటివారు వరకట్నం కోసం వేధించేవారన్న మృతురాలి తండ్రి
- కేసు నమోదు



మౌనిక (ఫైల్)

కమాన్‌పూర్(మంథని): మండలంలోని సిద్దిపల్లె గ్రామపంచాయితీ పరిధిలోని శాలపల్లె గ్రామానికి చెందిన బిల్లా మౌనిక(25) అనే వివాహిత అనుమానాస్పదస్థితిలో మృతి చెందింది. పోలీసుల వివరాల ప్రకారం.. మంథని మున్సిపాలిటీ పరిధిలోని పోచమ్మవాడ చెందిన ముదుతనపల్లి రాజయ్య కూతురు మౌనికను శాలపల్లెకు చెందిన బిల్లా హరీశ్‌కు ఇచ్చి, 2020 జనవరిలో వివాహం జరిపించారు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం రాజయ్య తమ్ముడు రవికి హరీశ్ ఫోన్ చేసి, ఇంట్లో పని చేస్తుండగా మౌనికను పాము కాటు వేసిందని చెప్పాడు. స్థానిక వైద్యుని వద్ద ప్రథమ చికిత్స చేయించి, అక్కడి నుంచి పెద్దపల్లికి, పరిస్థితి విషమించడంతో కరీంనగర్ తీసుకెళ్తున్నామని తెలిపాడు. తాను, తన భార్య రాధ కరీంనగర్‌కు వెళ్లేసరికే తమ కూతురు చనిపోయిందని మృతురాలి తండ్రి రాజయ్య చెప్పాడు. మౌనికను తమ అల్లుడు హరీశ్‌తోపాటు కుటుంబసభ్యులు నిత్యం వరకట్నం కోసం వేధింపులకు గురిచేసేవారని తెలిపాడు. తమ కూతురి మృతిపై అనుమానాలు ఉన్నాయని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై షేక్‌మస్తాన్ పేర్కొన్నారు. మృతురాలికి మూడేళ్ల పాప, ఎనిమిది నెలల బాబు ఉన్నారు.

చింతచెట్టు పైనుంచి పడి వృద్ధుడికి తీవ్ర గాయాలు

శంకరపట్నం(మానకొండూర్): శంకరపట్నం మండలంలోని ముత్తారం గ్రామంలో ఆదివారం చింతచెట్టు పైనుంచి పడి, కొమిరె వెంకటి అనే వృద్ధుడికి తీవ్ర గాయాలైనట్లు గ్రామస్తులు తెలిపారు. చింతకాయలు దులుపుతుండగా ప్రమాదవశాత్తు కిందపడ్డాడని పేర్కొన్నారు. బాధితుడికి ఈఎంటీ సురేశ్ ప్రథమ చికిత్స అందించి, కరీంనగర్ ఆస్పత్రికి తరలించారని చెప్పారు.

నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న వైఎస్సార్‌టీపీ నాయకులు

కరీంనగర్: నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వైఎస్సార్‌టీపీ జిల్లా కో–ఆర్డినేటర్ డాక్టర్ నగేశ్ ఆధ్వర్యంలో ఆదివారం కరీంనగర్‌లోని తెలంగాణ చౌక్‌లో ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎంతోమంది విద్యార్థులు ప్రాణత్యాగం వల్ల ఏర్పడిన ప్రత్యేక రాష్ట్రం రాబందుల పాలైందన్నారు. తెలంగాణలో తమ భవిష్యత్ బాగుంటుందని కలలుగన్న నిరుద్యోగుల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం తొమ్మిదేళ్లుగా ఉద్యోగాలు భర్తీ చేస్తామంటూ ఊరిస్తోంది తప్ప ఒక పోస్టును కూడా భర్తీ చేయడం లేదని ఆరోపించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన టీఎస్‌పీఎస్సీ బోర్డు అవినీతి ఊబిలో కూరుకుపోయిందని అన్నారు. బిస్వాల్ కమిటీ నివేదిక ప్రకారం 1.91 లక్షల ఉద్యోగాలకు తక్షణమే నోటిఫికేషన్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు రజితారెడ్డి, పట్టణ అధ్యక్షుడు రవీందర్ రెడ్డి, కార్మిక విభాగం అధ్యక్షుడు పోలీస్ శ్రీనివాస్, నాయకులు నర్సయ్య, ఆంజనేయులు, సుంకర సునీల్, రియాద్ తదితరులు పాల్గొన్నారు.

రాంపూర్‌లో వ్యక్తిపై దాడి



గాయపడిన శ్రీనివాస్‌గౌడ్

హుజూరాబాద్‌రూరల్: రాంపూర్ గ్రామంలో ఆదివారం గౌడ కులస్తుల పంచాయితీ జరిగింది. ఆ సమయంలో కుల పెద్ద మనిషి తాళ్లపల్లి శ్రీనివాస్‌గౌడ్‌పై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేశారు. ఆయనకు గాయాలయ్యాయి. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా సంఘటన స్థలానికి చేరుకొని, విచారణ చేపట్టారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఐఎన్‌టీయూసీని బలోపేతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న జనక్‌ప్రసాద్

గోదావరిఖని(రామగుండం): ఏరియాల వారీగా సభ్యత్వాలను సేకరించి, ఐఎన్‌టీయూసీని బలోపేతం చేయాలని ఆ సంఘం సెక్రటరీ జనరల్, వేజ్‌బోర్డు సభ్యుడు జనక్‌ప్రసాద్ కోరారు. ఆదివారం గోదావరిఖనిలోని జనక్ భవన్‌లో ఏర్పాటు చేసిన యూనియన్ సెంట్రల్ కోర్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. సంఘం మహాసభ నిర్వహణపై చర్చించారు. 18న కోల్‌కతాలో జరగనున్న జేబీసీసీఐ వేజ్ బోర్డు సమావేశంలో యూనియన్ సమర్పించే డిమాండ్లపై మాట్లాడారు. రాబోయే గుర్తింపు సంఘం ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలు, యూనియన్ పిట్‌స్థాయి నుంచి కేంద్ర కమిటీ వరకు సమగ్రమైన కమిటీ నిర్మాణం, క్రమశిక్షణ కమిటీ ఏర్పాటుపై సమాలోచనలు చేశారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ఐఎన్‌టీయూసీ పాత్ర, కాంగ్రెస్‌తో అనుబంధంపై సమీక్ష జరిపారు. నాయకులు గుమ్మడి కుమారస్వామి, నరసింహారెడ్డి, త్యాగరాజన్, ధర్మపురి, లక్ష్మీపతిగౌడ్, కాంపల్లి సమ్మయ్య, శంకర్‌రావు, శ్యాం, వడ్డేపల్లి దాస్, వికాస్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జనరల్ మజ్దూర్లకు బేసిక్ ప్రొటెక్షన్ కల్పించాలి

అండర్ గ్రౌండ్ నుంచి సర్ఫేస్‌కు వచ్చే జనరల్ మజ్దూర్లకు బేసిక్ ప్రొటెక్షన్ కల్పించాలని ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్ ఒక ప్రకటనలో కోరారు. బెల్లంపల్లి ఏరియాలో సర్ఫేస్ జనరల్ మజ్దూర్ల ఖాళీల భర్తీకి ఇచ్చిన సర్క్యులర్‌లో సీనియారిటీ, బేసిక్ ప్రొటెక్షన్ ఇవ్వలేదన్నారు. సర్ఫేస్ మజ్దూర్ల ఖాళీల భర్తీకై సింగరేణి వ్యాప్తంగా ఉన్న అన్ని కేటగిరీలకు చెందిన ఉద్యోగుల నుంచి దరఖాస్తులు కోరుతూ యాజమాన్యం నోటిఫికేషన్ ఇచ్చిందని తెలిపారు. కానీ అందులో సర్ఫేస్ మజ్దూర్‌గా నియమించబడే వారికి గ్రేడ్, బేసిక్ వర్తించదని పేర్కొనడం సరికాదన్నారు. కేటగిరీ వన్‌లోనే ఉండాలని చెప్పడం అన్యాయమని పేర్కొన్నారు. కొన్నేళ్లుగా సంస్థలో పనిచేస్తూ అనారోగ్య, వ్యక్తిగత కారణాలతో సర్ఫేస్‌కు దరఖాస్తు చేసుకునే ఉద్యోగులను ఈ నిబంధన తీవ్ర నిరాశకు గురిచేస్తోందన్నారు. ఉద్యోగుల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకొని, సీనియారిటీ గుర్తించాలని కోరారు.

విద్యుదాఘాతంతో ఎలక్ట్రీషియన్‌కు గాయాలు

- రామగుండం జీజీహెచ్‌లో ఘటన



చికిత్స పొందుతున్న వివేక్

కోల్‌సిటీ(రామగుండం): రామగుండం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి(జీజీహెచ్) ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పని చేస్తున్న వివేక్ అనే ఎలక్ట్రీషియన్‌కు విద్యుదాఘాతంతో గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. ఆదివారం ఉదయం రామగుండంలో రెండు గంటలపాటు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ అధికారులు ప్రకటించారు. ఆ సమయంలో మరమ్మతు చేపట్టాలని వివేక్ నిర్ణయించుకున్నాడు. ఆసుపత్రి ఆవరణలోని ట్రాన్స్‌ఫార్మర్ పైకి ఎక్కి పని చేస్తుండగా అకస్మాత్తుగా విద్యుత్ సరఫరా జరిగి, విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. ఈ ఘటనలో అతను ట్రాన్స్‌ఫార్మర్ పైనుంచి కిందపడగా తల, కాలు, చెయ్యి, చాతిపైన బలమయిన గాయాలయ్యాయి. వివేక్ అపస్మారకస్థితిలో ఉండటంతో సిబ్బంది వెంటనే సీపీఆర్ చేసి, ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించారు. కాగా.. విద్యుత్ సరఫరా రెండు గంటలపాటు ఉండదని ప్రకటించిన అధికారులు అకస్మాత్తుగా సరఫరా పునరుద్ధరించడం వల్లే ఈ ఘటన జరిగిందని పలువురు ఆరోపిస్తున్నారు. ప్రమాదానికి విద్యుత్, ఆసుపత్రి అధికారులే బాధ్యత వహించాలని సీపీఐ నగర సహాయ కార్యదర్శి మద్దెల దినేశ్ డిమాండ్ చేశారు. బాధితుడికి కార్పొరేట్ ఆసుపత్రిలో ఉచితంగా మెరుగైన వైద్యం అందించాలన్నారు.

మోటార్ కార్మికుల పరిస్థితి దయనీయం

- సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి
- సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఉమ్మడి జిల్లా కార్యదర్శి కె.రాజన్న



మాట్లాడుతున్న రాజన్న

జ్యోతినగర్(రామగుండం): మోటార్ రంగ కార్మికుల పరిస్థితి దయనీయంగా ఉందని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వారి వేతనాలు పెరగడం లేదని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఉమ్మడి కరీంనగర్ జిల్లా కార్యదర్శి కె.రాజన్న అన్నారు. వారికి ప్రత్యేకంగా సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఆదివారం ఎన్టీపీసీ రామగుండం ఆటోనగర్‌లోని యూనియన్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఓట్ల కోసం కార్మికులను వాడుకుంటున్నారే తప్ప వారిని ఆదుకోవడానికి ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. రోడ్ సేఫ్టీ బిల్లు రద్దు చేయాలని, ప్రమాదంలో మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు రూ.20 లక్షలు చెల్లించాలని, 50 ఏళ్ల వయసు దాటిన ప్రతీ కార్మికుడికి పింఛన్, డబుల్ బెడ్‌రూం ఇల్లు ఇవ్వాలని తదితర అంశాలపై చర్చించి, తీర్మానాలు చేశారు. ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఐ.కృష్ణ, సహాయ కార్యదర్శి వెంకన్న, జిల్లా అధ్యక్షులు ఈ.నరేష్, అశోక్, కాంట్రాక్టు కార్మిక సంఘం పెద్దపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి చిలుక శంకర్, నాయకులు బుచ్చయ్య, రవి, రమణ తదితరులు పాల్గొన్నారు.

ప్రియుడి ఇంటి ఎదుట ప్రియురాలి బైఠాయింపు

- పెళ్లికి ఒప్పుకున్న ఇరుకుటుంబాలు



రాకేశ్ ఇంటి ఎదుట బైఠాయించిన పుష్ప

రామగిరి(మంథని): ఇద్దరూ ప్రేమించుకున్నారు.. నాలుగేళ్లుగా కలిసే ఉంటున్నారు.. ఈ క్రమంలో సదరు యువతి ఆ యువకుడిని పెళ్లి చేసుకోవాలని అడిగితే ముఖం చాటేశాడు. దీంతో బాధితురాలు అతని ఇంటి ఎదుట బైఠాయించి, నిరసన తెలిపింది. ఆమె వివరాల ప్రకారం.. ముత్తారం మండలంలోని ఖమ్మంపల్లికి చెందిన పాలిశెట్టి రాకేశ్, పుష్ప ఎనిమిదేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. నాలుగేళ్లుగా హైదరాబాద్‌లో కలిసి ఉంటున్నారు. పుష్ప పెళ్లి ప్రస్తావన తెచ్చిన ప్రతీసారి దాటవేస్తూ వస్తున్నాడు. దీంతో ఇద్దరి మధ్య గొడవలు మొదలయ్యాయి. ఇద్దరి కులాలు వేరు కావడంతో తమ ఇంట్లో ఒప్పుకోవడం లేదని రాకేశ్ తేల్చిచెప్పాడు. దీంతో ఆమె ఆదివారం ఖమ్మంపల్లికి వచ్చి, ప్రియుడి ఇంటి ఎదుట బైఠాయించింది. విషయం తెలుసుకున్న గ్రామ పెద్దలు ఇరు కుటుంబాలతో మాట్లాడి, ముత్తారం పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. ఇరు కుటుంబాలవారు పెళ్లికి ఒప్పుకోవడంతో గొడవ సద్దుమణిగింది.

ట్రస్మా ఒలింపియాడ్‌లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న అతిథులు

సుల్తానాబాద్(పెద్దపల్లి): ట్రస్మా ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన రాష్ట్రస్థాయి సైంటిఫిక్ ఆప్టిట్యూడ్ టెస్ట్ (సాట్)లో పెద్దపల్లి పట్టణంలోని గాయత్రి విద్యానికేతన్ విద్యార్థులు ప్రతిభ కనబరిచి, ద్వితీయ, తృతీయ బహుమతులు గెలుచుకున్నారు. ఈ సందర్భంగా ఆదివారం కరీంనగర్‌లోని ఓ గార్డెన్స్‌లో రాష్ట్రస్థాయి ద్వితీయ ర్యాంక్ సాధించిన ఏడో తరగతి విద్యార్థినులు జి.లక్ష్మీప్రణతి, వి.విహిత, తొమ్మిదో తరగతికి చెందిన పి.వర్షిణి, తృతీయ ర్యాంక్ సాధించిన ఏడో తరగతికి చెందిన పి.హన్విత, కె.అక్షయ, తొమ్మిదో తరగతికి చెందిన ఎం.శ్రీవర్ధన్, క్లాస్ ఫస్ట్ ర్యాంక్ సాధించిన చాట్ల శ్రీమాన్ (5వ తరగతి), జంగపల్లి సాత్విక, కె.ఆరుష్ (6వ తరగతి)లకు చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి శేఖర్ రావు, సెక్రటరీ సిరిపురం సత్యనారాయణ, ఈ–అభ్యాస్ అకాడమీ ఫౌండర్ ఫణి పవన్‌ల చేతులమీదుగా మెడల్స్, సర్టిఫికెట్లు అందించారు. సాయంత్రం పాఠశాలలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో గాయత్రి విద్యాసంస్థల అధినేత అల్లెంకి శ్రీనివాస్, కరస్పాండెంట్ రజనీ శ్రీనివాస్, ప్రిన్సిపాల్ విజయ్, రజియుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు శంకర విజన్ సెంటర్ ప్రారంభం



పాలకుర్తి(రామగుండం): బసంత్‌నగర్‌లో మధ్యప్రదేశ్ రాష్ట్ర సమాచార కమిషనర్ పరికిపండ్ల నరహరి తన తండ్రి సత్యనారాయణ స్మారకార్థం కోయంబత్తూర్ శంకర విజన్ సహకారంతో నిర్మించిన కంటి ఆసుపత్రి భవనాన్ని(శంకర విజన్ సెంటర్) సోమవారం ప్రారంభించనున్నారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డితోపాటు కరీంనగర్ ఎంపీ బండి సంజయ్, పద్మభూషణ్ మెగాస్టార్ చిరంజీవి, కమెడియన్ అలీ, రాష్ట్ర మంత్రులు తన్నీరు హరీశ్‌రావు, గంగుల కమలాకర్, కొప్పుల ఈశ్వర్, ఎంపీలు, ఎమ్మెల్యేలు, బీజేపీ రాష్ట్ర నాయకులు, సింగర్ మంగ్లీ, ఇతర గాయకులు హాజరు కానున్నారు. ఉదయం 9 గంటలకు పరికిపండ్ల సత్యనారాయణ విగ్రహావిష్కరణ అనంతరం మధ్యాహ్నం 3 గంటలకు కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు ఆలయ ఫౌండేషన్ సభ్యులు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర మంత్రులతోపాటు ప్రముఖులు హాజరుకానుండటంతో పెద్దపల్లి సబ్ డివిజన్ పోలీసులు గట్టి బందోబస్తు చర్యలు చేపట్టారు. ఈ మేరకు ఆదివారం సభా ప్రాంగణంతోపాటు పార్కింగ్ స్థలాలను పెద్దపల్లి సీఐ ప్రదీప్ పరిశీలించారు. బసంత్‌నగర్ ఎస్సై శ్రీనివాస్, సిబ్బంది ఉన్నారు.

సంకటహర చతుర్థి పూజలు





అంజనాద్రిగుట్టపై స్వామి వారికి హారతి ఇస్తున్న అర్చకులు, పూజలో పాల్గొన్న భక్తులు



నగునూరులోని దుర్గాభవానీ ఆలయంలో..

కరీంనగర్ కల్చరల్: సంకటహర చతుర్థి పురస్కరించుకొని ఆదివారం నగరంలోని భగత్‌నగర్ అంజనాద్రి గుట్టపై ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారికి అర్చనలు, విశేషాలంకరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ బాధ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

నగునూరు దుర్గాభవానీ ఆలయంలో..

విద్యానగర్(కరీంనగర్): కరీంనగర్ మండలం నగునూర్‌లోని దుర్గాభవానీ ఆలయంలోని లక్ష్మీగణపతికి ఘన పూజలు జరిగాయి. స్వామివారలకు విశేష అభిషేకం, ఫలపంచామృతాభిషేకం, విశేష హారతి పూజా కార్యక్రమాలను ఆలయ ప్రధాన అర్చకులు పవన్‌కృష్ణ శర్మ వైభవంగా నిర్వహించారు. పూజల్లో ఆలయ ఫౌండర్, కమిటీ బాధ్యులు, భక్తులు పాల్గొన్నారు.

చెర్లభూత్కూర్‌లో పోచమ్మ బోనాలు



కరీంనగర్ మండలం చెర్లభూత్కూర్‌లో ఈనెల 14, 15, 16 తేదీల్లో చిరుతల రామాయణం ప్రదర్శిస్తున్న దృష్ట్యా ఆదివారం కళాకారుల కుటుంబాలు పోచమ్మ బోనాలను ఘనంగా నిర్వహించారు. మహిళలు, కళాకారులు డప్పుచప్పుళ్ల నడుమ బోనాలతో ఊరేగింపుగా ఆలయం వద్దకు వెళ్లి మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దబ్బెట రమణారెడ్డి, ఎంపీటీసీ బుర్ర తిరుపతిగౌడ్, కరీంనగర్ సింగిల్‌విండో చైర్మన్ పెండ్యాల శ్యాంసుందర్‌రెడ్డి, బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు కూర శ్యాంసుందర్‌రెడ్డితో పాటు కళాకారులు పాల్గొన్నారు.

- కరీంనగర్‌రూరల్

క్లుప్తంగా

శ్రీసుబ్రహ్మణ్యస్వామికి పూజలు



పూజలు చేస్తున్న వీహెచ్‌పీ, బజరంగదళ్ నాయకులు

కొత్తపల్లి: రేకుర్తి గుట్టపై స్వయంభూ వెలిసిన శ్రీసుబ్రహ్మణ్యస్వామికి ఆదివారం విశ్వహిందూ పరిషత్, బజరంగదళ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గుట్టపై అన్యమత గుర్తులు వెలవడాన్ని ఖండిస్తూ భజనలు చేశారు. వీహెచ్‌పీ గోరక్షక్ విభాగ్ ప్రముఖ్ ఊట్కూరి రాధాకృష్ణారెడ్డి, జిల్లా కార్యదర్శి విద్యాసాగర్, నగర కార్యదర్శి మనోజ్ లహోటి, నగర ఉపాధ్యక్షుడు ఎ.శ్రీనివాస్, ప్రజలు పాల్గొన్నారు.

గ్రంథాలయానికి ఫర్నిచర్ బహూకరణ



కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం మొగ్దుంపూర్‌లో ఈనెల 14న ప్రారంభించనున్న తాత్కాలిక లైబ్రేరిలో అవసరమైన ఫర్నిచర్‌ను ఆదివారం తాండ్ర అంజన్న చారిటిబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో అందించారు. రూ.15వేలతో ఎలక్ట్రికల్ వైరింగ్, లైట్లు, ఫ్యాన్లు, మరో రూ.15వేలతో కుర్చీలు, టేబుళ్లు, ర్యాక్‌లు, రూ.10వేల విలువైన అన్ని రకాల పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు అందించినట్లు ట్రస్టు చైర్మన్ తాండ్ర మధూకర్ తెలిపారు. త్వరలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతో పాటు ఇంటర్నెట్ సౌకర్యం కల్పించనున్నట్లు వివరించారు. వార్డు సభ్యుడు క్రాంతికుమార్‌తో కలిసి మధూకర్ లైబ్రేరిలో టేబుళ్లు, కుర్చీలు ఏర్పాటు చేశారు.

పాలధరల పెంపును ఉపసంహరించుకోవాలి

కరీంనగర్: విద్యుత్, డీజిల్ ధరలు పెరిగాయన్న సాకుతో పాల ధరలు రెండు నెలలుకాకముందే మళ్లీ రెండు రూపాయలు పెంచడం, ఒక్క సంవత్సరంలోనే నాలుగు ఐదు సార్లు ధరలు పెంచడం సిగ్గుచేటు అని రాష్ట్ర రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పైడిపల్లి రాజు ఒకప్రకటనలో ఆరోపించారు. పట్టించుకునేవారు లేకపోవడంతోనే కరీంనగర్ డెయిరీ యాజమాన్యం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవరిస్తూ.. అందిన కాడికి దోచుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి వాటిపై వెంటనే కలెక్టర్ స్పందించి ధరలు అదుపుచేయాలని లేకుంటే ప్రజలు ,రైతులు డెయిరీ అవినీతి బండారం బయటపెడతారని ఆయన హెచ్చరించారు. డెయిరీ లాభనష్టాలపై శ్వేతపత్రం యజమాన్యం విడుదల చేయాలన్నారు.

వరి కోతలు ప్రారంభం

- మబ్బులు పడుతున్న ఆకాశం
- ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు కసరత్తు



ఇరుకుల్లలో వరికోస్తున్న హార్వెస్టర్

కరీంనగర్‌రూరల్: యాసంగిలో కురుస్తున్న అకాల వర్షాలతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గత నెలలో కురిసిన గాలివాన, వడగండ్ల వర్షంతో 735 ఎకరాల్లో వరి, మొక్కజొన్న పంటలకు నష్టం జరుగగా ఇంకా వర్షాలు పడే అవకాశముందనే అధికారుల సూచన అన్నదాతలకు కంటిమీద కునుకులేకుండా చేస్తోంది. అకాల వర్షాల నుంచి పంటను కాపాడుకోవాలనే ఉద్దేశ్యంతో పలువురు రైతులు వరికోతలు చేపట్టారు.

13వేల ఎకరాల్లో వరిసాగు

కరీంనగర్ మండలంలోని 17 గ్రామాల్లో యాసంగి సీజన్‌లో 13,124 ఎకరాల్లో వరిపంటను సాగు చేయగా దాదాపు 22 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తోందని వ్యవసాయాధికారులు అంచనా వేస్తున్నారు. అయితే ముందస్తుగా వరి నాట్లేసిన రైతులు ప్రస్తుతం వరికోతలు ప్రారంభించారు. ఇరుకుల్ల, మొగ్దుంపూర్, చెర్లభూత్కూర్, చామనపల్లి, ఎలబోతారం, నగునూరు తదితర గ్రామాల్లో హార్వెస్టర్లతో వరికోస్తున్నారు. అయితే ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఇంకా ప్రారంభం కాకపోవడంతో పలువురు రైతులు పొలాల్లోనే ధాన్యం ఆరబెడుతున్నారు. మరో వారం, పదిరోజుల్లో వరికోతలు ముమ్మరమయ్యే అవకాశముంది. ప్రస్తుతం హార్వెస్టర్ గంటకు రూ.1,800 అద్దె వసూలు చేస్తుండగా వరికోతలు ఊపందుకుంటే రూ.2వేల వరకు పెరుగుతుందని రైతులు భావిస్తున్నారు. అయితే వర్ష సూచనతో పలువురు రైతులు హార్వెస్టింగ్ త్వరగా పూర్తి చేయాలని చూస్తున్నారు. వడగండ్లు పడితే వరిగొలకల్లో నిండుకున్న ధాన్యం గింజలు నేలరాలి తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందనే ఉద్దేశ్యంతో చైన్ హార్వెస్టర్లతో ముందస్తు వరికోతలు చేపడుతున్నారు. ధాన్యాన్ని ట్రాక్టర్లతో తెచ్చి కొనుగోలు కేంద్రాల్లో ఆరబెడుతున్నారు. అయితే ఇప్పటికే వరిపంటకు మొగిపురుగు, తెల్లకంకి, అగ్గితెగులు, కాండం కుళ్లు తెగులు ఆశించడంతో దిగుబడి తగ్గిపోయే అవకాశముందని రైతులు పేర్కొంటున్నారు.

కేంద్రాల ఏర్పాటుపై కసరత్తు

కరీంనగర్, దుర్శేడ్ సహకార సంఘాలు, ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడంపై అధికారులు కసరత్తు చేస్తున్నారు. గతంలో నిర్వహించిన కేంద్రాల్లోని లోటుపాట్లను సరిచేయడంపై దృష్టి పెట్టారు. ఆయా కేంద్రాలకు అవసరమయ్యే గన్నీ సంచులు, ఎలక్ట్రానిక్ కాంటాలు, ప్యాడీ క్లీనర్లు, టార్పాలిన్లు, తాగునీరు, నీడ వసతి తదితర సౌకర్యాలు కల్పించడంపై నివేదిక రూపొందిస్తున్నారు. మరో 15 రోజుల్లో కేంద్రాలను ప్రారంభించేందుకు అవసరమైన చర్యలు చేపట్టినట్లు సహకార అధికారులు తెలిపారు.

కమ్యూనిటీ హాల్ మంజూరుకు కృషి



మార్కెట్ కమిటీ చైర్మన్‌ను సన్మానిస్తున్న సభ్యులు

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం మొగ్దుంపూర్‌లో ముదిరాజ్ కమ్యూనిటీహాల్ మంజూరుకు కృషి చేస్తానని కరీంనగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రెడ్డవేణి మధు అన్నారు. ఆదివారం మొగ్దుంపూర్‌లో నిర్వహించిన ముదిరాజ్ సంఘం సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మంత్రి గంగుల కమలాకర్ సహాయంతో కమ్యూనిటీహాల్, పెద్దమ్మ గుడి నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు చేయించేందుకు కృషి చేస్తానన్నారు. ముదిరాజ్ కులస్తులు ఐక్యంగా ఉండి అన్ని రంగాల్లో ముందుకు రావాలని కోరారు. వ్యవసాయ మార్కెట్‌లో మామిడికాయల విక్రయాల్లో సమస్య ఉంటే నేరుగా సంప్రదించాలని సూచించారు. అనంతరం ఏఎంసీ చైర్మెన్ మధును సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జక్కం నర్సయ్య, ఎంపీటీసీ పుష్పలం జీరెడ్డి, దుర్శేడ్ సింగిల్‌విండో డైరెక్టర్లు కందుల రమేశ్‌గౌడ్, దాడి లచ్చయ్య, మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు జెట్టి తిరుపతి, ఉపాధ్యక్షుడు జెట్టి అంజయ్య, కోశాధికారి పప్పు అనిల్, సభ్యులు నూనె రాంచంద్రం, శ్రీనివాస్, జెట్టి శంకరయ్య, సాయి కిరణ్, పప్పు లచ్చయ్య, సంపత్, జెట్టి సతీశ్, చంద్రమౌళి, ఈర్ల తిరుపతి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మోదీ నిరంకుశ పాలనను అడ్డుకుంటాం



హైదరాబాద్‌కు వెళ్తున్న సీపీఎం నాయకులు

కరీంనగర్: మోదీ నిరంకుశ పాలనను వామపక్షాల ఐక్యతతో అడ్డుకుంటామని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవారెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న సీపీఐ, సీపీఎం ఉమ్మడి వామపక్షాల రాష్ట్ర సమావేశాలకు కరీంనగర్ నుంచి సీపీఎం నాయకులు ఆదివారం బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా వాసుదేవారెడ్డి మాట్లాడుతూ హైదరాబాద్‌లో జరిగే వామపక్షాల ఉమ్మడి సమావేశాలకు చాలా ప్రత్యేకత ఉందని, ఈ సమావేశంలో ఐక్య కార్యాచరణ, రాజకీయ సైద్ధాంతిక అవగాహన, ఎన్నికల వ్యూహం, ఎత్తుగడలను కలిసి నిర్ణయం తీసుకుంటాయని తెలిపారు. హైదరాబాద్ బయలుదేరిన వారిలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు గీట్ల ముకుంద రెడ్డి, గుడికందుల సత్యం, జిల్లా కమిటీ సభ్యులు సుంకరి సంపత్, ఎడ్ల రమేశ్, ఎస్.రజనీకాంత్, నరేశ్‌పటేల్, నాయకులు యాదగిరి, తిప్పారపు సురేశ్, కవ్వంపల్లి అజయ్,పున్నం రవి, రాయికంటి శ్రీనివాస్, కొంపల్లి సాగర్,మారెల్ల శ్రీలత,గజ్జల శ్రీకాంత్ తదితరులున్నారు.

ఇఫ్తార్ విందులు స్నేహ బంధాన్ని పెంపొందిస్తాయి



ఇఫ్తార్‌లో పాల్గొన్న మంత్రి గంగుల కమలాకర్, ప్రణాళిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వినోద్‌కుమార్

కరీంనగర్ కల్చరల్: ఇఫ్తార్ విందులు స్నేహ బంధాన్ని పెంపొందిస్తాయని మంత్రి గంగుల కమలాకర్, ప్రణాళిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్ అన్నారు. ఆదివారం నగరంలోని 47వ డివిజన్‌లోని మధు గార్డెన్‌లో ఎంఐఎం కార్పొరేటర్ మహ్మద్ షరుద్దీన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో పాల్గొని మాట్లాడారు. కేసీఆర్ పాలనలో రాష్ట్రం నేడు మత కల్లోలకు దూరంగా ఉందన్నారు. ఎటువంటి కల్లోలాలు, కలహాలు, ఘర్షణలు లేని నగరం కరీంనగర్ అని, ఈదేశ కీర్తి పతాకలో సుస్థిర స్థానం సంపాదించిందని తెలిపారు. కార్యక్రమంలో మేయర్ సునీల్‌రావు, ఎంఐఎం నగర అధ్యక్షుడు, తెలంగాణ హజ్ కమిటీ సభ్యుడు సయ్యద్ గులాం అహ్మద్‌హుస్సేన్, ప్రధాన కార్యదర్శి బర్కత్‌అలీ, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ అఖిల్ ఫిరోజ్, నాయకులు అతిన, అలీబాబా, అజర్ దబీర్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత నటన శిక్షణ శిబిరం ప్రారంభం



నటనలో మెలకువలు నేర్చుకుంటున్న చిన్నారులు

కరీంనగర్‌కల్చరల్: నటనపై ఆసక్తి ఉన్న వారిని ప్రోత్సహించేందుకు మాస్క్ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో పట్టణ స్వర్ణకార సంఘ భవనంలో ఏర్పాటు చేసిన ఉచిత నటన శిక్షణ శిబిరాన్ని ఆదివారం 46వ డివిజన్ కార్పొరేటర్ వంగల శ్రీదేవి పవన్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాస్క్ ఇనిస్టిట్యూట్ చైర్మన్, దర్శకుడు అనసూరి భూనాథచారి మాట్లాడుతూ నటనపై ఆసక్తి ఉన్న ప్రతిఒక్కరికీ అవకాశాలు రావాలంటే ఒక వేదిక కావాలని అన్నారు. అందుకు ఈ కరీంనగర్ యాక్టర్స్ క్లబ్‌లో చేరిన వారికి శిక్షణ ఇచ్చి వారి వివరాలు దర్శకులకు అందజేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బులియన్ అసోసియేషన్ పట్టణ అధ్యక్షుడు వంగల శ్రీధర్, స్వర్ణకార సంఘం పట్టణ అధ్యక్షుడు రావుల శ్రీకాంత్, నటులు కేశిరెడ్డి కనకరెడ్డి, కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

నేడు నిరసన దీక్ష



డిమాండ్ల ప్లకార్డుతో పెన్షనర్స్ సంఘ నాయకులు

విద్యానగర్(కరీంనగర్): విశ్రాంత ఉద్యోగుల అపరిష్కృత సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన దీక్ష నిర్వహిస్తున్నట్లు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.శ్రీహరిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి దామెర మహేంద్ర రెడ్డి తెలిపారు. ఆదివారం కరీంనగర్ ప్రెస్‌భవన్‌లో నిరసన దీక్ష సంబంధించిన ప్లకార్డులను విడుదల చేసి వారు మాట్లాడారు. పెన్షనర్స్ దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం కరీంనగర్ జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు రాచ ఆనంద్, కోశాధికారి బి.నరేందర్, కార్యదర్శి పి. రామచందర్‌రావులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

గోరు వ్యాధుల శస్త్రచికిత్సలపై అవగాహన



జ్యోతిప్రజ్వలన చేస్తున్న సయ్యద్ ఆసీమ్ అలీ

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం బొమ్మకల్‌లోని చల్మెడ ఆనందరావు ఆస్పత్రిలో ఆదివారం ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ డెర్మాటాలజీ కరీంనగర్ శాఖ ఆధ్వర్యంలో గోరు వ్యాధులు–శస్త్రచికిత్సలపై అవగాహన సదస్సు నిర్వహించారు. మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సయ్యద్ ఆసీమ్ అలీ ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతిప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభించారు. ప్రముఖ చర్మవ్యాధుల నిపుణులు అనూప్‌కుమార్ లఖ్రా, నానిశెట్టి రమేశ్, రాకేశ్‌కుమార్‌లు గోరు సంబంధిత వ్యాధులు, శస్త్రచికిత్సలను వివరించారు. కార్యక్రమంలో వైద్యులు జంగం అంజిబాబు, కమల్ లాహోటి, ఆనంద్ కుమార్, నరేందర్, నవీన్‌కుమార్, సరితతో పాటు పీజీ వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు

ఇల్లందకుంట : అపర భద్రాదిగా పేరొందిన శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవాల్లో చివరిరోజైన ఆదివారం రాత్రి సీతారామ లక్ష్మణ సమేత ఏకాంత సేవతో ఉత్సవాలను ఆలయ ఈవో కందుల సుధాకర్ ఆధ్వర్యంలో వైభవంగా ముగించారు. అంతకుముందు అర్చకులు రామాచార్యులు, వంశీధర్ ఆచార్యుల వేదమంత్రోచ్చరణలు, మేళతాలాల నడుమ పల్లకీలో స్వామివారిని ఆలయం చుట్టూ ఊరేగించారు. అనంతరం ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. చివరి రోజు ఆలయానికి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

శ్రీమార్కండేయ యువజన సంఘం ఎన్నిక



ఎన్నికైన కార్యవర్గం

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం దుర్శేడ్‌లో ఆదివారం శ్రీమార్కండేయ యువజన సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బోగ రాజ్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా గౌడ హరీశ్, ప్రధాన కార్యదర్శిగా నాగుల ప్రకాశ్, కార్య నిర్వహణ కార్యదర్శిగా వేముల మహేందర్, ప్రచార కార్యదర్శిగా బాలి సత్యనారాయణ, మెరుగు మహేందర్, కోశాధికారిగా గాజుల రాజేందర్ ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా బోగ అమర్, గౌడ రామరాజు, గంట్యాల స్వామి, గౌడ సంతోశ్, నల్ల మహేశ్, వేముల రాజేశం, రాజు, శ్రీకాంత్‌లను ఎన్నుకున్నారు.

ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

మానకొండూర్ : వైఎస్సార్‌టీపీ అధినేత్రి షర్మిల ఆదేశాల మేరకు ఆదివారం టీ–సేవ్ కార్యక్రమంలో మూడవరోజు ప్రభుత్వ దిష్టిబొమ్మను మానకొండూరు బస్టాండ్ కూడలిలో దహనం చేశారు. నియోజకవర్గ ఇన్‌చార్జి దుబ్బ నీరజ మాట్లాడుతూ నిరుద్యోగులకు ఉద్యోగాలు భర్తీ చేయాలని, నిరుద్యోగ భృతి చెల్లించాలని డిమాండ్ చేశారు. పేపర్ లీకేజీపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలన్నారు. కార్యక్రమంలో పారల సంపత్, పుల్లెల రామ్‌రెడ్డి, శ్రావణ్, శేఖర్, రాజు, నారాయణ, బాపిరెడ్డి, పద్మ, లక్ష్మి, జింక అనూష, స్రవంతి, భాగ్యలక్ష్మి, అంజయ్య, రాజేశ్, కొమురయ్య, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

అండర్ వాటర్ టన్నెల్ ఆక్వా ఎగ్జిబిషన్ ప్రారంభం



ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న మంత్రి కమలాకర్

సప్తగిరికాలనీ(కరీంనగర్): తెలంగాణ ట్రేడ్ ఫెయిర్ ఎగ్జిబిషన్ టీం ఆధ్వర్యంలో నగరంలోని పద్మనగర్ డెయిరీ పక్కన ఏర్పాటు చేసిన అండర్ వాటర్ టన్నెల్ ఆక్వా ఎగ్జిబిషన్‌ను ఆదివారం రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బి.వినోద్ కుమార్, మేయర్ వై.సునీల్‌రావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు రాజిరెడ్డి, మహ్మద్ ఇలియాస్, మహ్మద్ అలీ, మహ్మద్ సమీర్‌లు మాట్లాడుతూ బ్రేక్ డాన్స్, జాయింట్ వీల్, కొలంబస్, సునామీ, స్నో వరల్డ్, డ్రాగన్ ట్రెయిన్ వంటి 20 అమేజింగ్ రైడ్స్ ఎగ్జిబిషన్‌లో ఉన్నాయని, వందకుపైగా స్టాళ్లు ఏర్పాటు చేశామని అన్నారు. నదీ జలాలలో ఉండే ఖరీదైన చేపలు, సముద్ర గర్భంలో కంటికి కనిపించకుండా జీవించే వివిధ రకాలు రంగులతో కూడిన మత్స్య సంపదను కనువిందు చేసేలా ఏర్పాటు చేశామని తెలిపారు. కార్యక్రమంలో పలువురు కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

హుజూరాబాద్: పట్టణంలోని అంబేద్కర్ చౌక్ సమీపంలో ఆదివారం మాల మహానాడు ఉపకులాల ఆత్మీయ సమ్మేళనానికి సంబంధించిన పోస్టర్‌ను ఆదివారం మాల మహానాడు మండల కమిటీ బాధ్యులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు నీరటి రమేశ్ కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేడి అంజయ్య, శంకరపట్నం మండలాధ్యక్షుడు కత్తెర మల్ల కృష్ణస్వామి, సాల్లు బాబు, సదానందం , నర్సింగం, స్వామి, తదితరులున్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



అప్యాయ పలకరింపులు.. చిలిపి చేష్టలు.. కోతి పనులు.. తదితర పాఠశాల స్మృతులను నాలుగు దశాబ్దాల అనంతరం నెమరేసుకున్న సందర్భంగా ఉత్సాహాన్ని నింపింది. వివిధ రంగాల్లో స్థిరపడ్డ వారంతా ఒక్కచోట కలుసుకోవడం ఆనందానికి హద్దులు లేకుండా చేసింది. పాత జ్ఞాపకాలను తలుచుకుంటూ.. కుటుంబ నేపథ్యం తెలుసుకుంటూ ఆనందంలో మునిగితేలారు. కొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి 1981–82 బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం 41 ఏళ్లకు కలుసుకున్నారు. కొత్తపల్లిలోని ఓ ఫంక్షన్ హాల్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించి గురువులు రావు గోపాల్‌రావు, జగన్‌మోహన్ రెడ్డి, కిషన్‌రావు, నర్సయ్య, రాగయ్యలను ఘనంగా సత్కరించారు.

-కొత్తపల్లి



కరీంనగర్ మండలం మొగ్దుంపూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో ఆదివారం 1987–88 సంవత్సరం పదో తరగతి విద్యార్థులు సమావేశం నిర్వహించారు. 35ఏళ్ల తర్వాత అందరం కలుసుకోవడం సంతోషం కలిగించిందని పలువురు విద్యార్థులు తెలిపారు. అప్పటి మధుర జ్ఞాపకాలను, తీపిగుర్తులను వివరించారు. ప్రధానోపాధ్యాయులు గంగాధర్‌తో పాటు ఉపాధ్యాయులు తిరుపతిరెడ్డి, నర్సయ్య, మురళీ, పద్మలత, అటెండర్ సత్తయ్యలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జక్కం నర్సయ్య, పూర్వ విద్యార్థులు పోతర్ల రఘు, మహేందర్‌రెడ్డి, మంద తిరుపతి, అక్కి బాలకిషన్, పూరెల్ల అంజయ్య, రమణారావు, ఎస్. రవి, ఆకుల శ్రీనివాస్, మూలస్వామి, శ్రీనివాస్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, రవికుమార్, రమాదేవి, మణెమ్మ పాల్గొన్నారు.

- కరీంనగర్‌రూరల్



నగరంలోని శ్రీవిద్యానికేతన్ పాఠశాల 1993–94 విద్యా సంవత్సరానికి చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఓ ఫంక్షన్‌హాల్‌లో ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. వివిధ ప్రాంతాల్లో పలు హోదాల్లో, రంగాల్లో స్థిరపడ్డ వ్యక్తులంతా ఒకే చోట కలుసుకొని ఆనాటి మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. చిన్ననాటి ఆట, పాటలు, నృత్యాలతో పరిచయాలు, పలకరింపులతో సందడి చేశారు. కార్యక్రమంలో రజనీకాంత్, సదానందం, రమేశ్, రంజిత్‌కుమార్, మురళీ, శశిధర్, సంజయ్ ప్రసన్న, సురేశ్, జనార్దన్, వేణుగోపాల్, పునిత, సరిత, గంగాభవానీ, అనిత, రజిత, జయ పాల్గొన్నారు.

- సప్తగిరికాలనీ

క్లుప్తంగా...

రాష్ట్రంలో రాచరిక పాలన

ప్రశ్నించే స్వేచ్ఛ ఎమ్మెల్యేలకే లేదు: ఈటల రాజేందర్



వనపర్తి: ఎందరో ఆత్మబలిదానాలతో ఆవిర్భవించిన తెలంగాణ రాష్ట్రంలో రాజరిక పాలన సాగుతోందని బీజేపీ నేత, హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ విమర్శించారు. వనపర్తి జిల్లాకేంద్రంలో ఆదివారం నిర్వహించిన బీసీల ఆత్మగౌరవ సభలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. గతంలో తెలంగాణ ఫ్లోర్‌లీడర్‌గా అసెంబ్లీలో హక్కులు, అధికారాలు, ప్రజాధనం గురించి గద్దించి ప్రశ్నించే స్వేచ్ఛ ఉండేదన్నారు. కానీ ప్రస్తుత కేసీఆర్ పాలనలో మారుమూల గ్రామం నుంచి అసెంబ్లీ వరకు ప్రశ్నించే అవకాశం లేకుండా ఉక్కుపాదం మోపుతూ.. ప్రజాస్వామ్యం అనే పదాన్ని ఉచ్చరించకుండా చేస్తున్నారని విమర్శించారు. హుజూరాబాద్ ఉప ఎన్నికల్లో తాను గెలుపొందిన తర్వాత అసెంబ్లీ సమావేశాల్లో మాట్లాడేందుకు ప్రయత్నిస్తే.. సభ నుంచి బయటకు పంపించిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. రాష్ట్రంలో శాశ్వతంగా తామే అధికారంలో ఉంటామనే భ్రమలో బీఆర్ఎస్ నాయకులు అణచివేతకు పాల్పడటం తగదని ఈటల హెచ్చరించారు.

హక్కుల కోసం పోరాడిన జస్టిస్ చిన్నప్పరెడ్డి



మాడభూషి శ్రీధర్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం(హైదరాబాద్): తరిమెల నాగిరెడ్డి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ప్రజాపక్ష న్యాయమూర్తి జస్టిస్ ఓ.చిన్నప్పరెడ్డి శత జయంతి సభ జరిగింది. ఈ సందర్భంగా చిన్నప్పరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ప్రముఖులు నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సమాచార హక్కు చట్టం మాజీ జాతీయ కమిషనర్, ప్రొఫెసర్ మాడభూషి శ్రీధర్ మాట్లాడుతూ.. న్యాయవ్యవస్థలో పని చేస్తూ ప్రజల హక్కుల కోసం నిలిచిన గొప్ప వ్యక్తి చిన్నప్పరెడ్డి అని కొనియాడారు. ఆయన ఎక్కడ పని చేసినా శ్రామికుల గొంతుకగా నిలిచారని గుర్తు చేశారు.తన సుదీర్ఘ అనుభవంలో ఎన్నో చారిత్రక తీర్పులు ఇచ్చిన గొప్ప వ్యక్తి అని అన్నారు. ప్రొఫెసర్ తోట జ్యోతిరాణి, సీనియర్ అడ్వొకేట్ ఎస్.సైదారావు, సీనియర్ జర్నలిస్టు ఎం.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా సందడి



తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ స్టిక్కర్‌కు హారతులిస్తున్న మహిళలు

ఏపీ వ్యాప్తంగా 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమం పండుగ వాతావరణంలో కొనసాగుతోంది. ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జ్‌లు, సమన్వయకర్తలు, కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లు కలసికట్టుగా ఇంటింటికీ వెళ్తున్నారు. జగనన్న ప్రతినిధులుగా వచ్చిన వీరందరినీ.. తమ ఇంటికి బంధువులొచ్చినంత సంబరంగా ప్రజలు చిరునవ్వుతో ఆహ్వానిస్తున్నారు. 'ఎమ్మెల్యే వద్దకు ప్రజలు వెళ్లడం మామూలే.. అందుకు విరుద్ధంగా ప్రజల వద్దకే ఎమ్మెల్యే రావడం అంటే అది కేవలం ఒక్క జగనన్న వల్లే సాధ్యమైంది' అంటూ హర్షం వ్యక్తం చేస్తున్నారు. సీఎం వైఎస్ జగన్ పలు విధాలా తమను ఆదుకుంటున్నారని, ఇలా ఆదుకుంటుండటం కొంత మంది పెత్తందారులకు గిట్టడం లేదని అక్కచెల్లెమ్మలు నేతల వద్ద ఆవేదన వ్యక్తం చేశారు.

36% 'వంట' చెరకే!

దేశంలో వంటకు గ్యాస్ వాడకం 62 శాతం

- గ్రామీణ ప్రాంతాల్లో 46.7 శాతం కట్టెలు, వరిపొట్టు, పంట అవశేషాలతోనే
- ఛత్తీస్‌గఢ్‌లో అత్యధికంగా గ్రామీణ ప్రాంతాల్లో 84.2 శాతం కట్టెలతోనే వంట
- ఉచితంగా వంట చెరకు లభించడం, గ్యాస్ ధరలు భగ్గుమనడం కారణాలు
- కేంద్ర పర్యావరణ గణాంకాలు 2023 నివేదికలో వెల్లడి



సాక్షి, అమరావతి: దేశంలో 62 శాతం మంది వంట కోసం ఎల్పీజీ (గ్యాస్)ని వినియోగిస్తుండగా 36 శాతం ప్రజలు మాత్రం వంట చెరకునే వాడుతున్నట్లు కేంద్ర పర్యావరణ గణాంకాల నివేదిక వెల్లడించింది. 33.8 శాతం మంది కట్టెలు, పొట్టు, పంట అవశేషాలపై ఆధారపడుతుండగా 2.2 శాతం మంది వంట కోసం పిడకలను వినియోగిస్తున్నారు. 1.3 శాతం మంది కిరోసిన్, గోబర్ గ్యాస్, ఎలక్ట్రికల్, బొగ్గుల పొయ్యిపై వంట చేస్తున్నారు. ఇక ఎల్పీజీ వినియోగంలో గ్రామాలకు, పట్టణ ప్రాంతాలకు మధ్య భారీ వ్యత్యాసం ఉంది. గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో కట్టెలు, పొట్టు, పంట అవశేషాలు ఉచితంగా లభిస్తుండటంతోపాటు బూడిదను పంట పొలాలకు ఎరువుగా వాడుతున్నందున వీటివైపు మొగ్గు చూపుతున్నారు. ఇక భగ్గుమంటున్న గ్యాస్ ధరలు కూడా కారణమే. ఈమేరకు కేంద్ర పర్యావరణ నివేదిక 2023ని గణాంకాలు, కార్యక్రమాల అమలు శాఖ విడుదల చేసింది.

- గ్రామీణ ప్రాంతాల్లో 49.4 శాతం మంది ఎల్పీజీ వాడుతుండగా 46.7 శాతం మంది కట్టెలు, పొట్టు, పంట అవశేషాలపై ఆధారపడుతున్నారు. మూడు శాతం మంది పిడకలు, 0.7 శాతం మంది గోబర్ గ్యాస్, కిరోసిన్, ఎలక్ట్రికల్, బొగ్గుల పొయ్యిలను వాడుతున్నారు.
- పట్టణ ప్రాంతాల్లో 89 శాతం మంది వంట కోసం ఎల్పీజీ వాడుతుండగా 6.5 శాతం మంది కట్టెలు, పొట్టు, పంట అవశేషాలను వినియోగిస్తున్నారు. 0.3 శాతం మంది పిడకలు, 2.5 శాతం గోబర్ గ్యాస్, ఎలక్ట్రికల్, కిరోసిన్, బొగ్గుల పొయ్యిలను వాడుతున్నారు.
- ఛత్తీస్‌గఢ్ గ్రామీణ ప్రాంతాల్లో అత్యధికంగా 84.2 శాతం మంది వంట కోసం కట్టెలు, పొట్టు, పంట అవశేషాలపైనే ఆధారపడుతున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని గ్రామీణ ప్రాంతాల్లో 16.3 శాతం మంది కట్టెలు, పొట్టు, పంట అవశేషాలపై వంట చేస్తుండగా 81.7 శాతం మంది ఎల్పీజీ వినియోగిస్తున్నారు.

వందే భారత్ రైలులో ఏపీ సీఎస్ ప్రయాణం



తిరుపతి అర్బన్: వందే భారత్ రైలులో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కేఎస్ జవహర్ రెడ్డి ప్రయాణించారు. రెండు రోజుల జిల్లా పర్యటన నిమిత్తం తిరుపతి వచ్చిన ఆయన ఆదివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం తిరుపతి రైల్వేస్టేషన్‌లో మీడియాతో మాట్లాడారు. ప్రధాని మోదీ శనివారం సికింద్రాబాద్‌లో వందే భారత్ ట్రైన్ ప్రారంభించడం శుభపరిణామమని తెలిపారు. యాత్రికులకు ఎంతో సౌకర్యంగా ఉంటుందని పేర్కొన్నారు. అనంతరం సీఎస్ జవహర్ రెడ్డి తిరుపతి రైల్వేస్టేషన్ నుంచి వందే భారత్ రైలులో గుంటూరుకు వెళ్లారు. అక్కడ నుంచి విజయవాడకు వెళ్లనున్నారు. ఆయనకు టీటీడీ ఈవో ధర్మారెడ్డి, జిల్లా కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి, జాయింట్ కలెక్టర్ డీకే బాలాజీ, టీటీడీ జేఈఓలు సదాభార్గవి, వీరబ్రహ్మయ్య, నగరపాలక కమిషనర్ హరిత, స్టేషన్ డైరెక్టర్ సత్యనారాయణ వీడ్కోలు పలికారు.

పొదుపు మహిళల 'అర్బన్ మార్కెట్లు'

స్వయంగా తయారు చేసిన ఉత్పత్తులను విక్రయించుకునేలా స్టాళ్లు



గత నెలలో విశాఖపట్నంలో నిర్వహించిన అర్బన్ మార్కెట్‌లోని స్టాళ్లు

- శ్రీకాకుళం, విశాఖలో 'మెప్మా' పైలెట్ ప్రాజెక్టు విజయవంతం..
- ఏపీలోని అన్ని పట్టణాల్లో ఏర్పాటుకు సన్నద్ధం

సాక్షి, అమరావతి: పట్టణ మహిళల ఆర్థిక పరిస్థితిని మెరుగుపరుస్తూ స్వయం సహాయక సంఘాల మహిళలు స్వయంగా తయారు చేసే ఉత్పత్తులకు మార్కెట్ కల్పించేలా ఏపీ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ద్వారా పలు అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా 'అర్బన్ మార్కెట్ల'ను ఏర్పాటు చేయనుంది. పైలెట్ ప్రాజెక్టుగా శ్రీకాకుళం, విశాఖలో నెలకొల్పిన అర్బన్ మార్కెట్లు విజయవంతం కావడంతో రాష్ట్రంలోని 123 కార్పొరేషన్లు, పురపాలక సంఘాలు, నగర పంచాయతీల్లో ఈ నెలలోనే వీటిని ఏర్పాటు చేయాలని మెప్మా నిర్ణయించింది. మెప్మా రెండేళ్ల క్రితం 7 నగరాల్లో ఏర్పాటు చేసిన 'జగనన్న మహిళా మార్టులు' విజయవంతం కావడం తెలిసిందే. ఈ నేపథ్యంలో కొత్తగా అర్బన్ మార్కెట్ల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని సిటీ మిషన్ మేనేజర్లకు(సీఎంఎం)మెప్మా ఎండీ ఆదేశాలు జారీ చేశారు. దుకాణాల ఏర్పాటుకయ్యే ఖర్చును మెప్మా చెల్లించనుంది. వీటిల్లో పొదుపు మహిళలు తయారు చేసిన వివిధ ఉత్పత్తులను విక్రయించుకునేలా ఏర్పాట్లు చేస్తారు. వైఎస్సార్ చేయూత, ఆసరాతోపాటు సున్నావడ్డీ రుణాలు తీసుకున్న పొదుపు సంఘాల మహిళలకు స్వయం ఉపాధి కల్పించేలా అర్బన్ మార్కెట్లను అందుబాటులోకి తెస్తున్నారు.

అద్భుతమైన అవకాశం

ఇంట్లో మసాలాలు, కారప్పొడులు లాంటి 26 రకాల పొడులు తయారు చేస్తుంటా. గతంలో తెలిసినవారికి, బంధువులకు మాత్రమే విక్రయించగా రూ.2 వేలు కూడా వచ్చేవి కాదు. ఇటీవల విశాఖలో అర్బన్ మార్కెట్‌లో రెండు రోజులు స్టాల్ నిర్వహించగా రూ.17 వేల మేర వ్యాపారం జరిగింది. కొత్త వినియోగదారులు పరిచయం కావడంతో ఆన్‌లైన్‌లో కూడా ఆర్డర్లు వస్తున్నాయి. అర్బన్ మార్కెట్ ద్వారా అనూహ్యంగా వ్యాపారం పుంజుకోవడం చాలా ఆనందంగా ఉంది.

– జి.సత్యరాజ్యలక్ష్మి, విశాఖపట్నం ఎంటర్‌ప్రెన్యూర్

ఈ-వ్యర్థాల సేకరణ కేంద్రాలు

ఏపీలోని ప్రభుత్వ కార్యాలయాల్లోని ఎలక్ట్రానిక్ వ్యర్థాల సేకరణకు ఏర్పాట్లు

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాల్లో పేరుకుపోతున్న ఎలక్ట్రానిక్ వ్యర్థాలను (ఈ-వేస్ట్‌ను) పర్యావరణహితంగా తొలగించడంపై ఏపీ ప్రభుత్వం దృష్టిసారించింది. పాలనలో పారదర్శకత కోసం రాష్ట్ర ప్రభుత్వం అన్ని సేవలను ఆన్‌లైన్ విధానంలో అందిస్తుండడంతో ప్రభుత్వ కార్యాలయాల్లో ఈ-వేస్ట్ భారీగా పెరిగిపోతుండటాన్ని సర్కారు గుర్తించింది. ఏటా ప్రభుత్వ కార్యాలయాల నుంచి వెయ్యి టన్నుల ఈ-వేస్ట్ ఉత్పత్తి అవుతున్నట్లు ప్రభుత్వం ప్రాథమికంగా అంచనా వేసింది. కంప్యూటర్లు, ట్యాబులు, మొబైల్ ఫోన్లు, రూటర్లు, స్విచ్‌లు, వైర్లు వంటి వాటి కాలపరిమితి తీరిపోయి పనిచేయనివాటిని సేకరించి రీసైక్లింగ్, డిస్పోజబుల్ చేసేవిధంగా ఒక వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించింది. ప్రభుత్వ కార్యాలయాల నుంచి ఈ వేస్ట్ సేకరణకు నోడల్ ఏజెన్సీగా ఏపీ టెక్నాలజీస్ సర్వీసెస్ (ఏపీటీఎస్)ని నియమించింది. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి నిబంధనల మేరకు ఈ-వ్యర్థాలను రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల నుంచి ఈ-వ్యర్థాలను సేకరించి వాటిని తీసుకెళ్లి రీసైక్లింగ్, రీ-ఫర్‌బిషింగ్, డిస్పోజబుల్ చేసే బాధ్యతల్ని అప్పగించేందుకు ఏపీటీఎస్ టెండర్లు పిలిచింది. ఆసక్తిగల సంస్థల నుంచి బిడ్లను ఆహ్వానించింది. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ శాఖలు, కార్పొరేషన్లు, కార్యాలయాలు, సంస్థల నుంచి ఈ-వేస్ట్ సేకరించే విధంగా కార్యాలయాలను ఏర్పాటు చేయనున్నారు.

సత్యాగ్రహ సభ విజయవంతం చేయండి

- మాజీ ఎమ్మెల్సీ ప్రేమ్‌సాగర్‌రావు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ ప్రేమ్‌సాగర్‌రావు

మంచిర్యాలటౌన్: సీఎల్పీ నేత భట్టి విక్రమార్క ఉమ్మడి జిల్లాలో చేపడుతున్న హాథ్ సే హాథ్ జోడో పాదయాత్ర సందర్భంగా మంచిర్యాల జిల్లా నస్పూర్‌లో ఈనెల 14న నిర్వహించే సత్యాగ్రహ సభను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్సీ కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు పిలుపునిచ్చారు. జిల్లాకేంద్రంలోని ఆయన నివాసంలో ఆదివారం ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడారు. ఏఐసీసీ అధ్యక్షుడిగా మల్లికార్జున్ ఖర్గే ఎన్నికైన తర్వాత రాష్ట్రంలోనే మొట్టమొదటి సభను మంచిర్యాల జిల్లాలో చేపట్టడం ఆనందంగా ఉందన్నారు. ఈ సభకు టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, మాజీ అధ్యక్షులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నాయకులు హాజరవుతారని పేర్కొన్నారు. లక్షకు పైగా కార్యకర్తలు, అభిమానులతో సభ విజయవంతం చేసేలా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. కొన్ని అనివార్య కారణాలతో సభను 14న మార్చామని, ఆ రోజున బీఆర్ అంబేద్కర్ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తామన్నారు. పాలనలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని, వారి వైఫల్యాలను సత్యాగ్రహ సభలో ఎండగట్టాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ఉప్పలయ్య, చిట్ల సత్యనారాయణ, పూదరి తిరుపతి, తూముల నరేశ్, కొండ చంద్రశేఖర్, ఒడ్డె రాజమౌళి, వేములపల్లి సంజీవ్, పూదరి సునీత, జోగుల శ్రీదేవి, పెంట రజిత తదితరులు పాల్గొన్నారు.

మామిడి కోతలు షురూ



నెన్నెల: మండలంలోని ఆవుడం, చిత్తాపూర్, జెండా వెంకటాపూర్, కొత్తూర్, చిన్నవెంకటాపూర్, నెన్నెల, గొల్లపల్లి గ్రామాల్లో మామిడి కాయల కోతలు ప్రారంభమయ్యాయి. మండలంలో 6 వేల ఎకరాల్లో మామిడి సాగైంది. గతేడాదితో పోల్చితే ఈసారి దిగుబడి బాగానే ఉందని రైతులు పేర్కొంటున్నారు. గతేడాది బంగినపల్లి మామిడి కిలో రూ.20 నుంచి రూ.30 పలకగా ఈ యేడు రూ.30 నుంచి రూ.40 ధర పలుకుతుంది. కోసిన కాయలను బొలోరా, డీసీఎం వ్యాన్లలో మహారాష్ట్రలోని చంద్రాపూర్, నాగ్‌పూర్‌కు తరలిస్తున్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక



క్రీడాకారులతో అథ్లెటిక్స్ అసోసియేషన్ సభ్యులు

నస్పూర్: పట్టణ పరిధిలోని సీతారాంపల్లి జిల్లా ప్రజా పరిషత్ పాఠశాలలో ఆదివారం నిర్వహించిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ అండర్ 20 ఫెడరేషన్ కప్ ఎంపిక పోటీల్లో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎం.సాంబమూర్తి, మారయ్య తెలిపారు. ఈ నెల 15, 16 తేదీల్లో హన్మకొండలోని జేఎస్ఎస్ స్టేడియంలో నిర్వహించే రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీల్లో ఈ క్రీడాకారులు జిల్లా తరుపున పాల్గొంటారని వివరించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ సురిమిల్ల వేణు, పీఈటీలు శ్రీధర్, భాస్కర్, సీనియర్ క్రీడాకారుడు వంశీ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు..
కార్తీక్ (కోటపల్లి), వంశీ (మంచిర్యాల), మనోజ్ (మంచిర్యాల), సాయివర్మ (కోటపల్లి), అనిల్ (కోటపల్లి), దినకర్ (సీతారాంపల్లి), నందిని (దేవాపూర్), సాయిపల్లవి(జైపూర్), లక్ష్మి (కోటపల్లి), సౌజన్య (లక్షెట్టిపేట), మేఘన (దేవాపూర్), చంద్రశేఖర్ (శ్రీరాంపూర్).

కరోనా చికిత్సకు ముందస్తు చర్యలేవీ?

- రామగుండం జీజీహెచ్‌లో ఏర్పాటవని ఐసోలేషన్ వార్డు
- పెద్దపల్లి జిల్లాలోని నాలుగు ఆసుపత్రుల్లో 120 బెడ్స్
- నేటి నుంచి మాక్‌డ్రిల్



రామగుండం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి

కోల్‌సిటీ(రామగుండం): రామగుండం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి(జీజీహెచ్)లో కరోనా చికిత్సకు ముందస్తు చర్యలు చేపట్టలేదు. ప్రత్యేక ఐసోలేషన్ వార్డును ఏర్పాటు చేయలేదు. ఇటీవల దవాఖానాకు చికిత్స కోసం వచ్చిన ఓ గర్భిణికి కరోనా పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యింది. మందులు ఇచ్చి, పలు సూచనలు చేసిన వైద్యులు ఇంటి దగ్గరే తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పంపించారు. సోమవారం నుంచి పెద్దపల్లి జిల్లాలోని జీజీహెచ్ తోపాటు పెద్దపల్లి, సుల్తానాబాద్, మంథని ప్రభుత్వ ఆసుపత్రుల్లో కోవిడ్ ట్రీట్‌మెంట్‌కు ముందస్తుగా చేపట్టిన చర్యలపై డీఎంహెచ్‌వో డాక్టర్ ప్రమోద్‌కుమార్ నేతృత్వంలో మాక్‌డ్రిల్ నిర్వహించనున్నారు.

మొక్కుబడి చర్యలంటూ ఆరోపణలు..
నిత్యం పెరుగుతున్న కోవిడ్ కేసులతో అప్రమత్తమైన కేంద్రం ఈ నెల 10, 11 తేదీల్లో అన్ని ఆసుపత్రుల్లో కరోనా ట్రీట్‌మెంట్‌పై మాక్‌డ్రిల్ నిర్వహించాలని ఇటీవల రాష్ట్ర ప్రభుత్వాలకు సూచించింది. ఎమర్జెన్సీ హాట్‌స్పాట్లను గుర్తించడం, కరోనా పరీక్షలు, వ్యాక్సిన్లను అందించడంతోపాటు ఆసుపత్రుల్లో మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టిసారించాలని చెప్పింది. కానీ రామగుండం జీజీహెచ్‌లో మాత్రం కరోనా ఐసోలేషన్ వార్డు ఏర్పాటుపై అధికారులు మొక్కుబడిగా చర్యలు తీసుకుంటున్నారన్న ఆరోపణలున్నాయి. ఆదివారం సాయంత్రం వరకూ వార్డు ప్రాంతంలో పనులు చేపట్టారు. అక్కడున్న గదులు, బాత్‌రూంలకు డోర్లు ఏర్పాటు చేయలేదు.

బెడ్స్ అందుబాటులో ఉంచుతాం..
కోవిడ్ కేసులు పెరిగితే పేషెంట్లకు మెరుగైన వైద్యం అందించడానికి గతంలో మాదిరిగానే జిల్లాలోని నాలుగు ఆసుపత్రుల్లో 120 ఐసోలేషన్ బెడ్స్ ఏర్పాటు చేస్తున్నట్లు డీఎంహెచ్‌వో తెలిపారు. రామగుండం జీజీహెచ్‌లో 50, పెద్దపల్లిలో 40, సుల్తానాబాద్‌లో 20, మంథని ప్రభుత్వ ఆసుపత్రిలో 10 బెడ్స్‌ను అందుబాటులో ఉంచుతామన్నారు. ఇప్పటికే ఆయా ఆసుపత్రుల అధికారులు నివేదిక కూడా ఇచ్చారని పేర్కొన్నారు.

ఆక్సిజన్ ప్లాంట్లు సిద్ధం..



కోవిడ్ పేషెంట్లకు తక్షణం చికిత్స అందించడానికి అవసరమైన ఆక్సిజన్ ప్లాంట్లు సిద్ధంగా ఉన్నాయి. రామగుండం జీజీహెచ్‌లోని ప్లాంట్‌ను ప్రస్తుతం ఉపయోగిస్తున్నారు. పెద్దపల్లి, సుల్తానాబాద్ ఆసుపత్రుల్లోనూ వినియోగంలోకి వచ్చాయి. సోమవారం నుంచి నాలుగు దవాఖానాల్లో కోవిడ్ పేషెంట్ల కోసం చేపట్టిన చర్యలు, ఐసోలేషన్ వార్డులు, బెడ్స్, టెస్టుల తీరుపై తనిఖీలు చేస్తాం. – డాక్టర్ ప్రమోద్‌కుమార్, డీఎంహెచ్‌వో, పెద్దపల్లి

ఉద్యోగుల అ'పూర్వ' సమ్మేళనం



గతంలో పని చేసిన అధికారులతో పూర్వ ఉద్యోగులు

రెబ్బెన(ఆసిఫాబాద్): ఒక్కొక్కరిది ఒక్కో ప్రాంతం.. వేర్వేరు భాషలు.. విభిన్న సంస్కృతి.. అయినా వారందరినీ ఒక్కటి చేసింది సిరుల తల్లి సింగరేణి తల్లి. కలిసి పనిచేసినంత కాలం కష్టసుఖాల్లో తోడుగా నిలుస్తూ కుటుంబ సభ్యుల్లా మెదిలారు. ఉద్యోగ విరమణతో కొంత మంది దూరం ప్రాంతాలకు వెళ్లిపోగ, మిగిలిన ఉద్యోగులను గని మూసివేతతో యాజమాన్యం తలో దిక్కుకు పంపించింది. అధికారులు కూడా పదోన్నతులు, రిటైర్‌మెంట్లతో వేర్వేరు ప్రాంతాల్లో స్థిరపడ్డారు. వీరంతా పూర్వ ఉద్యోగుల సమ్మేళనంతో మళ్లీ ఒకచోట చేరారు. ఆదివారం బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి – 1 ఆవరణలో 1977 నుంచి 2016 వరకు గోలేటి 1, 1ఏ గనిలో పనిచేసిన ఉద్యోగులు, అధికారులు కలిసి శ్రీరాంపూర్ ఏరియా ప్రస్తుత జనరల్ మేనేజర్, ఒకప్పటి గోలేటి 1 ఇంక్లైన్ మేనేజర్ సంజీవరెడ్డి అధ్యక్షతన సమ్మేళనం నిర్వహించారు. ఉద్యోగులు ఏళ్ల తర్వాత ఒక్కచోట కలుసుకుని యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఒకే గనిలో పనిచేసిన అప్పటి అధికారులను మర్యాదపూర్వకంగా పలకరించారు. జీఎం సంజీవరెడ్డి మాట్లాడుతూ పూర్వ ఉద్యోగులందరినీ మరోసారి కలవడం సంతోషకరంగా ఉందన్నారు. కార్యక్రమాల్లో రిటైర్డ్ జనరల్ మేనేజర్ అప్పారావు, రిటైర్డ్ ఎస్‌వోటూజీఎం కరుణాకర్, రిటైర్డ్ ఏజెంట్ సాహెబ్ హుస్సేన్, మణుగూరు ప్రాజెక్టు ఆఫీసర్ శ్రీనివాసచారి, ఎస్ఎంఎస్ ప్లాంట్ పీవో నూక రమేశ్, ఏజెంట్ వెంకటేశ్వర్‌రావు, క్వాలిటీ మేనేజర్ రమణ, ఇన్‌చార్జి ఏరియా జీఎం గుప్తా, టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌రావు, ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి ఎస్.తిరుపతి, ఐఎన్‌టీయూసీ ఏరియా ఉపాధ్యక్షుడు పేరం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సంఘ విద్రోహుల విషయంలో జాగ్రత్త

- ఆర్ఎస్ఎస్ తెలంగాణ ప్రాంత అధ్యక్షుడు బూర్ల దక్షిణామూర్తి



సమావేశంలో మాట్లాడుతున్న దక్షిణామూర్తి

సుల్తానాబాద్(పెద్దపల్లి): సంఘ విద్రోహుల విషయంలో జాగ్రత్తగా ఉండాలని ఆర్ఎస్ఎస్ తెలంగాణ ప్రాంత అధ్యక్షుడు బూర్ల దక్షిణామూర్తి అన్నారు. నైజాం విముక్త స్వాతంత్ర్య అమృతోత్సవాల్లో భాగంగా పెద్దపల్లిలోని ఓ కల్యాణ మండపంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమాజంలో ఉన్న ప్రతిష్ఠిత వ్యక్తులే సమాజాన్ని జాగృతం చేయాలన్నారు. శతాబ్దాల తరబడి హిందువులు చేసిన పోరాటాలు, బలిదానాల కారణంగా నైజాం పాలన నుండి విముక్తి లభించిందని, పరకాల ఉదంతం మరో జలియన్ వాలాబాగ్ అని, బైరాన్‌పల్లి ఘటన మరువరానిదని, రజాకార్లు స్త్రీలతో బట్టలు లేకుండా బతుకమ్మ ఆడించారని పేర్కొన్నారు. బత్తిని మొగిలయ్యగౌడ్, రాంజీ గోండు, కొమురంభీం, చాకలి ఐలమ్మ, నారాయణరావు పవార్, షోయబుల్లాఖాన్, వందేమాతరం రామచందర్‌రావు, భాగ్యరెడ్డివర్మ వంటి వారే కాకుండా ఆర్యసమాజ్, ఆంధ్ర మహాసభ, గ్రంథాలయ, స్టేట్ కాంగ్రెస్ ఉద్యమాల ప్రేరణతో స్వయం సేవకులు, విద్యార్థులు ఉద్యమాలు చేశారని తెలిపారు. కమ్యూనిస్టులు ప్రేక్షక పాత్ర పోషించారని, హైదరాబాద్ సంస్థానం భారత్‌లో కలవకుండా సైనిక చర్యను వ్యతిరేకించారని, నిజాం పోలీసులు, రజాకార్ల అత్యాచారాలను ప్రోత్సహించారని ఆరోపించారు. ఉత్సవ సమితి అధ్యక్షుడు శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి డాక్టర్ పి.మల్లేశం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సమితి గౌరవ అధ్యక్షుడు చెరుకు మహేశ్, ఉపాధ్యక్షులు సిరిహె సంజయ్‌కుమార్, మొగుసాల రమణారెడ్డి, కార్యదర్శులు లింగం శ్రీనివాస్, ముస్కుల భాస్కర్‌రెడ్డి, నగర అధ్యక్షుడు గట్టు రామచంద్రారెడ్డి, నాయకులు కొంపెల రాజన్న, గడ్డి రమేశ్, గంధం రవీందర్, ముస్కుల సునీల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమరశీల పోరాటాలతోనే కార్మికుల హక్కులు సాధ్యం



మాట్లాడుతున్న సూర్యం

జ్యోతినగర్(రామగుండం): సమరశీల పోరాటాలతోనే కార్మిక హక్కులు సాధ్యమని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధానకార్యదర్శి కె.సూర్యం, భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎం.అన్వేశ్ అన్నారు. ఆదివారం ఎన్టీపీసీ రామగుండం ఆటోనగర్‌లో ఐఎఫ్‌టీయూ నూతన కార్యాలయాన్ని ప్రారంభించి, మాట్లాడారు. రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో ఐఎఫ్‌టీయూ సంఘటిత, అసంఘటిత రంగ కార్మిక హక్కుల కోసం రాజీలేని పోరాటం చేస్తోందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలను అనుసరిస్తూ పాలన సాగిస్తున్నాయన్నారు. దేశంలో భవన నిర్మాణరంగ కార్మికుల కోసం ప్రత్యేకంగా బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. రాష్ట్ర నాయకుడు గుజ్జుల సత్యనారాయణ రెడ్డి, సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా జిల్లా కార్యదర్శి జూపాక శ్రీనివాస్, నాయకులు తోకల రమేశ్, రాంప్రసాద్, గుమ్మడి వెంకన్న, ఆడెపు శంకర్, రాములు తదితరులు పాల్గొన్నారు.

సాక్షి ఫ్యామిలీ
కరీంనగర్
సోమవారం ॥ 10-4-2023

మంచి మాట

ఆలోచించవలసిన అలవాట్లు

అలవాట్లు అనేవి ప్రతివ్యక్తికి ఉంటాయి. అలవాట్లులేని వ్యక్తులు ఉండరు. పుట్టిన తరువాత పాలు తాగడం నుంచి మనిషికి అలవాట్లు మొదలు అవుతాయి. మనిషి మరణించేదాకా అలవాట్లు ఉంటూనే ఉంటాయి. వ్యక్తులనుంచి అలవాట్లు, అలవాట్లనుంచి వ్యక్తులు వేరై ఉండడం ఉండదు.

అలవాట్లలో మంచివి, చెడ్డవి ఉన్నాయి, ఉంటాయి. చెడ్డ అలవాట్లవల్ల మనుషుల బతుకులకు బతుకులే చెడిపోయాయి. కుటుంబాలకు కుటుంబాలే కూలిపోయాయి. అలవాట్ల కోసం ఆస్తుల్ని అమ్ముకున్నవాళ్లు, అలవాట్ల కారణంగా బంధువుల్ని కోల్పోయినవాళ్లు ఎందరో ఉన్నారు. అలవాట్లవల్ల అనారోగ్యాలపాలై మరణించినవాళ్లూ ఉన్నారు. బతుకులే అల్లకల్లోలం అయిపోయినా కూడా చెడ్డ అలవాట్లను మానుకోలేక పరితపిస్తున్నవాళ్లూ ఉన్నారు.

మంచి అలవాట్లవల్ల కష్టాలనుంచి బయటపడినవాళ్లు ఉన్నారు. మంచి అలవాట్లవల్ల అనారోగ్యం నుంచి విముక్తమై ఆరోగ్యాన్ని అందుకున్నవాళ్లు ఉన్నారు. మంచి అలవాట్లవల్ల మామూలు స్థితి నుంచి ఉన్నతమైన స్థితికి వెళ్లినవాళ్లు ఉన్నారు. మంచి అలవాట్లవల్ల మంచివాళ్లుగా, గొప్పవాళ్లుగా మన్ననల్ని పొందినవాళ్లూ ఉన్నారు.

అలవాట్లకు లొంగిపోయి బతుకును కోల్పోకూడదు. పనికిరాని అలవాట్లవల్లా, పాడుచేసే అలవాట్లవల్లా మనిషి పాడుపడకూడదు.

మనిషికి అలవాట్లు ఉండడం సహజం. మనిషి అలవాట్ల కోసమే బతకడం అసహజం. మనిషి అలవాట్లకు లొంగిపోవడం అవాంఛనీయం. అది అనర్థదాయకం మాత్రమే కాదు అపాయకరం కూడా. ఒక మనిషి అలవాట్లు అతడికి ఎంతమాత్రమూ అపాయకరం కాకూడదు. ఏ మనిషీ అలవాట్లకు బానిస అయిపోకూడదు. అలవాట్లకు బానిస అయిపోయిన వ్యక్తి ఆపదల్లో ఉన్న వ్యక్తి అయిపోతాడు.

ప్రతివ్యక్తీ తన అలవాట్లను తాను సమీక్షించుకుంటూ ఉండాలి. ప్రతివ్యక్తికీ



అలవాట్లలో మంచివి, చెడ్డవి మాత్రమే కాదు పనికివచ్చేవి, పనికిరానివి, అవసరమైనవి, అనవసరమైనవి కూడా ఉంటాయి. ఏయే అలవాట్లు పనికిరానివో, ఏయే అలవాట్లు పనికివచ్చేవో ఎవరికివారు తెలుసుకోవాల్సి ఉంటుంది. అవసరమైన అలవాట్లతో, పనికివచ్చే అలవాట్లతో ప్రతి ఒక్కరూ ప్రయోజనాల్ని పొందాలి.

అలవాట్లకోసం బతికేవాళ్లూ, అలవాటుగా బతికేవాళ్లూ ఉంటారు. చాలామంది అలవాట్ల ఏట్లో కొట్టుకుపోతూ ఉంటారు. అలవాట్ల ఏట్లో కొట్టుకుపోవడం బతుకుతూ ఉండడం అవుతుందా? కానేకాదు. బతుకుతున్నాం కాబట్టి అలవాట్లు అనేవి ఉంటాయి. అలవాటుగా బతకడమో, అలవాట్ల కోసం బతకడమో సరికాదు. అలవాట్ల ఏట్లో కొట్టుకుపోతూ ఉంటే మనం మనకు దక్కం. మన అలవాట్లతో మనల్ని మనం నిలుపుకోవాలి.

> అలవాట్లకోసం బతికే వాళ్లూ, అలవాటుగా బతికే వాళ్లూ ఉంటారు. చాలామంది అలవాట్ల ఏట్లో కొట్టుకు పోతూ ఉంటారు. అలవాట్ల ఏట్లో కొట్టుకు పోవడం బతుకుతూ ఉండడం అవుతుందా?

మన అలవాట్లు మనకు మేలు చెయ్యాలి. మన అలవాట్లు మన అభివద్ధికి దోహదం చెయ్యాలి. మనకు నష్టాల్నీ, కీడును కలగజేసే అలవాట్లను మనం వెనువెంటనే వదులుకోవాలి. అలవాట్లవల్ల ఏ వ్యక్తీ అగచాట్లపాలవకూడదు. ఏ వ్యక్తీ తన అలవాట్లపై తనకే ఒక ఆలోచన ఉండాలి. తన అలవాట్లు మంచివా? చెడ్డవా? తన అలవాట్లు తనకు మేలు చేస్తున్నాయా? కీడు చేస్తున్నాయా? అన్న ఆలోచన మనిషికి ఉంటూ ఉండాలి. 'అలవాట్లపై ఆలోచన' అన్నది మనిషికి ఎంతో అవసరం. తన అలవాట్లపై ఆలోచన చేస్తూ ఉండడం మనిషికి తప్పకుండా ఎప్పటికీ ఉండాల్సిన అలవాటు!

ఎంతటి మనిషినైనా నీచమైన అలవాట్లు పతనం చేసేస్తాయి. ఏ మనిషికైనా ఉత్తమైన అలవాట్లు ప్రగతిని ఇవ్వగలవు, ఇస్తాయి. అలవాట్లు మనిషికి పతనాన్ని కాదు ప్రగతిని ఇవ్వగలగాలి, ఇవ్వాలి.

మనిషి జీవనం నాట్యం. అలవాట్లు అన్నవి ఆ నాట్యంలో భంగిమలు. భంగిమలు సరిగ్గాలేకపోతే నాట్యం భ్రష్టుపడుతుంది. అలవాట్లు సరైనవి కాకపోతే మనిషి జీవితం భ్రష్టుపడుతుంది.

నాణ్యమైన అలవాట్లతో నాణ్యమైన జీవనం చేస్తూ నాణ్యమైన మనుషులం అవుదాం.

– రోచిష్మాన్

జనం కోసం...



బాబాసాహెబ్ అంబేద్కర్

అంబేద్కర్‌గారి గురించి ప్రత్యేకమైన పరిచయం అక్కరలేదు. దేశంలో పీడితవర్గాలు, అణగారిన వర్గాల అభ్యున్నతికి నిరంతరం పరిశ్రమించినవాడు. స్వతంత్ర భారతదేశంలో రాజ్యాంగాన్ని అనుష్ఠించి, అనుసరించి, పరిపాలన చేసుకోగలుగుతున్నాం అంటే దానికి ఆయన ప్రధాన కారకులు. రాజ్యాంగ నిర్మాతలలో ఆయన కూడా ఒకరు. ఆయన చెప్పిన ఒక మంచి మాట – 'నీకోసం జీవిస్తే నీలోనే జీవిస్తావు, జనం కోసం జీవిస్తే చరిత్రలో నిలుస్తావు' అని!

సర్వసాధారణంగా ఏ వ్యక్తి అయినా మొట్టమొదట తన గురించే ఆలోచిస్తాడు. 'నాకోసం నేను బతకాలి. నేను బాగుండాలి, నా భార్యాబిడ్డలు బాగుండాలి, నా కుటుంబం బాగుండాలి' అని ఆశిస్తాడు. కేవలం నాకోసం నేను జీవించాలనుకోవడం తప్పు కాకపోవచ్చు. పరిధి పెరిగి తనకన్నా సమాజం గొప్పదనీ, తన ఇంటికన్నా దేశం గొప్పదనీ ఆలోచించాలి. అందరికోసం జీవించినవారు ధర్మాత్ములు. అటువంటివారు కొన్ని కోట్లమందికి స్ఫూర్తిదాయకమైన జీవితాన్ని పొంది ఉంటారు. అటువంటి మహాపురుషులు ఈ దేశంలో ఎందరో ప్రభవించారు. స్వాతంత్ర్య సమర సమయంలో తమ ప్రాణాలను గడ్డిపోచకింద భావించి జీవితాంతం జైలుజీవితం అనుభవించినవారున్నారు.ఏకాంతవాసం చేసినవారు, ప్రవాస జీవితం గడిపిన వారు, ద్వీపాంతర జీవితం గడిపిన వారు, లాఠీదెబ్బలు తిన్నవారు, తుపాకీ గుళ్ళకు ఒరిగిపోయినవారు, అంగవైకల్యం పొందినవారు, కుటుంబాలు పోగొట్టుకున్నవారు, ఆర్థికంగా చితికిన వారు, .. ఇటువంటి మహాత్ములు ఎందరో... ఎవరి కోసం అదంతా... ఈ దేశంకోసం.. ఈ దేశ ప్రజల కోసం.. ఈ ఉదాత్త భావన ఆనాడు దేశ ప్రజలందరిలో ఎంతగా పొంగిపొర్లుతూ ఉండేదంటే...

గురువాణి

వినోబా భావే భూదానోద్యమం ప్రచారానికి దేశమంతటా తిరుగుతూ తమ తమ ప్రాంతాలకు వస్తే... చిన్నకమతాల దగ్గరనుండీ వందల, వేల ఎకరాల భూమిని నీళ్ళలా దానం చేసేసారు.. దాదాపు 42 లక్షల ఎకరాల భూమి పంచిపెట్టడానికిగాను ప్రజలు ఆయనకు ఇచ్చారు. ఉత్తర ప్రదేశ్‌లోని ఒక గ్రామానికి గ్రామం ఆయనకు దానమిచ్చేసారు. సంపద ఉంటే సంపద దానం లేకుంటే దేశంకోసం శ్రమ దానం చేసారు.

ఇదీ నలుగురికోసం బతకడం అంటే...
అంబేద్కర్ చెప్పినది ఇదే...

ఇలాంటి త్యాగబుద్ధి ప్రతి ఒక్కరిలో ఉండాలి. దేశమంటే నేను, నా కుటుంబం అనే కాదు, దేశమున్నది నాకోసం, నా కుటుంబం కోసం మాత్రమే కాదు...పరిధి దాటాలి, కుటుంబం పరిధి, ఊరు పరిధి... ఈ దేశం మనది అన్న భావన, మన దేశం బాగుపడడం కోసం మనం ఏ చేద్దామనే భావన ప్రతి ఒక్కరిలో రగులుతూ ఉండాలి. ఒకరిన చూసి మరొకరు స్ఫూర్తి పొందాలి... అప్పుడు మనం మహాత్మాగాంధీలను, అంబేద్కర్‌లను... రోజూ చూస్తూనే ఉండవచ్చు.



బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

బౌద్ధవాణి

కడదాకా కలిసి నడిచేవారు

కోర్కెల్ని జయించి, జీవితాన్ని సఫలం చేసుకోవాలని వచ్చిన భిక్షువుల్లో కొందరు అతి తొందరలోనే దారి తప్పేవారు. కొందరు నెమ్మదిగా వెనకడుగు వేసేవారు. మరికొందరు ఒక మంచి స్థాయి వచ్చాక, తిరోగమించేవారు. ఒకరోజున అలాంటి భిక్షువుల గురించి సంభాషణ వచ్చింది! ఆ సందర్భంగా బుద్ధుడు ఇలా చెప్పాడు.

అది ఒక సుందరవనం. అందులో అందమైన జింకలు. చాలా తెలివి గలవి. ఆరగారగా పడిన వర్షాలకు పచ్చిక ఒత్తుగా లేచింది. లేత పచ్చికను తింటూ జింకలు బలంగా తయారయ్యాయి. ఒక వేటగాడు ఆ జింకల్ని పట్టుకోవాలనుకున్నాడు. కాని అవి అలికిడి తగిలీ తగలక ముందే లేచి వేగంగా ఎగిరి దూకేవి. అందేవి కావు. వాడు ఆలోచించాడు. ఎరగా మత్తుమందు తెచ్చి పచ్చిక మీద చల్లాడు. జాగ్రత్తగా పరిశీలిస్తే ఆ మందు చారలు కనిపిస్తాయి. కానీ, కొన్ని జింకలు ఏమరపాటుతో ఆ పచ్చిక పరకలు కొరికి తిన్నాయి. మత్తుకు లోనయ్యాయి. వేటగాడికి చిక్కాయి. మరలా కొన్ని రోజులకి వేటగాడు అదేపని చేశాడు.

అక్కడికి రెండవ జింకల గుంపు వచ్చింది. '' ఈ వేటగాడు మనకి మత్తు రావడానికి ఎరగా చల్లిన ఆహారాన్ని తినడం వల్ల మొదటి గుంపు జింకలు వాడికి ఆహారం అయ్యాయి. కాబట్టి మనం ఇక్కడ ఉండడం ప్రమాదం'' అనుకున్నాయి. సమస్యకు దూరంగా పోవాలనుకున్నాయి. అక్కడి నుండి పలాయనం చిత్తగించాయి. ఆ ప్రాంతాన్ని వదిలి కొండల మీదకు



చేరాయి. కొన్నాళ్ళకు వేసవికాలం వచ్చింది. ఎండలు ముదిరాయి. నీటి కయ్యలు ఎండాయి. పచ్చిక ఎండిపోయింది. ఆహారం లేక చిక్కి శల్యమయ్యాయి. చేసేది లేక అవి చివరికి కొండ దిగి పాత చోటికే వచ్చి చేరాయి. వేటగాడి 'ఎర'కి గురయ్యాయి.

ఆ తర్వాత మూడవ జింకల గుంపు అక్కడికి వచ్చింది. వాటికి మొదటి రెండు జింకల గుంపు విషయం తెలిసింది.

''అయితే మనం ఇక్కడ కొచ్చి ఆహారం తీసుకుందాం. తీసుకునే ముందు నిశితంగా పరిశీలించి, జాగ్రత్తగా వాసన చూసి తీసుకుందాం. తిన్నాక వేరే చోటుకు వెళ్లిపోదాం'' అనుకున్నాయి. అలా కొన్నాళ్ళు జాగ్రత్తపడ్డాయి. అవి ఎటునుండి వస్తున్నాయో, ఎటునుండి పోతున్నాయో కనుక్కోవాలి అనుకున్నాడు వేటగాడు. ఆ పచ్చిక మైదానం చుట్టూ కర్రలు పాతాడు. కర్రలు పడిపోయిన వైపును గుర్తించాడు. వాటి నివాసాన్ని కనిపెట్టాడు. వాటిని వలలు పెట్టి పట్టాడు.

ఇక, నాలుగో గుంపు వచ్చింది. అది కూడా మూడవ గుంపులా ఆహారం విషయంలో జాగ్రత్తలు తీసుకుంది. పచ్చిక మైదానం చుట్టూ పాతిన కర్రల్ని విగరతొక్కకుండా , మందగా పోకుండా వాటి మధ్య నుండి ఒక్కొక్కటి వెళ్ళాయి. దానితో వేటగాడికి అవి చిక్కలేదు. జాడ కూడా తెలియలేదు. అవి చిరకాలం ఆనందంతో ఆరోగ్యంతో వర్ధిల్లాయి''

బుద్ధుడు ఈ కథ చెప్పి– మొదటి జింకల గుంపు తృష్ణ (కోరికలు)కు లోనైంది. రెండో గుంపు ప్రమాదాన్ని గుర్తించి , పలాయనం చిత్తగించింది. సరైన నిర్ణయం తీసుకోకపోవడం వల్ల తిరిగి వచ్చి 'ఎర'లో పడింది. మూడో గుంపు తెలివిగా నడుచుకుంది. కానీ, తగిన అప్రమత్తతో లేకపోవడం వల్ల అదీ అంతరించింది. ప్రజ్ఞతో, ఓర్పుతో, నేర్పుతో, అప్రమత్తతో ఉండడం వల్ల నాలుగవ గుంపు నిర్భీతిగా బతికింది. అలాంటి నేర్పరులే నా ధర్మంలో, నాతో కడదాకా నడచి రాగలరు'' అన్నాడు.

భిక్షువులు మౌనంగా ఉన్నారు. తమ తప్పులు సరిదిద్దుకున్నారు..! చిత్త సంస్కారంతో చివరికంటా నడిచారు..!

– డా. బొర్రా గోవర్ధన్

సినిమా

పోలీస్ ఆఫీసర్‌గా...



● రజనీకాంత్

హీరో రజనీకాంత్ మే మొదటి వారంలో పోలీస్ ఆఫీసర్‌గా ఛార్జ్ తీసుకోనున్నారట. 'జై భీమ్' ఫేమ్ టీజే జ్ఞానవేల్ దర్శకత్వంలో రజనీకాంత్ హీరోగా లైకా ప్రొడక్షన్స్‌పై సుభాస్కరన్ ఓ సినిమాను నిర్మించనున్న సంగతి తెలిసిందే. ఈ మూవీ షూటింగ్ మే మొదటి వారంలో ప్రారంభం కానుందని, ఇందుకు తగ్గట్లుగా జ్ఞానవేల్ ప్రీ ప్రొడక్షన్ పనుల్ని వేగవంతం చేశారని కోలీవుడ్ టాక్. కొన్ని వాస్తవ సంఘటనలతో రూపొందనున్న ఈ సినిమాలో ఓ ముస్లిం పోలీస్ అధికారి పాత్రలో రజనీకాంత్ నటించనున్నారని సమాచారం. ప్రస్తుతం నెల్సన్ దిలీప్ కుమార్ దర్శకత్వంలో 'జైలర్' సినిమాలో నటిస్తున్నారు రజనీకాంత్. అలాగే 'లాల్‌సలామ్' చిత్రంలో ఆయన ఓ అతిథి పాత్ర చేస్తున్నారు.

డ్యూయల్ రోల్?



● ఎన్టీఆర్

'జనతా గ్యారేజ్' (2016) వంటి హిట్ చిత్రం తర్వాత హీరో ఎన్టీఆర్, దర్శకుడు కొరటాల శివ కాంబినేషన్‌లో ఓ సినిమా రూపొందుతున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో జాన్వీకపూర్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. కల్యాణ్ రామ్ సమర్పణలో మిక్కిలినేని సుధాకర్, కె.హరికృష్ణ నిర్మిస్తున్నారు. ఇటీవల హైదరాబాద్‌లో మొదలైన ఈ సినిమా తొలి షెడ్యూల్ చిత్రీకరణ ముగిసింది. మలి షెడ్యూల్ షూటింగ్ గోవాలో ప్రారంభం కానుందని తెలిసింది. దేశంలో పట్టించుకోకుండా ఉన్న తీరప్రాంత ప్రజల నేపథ్యంలో సాగే ఈ చిత్రంలో ఎన్టీఆర్ డ్యూయల్ రోల్(తండ్రీకొడుకుల పాత్రల్లో) కనిపిస్తారనే ప్రచారం జరుగుతోంది. ఈ విషయంపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

యువత మన జాతిసంపద

– ఆర్. నారాయణమూర్తి



''డిగ్రీ పట్టాలు ఉత్పత్తి చేసే ఫ్యాక్టరీలుగా కాలేజీలు ఉండకూడదు. విద్యార్థులకు జ్ఞానసందను పంచాలి.. విలువలను కాపాడాలి. రాజ్యాంగం కల్పించిన విద్యా హక్కు, పని హక్కు నిర్వీర్యం కాకుండా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందంటూ చెప్పే చిత్రమే 'యూనివర్సిటీ'' అన్నారు దర్శక – నిర్మాత, నటుడు ఆర్.నారాయణ మూర్తి. స్నేహ చిత్ర పిక్చర్స్ పతాకంపై ఆయన నటించి, స్వీయ దర్శకత్వంలో నిర్మించిన తాజా చిత్రం 'యూనివర్సిటీ'. ప్రస్తుతం ఈ సినిమా సెన్సార్ పనులు జరుగుతున్నాయి. త్వరలోనే ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా ఆర్. నారాయణ మూర్తి మాట్లాడుతూ– ''యువత జాతి సంపద. వారిని మనం కాపాడుకోవాలి. వారి మేథస్సు దేశ భవిష్యత్తుకు ఉపయోగపడాలి. కానీ పేపర్ లీకేజీ వల్ల యువత తీవ్ర నిరాశ, నిస్పృహలకు లోనవుతున్నారు. పేపర్ లీకేజీ అనే అంశం తెలుగు రాష్ట్రాల్లోనే కాదు.. గుజరాత్, మధ్యప్రదేశ్, బీహార్, మహారాష్ట్ర వంటి రాష్ట్రాల్లో కూడా గమనిస్తూనే ఉన్నాం. పేపర్ లీకేజీల వల్ల విద్యావ్యవస్థ నిర్వీర్యం అవుతుంది. విద్యార్థులు, ప్రభుత్వ పరీక్షలకు సన్నద్ధం అవుతున్న నిరుద్యోగుల భవిష్యత్తు ఏమైపోతుంది? అనే అంశాల ఇతివృత్తంగా 'యూనివర్సిటీ' సినిమా తీశాం. విద్య, వైద్య, విమాన యానం, బ్యాంకింగ్, రైల్వేస్ వంటి రంగాల్లో ప్రైవేటీకరణ జరుగుతున్న పరిస్థితులు నెలకొంటున్నాయి. వీటి వల్ల మైనార్టీలు, బడుగు, బలహీన వర్గాల వారు రిజర్వేషన్లు కోల్పోయి, ఉపాధి దక్కని పరిస్థితులు ఉండొచ్చు. ఆ అంశాలను కూడా ఈ సినిమాలో చూపించే ప్రయత్నం చేశాం'' అని పేర్కొన్నారు.

ఆయన రాజమౌళి కాదు.. రాజముని

– ఏపీ మంత్రి శ్రీనివాస వేణుగోపాలకృష్ణ

''ఆస్కార్ అవార్డు సాధించి ఎంతో మంది తెలుగు ప్రజల ఆకాంక్షలు నెరవేర్చారు డైరెక్టర్ రాజమౌళి. ఆయన రాజమౌళి కాదు.. రాజముని. ఆయన చేసిన గొప్ప ప్రయోగం (ఆర్ఆర్ఆర్) తెలుగు వారి కీర్తిని ప్రపంచ వ్యాప్తంగా చాటింది'' అని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాల కృష్ణ అన్నారు. 95వ ఆస్కార్ వేడుకల్లో 'ఆర్ఆర్ఆర్' సినిమాలోని 'నాటు నాటు..' పాట బెస్ట్ ఒరిజినల్ సాంగ్ విభాగంలో ఆస్కార్ సాధించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా తెలుగు చలనచిత్ర పరిశ్రమ ఆధ్వర్యంలో ఆస్కార్ అవార్డు గ్రహీతలు కీరవాణి, చంద్రబోస్‌లను హైదరాబాద్‌లో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన **శ్రీనివాస వేణుగోపాల కృష్ణ మాట్లాడుతూ–** ''ఆస్కార్ అంటే ఆకాశంలో తారలాంటిది. ఆ తారని నేలకు తెచ్చిన రాజమౌళి, కీరవాణి, చంద్రబోస్‌లకు అభినందనలు. తెలుగువారు గర్వపడేలా తెలుగు ఇండస్ట్రీని ఉన్నత స్థానంలో నిలిపిన వారికి ఏపీ ప్రభుత్వం, మా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి గారి తరఫున అభినందనలు'' అన్నారు.



● తలసాని శ్రీనివాస్ యాదవ్, శ్రీనివాస్ గౌడ్, వేణుగోపాలకృష్ణ, చంద్రబోస్, కీరవాణి, రాజమౌళి

తెలంగాణ రాష్ట్ర సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ– ''నాటు నాటు..' పాటకి 'ఆస్కార్' రావాలని లక్షల మంది ఎదురు చూశారు.. ఆ అవార్డు రానే వచ్చింది. ఈ విజయాన్ని సాధించిన రాజమౌళి, కీరవాణి, చంద్రబోస్‌గార్లకు అభినందనలు'' అన్నారు. **తెలంగాణ రాష్ట్ర క్రీడలశాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ–** ''ఒక సినిమాకి నంది అవార్డు వచ్చిందంటే చాలా గొప్పగా అనుకుంటున్నాం. అలాంటిది తొలిసారి ఒక తెలుగు పాటకి ప్రపంచంలో అత్యున్నతమైన 'ఆస్కార్' అవార్డు రావడం తెలుగు ఇండస్ట్రీ గర్వపడే సమయం. 'ఆర్ఆర్ఆర్' యూనిట్‌కి అభినందనలు'' అన్నారు. **ఎంఎం కీరవాణి మాట్లాడుతూ** – ''నాటు నాటు..' పాటకి 'ఆస్కార్' అవార్డు రావడం వెనుక రాజమౌళి, ప్రేమ్ రక్షిత్ మాస్టర్, అద్భుతంగా డ్యాన్స్ చేసిన రామ్‌చరణ్, ఎన్టీఆర్, ఉక్రెయిన్ డ్యాన్సర్స్ కృషి ఉంది. 'ఆర్ఆర్ఆర్' సినిమా నచ్చింది కాబట్టే 'నాటు నాటు..' పాట నచ్చింది, అవార్డు వచ్చింది. ఇది 'ఆర్ఆర్ఆర్' యూనిట్ సమిష్టి కృషికి లభించిన విజయం'' అన్నారు. **పాటల రచయిత చంద్రబోస్ మాట్లాడుతూ–** ''తమ్ముడూ.. నువ్వు పాడటంపై దృష్టి పెట్టొద్దు.. రాయడంపై దృష్టి పెట్టు' అని చెప్పిన గుర్రా శ్రీనాథ్ అన్న, 'పెళ్లిసందడి' సమయంలో 'బోస్‌ని మనతోపాటు చెన్నై తీసుకెళదాం' అంటూ రాఘవేంద్రరావుగారితో చెప్పిన కీరవాణిగార్ల మాటలు నా జీవిత గమనాన్ని మార్చి ఈ స్థాయిలో నిలబెట్టాయి. ఆస్కార్‌ని చేతిలో పట్టుకున్నప్పుడు భారత సాహిత్య పతాకాన్ని పట్టుకున్నంత ఆనందం కలిగింది'' అన్నారు. ఈ వేడుకలో నిర్మాతలు, దర్శకులు, హీరోలు, చిత్ర పరిశ్రమలోని 24 విభాగాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఏడేళ్ల తర్వాత....



● ఏఆర్ రెహమాన్

రామ్‌చరణ్ హీరోగా 'ఉప్పెన' ఫేమ్ బుచ్చిబాబు సన దర్శకత్వంలో ఓ సినిమా రూపొందనున్న సంగతి తెలిసిందే. వృద్ధి సినిమాస్ పతాకంపై వెంకట సతీష్ కిలారు ఈ చిత్రం నిర్మించనున్నారు. ఈ సినిమా చిత్రీకరణను సెప్టెంబరులో ప్రారంభించాలని యూనిట్ సన్నాహాలు చేస్తోంది. హీరోయిన్‌గా మృణాల్ ఠాకూర్, జాన్వీకపూర్‌ల పేర్లు తెరపైకి వచ్చాయి. అలాగే ఈ చిత్రానికి సంగీత దర్శకునిగా ఆస్కార్ అవార్డు విజేత ఏఆర్ రెహమాన్ పేరు తాజాగా వినిపిస్తోంది. గతంలో తెలుగులో 'సూపర్ పోలీస్','నాని', 'ఏమాయ చేసావె' 'కొమురం పులి' 'సాహసం శ్వాసగా సాగిపో'(2016) సినిమాలకు సంగీతం అందించారాయన. ఏడేళ్ల తర్వాత ఏఆర్ రెహమాన్ మరోసారి తెలుగు సినిమాకు సంగీతం అందించనున్నారని టాక్. ఈ విషయంపై స్పష్టత రావాలంటే మరికొన్ని రోజులు వేచి చూడాలి.

రారా పెనిమిటి హిట్ కావాలి

– మణిశర్మ



● సత్య వెంకట, నందిత, ప్రమీల, మణిశర్మ

''రారా పెనిమిటి' సినిమా చాలా మంచి కథ. ఇందులో మంచి పాటలు చేసే అవకాశం కల్పించిన డైరెక్టర్ సత్యగారికి థ్యాంక్స్. ఈ సినిమా మంచి హిట్ కావాలి'' అని సంగీత దర్శకుడు మణిశర్మ అన్నారు. నందిత శ్వేత లీడ్ రోల్‌లో నటించిన చిత్రం 'రారా పెనిమిటి'. సత్య వెంకట గెద్దాడ దర్శకత్వంలో ప్రమీల గెద్దాడ నిర్మించిన ఈ సినిమా త్వరలో విడుదల కానుంది. ఈ సందర్భంగా ప్రీ రిలీజ్ వేడుకలో నందిత శ్వేత మాట్లాడుతూ– ''ఈ సినిమాలో ఒకే ఒక పాత్ర అనగానే నేను చేయగలనా? అని మొదట భయపడ్డాను.. కానీ, ధైర్యం చేసి చేశాను'' అన్నారు. ''కొత్తగా పెళ్లి అయిన అమ్మాయి తన భర్త రాక కోసం ఎదురు చూస్తూ పడే విరహ వేదనే ఈ చిత్రం'' అన్నారు సత్య వెంకట గెద్దాడ. ఈ వేడుకలో సీనియర్ జర్నలిస్ట్ ప్రభు, నటుడు రాంకీ, పాటల రచయిత డి.నీలకంఠరావు, సింగర్ హరిణి ఇవటూరి తదితరులు మాట్లాడారు.

అల్బెలా అల్బెలా...



● 'ఉగ్రం' పోస్టర్

హీరో 'అల్లరి' నరేశ్, దర్శకుడు విజయ్ కనకమేడల కాంబినేషన్‌లో వచ్చిన తొలి చిత్రం 'నాంది' సూపర్ హిట్‌గా నిలిచింది. ఈ హిట్ కాంబోలో రెండోసారి రూపొందిన మూవీ 'ఉగ్రం'. ఇందులో మీర్నా మీనన్ హీరోయిన్‌గా నటించారు. షైన్ స్క్రీన్స్ పతాకంపై సాహు గారపాటి, హరీష్ పెద్ది నిర్మించిన ఈ చిత్రం మే 5న రిలీజ్ కానుంది. శ్రీచరణ్ పాకాల సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'అల్బెలా అల్బెలా..' అనే పాట వీడియో సాంగ్‌ను హీరో నాని రిలీజ్ చేశారు. 'అల్బెలా అల్బెలా బిలా హల్‌చల్ చేద్దాం క్రేజీగా... టెన్షన్‌కు బ్రేక్ ఇద్దాం పదా..' అంటూ సాగుతుందీ పాట. ఈ పాటకు భాస్కర్ భట్ల సాహిత్యం అందించగా, రేవంత్, శ్రావణ భార్గవి పాడారు. ఈ సినిమాకు కెమెరా: సిద్.



ఓర్లియాన్ మాస్టర్స్ టోర్నీ విజేత ప్రియాన్షు

భారత బ్యాడ్మింటన్ యువతార, ప్రపంచ 58వ ర్యాంకర్ ప్రియాన్షు రజావత్ తన కెరీర్‌లోనే గొప్ప విజయం సాధించాడు. ఆదివారం ఫ్రాన్స్‌లో ముగిసిన ఓర్లియాన్ మాస్టర్స్ టోర్నీలో పురుషుల సింగిల్స్ విభాగంలో విజేతగా నిలిచాడు. మధ్యప్రదేశ్‌కు చెందిన 21 ఏళ్ల ప్రియాన్షు 68 నిమిషాలపాటు జరిగిన ఫైనల్లో 21-15, 19-21, 21-16తో ప్రపంచ 49వ ర్యాంకర్ మాగ్నస్ జొహాన్సన్ (డెన్మార్క్)పై గెలిచాడు. ప్రియాన్షుకు 18,000 డాలర్ల (రూ. 14 లక్షల 73 వేలు) ప్రైజ్‌మనీ, 7000 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.

రజతం నెగ్గిన భారత రెజ్లర్ రూపిన్

కజకిస్తాన్‌లో జరుగుతున్న ఆసియా సీనియర్ రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో తొలి రోజు భారత్‌కు మూడు పతకాలు లభించాయి. పురుషుల గ్రీకో రోమన్ విభాగంలో రూపిన్ (55 కేజీలు) రజతం... నీరజ్ (63 కేజీలు), సునీల్ (87 కేజీలు) కాంస్య పతకాలు సాధించారు. ఫైనల్లో రూపిన్ 1-3తో సొలత్ (ఇరాన్) చేతిలో ఓడిపోగా... నీరజ్ 5-2తో జిన్‌సియెబ్ సాంగ్ (దక్షిణ కొరియా)పై, సునీల్ 4-1తో మసాటో సుమి (జపాన్)పై గెలిచారు.



రింకూ 6,6,6,6,6

- వరుస ఐదు బంతుల్లో ఐదు సిక్స్‌లతో కోల్‌కతాను గెలిపించిన రింకూ సింగ్
- వెంకటేశ్ అయ్యర్ మెరుపులు
- గుజరాత్ టైటాన్స్‌కు షాక్
- రషీద్ ఖాన్ 'హ్యాట్రిక్' వృథా

ఒకటి కాదు.. రెండు కాదు.. మూడు కాదు.. ఏకంగా ఐదు వరుస బంతుల్లో ఐదు సిక్స్‌లు... ఆదివారం జరిగిన ఐపీఎల్ మ్యాచ్‌లో గుజరాత్ టైటాన్స్‌పై కోల్‌కతా నైట్‌రైడర్స్ బ్యాటర్ రింకూ సింగ్ ఆఖరి ఓవర్లో సృష్టించిన విధ్వంసమిది. రింకూ అత్యద్భుత ఆటతీరుతో ఓటమి తథ్యమనుకున్న చోట కోల్‌కతా విజయకేతనం ఎగురవేసింది. గెలుపు ఖాయమనుకున్న గుజరాత్ టైటాన్స్‌కు రింకూ ఆటతో దిమ్మదిరిగిపోయింది. ఐపీఎల్ టోర్నీ చరిత్రలో అభిమానులు ఎన్నో ఉత్కంఠభరిత మ్యాచ్‌లు చూశారు. ఆఖరి బంతికి ఫలితాలు తారుమారైన మ్యాచ్‌లు కూడా ఎన్నో ఉన్నాయి. కానీ రింకూ సింగ్ ఆడిన ఇన్నింగ్స్ మాత్రం అభిమానుల మదిలో చిరస్థాయిగా నిలిచిపోతుందంటే అతిశయోక్తి కాదు.



రింకూ సింగ్

అహ్మదాబాద్: ఐపీఎల్ టోర్నీలో ఆదివారం అద్భుతం చోటు చేసుకుంది. డిఫెండింగ్ చాంపియన్ గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో కోల్‌కతా నైట్‌రైడర్స్ మూడు వికెట్లతో అసాధారణ విజయం సాధించింది. 205 పరుగుల విజయలక్ష్యాన్ని కోల్‌కతా సరిగ్గా 20 ఓవర్లలో ఏడు వికెట్లు కోల్పోయి ఛేదించింది. ఓటమి ముంగిట ఉన్న కోల్‌కతాను 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' రింకూ సింగ్ (21 బంతుల్లో 48 నాటౌట్; 1 ఫోర్, 6 సిక్స్‌లు) విజయతీరానికి చేర్చాడు. భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన కోల్‌కతా 18 ఓవర్లు ముగిసేసరికి 162/7తో ఉంది. గెలవాలంటే కోల్‌కతా 12 బంతుల్లో 43 పరుగులు చేయాలి. 19వ ఓవర్లో కోల్‌కతా14 పరుగులు సాధించింది. దాంతో ఆ జట్టు విజయ సమీకరణం 6 బంతుల్లో 29 పరుగులుగా మారింది. గుజరాత్ బౌలర్ యశ్ దయాళ్ వేసిన చివరి ఓవర్ తొలి బంతికి ఉమేశ్ సింగిల్ తీసి రింకూ సింగ్‌కు స్ట్రయిక్ ఇచ్చాడు. కోల్‌కతా నెగ్గాలంటే 5 బంతుల్లో 28 పరుగులు చేయాలి. అప్పటికి రింకూ 16 బంతుల్లో 18 పరుగులు చేసి క్రీజులో ఉన్నాడు. అద్భుతం జరిగితే తప్ప గుజరాత్ జట్టే గెలవడం ఖాయమనుకున్నారు. కానీ రింకూ తన ఆటతో అద్భుతమే చేసి చూపించాడు. ఈ ఓవర్ రెండో బంతిని లాంగ్ ఆఫ్ మీదుగా... మూడో బంతిని డీప్ బ్యాక్‌వర్డ్ స్క్వేర్ లెగ్ దిశగా... నాలుగో బంతిని లెగ్ సైడ్ దిశగా... ఐదో బంతిని లాంగ్‌ఆఫ్ మీదుగా సిక్స్‌లుగా మలిచాడు. దాంతో కోల్‌కతా విజయసమీకరణం 1 బంతికి 4 పరుగులుగా మారిపోయింది. కోల్‌కతా గెలుస్తుందా? గుజరాత్ గట్టెక్కుతుందా? మ్యాచ్ 'టై'గా ముగిసి 'సూపర్ ఓవర్' జరుగుతుందా? అని ఉత్కంఠ ... కానీ రింకూ రఫ్ఫాడించడం ఆపలేదు. చివరి బంతిని లాంగ్‌ఆన్ మీదుగా సిక్స్ కొట్టేశాడు. అంతే కోల్‌కతా శిబిరంలో ఆనందోత్సాహాలు వెల్లివెరియగా... జరిగిందా కలయా, నిజమా అని గుజరాత్ జట్టు సభ్యులు దిగ్భ్రమలో ఉండిపోయారు. అంతకుముందు కోల్‌కతా 4 ఓవర్లు ముగిసేసరికి 2 వికెట్లు కోల్పోయి 28 పరుగులతో ఇబ్బందుల్లో పడింది. ఈ దశలో 'ఇంపాక్ట్ ప్లేయర్' వెంకటేశ్ అయ్యర్ (40 బంతుల్లో 83; 8 ఫోర్లు, 5 సిక్స్‌లు), కెప్టెన్ నితీశ్ రాణా (29 బంతుల్లో 45; 4 ఫోర్లు, 3 సిక్స్‌లు) ధాటిగా ఆడి కోల్‌కతాను నిలబెట్టారు. వీరిద్దరు మూడో వికెట్‌కు 100 పరుగులు జోడించారు. నితీశ్ అవుటయ్యాక రింకూతో కలిసి వెంకటేశ్ కోల్‌కతా స్కోరు బోర్డును ముందుకు నడిపించాడు. 16వ ఓవర్ ఐదో బంతికి జోసెఫ్ బౌలింగ్‌లో గిల్‌కు క్యాచ్ ఇచ్చి వెంకటేశ్ పెవిలియన్ చేరాడు.



వెంకటేశ్ అయ్యర్

రషీద్ ఖాన్ 'హ్యాట్రిక్'...

కోల్‌కతా ఇన్నింగ్స్ 17వ ఓవర్లో మ్యాచ్ గుజరాత్ వైపు పూర్తిగా మొగ్గిపోయింది. ఈ ఓవర్లోని తొలి మూడు బంతుల్లో వరుసగా రసెల్ (1), సునీల్ నరైన్ (0), శార్దుల్ ఠాకూర్ (0)లను గుజరాత్ తాత్కాలిక కెప్టెన్ రషీద్ ఖాన్ అవుట్ చేసి 'హ్యాట్రిక్' సాధించాడు. దాంతో కోల్‌కతా స్కోరు 154/4 నుంచి 155/7గా మారిపోయింది. గుజరాత్ విజయం ఖాయమనిపించింది. కానీ చివరి మూడు ఓవర్లలో ఉమేశ్ యాదవ్ (6 బంతుల్లో 5 నాటౌట్) జతగా రింకూ సింగ్ అసాధారణ ఇన్నింగ్స్‌తో కోల్‌కతాకు చిరస్మరణీయ విజయం అందించాడు.



రషీద్

విజయ్ శంకర్ ధనాధన్...

అంతకుముందు టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న గుజరాత్ 20 ఓవర్లలో 4 వికెట్లకు 204 పరుగులు సాధించింది. రెగ్యులర్ కెప్టెన్ హార్దిక్ పాండ్యా అస్వస్థత కారణంగా ఈ మ్యాచ్‌కు దూరంకాగా, రషీద్ ఖాన్ కెప్టెన్‌గా వ్యవహరించాడు. శుబ్‌మన్ గిల్ (31 బంతుల్లో 39; 5 ఫోర్లు), సాయి సుదర్శన్ (38 బంతుల్లో 53; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించారు. ఆఖర్లో విజయ్ శంకర్ (24 బంతుల్లో 63 నాటౌట్; 4 ఫోర్లు, 5 సిక్స్‌లు) కళ్లు చెదిరే ఇన్నింగ్స్‌తో గుజరాత్ చివరి 15 బంతుల్లో 51 పరుగులు పిండుకుంది. దాంతో ఆ జట్టు స్కోరు 200 పరుగులు దాటింది.

ఐపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.
రాజస్తాన్	3	2	1	4	2.067
కోల్‌కతా	3	2	1	4	1.375
లక్నో	3	2	1	4	1.358
గుజరాత్	3	2	1	4	0.431
చెన్నై	3	2	1	4	0.356
పంజాబ్	3	2	1	4	-0.281
బెంగళూరు	2	1	1	2	-1.256
హైదరాబాద్	3	1	2	2	-1.502
ముంబై	2	0	2	0	-1.394
ఢిల్లీ	3	0	3	0	-2.092

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.-నెట్ రన్‌రేట్

ఐపీఎల్‌లో నేడు

బెంగళూరు × లక్నో (రా. గం. 7:30 నుంచి)
స్టార్ స్పోర్ట్స్, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం

స్కోరు వివరాలు

గుజరాత్ టైటాన్స్ ఇన్నింగ్స్: సాహా (సి) జగదీశన్ (బి) నరైన్ 17; శుబ్‌మన్ గిల్ (సి) ఉమేశ్ యాదవ్ (బి) నరైన్ 39; సాయి సుదర్శన్ (సి) అనుకూల్ రాయ్ (సబ్) (బి) నరైన్ 53; అభినవ్ మనోహర్ (బి) సుయశ్ శర్మ 14; విజయ్ శంకర్ (నాటౌట్) 63; డేవిడ్ మిల్లర్ (నాటౌట్) 2; ఎక్స్‌ట్రాలు 16; **మొత్తం (20 ఓవర్లలో 4 వికెట్లకు) 204. వికెట్ల పతనం:** 1-33, 2-100, 3-118, 4-153. **బౌలింగ్:** ఉమేశ్ యాదవ్ 3-0-24-0, శార్దుల్ ఠాకూర్ 3-0-40-0, ఫెర్గూసన్ 4-0-40-0, సునీల్ నరైన్ 4-0-33-3, వరుణ్ చక్రవర్తి 2-0-27-0, సుయశ్ శర్మ 4-0-35-1. **కోల్‌కతా నైట్‌రైడర్స్ ఇన్నింగ్స్:** గుర్బాజ్ (సి) యశ్ దయాళ్ (బి) షమీ 15; జగదీశన్ (సి) మనోహర్ (బి) లిటిల్ 6; వెంకటేశ్ అయ్యర్ (సి) గిల్ (బి) జోసెఫ్ 83; నితీశ్ రాణా (సి) షమీ (బి) జోసెఫ్ 45; రింకూ సింగ్ (నాటౌట్) 48; రసెల్ (సి) కేఎస్ భరత్ (సబ్) (బి) రషీద్ ఖాన్ 1; నరైన్ (సి) జయంత్ యాదవ్ (సబ్) (బి) రషీద్ ఖాన్ 0; శార్దుల్ ఠాకూర్ (ఎల్బీడబ్ల్యూ) (బి) రషీద్ ఖాన్ 0; ఉమేశ్ యాదవ్ (నాటౌట్) 5; ఎక్స్‌ట్రాలు 4; **మొత్తం (20 ఓవర్లలో 7 వికెట్లకు) 207. వికెట్ల పతనం:** 1-20, 2-28, 3-128, 4-154, 5-155, 6-155, 7-155. **బౌలింగ్:** షమీ 4-0-28-1, జోష్ లిటిల్ 4-0-45-1, అల్జారి జోసెఫ్ 4-0-27-2, యశ్ దయాళ్ 4-0-69-0, రషీద్ ఖాన్ 4-0-37-3.

'విన్'రైజర్స్...

- హైదరాబాద్ బోణీ
- 8 వికెట్లతో పంజాబ్ కింగ్స్‌పై విజయం
- రాణించిన రాహుల్ త్రిపాఠి, మర్కండే



రాహుల్ త్రిపాఠి

సాక్షి, హైదరాబాద్: ఐపీఎల్ సీజన్‌లో రెండు వరుస ఓటముల తర్వాత సన్‌రైజర్స్ చెలరేగింది. హైదరాబాద్ జట్టు సంపూర్ణ ఆధిపత్యంతో కీలక విజయాన్ని నమోదు చేసింది. ఆదివారం ఉప్పల్ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో సన్‌రైజర్స్ 8 వికెట్ల తేడాతో పంజాబ్ కింగ్స్‌పై ఘన విజయం సాధించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన పంజాబ్ 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 143 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' శిఖర్ ధావన్ (66 బంతుల్లో 99 నాటౌట్; 12 ఫోర్లు, 5 సిక్స్‌లు) త్రుటిలో సెంచరీకి దూరమయ్యాడు. మయాంక్ మర్కండే (4/15) కింగ్స్ పతనంలో కీలకపాత్ర పోషించాడు. అనంతరం సన్‌రైజర్స్ 17.1 ఓవర్లలో 2 వికెట్లకు 145 పరుగులు చేసి గెలిచింది. రాహుల్ త్రిపాఠి (48 బంతుల్లో 74 నాటౌట్; 10 ఫోర్లు, 3 సిక్స్‌లు), కెప్టెన్ మార్క్‌రమ్ (21 బంతుల్లో 37 నాటౌట్; 6 ఫోర్లు) కలిసి జట్టును గెలిపించారు. వీరిద్దరు మూడో వికెట్‌కు 52 బంతుల్లోనే 100 పరుగులు జోడించారు.

శిఖర్ మినహా...

ఒక ఎండ్‌లో ధావన్ పట్టుదలగా చివరి వరకు నిలబడగా, మరో ఎండ్ నుంచి కనీసం సహకారం లేకపోవడంతో పంజాబ్ భారీ స్కోరు సాధించలేకపోయింది. ఇన్నింగ్స్ తొలి బంతికి ప్రభ్‌సిమ్రన్ (0)ను అవుట్ చేసి భువనేశ్వర్ మొదటి దెబ్బ కొట్టాడు. ఆ తర్వాత జాన్సెన్ తన వరుస ఓవర్లలో మాథ్యూ షార్ట్ (1), జితేశ్ శర్మ (4)లను అవుట్ చేయడంతో జట్టు 22 పరుగులకే 3 వికెట్లు కోల్పోయింది. స్యామ్ కరన్ (15 బంతుల్లో 22; 3 ఫోర్లు, 1 సిక్స్) కొద్దిసేపు ధావన్‌కు అండగా నిలిచాడు. అయితే ఆ తర్వాత పంజాబ్ టపటపా వికెట్లు కోల్పోయింది. 35 పరుగుల వ్యవధిలో ఆ జట్టు 6 వికెట్లు చేజార్చుకుంది. దాంతో స్కోరు 88/9 వద్ద నిలిచింది. పంజాబ్ 100 పరుగులు చేయడం కూడా సందేహంగానే అనిపించింది. అయితే ఈ దశలో ధావన్ తను అనుభవాన్నంతా రంగరించి బాధ్యతను తీసుకున్నాడు. ఈ సమయంలో ధావన్ 47 పరుగుల వద్ద (38 బంతుల్లో) ఉన్నాడు. ఆపై చెలరేగిపోయిన అతను తర్వాతి 28 బంతుల్లో 4 ఫోర్లు, 5 సిక్సర్లతో మరో 52 పరుగులు సాధించడం విశేషం. చివరి వికెట్‌కు ధావన్, మోహిత్ రాఠీ 55 పరుగులు జోడించగా, అందులో 52 ధావనే చేశాడు.



ధావన్

భారీ భాగస్వామ్యం...

ఛేదనలో రైజర్స్‌కు పెద్దగా ఇబ్బంది ఎదురు కాలేదు. ఓపెనర్లు బ్రూక్ (13), మయాంక్ అగర్వాల్ (21) ఫర్వాలేదనిపించడంతో పవర్‌ప్లేలో స్కోరు 34 పరుగులకు చేరింది. వీరిద్దరు తక్కువ వ్యవధిలో వెనుదిరిగినా... త్రిపాఠి, మార్క్‌రమ్ కలిసి సునాయాసంగా జట్టును విజయం దిశగా నడిపించారు. పంజాబ్ బౌలర్లు ఎంతగా శ్రమించినా ఈ జోడీని ఇబ్బంది పెట్టలేకపోయారు. వరుస ఫోర్లతో దూకుడు ప్రదర్శించిన త్రిపాఠి 35 బంతుల్లోనే హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఎలిస్ ఓవర్లో మార్క్‌రమ్ నాలుగు ఫోర్లు కొట్టడంతో హైదరాబాద్ గెలుపు ఖాయమైంది.

స్కోరు వివరాలు

పంజాబ్ కింగ్స్ ఇన్నింగ్స్: ప్రభ్‌సిమ్రన్ (ఎల్బీ) (బి) భువనేశ్వర్ 0; ధావన్ (నాటౌట్) 99; షార్ట్ (ఎల్బీ) (బి) జాన్సెన్ 1; జితేశ్ (సి) మార్క్‌రమ్ (బి) జాన్సెన్ 4; కరన్ (సి) భువనేశ్వర్ (బి) మర్కండే 22; రజా (సి) మయాంక్ (బి) ఉమ్రాన్ 5; షారుఖ్ (ఎల్బీ) (బి) మర్కండే 4; హర్‌ప్రీత్ (బి) ఉమ్రాన్ 1; చహర్ (ఎల్బీ) (బి) మర్కండే 0; ఎలిస్ (బి) మర్కండే 0; రాఠీ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 6; **మొత్తం (20 ఓవర్లలో 9 వికెట్లకు 143). వికెట్ల పతనం:** 1-0, 2-10, 3-22, 4-63, 5-69, 6-74, 7-77, 8-78, 9-88. **బౌలింగ్:** భువనేశ్వర్ 4-0-33-1, జాన్సెన్ 3-1-16-2, నటరాజన్ 4-0-40-0, సుందర్ 1-0-6-0, మర్కండే 4-0-15-4, ఉమ్రాన్ 4-0-32-2. **సన్‌రైజర్స్ హైదరాబాద్ ఇన్నింగ్స్:** బ్రూక్ (బి) అర్ష్‌దీప్ 13; మయాంక్ (సి) కరన్ (బి) చహర్ 21; త్రిపాఠి (నాటౌట్) 74; మార్క్‌రమ్ (నాటౌట్) 37; ఎక్స్‌ట్రాలు 0; **మొత్తం (17.1 ఓవర్లలో 2 వికెట్లకు) 145. వికెట్ల పతనం:** 1-27, 2-45. **బౌలింగ్:** స్యామ్ కరన్ 3-0-14-0, అర్ష్‌దీప్ 3-0-20-1, హర్‌ప్రీత్ 3.1-0-26-0, ఎలిస్ 3-0-28-0, రాహుల్ చహర్ 3-0-28-1, రాఠీ 2-0-29-0.

భవిత

తెలంగాణ పదో తరగతికి సంబంధించిన స్టడీ మెటీరియల్, సిలబస్, మోడల్‌పేపర్స్, ప్రీవియస్ పేపర్స్, టెక్స్ట్‌బుక్స్, గైడెన్స్ మొదలైన వాటి కోసం www.sakshieducation.com చూడొచ్చు.

• గ్రూప్1, గ్రూప్2 ప్రత్యేకం- కరెంట్ అఫైర్స్ కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

ఏపీఆర్‌జేసీ సెట్-2023

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని 10 గురుకుల జూనియర్ కళాశాలల్లో.. 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి ఇంటర్మీడియట్(ఆంగ్ల మాధ్యమం) మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు గుంటూరులోని ఏపీ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ దరఖాస్తులు కోరుతోంది. ఇందుకు సంబంధించి ఏపీ ఆర్‌జేసీ సెట్-2023 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ప్రస్తుత విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు. అర్హులైన విద్యార్థులు ఏప్రిల్ 24 లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.

» **గ్రూప్స్:** ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ, ఈఈటీ, సీజీటీ.
» **మొత్తం సీట్ల సంఖ్య:** 1149
» **అర్హత:** 2023 ఏప్రిల్‌లో జరుగుతున్న పదో తరగతి పరీక్షల్లో మొదటి ప్రయత్నంలో ఉత్తీర్ణులై ఉండాలి.
» **ఎంపిక విధానం:** ప్రవేశ పరీక్షలో సాధించిన మార్కులు, రిజర్వేషన్, స్పెషల్ కేటగిరీ, స్థానికత ఆధారంగా సీట్లను కేటాయిస్తారు.
» **పరీక్ష విధానం:** ప్రశ్నపత్రం ఆబ్జెక్టివ్ విధానంలో మొత్తం 150 మార్కులకు నిర్వహిస్తారు. విద్యార్థులు ఎంపిక చేసుకునే గ్రూప్ ఆధారంగా సంబంధిత సబ్జెక్టుల నుంచి ప్రశ్నలు ఉంటాయి. పరీక్ష సమయం 2.30 గంటలు. ప్రశ్నాపత్రం తెలుగు/ఇంగ్లిష్, ఉర్దూ/ఇంగ్లిష్ మాధ్యమాల్లో ఉంటుంది. పదో తరగతి స్థాయిలో ప్రశ్నలు అడుగుతారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 24.04.2023.
» **హాల్‌టికెట్ జారీ తేది:** 12.05.2023.
» **ప్రవేశ పరీక్ష తేది:** 20.05.2023.
» **వెబ్‌సైట్:** www.aprs.apcfss.in

ఏపీఆర్‌డీసీసెట్-2023

గుంటూరులోని ఏపీ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ.. ఏపీ రెసిడెన్షియల్ డిగ్రీ కాలేజ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్-2023కు నోటిఫికేషన్ విడుదల చేసింది. దీని ద్వారా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పల్నాడు జిల్లా నాగార్జున సాగర్‌లోని రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలలో 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి డిగ్రీ(ఆంగ్ల మాధ్యమం) మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది. ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన ఇంటర్ ఉత్తీర్ణులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. అర్హులైన విద్యార్థులు ఏప్రిల్ 24 లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు చేసుకున్న వారికి మే 20న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు.

» **మొత్తం సీట్ల సంఖ్య:** 152
» **గ్రూపు, సీట్లు:** బీఏ (హిస్టరీ, ఎకనామిక్స్, పొలిటికల్ సైన్స్)-40 సీట్లు, బీకాం-40 సీట్లు, బీఎస్సీ (మ్యాథ్స్,ఫిజిక్స్,కెమిస్ట్రీ)-36 సీట్లు,బీఎస్సీ (మ్యా థ్స్, స్టాటిస్టిక్స్ అండ్ కంప్యూటర్ సైన్స్)-36 సీట్లు.
» **అర్హత:** 2022-23 విద్యా సంవత్సరంలో ఇంటర్మీడియట్ లేదా తత్సమాన అర్హత పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి.
» **ఎంపిక విధానం:** కామన్ ఎంట్రన్స్ టెస్ట్, రిజర్వేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 24.04.2023.
» **హాల్ టికెట్ల జారీ తేది:** 12.05.2023.
» **ప్రవేశ పరీక్షతేది:** 20.05.2023.
» **వెబ్‌సైట్:** www.aprs.apcfss.in

బైపీసీతో... క్రేజీ కోర్సులివే!

» బైపీసీ ఉత్తీర్ణుల తొలి ప్రాధాన్యంగా ఎంబీబీఎస్, బీడీఎస్
» ఆయుష్ కోర్సులతోనూ వైద్య వృత్తిలో స్థిరపడే అవకాశం
» ప్రత్యామ్నాయ కోర్సులుగా నర్సింగ్, వెటర్నరీ, అగ్రికల్చర్
» ఏ కోర్సులో చేరినా.. నైపుణ్యాలుంటే ఉజ్వల భవిత ఖాయం

ఇంటర్మీడియెట్ బైపీసీ. ఈ గ్రూప్‌లో చేరిన విద్యార్థుల్లో అధికశాతం మంది లక్ష్యం.. ఎంబీబీఎస్ లేదా బీడీఎస్! ఇందుకోసం ఇంటర్‌లో చేరిన తొలి రోజు నుంచే 'నీట్-యూజీ'లో ర్యాంకు కోసం అహర్నిశలూ కృషి చేస్తుంటారు. కానీ.. సీట్ల సంఖ్య పరిమితం. పోటీ తీవ్రం. దీంతో ఆశించిన వారందరికీ మెడిసిన్‌లో ప్రవేశం లభించే అవకాశం ఉండటంలేదు. అయితే బైపీసీ విద్యార్థుల కోసం ఎంబీబీఎస్‌కు దీటైన కోర్సులెన్నో ఉన్నాయి. వాటి వివరాలు..



'బైపీసీ అంటే.. కేవలం ఎంబీబీఎస్, బీడీఎస్ కోసమే అనే ఆలోచన వీడాలి. ఈ అర్హతతో ఇప్పుడు మరెన్నో కోర్సులు అందుబాటులోకి వచ్చాయి. వీటితోనూ ఉజ్వల భవిష్యత్తుకు మార్గం వేసుకునే అవకాశం ఉంది. విద్యార్థులు ఇలాంటి కోర్సులపైనా దృష్టి సారించాలి'-బైపీసీ విద్యార్థులకున్న ఉన్నత విద్య అవకాశాలపై నిపుణుల అభిప్రాయం. వాస్తవానికి ప్రస్తుతం బైపీసీ విద్యార్థులకు ఎంబీబీఎస్, బీడీఎస్, ఆయుష్‌తోపాటు బ్యాచిలర్స్, పీజీ స్థాయిలో వినూత్న కోర్సులు ఎన్నో అందుబాటులో ఉన్నాయి. అదేవిధంగా బయోటెక్నాలజీ, బయో ఇన్ఫర్మాటిక్స్, బయో మెడిసిన్ వంటి మరెన్నో కొత్త కోర్సులు పుట్టుకొస్తున్నాయి.

మెడిసిన్‌లో చేరేలా

బైపీసీ విద్యార్థులు ఎంబీబీఎస్(బ్యాచిలర్ ఆఫ్ మెడిసిన్, బ్యాచిలర్ ఆఫ్ సర్జరీ)లో ప్రవేశానికి.. జాతీయ స్థాయిలో నిర్వహించే నీట్-యూజీలో ర్యాంకు సాధించాలి. ఎంబీబీఎస్‌లో ప్రవేశం పొందితే.. వైద్య వృత్తికి తొలి అడుగు పడినట్లే. దీని తర్వాత పీజీ, సూపర్ స్పెషాలిటీ, పీహెచ్‌డీ ఉంటాయి. పీజీ స్థాయిలో ఎండీ లేదా ఎంఎస్ పేరుతో దాదాపు 30 స్పెషలైజేషన్లు ఉన్నాయి. పీజీ కోర్సుల్లో చేరాలనుకునే అభ్యర్థులు నీట్-పీజీ; డీఎం, ఎంసీహెచ్, డీఎన్‌బీ వంటి కోర్సుల్లో అడ్మిషన్ కోసం నీట్-ఎస్ఎస్ ఎంట్రన్స్ టెస్ట్‌లో విజయం సాధించాల్సి ఉంటుంది.

బీడీఎస్

ఎంబీబీఎస్ తర్వాత అధిక శాతం మంది ప్రాధాన్యం.. బీడీఎస్(బ్యాచిలర్ ఆఫ్ డెంటల్ సర్జరీ). ఇందులో చేరేందుకు కూడా నీట్-యూజీలో ర్యాంకు సాధించాలి. ఉన్నత విద్యలో ప్రధానంగా అందుబాటులో ఉన్న కోర్సు ఎండీఎస్ (మాస్టర్ ఆఫ్ డెంటల్ సర్జరీ). మూడేళ్ల ఈ కోర్సులో పలు స్పెషలైజేషన్లు ఎంచుకోవచ్చు. ఎండీఎస్‌లో చేరాలంటే.. నీట్-పీజీ ఎంట్రన్స్‌లో ర్యాంకు సొంతం చేసుకోవాలి. ఎండీఎస్‌తోపాటు డెంటల్ మెడికల్ కేర్ విభాగంలో పీజీ డిప్లొమా కోర్సు కూడా అందుబాటులో ఉంది.

ఆయుష్‌తో.. వైద్య రంగంలో!

వైద్య రంగంలో కెరీర్ కోరుకునే బైపీసీ విద్యార్థులు ఆయుష్ కోర్సులను ఎంచుకోవచ్చు. ఎంబీబీఎస్, బీడీఎస్‌లకు ప్రత్యామ్నాయంగా నిలుస్తున్న ఆయుర్వేదం, యోగా అండ్ నేచురోపతి, యునాని, సిద్ధ యోగ, హోమియోపతిలనే సంక్షిప్తంగా ఆయుష్ కోర్సులుగా పిలుస్తారు. సంప్రదాయ వైద్య రీతులుగా భావించే ఈ ఆయుష్ విభాగాలకు కూడా ఆదరణ పెరుగుతోంది. కాబట్టి ఈ కోర్సులు పూర్తి చేసుకున్నా.. వైద్య రంగంలో కెరీర్ సొంతమవుతుంది.

ఆయుష్ కోర్సులకు కూడా నీట్ ర్యాంకు ఆధారంగానే కౌన్సెలింగ్ నిర్వహించి ప్రవేశాలు కల్పిస్తారు. ఎంబీబీఎస్, బీడీఎస్ కౌన్సెలింగ్ ప్రక్రియ పూర్తయ్యాక.. నీట్-యూజీ స్కోర్ ఆధారంగా ఆయుష్ కోర్సులకు ప్రత్యేక కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. వచ్చిన దరఖాస్తులు, అందుబాటులోని సీట్లు, అభ్యర్థుల ప్రాథమ్యాలను పరిగణనలోకి తీసుకొని సీట్ల కేటాయింపు చేస్తారు.

బీహెచ్ఎంఎస్

బ్యాచిలర్ ఆఫ్ హోమియోపతిక్ మెడిసిన్ అండ్ సర్జరీ సంక్షిప్తంగా..బీహెచ్ఎంఎస్. ఎంబీబీఎస్, బీడీఎస్ తర్వాత ఆదరణ పొందుతున్న కోర్సు. ఇందులోనూ ఎంబీబీఎస్ కరిక్యులంలో ఉండే విభాగాలు ఉంటాయి. ఉన్నత విద్యలో.. పీజీ స్థాయిలో మెటీరియా మెడికా, హోమియోపతిక్ ఫిలాసఫీ వంటి స్పెషలైజేషన్లకు డిమాండ్ నెలకొంది. వీటిని కూడా పూర్తి చేస్తే భవిష్యత్తులో కెరీర్ అవకాశాలు మరింత విస్తృతం అవుతాయి.

బీఏఎంఎస్

బ్యాచిలర్ ఆఫ్ ఆయుర్వేదిక్ మెడిసిన్ అండ్ సర్జరీ.. బీఏఎంఎస్. ఎంబీబీఎస్‌లో మాదిరిగానే ఇందులోనూ అనాటమీ, ఫిజియాలజీ, పెడియాట్రిక్స్, జనరల్ మెడిసిన్ తదితర సబ్జెక్టులు చదవాల్సి ఉంటుంది. వీటిలో నైపుణ్యం ద్వారా సహజ సిద్ధ ప్రక్రియలతో రోగులకు వైద్యం చేయగలిగే పట్టు లభిస్తుంది. ఉన్నత విద్యలో.. ఎండీ స్థాయిలో ఆయుర్వేద, ఎంఎస్-ఆయుర్వేద కోర్సులు చదవొచ్చు. ఎంబీబీఎస్‌లోని జనరల్ మెడిసిన్‌కు సరితూగే విధంగా ఉండే కాయ చికిత్స, జనరల్ సర్జరీకి సరితూగే శల్యతంత్ర కోర్సులు కూడా పీజీ స్పెషలైజేషన్లుగా ఉన్నాయి.

బీయూఎంఎస్

పూర్తిగా ప్రకృతి వైద్యంగా భావించే కోర్సు.. బీయూఎంఎస్(బ్యాచిలర్ ఆఫ్ యునానీ మెడికల్ సైన్స్). దీన్ని పూర్తి చేసిన విద్యార్థులకు పీజీ స్థాయిలో గైనకాలజీ, సోషల్ అండ్ ప్రివెంటివ్ మెడిసిన్, జనరల్ మెడిసిన్, ఫార్మకాలజీలకు సరితూగే విధంగా ఎండీ, ఎంఎస్ కోర్సులు చదివే అవకాశం ఉంది.

బీఎన్‌వైఎస్

వైద్య రంగంలో మరో ప్రత్యామ్నాయ కోర్సు.. బీఎన్‌వైఎస్(బ్యాచిలర్ ఆఫ్ నేచురోపతిక్ మెడికల్ సైన్సెస్). ఈ కోర్సును పూర్తి చేసిన వారికి యోగా, సిద్ధ యోగా వంటి విధానాల ద్వారా రోగులకు చికిత్స చేయగలిగే నైపుణ్యాలు లభిస్తాయి.

బీవీఎస్సీ అండ్ ఏహెచ్

బైపీసీ విద్యార్థులకు డాక్టర్ హోదా కల్పించే మరో కోర్సు.. బ్యాచిలర్ ఆఫ్ వెటర్నరీ సైన్స్ అండ్ యానిమల్ హజ్బెండరీ(బీవీఎస్సీ అండ్ ఏహెచ్). జంతువులకు వచ్చే వ్యాధులు, నివారణ చర్యలు, పశువుల గర్భధారణ పద్ధతులు వంటి వాటిపై అవగాహన కల్పించే కోర్సు ఇది. ఫౌల్ట్రీ ఫారాలు, ప్రభుత్వ, ప్రైవేటు పశు వైద్య ఆసుపత్రులు, పశు సంవర్ధక శాలలు, వన్యమృగ సంరక్షణ కేంద్రాలు, జంతు ప్రదర్శనశాలలు, డెయిరీ ఫామ్స్, గొర్రెల పెంపక ం కేంద్రాల్లో ఉపాధి అవకాశాలు లభిస్తాయి. తెలుగు రాష్ట్రాల్లో ఈ కోర్సు.. ఏపీలో శ్రీ వేంకటేశ్వర వెటర్నరీ యూనివర్సిటీ, తెలంగాణలో పి.వి.నరసింహారావు తెలంగాణ వెటర్నరీ యూనివర్సిటీ పరిధిలో అందుబాటులో ఉంది. పీజీ స్థాయిలోనూ పలు స్పెషలైజేషన్లు అభ్యసించే అవకాశం ఉంది.

బ్యాచిలర్ ఆఫ్ ఫిజియోథెరపీ

బ్యాచిలర్ ఆఫ్ ఫిజియోథెరపీ..సంక్షిప్తంగా బీపీటీ. వైద్య రంగంలో స్థిరపడాలనుకునే వారికి ఉపయుక్తమైన కోర్సు ఇది. ఈ కోర్సు పూర్తి చేస్తే ఫిజియోథెరపిస్ట్‌లుగా ఉద్యోగాలతోపాటు స్వయం ఉపాధి అవకాశాలు అందుకోవచ్చు.

బీఎస్సీ నర్సింగ్

వైద్య రంగంలోనే స్థిరపడే అవకాశం కల్పిస్తున్న మరో కోర్సు.. బీఎస్సీ నర్సింగ్. తెలంగాణలో ఈ ఏడాది నుంచి ఎంసెట్ ర్యాంకు ఆధారంగా బీఎస్సీ నర్సింగ్ ప్రవేశాలు చేపట్టనున్నారు. ఈ కోర్సు పూర్తి చేసుకున్న వారికి నేరుగా నర్సులుగా కెరీర్ ప్రారంభించే అవకాశం లభిస్తుంది. వీరికి ఆస్పత్రుల్లో, ఆరోగ్య సంరక్షణ కేంద్రాల్లో సూపర్‌వైజర్ స్థాయి ఉద్యోగాలు లభిస్తాయి. పీజీ స్థాయిలో ఎమ్మెస్సీ నర్సింగ్ కోర్సు అందుబాటులో ఉంది. ప్రస్తుతం నర్సింగ్ కోర్సులను రాష్ట్రాల స్థాయిలో హెల్త్ యూనివర్సిటీల పరిధిలోని కళాశాలలతోపాటు జాతీయ స్థాయిలోనూ పలు ప్రముఖ ఇన్‌స్టిట్యూట్‌లు అందిస్తున్నాయి.

పారా మెడికల్ కోర్సులు

బైపీసీ విద్యార్థులకు ఉన్నత విద్య, ఉపాధి అవకాశాలను అందిస్తున్నాయి.. పారా మెడికల్ కోర్సులు. ప్రధానంగా న్యూరో ఫిజియాలజీ టెక్నాలజీ, ఆప్టోమెట్రిక్ టెక్నాలజీ, రెనాల్ డయాలసిస్ టెక్నాలజీ, పెర్‌ఫ్యూజన్ టెక్నాలజీ, కార్డియాక్ కేర్ టెక్నాలజీ అండ్ కార్డియో వ్యాస్కులర్ టెక్నాలజీ, అనెస్థీషియాలజీ టెక్నాలజీ అండ్ ఆపరేషన్ థియటర్ డిగ్రీ, ఇమేజింగ్ టెక్నాలజీ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. వీటిని పూర్తి చేయడం ద్వారా హాస్పిటల్స్‌లో ఆయా విభాగాల్లో టెక్నీషియన్స్‌గా స్థిరపడొచ్చు. పారా మెడికల్ కోర్సులను కూడా హెల్త్ యూనివర్సిటీలే పర్యవేక్షిస్తాయి.

అగ్రికల్చర్ బీఎస్సీ

బైపీసీ విద్యార్థులకు కెరీర్ అవకాశాలు కల్పించే మరో చక్కటి కోర్సు.. అగ్రికల్చరల్ బీఎస్సీ. వ్యవసాయ సాగు విధానాల్లో ఆధునిక పద్ధతులు, నూతన పరికరాల వినియోగం వంటి నైపుణ్యాలను అందించే కోర్సు ఇది. తెలుగు రాష్ట్రాల్లో ఆచార్య ఎన్‌జీరంగా అగ్రికల్చర్ యూనివర్సిటీ(ఏపీ), ఆచార్య జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీ(తెలంగాణ) పరిధిలో పలు కళాశాలల్లో అగ్రికల్చర్ బీఎస్సీ అందుబాటులో ఉంది. ప్రభుత్వ విభాగంలో వ్యవసాయ శాఖలో అగ్రికల్చర్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ వంటి ఉద్యోగాలు లభిస్తాయి.

బ్యాచిలర్ ఆఫ్ ఫిషరీస్ సైన్స్

బ్యాచిలర్ ఆఫ్ ఫిషరీస్ సైన్స్ సంక్షిప్తంగా.. బీఎఫ్ఎస్సీ. మత్స్య సంరక్షణ,సేకరణ వంటి విషయాల్లో ప్రత్యేక పద్ధతులు, శాస్త్రీయ విధానాలపై అవగాహన కల్పించే కోర్సు ఇది. దీన్ని పూర్తి చేసిన వారికి ఆక్వాకల్చర్ సంస్థలు, ఆక్వా రీసెర్చ్ సంస్థలు ప్రధాన ఉపాధి వేదికలుగా నిలుస్తున్నాయి. తెలంగాణలో పీవీ నరసింహారావు వెటర్నరీ యూనివర్సిటీ, ఏపీలో శ్రీ వేంకటేశ్వర వెటర్నరీ యూనివర్సిటీల పరిధిలో ఈ కోర్సు అందుబాటులో ఉంది.

బీటెక్-ఫుడ్ టెక్నాలజీ

ప్రస్తుత ఆధునిక పరిస్థితుల్లో అందుబాటులో ఉన్న మరో కోర్సు.. బీటెక్-ఫుడ్ టెక్నాలజీ. ఆహార ఉత్పత్తుల తయారీ, నాణ్యత, ప్రాసెసింగ్ సంబంధిత నైపుణ్యాలు అందించే కోర్సు ఇది. దీన్ని పూర్తి చేసుకుంటే.. ఫుడ్ ప్రొడక్షన్ యూనిట్స్, ప్యాకేజ్డ్ ఫుడ్ మాన్యుఫ్యాక్చరింగ్ సంస్థల్లో కొలువుదీరొచ్చు.

బీఎస్సీ(సీఏబీఎం)

బ్యాచిలర్ ఆఫ్ సైన్స్ ఇన్ కమర్షియల్ అగ్రికల్చర్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్.. సంక్షిప్తంగా సీఏబీఎం. బైపీసీ విద్యార్థులకు కార్పొరేట్ కొలువులకు మార్గం వేసే మరో కోర్సు ఇది. వ్యవసాయ విధానంలో ఆధునిక పద్ధతులను అన్వయించడం, వాటి ద్వారా లాభదాయకత పెంచే విధానాలను బోధిస్తారు.

బీఎస్సీ(బీజెడ్‌సీ)

బైపీసీ విద్యార్థులకు అందుబాటులో ఉన్న సాంప్రదాయ కోర్సు.. బీఎస్సీ(బీజెడ్‌సీ). ప్రస్తుతం యూనివర్సిటీలు అనుసరిస్తున్న నూతన విధానాల మేరకు.. బీజెడ్‌సీలోనూ మైక్రోబయాలజీ, జెనెటిక్స్, హ్యూమన్ జెనెటిక్స్, బయోటెక్నాలజీ, బయో ఇన్ఫర్మాటిక్స్ వంటి వినూత్న కాంబినేషన్లు అందుబాటులోకి వస్తున్నాయి. ఈ సబ్జెక్ట్‌లతో బీఎస్సీ పూర్తి చేసిన తర్వాత సంబంధిత స్పెషలైజేషన్లతో పీజీతో లైఫ్ సైన్సెస్ విభాగాల్లో కొలువులు సొంతం చేసుకోవచ్చు. బీఎస్సీ తర్వాత ఇంటిగ్రేటెడ్ పీజీ+పీహెచ్‌డీ కోర్సుల్లో చేరే అవకాశం కూడా ఉంది.

స్టాక్ మార్కెట్లు (గురువారం ముగింపు)

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	144	59,833
నిఫ్టీ ▲	42	17,599

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు			
నాస్డాక్	12,088	▲	91
డోజోన్స్	33,485	▲	3
ఎఫ్టీఎస్ఈ 100	7,742	▲	79
డాక్స్	15,598	▲	78
షాంఘై (7-4-2023)	3,328	▲	15
నికాయ్ (7-4-2023)	27,518	▲	46

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఈ మార్పులపై ఓ లుక్కేయండి!

ఆదాయపన్ను పరంగా ఏప్రిల్ 1 నుంచి కొన్ని కీలక మార్పులు అమల్లోకి వచ్చాయి. కొన్ని పన్ను మినహాయింపులు తొలగిపోగా.. కొన్ని సాధనాలకు సంబంధించి పెట్టుబడి పరిమితుల్లో మార్పులు చోటు చేసుకున్నాయి. గతంతో పోలిస్తే ఆదాయపన్ను కొత్త విధానం మరింత ఆకర్షణీయంగా మారింది. ప్రధానంగా పన్నుల వ్యవస్థను మరింత సరళీకృతం చేయడం, పారదర్శకతను పెంచే లక్ష్యాలతో కేంద్ర సర్కారు ఎప్పటికప్పుడు కొత్త ప్రతిపాదనలు, సవరణలు తీసుకొస్తోంది. కనుక ఆదాయపన్ను పరిధిలోని ప్రతి ఒక్కరూ తప్పక తెలుసుకోవాల్సిన మార్పులను వివరించే కథనమిది...

ఆదాయపన్ను పరంగా కీలక పరిణామాలు • కొత్త విధానం ఆకర్షణీయం
రూ.7.5 లక్షల వరకు పన్ను లేదు • డెట్ ఫండ్స్ లాభాలపై పన్ను భారం
గేమింగ్ లాభాలపై టీడీఎస్ • అధిక ప్రీమియం పాలసీలపై పన్ను



నూతన పన్ను విధానం...

నూతన పన్ను విధానం ఎంపిక చేసుకునే వారికి వార్షిక ఆదాయం రూ.7 లక్షల వరకు ఉంటే రూపాయి పన్ను చెల్లించే పని లేకుండా పన్ను రాయితీని ప్రభుత్వం కల్పించింది. సెక్షన్ 87ఏ కింద గరిష్ఠంగా రూ.25,000 రాయితీని ప్రకటించింది. అంటే నికరంగా రూ.7 లక్షల వరకు ఆదాయం ఉన్న వారికి పన్ను భారం ఉండదు. తక్కువ ఆదాయం కలిగిన వారికి ఉపశమనం కల్పించడమే ఈ రాయితీ ఉద్దేశ్యమని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. 2022–23 ఆర్థిక సంవత్సరం నుంచే ఈ రాయితీ అమల్లోకి వచ్చింది. ఈ రాయితీ వల్ల ఎక్కువ మందికి ప్రయోజనం లభించనుంది. ఒక వేళ ఆదాయం రూ.7లక్షలకు పైన స్వల్పంగా ఉన్నప్పుడు భారీగా పన్ను చెల్లించాల్సి వస్తోంది. దీన్ని అర్థం చేసుకున్న కేంద్ర సర్కారు ఆర్థిక బిల్లు 2023లో కొన్ని సవరణలు చేసింది. ఉదాహరణకు రూ.7 లక్షలకు పైన మరో రూ.5 వేల ఆదాయం ఉంటే అప్పుడు నిబంధనల కింద రూ.26,500 పన్ను (సెస్సులతో) చెల్లించాల్సి ఉంది. దీని స్థానంలో.. రూ.7లక్షలకు పైన అదనంగా ఉన్న రూ.5వేలపైనే పన్ను చెల్లిస్తే సరిపోతుంది. అలాగే, నూతన పన్ను విధానంలోనూ రూ.50,000 స్టాండర్డ్ డిడక్షన్ ప్రయోజనం కల్పించారు. దీంతో నికరంగా రూ.7.50 లక్షల వరకు పన్ను భారం పడదు. నూతన పన్ను విధానం కింద పన్ను రేట్లలోనూ మార్పులు చేశారు. 60 ఏళ్లలోపు వారికి రూ.3 లక్షల వరకు ఆదాయంపై ఎలాంటి పన్ను ఉండదు. రూ.3–6 లక్షల ఆదాయంపై 5 శాతం పన్ను, రూ.6–9 లక్షల ఆదాయంపై 10 శాతం పన్ను పడుతుంది. రూ.9–12 లక్షల ఆదాయంపై 15 శాతం, రూ.12–15 లక్షల ఆదాయంపై 20 శాతం, రూ.15 లక్షల ఆదాయంపై 30 శాతం పన్ను రేటు వర్తిస్తుంది.

బీమాపైనా పన్ను

జీవిత బీమా పాలసీలకు చెల్లించే ప్రీమియంపైనే కాదు, గడువు తీరిన తర్వాత అందుకునే మొత్తంపైనా పన్ను ఉండదనేది అందరికీ తెలిసిన విషయం. కానీ, 2023 ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వచ్చిన మార్పుల ప్రకారం.. జీవిత బీమా పాలసీలకు చెల్లించే వార్షిక ప్రీమియం రూ.5 లక్షలకు మించి ఉంటే.. పాలసీదారు జీవించి ఉన్న సందర్భాల్లో గడువు తీరిన తర్వాత అందుకునే మొత్తం పన్ను పరిధిలోకి వస్తుంది. అంటే అధిక ప్రీమియం పాలసీల మెచ్యూరిటీపై ఇప్పటి వరకు ఉన్న సున్నా పన్ను ప్రయోజనాన్ని సర్కారు తొలగించింది. వార్షిక ప్రీమియం రూ.5 లక్షల వరకు ఉండే పాలసీల మెచ్యూరిటీపై ఇక ముందూ పన్ను మినహాయింపు ప్రయోజనం కొనసాగుతుంది. అలాగే, 2023 మార్చి 31వరకు కొనుగోలు చేసిన జీవిత బీమా పాలసీలకు సంబంధించి వార్షిక ప్రీమియం రూ.5 లక్షలకు మించి ఉన్నా, చివర్లో అందుకునే మొత్తంపై పన్ను ఉండదు. అలాగే, పాలసీదారు మరణించిన సందర్భంలో చెల్లించే పరిహారంపైనా పన్ను ఉండదు. యులిప్ ప్లాన్ల ప్రీమియం ఎంత ఉన్నా కానీ, పన్ను పరిధిలోకి రావు.

డెట్ ఫండ్స్‌పై కూడా...




డెట్ మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడులను మూడేళ్లపాటు కొనసాగించినప్పుడు వచ్చిన లాభం దీర్ఘకాల మూలధన లాభం కిందకు వస్తుంది. వచ్చిన లాభం నుంచి పెట్టుబడి పెట్టిన కాలంలో సగటు ద్రవ్యోల్బణ ప్రభావాన్ని మినహాయించి, మిగిలిన లాభంపైనే 20 శాతం పన్ను చెల్లిస్తే సరిపోయేది. ఇది గతంలో ఉన్న విధానం. కానీ, ఈ ప్రయోజనాన్ని తొలగించారు. 2023 ఏప్రిల్ 1 నుంచి డెట్ మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడుల కాల వ్యవధి ఎంతైనా కానీయండి, వచ్చే లాభం మొత్తం వార్షిక ఆదాయానికి కలుస్తుంది. ఏ శ్లాబు రేటు పరిధిలో ఉంటే, ఆ మేరకు పన్ను చెల్లించాల్సి వస్తుంది. అంటే ప్రస్తుతం డెట్ ఫండ్స్‌లో అమల్లో ఉన్న స్వల్పకాల మూలధన లాభాల పన్ను విధానమే ఇక మీదట అన్ని రకాల డెట్ ఫండ్స్ లాభాలకు అమలవుతుంది. మొత్తానికి డెట్ ఫండ్స్‌లో పెట్టుబడులకు దీర్ఘకాల మూలధన లాభాల పన్ను ప్రయోజనాన్ని తొలగించారు. తద్వారా డెట్ ఫండ్స్‌లో దీర్ఘకాల పెట్టుబడులను నిరుత్సాహపరిచినట్టయింది. దీంతో దీర్ఘకాల పెట్టుబడులు జీవిత బీమా, ఈక్విటీ సాధనాల వైపు వెళతాయన్నది నిపుణుల అంచనాగా ఉంది. 2023 ఏప్రిల్ 1 నుంచి చేసే తాజా డెట్ పెట్టుబడులకు నూతన పన్ను విధానం అమలవుతుంది. 2023 మార్చి 31 వరకు చేసిన పెట్టుబడులకు కొత్త నిబంధన వర్తించదు.

రిటర్నుల దాఖలు

ఆదాయపన్ను రిటర్నులను దాఖలు చేసే వారు తప్పకుండా గమనించాల్సిన మార్పు ఒకటి ఉంది. పాత, కొత్త పన్ను విధానాలు ఉన్నప్పటికీ, నూతన పన్ను విధానమే డిఫాల్ట్‌గా కనిపిస్తుంది. పాత పన్ను విధానంలోనే కొనసాగాలని అనుకునేవారు రిటర్నులు దాఖలు చేసే ముందే దానిని ప్రత్యేకంగా ఎంపిక చేసుకోవాల్సి ఉంటుంది. నూతన పన్ను విధానంలో పన్ను రేట్లు తక్కువ. కానీ, చాలా వరకు పన్ను మినహాయింపులు, పన్ను తగ్గింపు ప్రయోజనాల్లేవు. అన్ని రకాల మినహాయింపు ప్రయోజనాలను ఉపయోగించుకునే వారికి పాత విధానం అనుకూలం. కనుక ఎవరికి వారు తమ వార్షిక ఆదాయం, పెట్టుబడుల ఆధారంగా ఏ పన్ను విధానం అనుకూలం అనేది ఎంపిక చేసుకోవాలి. ఈ విషయంలో స్పష్టత రాకపోతే పన్ను నిపుణుల సాయం తీసుకోవాలి.

ఎస్‌సీఎస్‌ఎస్



పదవీ విరమణ పొందిన వారికి క్రమం తప్పకుండా ఆదాయం తెచ్చిపెట్టే పెట్టుబడి పథకాల్లో సీనియర్ సిటిజన్ సేవింగ్స్ స్కీమ్ (ఎస్‌సీఎస్‌ఎస్) ఒకటి. ఈ పథకంలో పెట్టుబడిపై ప్రతి మూడు నెలలకు ఒకసారి వడ్డీ ఆదాయం చెల్లిస్తారు. 60 ఏళ్లు నిండిన వ్యక్తులు ఎవరైనా ఈ పథకంలో ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. పదవీ విరమణ పొందిన ఉద్యోగులు అయితే 55–60 ఏళ్ల మధ్యలో ఉన్నా పెట్టుబడికి అర్హులు. ఈ పథకంలో ఒక్కరు గరిష్ఠంగా రూ.15 లక్షల వరకే ఇన్వెస్ట్ చేసుకునేందుకు అనుమతి ఉండగా, ఏప్రిల్ 1 నుంచి దీన్ని రూ.30 లక్షలకు పెంచారు.

నగదు ఉపసంహరణలపై టీడీఎస్

బ్యాంకు ఖాతా నుంచి భారీగా నగదు ఉపసంహరణలను నిరుత్సాహ పరిచేందుకు గాను కేంద్ర సర్కారు మూలం వద్ద పన్ను మినహాయింపు (టీడీఎస్‌ను) ప్రవేశపెట్టింది. ఒక ఆర్థిక సంవత్సరంలో ఒక బ్యాంక్ ఖాతా నుంచి నగదు ఉపసంహరణలు రూ.కోటి మించితే టీడీఎస్ కింద బ్యాంకులు 2 శాతాన్ని మినహాయిస్తాయి. వ్యక్తులు, వ్యాపార సంస్థలకూ ఇది అమలవుతుంది.



ఎల్‌టీఏ

ప్రభుత్వ ఉద్యోగులు కాని వారు సెలవులను నగదుగా మార్చుకునే మొత్తంపై పన్ను ప్రయోజనానికి పరిమితి ఉంది. 2002 నుంచి ఈ పరిమితి రూ.3 లక్షలుగా ఉంటే, దాన్ని రూ.25 లక్షలకు పెంచారు. అంటే సెలవులను నగదుగా మార్చుకునే మొత్తం రూ.25 లక్షలు ఉన్నా కానీ పన్ను చెల్లించాల్సిన అవసరం ఉండదు.

పోస్టాఫీసు నెలవారీ ఆదాయ పథకం

పోస్టాఫీసు మంత్లీ ఇన్‌కమ్ స్కీమ్ (పీవో ఎంఐఎస్) కూడా నెలవారీ ఆదాయం కోరుకునే వారికి ఉద్దేశించిన పథకం. ఈ పథకంలోనూ ఒక్కరు గరిష్ఠంగా రూ.4.5 లక్షల వరకు పెట్టుబడి పెట్టుకునేందుకు అనుమతి ఉంటే, దీన్ని రూ.9 లక్షలకు పెంచారు. జాయింట్ అకౌంట్ కింద రూ.9 లక్షల పరిమితిని రూ.15 లక్షలు చేశారు.

హెచ్‌ఎన్‌ఐలపై పన్ను భారం

బడ్జెట్‌లో అధిక సంపద కలిగిన వ్యక్తులకు సర్‌చార్జీ భారాన్ని తగ్గించారు. వార్షికాదాయం రూ.5 కోట్లకు పైన ఉన్న వారికి సర్‌చార్జీ 37 శాతం నుంచి 25 శాతానికి దిగొచ్చింది. కాకపోతే నూతన పన్ను విధానాన్ని ఎంపిక చేసుకునే వారికే దీన్ని పరిమితం చేశారు.

ఎన్‌పీఎస్ నుంచి వైదొలగాలంటే..

ఏప్రిల్ 1 నుంచి ఎన్‌పీఎస్ పథకం నుంచి వైదొలిగే లేదా యాన్యుటీ ఎంపిక చేసుకునే వారికి కేవైసీ డాక్యుమెంట్లు అప్‌లోడ్ చేయడం తప్పనిసరి చేశారు. పథకం నుంచి వైదొలిగిన సభ్యులకు వేగంగా యాన్యుటీ చెల్లింపుల చేసేందుకే ఈ ఆదేశాలు అమల్లోకి తెచ్చారు. ఎన్‌పీఎస్ ఎగ్జిట్ లేదా విత్ డ్రాయల్ ఫారమ్, గుర్తింపు, చిరునామా ధ్రువీకరణ, బ్యాంక్ అకౌంట్ రుజువు, ప్రాన్ (పెన్షన్ అకౌంట్) కార్డ్ కాపీని సెంట్రల్ రికార్డ్ కీపింగ్ ఏజెన్సీ సిస్టమ్‌లోకి అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. అనారోగ్యం, వైకల్యం తదితర సందర్భాల్లో ఎన్‌పీఎస్ నుంచి 25 శాతం ఉపసంహరణకు అనుమతి ఉంది. ఆ సందర్భాల్లోనూ వీటిని అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది.



ఈ–గోల్డ్

భౌతిక బంగారాన్ని ఎలక్ట్రానిక్ గోల్డ్ రిసీప్ట్ (ఈజీఆర్) రూపంలోకి మార్చుకుంటే ఎలాంటి మూలధన లాభాల పన్ను పడదు.

ఆన్‌లైన్ గేమింగ్

ఆన్‌లైన్ గేమింగ్ ద్వారా గెలుచుకునే మొత్తంపై 30 శాతం టీడీఎస్ అమలు కానుంది.

ఈపీఎఫ్ ఉపసంహరణపై టీడీఎస్

ఈపీఎఫ్ ఖాతాకు పాన్ లింక్ చేయకపోతే.. సభ్యులు ఉపసంహరించుకునే మొత్తంపై 20 శాతం టీడీఎస్ అమలు చేస్తారు.

ఇంటి మూలధన లాభంలో మార్పులు

ఆదాయపన్ను చట్టంలోని సెక్షన్ 54, 54 ఎఫ్ కింద ఒక ఇంటిని విక్రయించగా వచ్చే మొత్తాన్ని తిరిగి ఇన్వెస్ట్ చేయడం ద్వారా పన్ను లేకుండా చూసుకోవచ్చు. ఈ సెక్షన్ల కింద తిరిగి పెట్టుబడి పెట్టే మూలధన లాభాలను రూ.10 కోట్లకు పరిమితం చేశారు. అంటే ఇంతకు మించి మూలధన లాభం ఉంటే దానిపై పన్ను చెల్లించాల్సి ఉంటుంది.

మహిళా సమ్మాన్ సేవింగ్స్ స్కీమ్

మహిళలకు 2023 బడ్జెట్‌లో కొత్తగా ప్రకటించిన పథకం ఇది. 2025 మార్చి వరకు ఈ పథకం ఉంటుంది. ఒక్కరు రూ.2 లక్షల వరకు ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. పెట్టుబడిపై 7.5% వడ్డీ రేటు చెల్లిస్తారు. గరిష్ఠంగా రెండేళ్లు డిపాజిట్ చేసుకోవచ్చు.

బంగారం విక్రయం ఇలా..

హాల్ మార్క్ ఆభరణాలు, బంగారం వస్తువులను ఏప్రిల్ 1 నుంచి 6 నంబర్ల ఆల్ఫాన్యూమరిక్ హాల్ మార్క్ యూనిక్ ఐడెంటిఫికేషన్ నంబర్ (హెచ్‌యూఐడీ)తోనే విక్రయించాల్సి ఉంటుంది. హాల్ మార్క్ జ్యుయలరీ పట్ల వినియోగదారుల్లో విశ్వాసాన్ని ఇది పెంచనుంది. హెచ్‌యూఐడీ లేకుండా విక్రయించడాన్ని బీఐఎస్ నిషేధించింది.

పసిడి దిగుమతుల భారీ పతనం

- 2022–23 ఏప్రిల్–ఫిబ్రవరి మధ్య 30 శాతం డౌన్
- 31.8 బిలియన్ డాలర్లుగా నమోదు



న్యూఢిల్లీ: భారత్ బంగారం దిగుమతులు గడిచిన ఆర్థిక సంవత్సరం (2022–23) ఏప్రిల్–ఫిబ్రవరి మధ్య 30 శాతం పడిపోయాయి. దిగుమతులు మొత్తం విలువ 31.8 బిలియన్ డాలర్లుగా నమోదయ్యింది. యల్లో మెటల్ దిగుమతుల విలువ 2021–22 ఇదే కాలంలో 45.2 బిలియన్ డాలర్లుగా ఉంది. 2022 ఆగస్టు నుంచి దిగుమతుల్లో పెరుగుదల లేకపోగా, క్షీణత నమోదుకావడం దీనికి నేపథ్యం. బంగారంపై అధిక దిగుమతి సుంకం, ప్రపంచ ఆర్థిక అనిశ్చితులు విలువైన లోహం దిగుమతులు తగ్గడానికి కారణమని పరిశ్రమ వర్గాలు పేర్కొంటున్నాయి.గత ఏడాది కేంద్రం పసిడిపై దిగుమతి సుంకాన్ని 10.75 శాతం నుంచి 15 శాతానికి పెంచిన సంగతి తెలిసిందే. పసిడి దిగుమతులను నిరుత్సాహ పరచడం, తద్వారా ఈ బిల్లును తగ్గించడం, కరెంట్ అకౌంట్ లోటు (క్యాడ్) పెరక్కుండా కట్టడి చేయడం ఈ నిర్ణయం లక్ష్యం.

వెండి వెలుగులు..

కాగా, వెండి దిగుమతులు మాత్రం 2022–23 ఏప్రిల్– ఫిబ్రవరి మధ్య 66 శాతం పెరిగి 5.3 బిలియన్ డాలర్లుగా నమోదుకావడం గమనార్హం.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)	
10-4-2023	
విశాఖ	420–00
చిత్తూరు	428–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	395–00
విజయవాడ	395–00
రిటైల్ ధర (డజను)	66.00
9-4-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	370–00
వరంగల్	372–00
రిటైల్ ధర	4.30

ఫినొలెక్స్ ఇండస్ట్రీస్ — ప్రభుదాస్ లీలాధర్ — కొనొచ్చు

సాక్షి స్టాక్స్

ప్రస్తుత ధర: రూ. 170 టార్గెట్: రూ. 224


ఎందుకంటే: అమ్మకాల పరిమాణం, అధిక మార్జిన్లు సాధించే వీలుండటంతో ఫినొలెక్స్ ఇండస్ట్రీస్ కౌంటర్‌పట్ల బుల్లిష్‌గా ఉన్నాం. స్వల్పకాలానికి పీవీసీ, ఈడీసీ ధరల మధ్య అంతరం(స్ప్రెడ్) లాభదాయకత మెరుగుకు సహకరించనుంది. వ్యవసాయం, పైపుల మార్కెట్‌లలో నాయకత్వ స్థానాన్ని నిలుపుకునేందుకు ప్రత్యేక దృష్టిని కొనసాగించనున్నట్లు యాజమాన్యం ఇటీవలే స్పష్టం చేసింది. నిజానికి అక్టోబర్–డిసెంబర్(క్యూ4), ఏప్రిల్–జూన్(క్యూ1) కాలాలు కంపెనీ అమ్మకాలకు కీలకంగా నిలుస్తుంటాయి. వ్యవసాయ పైపుల మార్కెట్లో సీజనల్‌గా క్యూ1, క్యూ4 కంపెనీ అత్యుత్తమ అమ్మకాల సాధనకు దోహదం చేస్తుంటాయి. గతేడాది(2022–23) పీవీసీ రెజిన్ ధరలు కంపెనీ అమ్మకాలను ప్రభావితం చేశాయి. 2022 నవంబర్ తదుపరి భారీ దిద్దుబాటు నుంచి పీవీసీ రెజిన్ ధరలు స్థిరత్వాన్ని సంతరించుకున్నాయి. కేజీకి రూ. 66కు చేరుకున్నాయి. అయితే 2023 ఫిబ్రవరి నుంచి తిరిగి బలపడుతున్నాయి. కేజీ ధర రూ. 91ను తాకింది. చైనా మార్కెట్ నూతన సంవత్సర సెలవుల తదుపరి ఓపెన్ కావడంతో కేజీ రూ. 81 వద్ద నిలకడను చూపుతోంది. 2022–23 క్యూ4లో అగ్రి–పైపుల అమ్మకాలు ఊపందుకున్నాయి. మరోవైపు పీవీసీ–ఈడీసీ ధరల అంతరం నేపథ్యంలో 16–17% ఇబిటా మార్జిన్లు కొనసాగగలవని అంచనా.



నజారా టెక్నాలజీస్ — ఐసీఐసీఐ సెక్యూరిటీస్ — కొనొచ్చు


ప్రస్తుత ధర: రూ. 550 టార్గెట్: రూ. 700

ఎందుకంటే: ఈస్పోర్ట్స్ విభాగంలో కనిపిస్తున్న వృద్ధి అవకాశాలు, గేమిఫైడ్ ఎర్లీ లెర్నింగ్(జీఈఎల్)లో క్రమంగా మెరుగుపడుతున్న లాభదాయకత నేపథ్యంలో నజారా టెక్నాలజీస్ కౌంటర్ ఆకర్షణీయంగా కనిపిస్తోంది. షేరు లైఫ్‌టైమ్ గరిష్ఠం నుంచి భారీగా దిగివచ్చింది. 52 వారాల కనిష్టానికి చేరువై ఇటీవల కొంతమేర బలపడింది. వచ్చే ఏడాది కాలంలో రూ. 700 టార్గెట్‌ను చేరగలదని అంచనా. 2024–25 అంచనా ఈపీఎస్‌కు ఇది 41 రెట్లు అధికంకాగా.. గత రెండేళ్ల సగటు చరిత్రాత్మక పీఈతో చూస్తే తక్కువే. వచ్చే ఏడాదిలో ఆదాయం వార్షిక ప్రాతిపదికన 37 శాతం పురోగమించే వీలుంది. ఇందుకు ఈస్పోర్ట్స్ విభాగం 45 శాతం, జీఈఎల్ బిజినెస్ 25 శాతం చొప్పున వార్షిక వృద్ధి సాధించడం ద్వారా దోహదపడనున్నాయి. వెరసి నిర్వహణా లాభం(ఇబిటా) 86 శాతం జంప్‌చేయగలదని అంచనా. కంపెనీ చేతిలో రూ. 660 కోట్ల నగదు నిల్వలున్నాయి. నియంత్రణ సంస్థల నుంచి నిబంధనల్లో స్పష్టత లభించాక రియల్‌మనీ గేమింగ్ విభాగంలో మరింత పట్టుసాధించేందుకు వీలుగా కంపెనీ నగదు నిల్వలను వినియోగించుకునే అవకాశముంది. తద్వారా కార్యకలాపాలను మరింత విస్తరించేందుకు దారి ఏర్పడనుంది. పటిష్ట లిక్విడిటీ పరిస్థితుల నేపథ్యంలో కంపెనీ చౌకగా బిజినెస్‌లను చేజిక్కించుకునేందుకు సైతం వీలు చిక్కుతుంది. ఈ సానుకూల అంశాలు కంపెనీ షేరుకి ఆకర్షణను కల్పిస్తున్నాయి.



రాబడులు చూసి వైదొలగొచ్చా?

Q & A



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్

నేను పెట్టుబడులు పెట్టిన మ్యూచువల్ ఫండ్ వరుసగా రెండేళ్లపాటు చెత్త పనితీరు చూపించినట్టయితే, నా పెట్టుబడులను వెనక్కి తీసుకోవడం సరైనదేనా?
– ఖలీద్ మునావర్

ఏదైనా ఒక మ్యూచువల్ ఫండ్ పథకం నుంచి వైదొలగేందుకు, ఆ పథకం తక్కువ పనితీరు చూపించడం అన్నది ముఖ్యమైన అంశం అవుతుంది. తక్కువ పనితీరు అంటే ఇతర పథకాలతో పోలిస్తే తక్కువ రాబడులు ఇవ్వడం. వైదొలిగే నిర్ణయానికి ముందు.. మీరు పెట్టుబడులు పెట్టిన మ్యూచువల్ ఫండ్ పథకం విభాగంలోని ఇతర పథకాల పనితీరు కూడా విశ్లేషించాలి. వాటి పనితీరు కూడా తగ్గిందా..? లేక మీరు ఇన్వెస్ట్ చేసిన పథకం పనితీరు మాత్రమే తగ్గిందా? చూడాలి. మీరు ఇన్వెస్ట్ చేసిన ఫండ్ ఎన్‌ఏవీ క్షీణించడానికి ఎన్నో కారణాలు ఉండొచ్చు. స్టాక్ మార్కెట్ పడిపోయినా రాబడులు తగ్గుతాయి. అన్ని పథకాలు కొన్ని ప్రతికూల సమయాలను ఎదుర్కొంటూ ఉంటాయి. అది చూసి ఒక పథకం నుంచి మరో పథకంలోకి మారిపోవడం సరైన నిర్ణయం కాబోదు. ఈ ప్రతికూల, తక్కువ పనితీరు అనేది ఒక పథకంలో కనీసం నిరంతరాయంగా రెండేళ్లపాటు కొనసాగాలి. అప్పుడు ఆ పథకం పనితీరు గురించి మీరు ఆలోచన చేయవచ్చు. మీరు ఇన్వెస్ట్ చేసిన పథకం తక్కువ పనితీరు చూపించడం వెనుక కారణాన్ని గుర్తించాలి. ఫండ్ మేనేజర్‌లో మార్పు జరిగిందా? అందుకే పనితీరు మందగించిందా? అని చూడాలి. అదే నిజమైతే ఆ పథకం నుంచి మీ పెట్టుబడులను తీసుకుని బయటకు రావచ్చు. ఒకవేళ ఫండ్ మేనేజర్‌లో మార్పు లేకపోతే.. రాబడులు మందగించడానికి గల కారణాన్ని సాధారణంగా వారు మీడియాకు వెల్లడించే ప్రయత్నం చేస్తుంటారు. లేదంటే ఆయా ఫండ్ సంస్థ నెలవారీ న్యూస్‌లెటర్‌లోనూ సమాచారాన్ని వెల్లడిస్తుంటారు. పథకం పెట్టుబడుల విధానం వల్ల కూడా తాత్కాలికంగా రాబడులు మెరుగ్గా ఉండకపోవచ్చు. అలాంటి సందర్భాల్లో పథకం పనితీరును తప్పుబట్టడం సరైనది కాకపోవచ్చు. ఉదాహరణకు గ్రోత్ ఆధారిత విధానంతో పోలిస్తే వ్యాల్యూ ఆధారిత పెట్టుబడుల విధానం కాస్త ఆలస్యంగా ఫలితాలను ఇస్తుంది. అటువంటప్పుడు మీరు పెట్టుబడులను కొనసాగించొచ్చు. ప్రతి ఒక్క ఇన్వెస్టర్ తాను ఎంపిక చేసుకున్న పథకం అన్ని కాలాల్లోనూ అద్భుత పనితీరు చూపించాలని ఆశిస్తుంటారు. కానీ, ఆచరణలో ఇది సాధ్యం కాదు. అన్ని పథకాలు సానుకూల, ప్రతికూల సందర్భాలను ఎదుర్కొంటూ వెళుతుంటాయి. కనుక పెట్టుబడులను వెనక్కి తీసుకునే ముందు ఈ అంశాలన్నింటినీ చూడాలి.

నా వయసు 32 సంవత్సరాలు. నేను ఐదేళ్ల నుంచి మ్యూచువల్ ఫండ్ పథకాల్లో ఇన్వెస్ట్ చేస్తున్నాను. ఇలా పెట్టుబడులు పెట్టే కాలంలో అస్సెట్ అలోకేషన్‌ను ఎలా నిర్వహించాలి?
– వినయ్ శేఖర్

చిన్న వయసు నుంచే క్రమం తప్పకుండా ఇన్వెస్ట్ చేయడం మంచి నిర్ణయం. దీనివల్ల ఎన్నో ప్రయోజనాలు ఉంటాయి. పెట్టుబడుల విషయంలో అస్సెట్ అలోకేషన్ ఎంతో కీలకమైనది. మీ పెట్టుబడులను ఈక్విటీ, ఫిక్స్‌డ్ ఇన్‌కమ్ సాధనాలకు (డెట్) కేటాయించడం, అలాగే, మీ పెట్టుబడుల కాల వ్యవధి, రిస్క్ తీసుకునే సామర్థ్యం, పెట్టుబడుల లక్ష్యాల ఆధారంగా కేటాయింపులు చేసుకోవడమే అస్సెట్ అలోకేషన్. ఈక్విటీలు ఇతర సాధనాలతో పోలిస్తే దీర్ఘకాలంలో ద్రవ్యోల్బణాన్ని మించి మంచి రాబడులను ఇవ్వగలవు. మీ పెట్టుబడుల కాల వ్యవధి ముగింపునకు వస్తున్నప్పుడు, పెట్టుబడులతో అవసరం ఏర్పడడానికి కొంత ముందు నుంచే క్రమంగా ఈక్విటీ పెట్టుబడులను డెట్‌లోకి మళ్లించుకోవాలి. మీ ఆర్థిక లక్ష్యాలు మూడేళ్ల లోపు ఉంటే డెట్ సాధనాల్లో ఇన్వెస్ట్ చేసుకోవడం సూచనీయం. మూడేళ్లకు మించి ఉన్నప్పుడు మొత్తం పెట్టుబడుల్లో కొంత భాగాన్ని ఈక్విటీలకు కేటాయించుకోవాలి. మూడు నుంచి ఐదేళ్ల కోసం అయితే 25–30 శాతాన్ని ఈక్విటీలకు కేటాయించుకోవచ్చు. ఐదు, ఏడేళ్ల కోసం అయితే ఈక్విటీ కేటాయింపులు 50 శాతం వరకు, లేదా మీ రిస్క్ తీసుకునే సామర్థ్యం ఆధారంగా ఇంకా ఎక్కువే ఉండొచ్చు. ఏడేళ్లకు మించిన లక్ష్యాల కోసం ఈక్విటీలకు 70–80 శాతం వరకు కేటాయింపులు చేసుకోవచ్చు. సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ ద్వారా ఇన్వెస్ట్ చేయడంతోపాటు, సిస్టమ్యాటిక్ విత్‌డ్రాయల్ ప్లాన్ ద్వారా పెట్టుబడులను వెనక్కి తీసుకోవడం ముఖ్యమైనది. దీనివల్ల అస్థిరతలను అధిగమించొచ్చు.

ప్రీమియం ప్లాన్లకు నో డిమాండ్



న్యూఢిల్లీ: అధిక ప్రీమియం కలిగిన జీవిత బీమా ఉత్పత్తులకు ఏమంత డిమాండ్ కనిపించలేదు. ఏప్రిల్ 1 నుంచి తీసుకునే జీవిత బీమా పాలసీల వార్షిక ప్రీమియం రూ.5,00,000కు మించి ఉంటే పన్ను చెల్లించాలంటూ నిబంధనలను బడ్జెట్‌లో ప్రకటించడం తెలిసిందే. కాకపోతే మార్చి 31 వరకు కొనుగోలు చేసే పాలసీలకు ఈ నిబంధన వర్తించదు. దీంతో అధిక ప్రీమియం ప్లాన్లను మార్చి ఆఖరులోపు కంపెనీలు పెద్ద ఎత్తున విక్రయిస్తాయని నిపుణులు భావించారు. కానీ, క్షేత్రస్థాయిలో ఆ పరిస్థితి లేదు. అనుకున్న విధంగా వీటి విక్రయాలు ఏమీ పెరగలేదని పరిశ్రమ వర్గాలు తెలిపాయి. రూ.5,00,000కు పైగా ప్రీమియం చెల్లించే ప్లాన్లకు సంబంధించి గడువు తీరిన తర్వాత అందే మొత్తం కూడా పన్ను పరిధిలోకి వస్తుందని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్‌లో భాగంగా ప్రకటించారు. అధిక పన్ను పరిధిలోని వారు ఈ ప్లాన్లను తీసుకోవడం ద్వారా ఆ మేరకు పన్ను ప్రయోజనం పొందే అవకాశం సెక్షన్ 10(10డి) కింద ఉంది. బడ్జెట్‌లో ప్రకటన తర్వాత చాలా బ్రోకరేజీ సంస్థలు అధిక ప్రీమియంతో కూడిన నాన్ పార్టిసిపేటరీ గ్యారంటీడ్ ఉత్పత్తులకు ఫిబ్రవరి, మార్చిలో అనూహ్య డిమాండ్ ఉంటుందనే అంచనాను వ్యక్తం చేశాయి. ఏప్రిల్ 1 నుంచి ఈ అవకాశం లేనందున చాలా మంది ముందుకు వస్తారని భావించాయి.

సాధారణ అమ్మకాలే..

ఫిబ్రవరి నెలలో అధిక ప్రీమియం బీమా ఉత్పత్తుల అమ్మకాలు పెద్దగా పెరగలేదని పరిశ్రమ వర్గాలు తెలిపాయి. మార్చిలో పెద్ద ఎత్తున అమ్ముడుపోవచ్చని బీమా కంపెనీలు సైతం భావించాయి. అయితే అలాంటి పరిస్థితి కనిపించలేదు. ''అధిక విలువ కలిగిన నాన్ యులిప్ లైఫ్ ఇన్సూరెన్స్ ప్లాన్ల అమ్మకాల్లో అసాధారణ వృద్ధి నమోదు కాలేదు. దీనికి కారణం వాటిపై పన్ను వేయాలని ప్రభుత్వం నిర్ణయించడం వల్లేనని అనుకుంటున్నాం.'' అని ఏజెస్ ఫెడరల్ లైఫ్ ఇన్సూరెన్స్ ఎండీ, సీఈవో విఘ్నేష్ సహానే తెలిపారు.

కశ్మీర్ లోయకు ప్రత్యేక రైలు

- థీమ్‌టూరిజంలో భాగంగా మే 11న ప్రారంభం
- కోయంబత్తూర్ నుంచి హైదరాబాద్, వరంగల్ మీదుగా ప్రయాణం



సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ మీదుగా కశ్మీర్ లోయకు మే 11న ప్రత్యేక రైల్వే సేవలు ప్రారంభిస్తున్నట్టు సౌత్ స్టార్ రైల్ ప్రతినిధులు తెలిపారు. భారతీయ రైల్వే ప్రారంభించిన భారత్ గౌరవ్ పథకంలో భాగంగా 'సౌత్ స్టార్ రైల్' నూతన రైల్వే సేవలు అందిస్తోంది. ఈ సందర్భంగా 'సౌత్ స్టార్ రైల్' ప్రాజెక్ట్ డైరెక్టర్ విఘ్నేశ్ ఆదివారం సోమాజిగూడలోని ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడుతూ.. వేసవి విడిది నేపథ్యంలో థీమ్ టూరిస్ట్ ప్యాకేజీలో భాగంగా కశ్మీర్‌కు ప్రత్యేక రైల్‌ను ప్రారంభిస్తున్నట్టు తెలిపారు. ఈ రైలు కోయంబత్తూర్ నుంచి ప్రారంభమై హైదరాబాద్, వరంగల్, ధర్మపురి, విజయవాడ, ఈరోడ్, సేలం, ఎలహంక, పెరంబుదూర్ మీదుగా ప్రయాణిస్తుందని చెప్పారు. భారత పర్యాటక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఈ టూర్ ఆపరేటర్లను పర్యవేక్షిస్తుందని పేర్కొన్నారు. ప్యాకేజీ వ్యవధి 12 రోజులని తెలిపారు. ఇందులో ప్రత్యేక సదుపాయాలతో పాటు ప్రయాణ బీమా, సైట్ సీయింగ్, భోజన వసతులు అందిస్తున్నామని రీజినల్ మేనేజర్ సంతోష్ వివరించారు. బుకింగ్ తదితర సమాచారం కోసం 7876101010 నంబర్ లేదా www.railtourism.comలో సంప్రదించవచ్చని సూచించారు.

'కవచ్'ను పరిశీలించిన రైల్వేబోర్డు చైర్మన్ లహోటీ



సాక్షి, హైదరాబాద్: రెండు రైళ్లు ఒకే ట్రాక్‌మీదకు వచ్చినప్పుడు పరస్పరం ఢీకొనకుండా నిరోధించే సాంకేతిక వ్యవస్థ 'కవచ్'ను రైల్వే బోర్డు చైర్మన్ అనిల్ కుమార్ లహోటీ పర్యవేక్షించారు. ఆదివారం నగరానికి వచ్చిన ఆయన క్షేత్రస్థాయిలో దాని పరీక్షలను పరిశీలించారు. లింగంపల్లి–చిట్గిద్ద స్టేషన్ల మధ్య కవచ్ సాంకేతికత ఏర్పాటు చేసిన ప్రాంతంలో ఓ లోకోమోటివ్‌లో ప్రయాణించారు. లోకోపైలట్ స్పందించాల్సిన చోట స్పందించనప్పటికీ కవచ్ వ్యవస్థ తనంతట తానుగా ఆయా పనులు ఎలా చేస్తుందో స్వయంగా చూశారు. అనంతరం ఇరిసెట్‌లో కవచ్ కోసం ఏర్పాటు చేసిన సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ పని తీరును సమీక్షించారు. సంబంధిత అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఆ వ్యవస్థ పనితీరును ఆయనకు వివరించారు. దక్షిణ మధ్య రైల్వే పరిధిలో 1465 రూట్ కి.మీ.లలో కవచ్ వ్యవస్థను ఏర్పాటు అయిందని, ఇతర జోన్లకంటే ఇదే ఎక్కువ అని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్, ఇరిసెట్ డీజీ సుధీర్‌కుమార్ పాల్గొన్నారు.



బ్లాక్‌హోల్ ప్రయాణించే ఊహాచిత్రం..

నక్షత్రాన్ని అమిత వేగంతో దూసుకెళ్తూ.. అడుగుకో పుట్టిస్తూ..

అంతరిక్షంలో నక్షత్రాలన్నీ సమూహాలు (గెలాక్సీలు)గా.. అక్కడో గుంపు, ఇక్కడో గుంపు అన్నట్టుగా ఉంటాయి. కానీ శాస్త్రవేత్తలకు ఒకచోట మాత్రం ఏదో గీత గీసినట్టుగా నక్షత్రాల వరుస కనిపించింది. అదేదో పదులు, వందల్లో కాదు.. లక్షల నక్షత్రాలు అలా లైన్ కట్టాయి. అదేమిటా అని చూస్తే నోరెళ్లబెట్టే సంగతి బయటపడిందని శాస్త్రవేత్తలు చెప్తున్నారు. ఆ వివరాలేమిటో తెలుసుకుందామా.. – సాక్షి సెంట్రల్ డెస్క్

నక్షత్రాల లైన్ ఏమిటని చూసి..

సాధారణంగా ప్రతి నక్షత్ర సమూహం (గెలాక్సీ) మధ్యలో పెద్ద బ్లాక్‌హోల్ ఉంటుంది. దాని చుట్టూరానే నక్షత్రాలు పరిభ్రమిస్తూ ఉంటాయి. నక్షత్రాలు కూడా గుంపుగా ఉంటాయి. కానీ ఇటీవల హబుల్ స్పేస్ టెలిస్కోప్ తీసిన చిత్రాల్లో.. నక్షత్రాలు ఒక గీతలా వరుసగా ఉండటం, అదీ ఓ చిన్న గెలాక్సీ దగ్గర మొదలై కోట్ల కిలోమీటర్ల పొడవునా కనిపించడంతో శాస్త్రవేత్తలు ఆశ్చర్యపోయారు. చిత్రాల్లో అదేదో 'పొరపాటు (ఎర్రర్)' కావొచ్చని తొలుత భావించారు. కానీ యేల్ యూనివర్సిటీకి చెందిన ప్రొఫెసర్ పీటర్ వాన్ డొక్కుమ్ నేతృత్వంలోని శాస్త్రవేత్తల బృందం దీనిపై పరిశోధన చేసి.. ఆ నక్షత్రాల వరుస ముందు ఓ ప్రకాశవంతమైన వస్తువును గుర్తించింది. క్షుణ్నంగా పరిశీలించి అది కృష్ణబిలం అని తేల్చింది.

గెలాక్సీ నుంచి తప్పించుకుని..

ఓ పెద్ద కృష్ణబిలం తన గెలాక్సీ నుంచి తప్పించుకుని, అమిత వేగంతో ప్రయాణిస్తూ.. దారిలో ఈ నక్షత్రాల పుట్టుకకు కారణమవుతోందని శాస్త్రవేత్తలు తేల్చారు. రెండు, మూడు గెలాక్సీలు ఢీకొన్న క్రమంలో.. ఒక గెలాక్సీ నుంచి విసిరేసినట్టుగా ఈ కృష్ణబిలం బయటికి వచ్చి ఉంటుందని అంచనా వేశారు. దాని పరిమాణం మన సూర్యుడి కంటే రెండు కోట్ల రెట్లు పెద్దగా ఉందని.. అది గంటకు సుమారు 58 లక్షల కిలోమీటర్ల అమిత వేగంతో ప్రయాణిస్తోందని గుర్తించారు.



హబుల్ స్పేస్ టెలిస్కోప్ తీసిన చిత్రం..

ఏమిటీ కృష్ణ బిలం?

అతిపెద్ద నక్షత్రాలు వేలకోట్ల ఏళ్లపాటు మండిపోయి, ఇంధనం ఖాళీ అయ్యాక.. వాటిలోని పదార్థమంతా కుచించుకుపోయి 'కృష్ణబిలం'గా మారుతాయి. వీటి గురుత్వాకర్షణ శక్తి చాలా తీవ్రంగా ఉండి.. సమీపంలోకి వచ్చే అన్నింటినీ తమలోకి లాగేసుకుంటాయి. కాంతి కూడా వాటి నుంచి తప్పించుకోలేకపోవడంతో.. నేరుగా కనబడవు. అందుకే కృష్ణబిలం (బ్లాక్‌హోల్స్) అని పిలుస్తారు.

నక్షత్రాలు ఎలా ఏర్పడుతున్నాయి?

విశ్వం ఏర్పడే క్రమంలో గెలాక్సీలతోపాటు వాటి మధ్యలో అక్కడక్కడా విడిగా వాయువులు, ఇతర ఖగోళ పదార్థాలు ఉండిపోయాయని శాస్త్రవేత్త పీటర్ వాన్ చెప్పారు. ఈ కృష్ణబిలం ప్రయాణిస్తున్న క్రమంలో దాని ఆకర్షణ శక్తి వల్ల వాయువులు, ఖగోళ పదార్థాలు ఒక్కచోటికి చేరుతున్నాయని తెలిపారు. ఇదే సమయంలో కృష్ణబిలం వెనుక ఏర్పడే అతిశీతల పరిస్థితితో.. అవి సంకోచించి నక్షత్రాలు జన్మిస్తున్నాయని వివరించారు. విశ్వంలో ఇలాంటి దానిని గుర్తించడం ఇదే మొదటిసారని తెలిపారు. దీని గుట్టు తేల్చేందుకు త్వరలో ప్రఖ్యాత జేమ్స్‌వెబ్ టెలిస్కోప్‌తో పరిశీలించనున్నామని వెల్లడించారు.

సరికొత్త వైద్య విధానాలతో పూర్తి ఆరోగ్యం

- కాంటినెంటల్ ఆస్పత్రి సీఎండీ డాక్టర్ గురు ఎన్ రెడ్డి
- మెడికేషన్ సేఫ్టీ, క్లినికల్ ఫార్మసీపై 'కాంటినెంటల్'లో అంతర్జాతీయ సదస్సు



అంతర్జాతీయ మెడికేషన్ సేఫ్టీ, క్లినికల్ ఫార్మసీ సదస్సు ప్రారంభోత్సవంలో డా. గురు ఎన్. రెడ్డి, ఇతర వైద్య నిపుణులు

రాయదుర్గం: వైద్య రంగంలో వస్తున్న సరికొత్త వైద్య విధానాలు రోగుల సంపూర్ణ ఆరోగ్య పరిరక్షణకు దోహదం చేస్తున్నాయని కాంటినెంటల్ ఆస్పత్రి చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ గురు ఎన్. రెడ్డి పేర్కొన్నారు. తెలుగు రాష్ట్రాల్లో మొట్టమొదటిసారిగా అతిపెద్ద అంతర్జాతీయ మెడికేషన్ సేఫ్టీ, క్లినికల్ ఫార్మసీ సదస్సును నానక్‌రాంగూడ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతంలోని కాంటినెంటల్ ఆస్పత్రిలో ఆయన జ్యోతి వెలిగించి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్లినికల్ ఫార్మసిస్ట్‌ల విజ్ఞానాన్ని, సరికొత్త నేపథ్యాల్ని సంయుక్తంగా అధ్యయనం చేయడానికి ఈ సదస్సు దోహదపడుతుందన్నారు. మెడికల్ సేఫ్టీ ప్రాముఖ్యతను తెలియజేస్తూ ఇప్పటివరకు సాగిన అధ్యయనాలే కాకుండా నూతన అధ్యయనాలు మరింతగా సాగాల్సిన అవసరం ఉందన్నారు. అధ్యయనాలు, నూతన విధానాలు పేషెంట్ల సంపూర్ణ ఆరోగ్య పరిరక్షణలో గణనీయమైన ప్రగతి సాధిస్తాయనడంలో ఏమాత్రం సందేహం లేదని చెప్పారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఎక్కువ ప్రాముఖ్యతను సంతరించుకుంటున్న డిజిటలైజేషన్ ప్రక్రియ ద్వారా మెడికేషన్‌లో తప్పిదాల్ని నివారించి రోగుల రక్షణకు చర్యలు తీసుకొనేందుకు అధ్యయనాలు మరింతగా తోడ్పడతాయని డాక్టర్ గురు ఎన్. రెడ్డి పేర్కొన్నారు. ఆవిష్కరణలకు, అవగాహన పెంపునకు, అధ్యయన పద్ధతులకు, నూతన విజ్ఞానానికి ఈ సదస్సు చక్కటి వేదికగా నిలుస్తుందన్నారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ దేశ, విదేశాల నుంచి విశిష్ట నిపుణులు, స్థానిక నిపుణుల ద్వారా నేటితరం వైద్య బృందం ఎంతో నేర్చుకోవడానికి ఇలాంటి సదస్సులు దోహదం చేస్తాయన్నారు. పేషెంట్లకు అత్యుత్తమ వైద్య సేవలను అందించేందుకు అవకాశం కలుగుతుందన్నారు. ఆ తర్వాత ప్యానెల్ డిస్కషన్, ప్రశ్నోత్తరాల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో క్లినికల్ అకాడమిక్స్, మెడికల్ క్వాలిటీ, క్లినికల్ రీసెర్చ్ డైరెక్టర్ డాక్టర్ సుబ్రోజ్యోతి భౌమిక్, ఢిల్లీలోని హ్యూమన్ బిహేవియర్, యాలీడ్ సైన్సెస్ న్యూరోసైకో ఫార్మ కాలజీ ప్రొఫెసర్ డాక్టర్ సంగీతశర్మ, క్లీవ్‌ల్యాండ్ క్లినిక్ (అబుధాబి) క్లినికల్ ఫార్మసిస్ట్ డాక్టర్ మహ్మద్ హిషం, కాంటినెంటల్ ఆస్పత్రి విశిష్ట నిపుణులు, ఇతర వైద్య బృందం పాల్గొన్నారు.

అన్నింటికీ వర్తించదు

24 గంటలు దుకాణాలు తెరిచి ఉంచడంపై కార్మిక ఉపాధి శాఖ ప్రకటన



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలోని దుకాణాలను 24 గంటల పాటు తెరిచి ఉంచేందుకు అనుమతిస్తూ జారీ చేసిన జీవో నెం:4 అన్ని రకాల దుకాణాలకు వర్తించదని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ జీవో జారీ నేపథ్యంలో ఏయే రకాల దుకాణాలను 24 గంటలు తెరచి ఉంచవచ్చనే దానిపై సందేహాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో స్పష్టతనిస్తూ రాష్ట్ర కార్మిక ఉపాధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాణి కుముదిని ఆదివారం ప్రకటన విడుదల చేశారు. 'దేశంలోని ప్రధాన మెట్రోపాలిటన్ నగరాలైన న్యూఢిల్లీ, ముంబై, బెంగళూరులో ఇప్పటికే ఈ నిబంధనలు అమల్లో ఉన్నాయి. ఈనెల 4వ తేదీన జారీ చేసిన ఉత్తర్వులు తెలంగాణ రాష్ట్ర షాప్స్ అండ్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్–1988కు లోబడి అమలవుతాయి. కానీ, అన్ని షాపులకు వర్తించదు. 24 గంటల పాటు షాపులు తెరచి ఉంచాలనుకునే వ్యాపారులు ప్రత్యేక నిబంధనల మేరకు అనుమతి పొందాల్సి ఉంటుంది. ఈ ఉత్తర్వులు ఎక్సైజ్, ప్రొహిబిషన్ శాఖకు వర్తించవు. ఎక్సైజ్ చట్టాలు, నిబంధనలు అనుసరించి మాత్రమే రాష్ట్రంలో టీఎస్‌బీసీఎల్, ఐఎంఎఫ్‌ఎల్ డిపోలు, డిస్టిలరీలు, బ్రూవరీలు, ఏ4 షాపులు (వైన్స్), బార్లు తెరచి ఉంటాయి.' అని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.



అగ్గిపెట్టెలో ఇమిడిన చీరను ప్రదర్శిస్తున్న నేత కళాకారుడు నల్ల విజయ్‌కుమార్

శ్రీవారికి అగ్గిపెట్టెలో ఇమిడే చీర

- పద్మావతి అమ్మవారికి సమర్పించిన సిరిసిల్ల నేత కళాకారుడు
- అలువేలు మంగమ్మకు బంగారం, వెండిపోగుల చీర



బంగారం, వెండితో నేసిన చీర ప్రదర్శన

సిరిసిల్ల: రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రానికి చెందిన నేత కళాకారుడు నల్ల విజయ్ కుమార్ మరోసారి అగ్గిపెట్టెలో ఇమిడే చీరను నేసి తిరుపతి శ్రీవారికి ఆదివారం అందించారు. చేనేతలో నిత్యప్రయోగాలు చేసే నల్ల విజయ్‌కుమార్.. బంగారం, వెండి పోగులు పొదిగిన మరో చీరను అలువేలు మంగమ్మకు సమర్పించారు. ఆ రెండు చీరలను టీటీడీ ఈవో ధర్మారెడ్డి, కలెక్టర్ వెంకటరమణారెడ్డి ఎదుట ప్రదర్శించారు. పద్మావతి అమ్మవారికి సమర్పించిన చీరను పవర్‌లూమ్‌పై సిల్క్‌పోగులతో అగ్గిపెట్టెలో ఇమిడేలా తయారుచేశారు. మరో చీరను మాత్రం ఐదు గ్రాముల బంగారం, 100 గ్రాముల వెండిపోగులతో పవర్‌లూమ్‌పై నేశారు. చీరబరువు 250 గ్రాములు ఉండగా.. 5.5 మీటర్ల పొడవు, 48 ఇంచుల వెడల్పుతో కట్టుకోవడానికి వీలుగా ఉండే చీరను నేశారు. దీనికోసం 15 రోజుల పాటు శ్రమించారు. దశాబ్దకాలంగా విజయ్‌కుమార్ చేనేత మగ్గంపై పలు ప్రయోగాలు చేస్తూ అరుదైన గుర్తింపు సాధించారు.

యాదాద్రిలో డ్రోన్ కలకలం



యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి కొండపై మరోసారి డ్రోన్ కెమెరా కలకలం సృష్టించింది. వారం రోజుల వ్యవధిలోనే రెండవసారి డ్రోన్ కెమెరాతో చిత్రీకరించడం భక్తులను, అధికారులను షాక్‌కు గురిచేసింది. పోలీసుల కథనం ప్రకారం ..హైదరాబాద్‌లోని సరూర్‌నగర్‌కు చెందిన నక్కల సాయి కిరణ్, యార్లగడ్డ మనీష్‌కుమార్‌లు శనివారం రాత్రి 7గంటలకు యాదాద్రి కొండపైకి వచ్చారు. ఎలాంటి ముందస్తు అనుమతులు లేకుండా డ్రోన్ కెమెరాతో ప్రధానాలయంతో పాటు ఆలయ పరిసరాలను చిత్రీకరించారు. డ్రోన్‌ను ఎందుకు వినియోగించారు..ఎక్కడెక్కడ ఆలయ దృశ్యాలను తీశారు అనే దానిపై ఆరా తీస్తున్నట్లు సీఐ సైదయ్య చెప్పారు. దేవాలయ డీఈఓ భాస్కర్‌శర్మ ఫిర్యాదు మేరకు ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకుని, డ్రోన్ కెమెరాను సీజ్ చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెల్లడించారు.

ఊరి ఆడపిల్లలే గెలిచారు



ఉత్సాహంగా బడ్డు సంబరం

బడ్డు తాడును ఉత్సాహంగా లాగుతున్న ఊరి ఆడపిల్లలు, మెట్టినింటి ఆడపిల్లలు

సాక్షి, పాడేరు (అల్లూరి సీతారామరాజు జిల్లా): పాత పాడేరులో ఇటుకల పండుగలో భాగంగా బడ్డు సంబరం ఆదివారం ఉత్సాహంగా జరిగింది. జిల్లా వ్యాప్తంగా, మైదాన ప్రాంతాల్లోని గిరి మహిళలు భారీగా తరలిరావడంతో పాతపాడేరు జనసంద్రమైంది. బడ్డుతాడు లాగే సంబరంలో ఈ ఏడాది కూడా ఊరిలోని మహిళలే విజయం సాధించారు. వివాహాలు చేసుకుని మెట్టినింటికి వెళ్లిన ఇక్కడి ఆడపిల్లలు మాత్రం ఓటమి చెందారు.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G., Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.